భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

అగస్టు 1963

సంపుటము 40 : : సంచిక 8

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఆగస్టు 1963

తోటమాలి

★

కీ॥ శే॥ కాటూరి వెంకటేశ్వరరావుగారు

ఎవరు గట్టిరమ్మ యీ సంతబాటలో
ఇల్లునాకు ? బెస్తలిచట చెట్ల
నీడయారసి, సరకు నిండిన పడవలు
నిలిపి పోవుచుండ్రు, నిముసమైన
తెరపియుండ దెవరో తిరిగిపోవుచు నుందు
రడ్డమాక లేక యహరహమ్ము,
వారివంక నురక తేరి చూడంగనే
గడచుచుండె నాదు కాలమెల్ల,
పవలు రేయు నొక్కభంగి విన్పడు మాదు
గడపచెంత వారియడుగుల సడి
ముట్టె కొంతమంది, మూచూచి కొందరి
నెరుగుదాన, రక్తహితులు, నాకు
గలల చుట్టములును గలరు వారలలోన
నెట్టులందు మిమ్ము నెఱుగనంచు?
ఎట్లు నేర్తు వారి నెల్లబోద్రోలంగ?
ననుచు బిలుచుచుందు నయ్యలార
'రానె వచ్చినారు రండయాలోనికి
ఇష్టమున్న వారలెల్ల రండు'.

ఉదయదరుణకాంతి వదనమ్ము లింపార
నడుగుదోయి కెంపు లావటింప—
గంట లాలయమున గణగణ మనువేళ
చిన్న పుట్టికలను చేతబూని
అరుగుదెంచువారి మరలింప జాలక

పిలిచి యిట్టులేను బలుకుచుందు—
రానెవచ్చినారు రారమ్మ, మాపూల
తోటలోని బూలు ద్రుంచికొనుడు.
పనులు పాటులు మాని కొప్పునను వాడి
వత్తలగు పూలతో మాంద్య మత్తమిల్లు
పిల్లగ్రోవుల రవళితో నల్లమాడు
కంచెదరి తరులాకుట గాంచి, వారి
బంపజాలక, 'యిట రానె వచ్చినారు
నేద దేరుడు చల్లని చెట్లనీడ
లందు నెచ్చెలులార' యటంచు బిలుతు.

మసమసక చీకటుల్ నిండు మాపులందు
నెవరో మా తల్పు చెంతకు నేగుదెంచి
అల్లనం దట్టుదురు, తదీయాస్య మేమొ
లీలగాదోచు, గగన విస్ఫీలిమము ప్ర
శాంతమై యాక్రమింప నాశావలయము
సడియు జప్పుడు లేని యానడికి రేయి
మాటపలుకును లేని యామాపువిందు
మరలుపన్ లేక, చీకటి మరుగునుండి
ఆ వదనమేను గనుచుండ అల్లనల్ల
కలల నిండారు యామముల్ గడుచుచుండు.

(రవీంద్రుని గార్డెనర్ నుండి అనువాదము.)

ఆధునిక కవిత్వము

★

డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

10

కొంపెల్ల జనార్దనరావుగారిని మాన్యశ్రీ రాధాకృష్ణన్ పండితులు 'ఆధునిక కవిత్వమంటే దాని తత్వమేమిటి?' అని అడిగేరట. ఆరోజులలో (1925 ప్రాంతము) చాలా మంది ఇలాటి ప్రశ్నలే అడిగేవారు. విశ్వవిద్యాలయాధ్యాపకులు 'ఆధునిక కవిత్వము, అయితే గియితే, క్షీణయుగ కవిత్వము మీద తిరుగుబాటు మాత్రమే'అని ఇంచుకంత దాక్షిణ్యము చూపించేవారు. యెంకి పాటలను సమర్థిస్తూ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రులుగారు వ్రాసినదీ, ఆధునిక కవి పండితులు సభాముఖాన్నా, గ్రంథ పరిచయాల్లోనూ చెప్పిన విమర్శలూ మించి, ఆధునిక కవితా వివరణ రావలసినంతరాలేదు. ఏ వాఙ్మయ చరిత్రలోనైనా, పురోగామి ఉద్యమాలు వెంటనే గుర్తించబడలేదు. కీట్సుకవి విషాద మరణానికి కారణమైన పండిత విమర్శలు చూడండి. చుట్టు చూపు ఉండిన పాశ్చాత్యుల వాఙ్మయాలలోనే నవీన పద్ధతులను గుర్తించలేక అచారాభిమానులు బండ విమర్శలు చేశారంటే, చిరనిద్రలో నుంచి మేల్కొని చైతన్య వంతములైన రచనలకుద్యమించిన చిన్న వాఙ్మయాల సంగతి చెప్పేదేమిటీ?

చిన్న వాఙ్మయమన్నానా? అవును, తెలుగు వాఙ్మయము వయసులో పెద్దవాఙ్మయమైనా ఒడ్డూ పొడుగూలో ఆంగ్ల వాఙ్మయము కంటె చిన్న వాఙ్మయమే. ఏనాడో రేనాటి చోళుల అభిమానమువల్ల శాసనాలలో ప్రవేశించి పెరిగిన తెలుగు వాఙ్మయములో ఇంకా ఆరుశతాబ్దాలు గడచిపోయిన తరువాత వెలసిన ఆంగ్ల వాఙ్మయము గ్రహించవలసిన రీతులేవేవీ? సంస్కృత పురాణాల అనువాదాలతో ప్రారంభమైంది బహుళాంధ్రోక్తిమయ ప్రపంచము! "స్వేచ్ఛానువాదము" (rendering into Telugu) అని ఎంత పెద్ద అక్షరాలతో వ్రాసిపెట్టుకున్నా ఇది మూల గ్రంథపుటంతస్థును అందుకోలేదు. కథ, పాత్రములూ, పాత్రపోషణమూ, సన్నివేశాలూ అనువాదకునివి కావు. ఆంధ్ర భారతమును తెలుగులో అందంగా చెప్పే యత్నంలో కథా సరళి కోసమూ, విసుగును తగ్గించడము కోసమూ, నుడికారపు సొంపుకోసమూ, (ఏకొంతో) తెలుగు పద్యంలో ఇముడ్చడము కోసమూ కవుల ప్రయత్న పూర్వకంగా కొంత అక్కడక్కడ మారిందీ, ప్రబంధ ఫక్కీగా రచించడములోనూ సమకాలిక అనుభవాలు ఇముడ్చడములోనూ యదాలాభంగానే మూలము కంటె భిన్నంగా కొన్నిచోట్ల సాగింది. మనము ఇంత మాత్రంతో సంతోషించుకుని భారతాదులు స్వతంత్ర గ్రంథములే అనడము మనకు ఆ కవుల యెడమున్న గౌరవాన్ని తెలుపుతుందిగాని సత్యాన్ని సూచించదు. చెప్పినది సంస్కృత మూలమున్న పురాణాల్నే అయినా చక్కగా చెప్పినందుకు మనము ఆ కవులను 'ఆదికవి'అనీ 'కవిబ్రహ్మ'అనీ 'ప్రబంధ పరమేశ్వరుడనీ' అగ్గించుకోడము మన దేశంలో చెల్లుతుందిగాని అద్భుతమైన మౌలిక రచనలు వెలసిన పాశ్చాత్య దేశాల్లో చెల్లదనే అనుకుంటున్నాను. మన వాఙ్మయ శోభ వారికి చెప్పడము ప్రారంభిస్తే వారందర్నీ 'చెప్పడంలో నేర్పుగా చెప్పిన కవులు' అనే చెప్పుకోగలంగాని ఇతర భాషల్లోకి మార్చుకోవలసిన మౌలిక వాఙ్మయానికి కర్తలని చెప్పుకోలేము.

మనవారి పరిగణనలో, చక్కగా చెప్పగలిగినవాడు కవి; వస్తు సృష్టితో నిమిత్తములేదు. శ్రీనాథుడు తన రచనను 'ఉద్దండలీల' 'సూక్తివైచిత్రి' 'ఉభయ వాక్ప్రౌఢి' గల రచనగా గొప్ప చెప్పుకున్నాడు. (కథా—, సన్నివేశ—, పాత్ర—, సృష్టి సంస్కృత కవిది అయినప్పుడు 'రసాభ్యుచిత బంధము' తెలుగు చేసిన వారిదేనని అనలేము కదా?) ఆయన గొప్పదనముకూడా 'ప్రౌఢి' 'పలుకు నుడికారమూ'నే. పెద్దనగారు 'చతురవచోనిధి'. 'పెద్దనబోలు పండితులు పృథ్విని లేర'న్న కీర్తిని గన్నారు. ఆయన 'అల్లికబిగి' కవులను కూడ ప్రత్యేక

ముగా ఆకర్షించినది. ఆయన కాలములో రాజసభలలో కవు లకు జరుగుతూండిన పరీక్షలు 'చెప్పగల చమత్కారము' లోనే. నగరు, తగరు, తొగరు, వగరు అన్న మాటలను ప్రాస స్థానాల్లో ఉంచి మూడు పురాణాల పరంగానూ పద్యాలు చెప్ప డమూ, కుక్కుటము వంటి పరిచిత పక్షి—, జంతు—, జాలము మీద పద్యాలు చెప్పడమూ, సమస్యలు పూర్తి చేయడమూ, ఇవే సాహిత్య సభావినోదాలు. కవులు ప్రాకృత సంస్కృత ఘూర్జర భాషలు నేర్చి ఉండాలి. ఆద్య సత్కథలను రచించినా అందులో కవి కల్పనా విశేషము ఉండాలి. అక్కడ కూడా కవి మాటకారి తనానికే గౌరవము. అష్టాదశ వర్ణనలూ కవి యెంత చమత్కారంగా నిర్వహించాడూ అన్నదే ఆ నాటి రసికులు గమనించినది. కథా కల్పనతో నిమిత్తమేలేదు. కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నములు. వర్ణనలు కథావస్తువుతో సంబంధించి ఉండనక్కరలేదు. ఒక ఊరు, మేడలూ, నాలుగు వర్ణాలూ, వారాంగనలూ, పుష్పలావికలూ, వేట, దాని సరం జామూ, కథకోసము కాదు రచన. కథా సన్నివేశము ఒక కడకు తెచ్చి కవి సాయంకాల, చంద్రోదయాది వర్ణనలు చేసు కుంటూ హాయిగా పాండిత్యము ప్రదర్శించుకుంటూ సాగి పోతాడు. పెద్దనగారి లాంటివాడు కూడా ఏ కాదంబరి నుంచో ధారాళంగా తెచ్చుకోవడము 'కొఱతంబడ' డనుకోలేదు. చక్కని సత్యా పరిణామ గాథను స్వీకరించిన నంది తిమ్మనగారు ఆ పరి ణామాన్ని తప్పించేసి, స్త్రీల పాటల 'తులసి దళము' పాటి పరిణామ సౌందర్యాన్నైనా తేలేకపోయారు. గొప్పగొప్ప సంస్కృత నాటకాలు— శాకుంతలము లాంటివి— కూడా నల్చబడిపోయాయి. 'ప్రబంధ రూపంలో'. సూరన్నగారంతటి కవి ఇటునుంచి చదివితే తెలుగూ అట్నుంచి చదివితే సంస్కృ తమూ అయే పద్యము చెప్పుకున్నాడూ, సులువుగా శ్లేషను సాధిస్తానని చూపడానికి శ్లేష ప్రబంధము రచించాడు. దేశము ఈ నాటివలె ఒక్కటిగాలేదు. అక్షరాస్యులు చాలా కొద్ది. ప్రజల రుచితో ప్రసక్తే లేదు. రాజసభయే తప్ప కవికి శరణమే లేదు. ఇక తెలివి తేటలు ప్రదర్శించడము కంటే, 'రమ్మన్నారా, కమలమ్మలున్న చోటికి భ్రమరమ్మల' అని చమత్కరించడము కంటే కవి ఏమిచెయ్యగలడూ ?

దక్షిణాంధ్ర వాఙ్మయంలో శృంగారము స్త్రీల కావ్యా లలో కూడా అతి నగ్నంగా విహరించింది. కరుణ మానవు లందరికీ సర్వ సామాన్యమైనా, శృంగారమే 'పాకాన్నపడు' తుందని రసికుల నిర్ణయము. అష్టభాషా రచనల భేషజాలూ, శబ్దాలంకారాలూ బంధ గర్భ శ్లేష చిత్ర కవిత్వాలూ విజృం భించాయి. ఆశుకవిత్వాలూ ఏకాక్షర ద్వ్యక్షర రచనలూ ఉత్త రాంధ్ర ప్రజలు స్వీకరించిన పద్యాల కథల్ని ఒప్పి ఏరు వేశారు. సైనికుడు కత్తినీ రచయిత కలాన్నీ నమ్ముకుని గొప్పలు చెప్పుకుని బ్రతికేవారు. ఇద్దరికీ ఉదరపోషణ మాత్రమే ఆశయము .... ఏతావాతా చెప్పవచ్చేది ఆంధ్ర వాఙ్మయంలో యశసేర్థకృతే ఆశయాలతోనే గాని సద్యః పర నిర్వృతయే కాంతాసమ్మిత తయోపదేశయుజే ఆశయాలతో మౌలిక కావ్యాలు లెక్కపెట్టదగినన్ని రాలేదని. ప్రభావతీప్రద్యు మ్నము లాంటి పక్కనికావ్యాలు కవులకు ఒరవడి కాలేదు. పారి జాతాపహరణమువలె కథను చెపుతూ ప్రారంభించి చదువరిని ఆక ర్షించగలిగిన కావ్యాలు ఆ ఒక్క ఆశ్వాసమూ గడిచాక ప్లేటు మార్చేసేయి. కావ్యంలో మహా ఉంటే ఏ పాతిక పద్యాల మేరకో చదువరి అపేక్షను పోషించే రచన ఉంటే అబ్బురము. తక్కినదంతా రచయిత పాండిత్య విక్షేపమే. చిన్నచిన్న రాజ్యా లుగా పలువురి పాలన క్రింద ఉన్న దేశంలో ఇది సహజమే. ప్రతి కాలములోనూ ఆ కాలపు మేధావుల 'ఉత్తమ' రచనలే వస్తాయి. వాఙ్మయములోని ప్రతి మెట్టూ దాని వెనకటి మెట్టు కన్న ఎత్తయినదే ఏదో అంశంలో. అయితే రాజును పొగడి మెప్పించడమూ, పాండిత్యము చూపి మెప్పించడమూ మాత్రమే ఆనాడు ఇంటికి బయట కవికి లందిన అవకా శాలు. ఏనంతట తాను ఆశయ సాఫల్యానికో, భక్తి సంతుష్టికో రచించిన శతకాల్లో మాత్రము తెలుగు కవి కొంత కొంత సద్యః పరనిర్వృతీ, శివేతర క్షతీ, ఉపదేశమూ చేశా డనిపిస్తుంది. ఆ మధు బిందువులను తేనె పెఱలని ఎట్లనగలమూ ? పరజాతులకు, ఇదీ మావారి రచన అని శతకాలలోని పద్యాలను మూటలుకట్టి ఎలాగ అందించగలమూ ?

ఆంగ్ల పాలనమూ, ఆధునిక యుగమూ వచ్చాయి. ప్రభు వులు, పండితులూ మాత్రమే కాక, ప్రజలూ కావ్య పాఠకు లలో చేరేరు. పూర్వము పుస్తకాలు అమ్ముకోలేదు కవి. ఎవ రైనా తాటాకు ప్రతి వ్రాసుకుంటానంటే మహాభాగ్య మను కునేవాడు. "దీని వ్రాయు జదవ నైహికాముష్మిక ఫలంబు లందు నరుడు" వంటి ఫలశ్రుతి వాక్యాల కవసరము నాడుండేది. ఈనాడు అచ్చు కూటములు వచ్చాయి. వేలాది పాఠకులకు ఒక్కమారే అందుతాయి రచనలు. నాడు కంటే నేడు ప్రజాసభల కవకాశము లెక్కువ. వ్యక్తుల రుచి భేదా నికి కాక సమాజపు రుచి సామరస్యానికి గురిచూచి రచన చేస్తేనే ఈనాడు కావ్యాలు చదువుతారూ, మెచ్చుకుంటారు: 'సేతు శీతాచలేంద్ర మధ్య నృధాత్రీ జనైక కంఠ్యప్రణీత జయజయ ధ్వానములు' ఏనా డెరుగుదుమూ ?' ఈ జన బాహు ళ్యాన్ని పలకరించడానికి రచయిత పాండిత్య ప్రకర్ష కాక, చదు

ఆధునిక కవిత్వము

పఠితకి అనుభవమూ, ఆనందమూ కలిగించే రచన కానిక, ఆంగ్ల కవిత్వములో అలాటి రచనలు కొల్లలు. రామలింగారెడ్డి, రాయప్రోలు ప్రభృతులు ఆ పద్ధతులలో, ఆ కథలూ. తను కథలూ వివరించారు. మేధా వసుపురెడ్డిగారు అకుంఠిత తర్కములో కవిత్వ తత్వ విచారము చేశారు. కీట్సు, షెల్లీ కవుల కావ్యాల్ని కొందరు తెలుగు చేశారు. యథాశక్తి సంవత్సరాది సంచికల్లో కొందరు స్వంత రచనలు చేశారు. సందేహాల రోద్యమంతో భాష స్వాతంత్ర్యము మొలకలెత్తింది. ఠాగూరు కవి అమృత నిష్యంది భారతీయవాణి పాశ్చాత్యదేశాల్లో ముఖరితమైనది. గురజాడ కవి కవితా సామగ్రి, ఛందస్సు, వర్ణనా పద్ధతి, భాషావేషమూ మార్చి ఆదిమధ్యమూ అంతమూ గల ఖండకావ్యాలు ముత్యాలసరాలూ, కన్యక, డామన్ పిథియసూ, పూర్ణమ్మా, లంగరెత్తుము రచించారు. ఇవి సద్యః పరనిర్వృతి కలిగించే కావ్యాలు. కవిత్రయమువారి ప్రబంధమండలి వ్యాసునిది. తెలుగువారు 'మా జాతి సృష్టి' అని చెప్పుకో వీల్తైనది కాదు. అది పెద్ద సత్రములాంటి భవనము, మన స్వంతము కాదు. గురజాడవారు నిర్మించిన పర్ణశాలలు మనవి. ఇతరుల నిర్మాణ పద్ధతులను విమర్శగా పరిశీలించి నేర్చిన రీతులలో చేసిన రచనలే గాని అనుకరించినట్టివి కావు. మను చరిత్రాదులు సంస్కృతకవుల కల్పనల దారిలో ఉత్ప్రేక్షలూ, అతిశయోక్తులతో రాజసభల కుద్దేశించిన రచనలు. చెప్పే రీతిని వెలయించే రచనలే గాని చెప్పే కథను గాని, సందేశమును గాని వెలయించే రచనలు కావు. విజయనగర సామ్రాజ్య కాలానికి అన్ని కళలలోనూ విజృంభించిన 'బరోక్' (అతి అలంకార భార) పద్ధతిలో రాతి యేనుగుల్లాగ తీర్చి అలంకరించిన రచనలవి. కొయ్యబొమ్మ లన్నారు గురజాడవారు వాటిని. పర భాషలలోనికి అనువదించుకుని చూస్తే తెలుస్తుంది వాటి 'సౌందర్యము' ఎంత పరిమితమో. గురజాడవారి రచనలు ఏ భాషలోని కనువదించినా వాటి కాళ్ళమీద అవి నిలబడగలవు. (కవి విమర్శకులు గురజాడకూ వర్డ్స్‌వర్త్‌కూ పోలికలు చూపుతున్నారు. అవి యదాలాభములేగాని యత్న ఫలితాలు కావు. గురజాడ సంస్కారి, కవిత్వ రచన ఆయనకు సాధన సామగ్రిలో ఒకటి, సాధ్య ఆశయము కాదు. భాషా సంస్కారము ఆయన ఆశయము. నాటకానికీ, చిన్న కథకీ, కావ్యానికీ, వ్యాసానికీ, విమర్శకీ వాడుకభాష అనుకూలమే అని నిరూపించడమే ఆయన ఆశయము. ఆ అనుకూల్యమును నిరూపించడము కోసము రచించిన ఖండ కావ్యాలలో ఆయన వాడుకభాష పాలు క్రమంగా ఎక్కువ చేశారూ, ఆమాట చెప్పుకున్నారు కూడాను. వర్డ్స్‌వర్త్ నూటికి నూరుపాళ్ళ కవి. పల్లె భాషతో సాయిలా పాయిలా మాటలతో కవిత్వము రచించడమూ, మెప్పించడమూ సాధ్యమే అని నిరూపించడము కోసము ఆయన తన ఖండ కావ్యాలు వ్రాశారు. ఆయన కవి సంస్కారి కాడు. సంస్కారము ఆయన ఆశయాల్లో గౌణము. గురజాడకు కవితారచన గౌణము. వర్డ్స్‌వర్త్ వెంటబెట్టినది సౌందర్యాన్ని. గురజాడ గురి చూచినది సంస్కారాన్ని. ఆయన కాంతా సమ్మితోపదేశము చేశారూ, ఈయన సుహృత్సమ్మితంగా ప్రబోధించారు. భాషా సంస్కారము కోరి గురజాడా, కవిత్వ సంస్కారము కోరి వర్డ్స్‌వర్త్ చేసిన పనులలో సామరస్యమున్నా గురజాడ ఆయనను అనుకరించె ననడానికి సాక్ష్యము చాలదనుకుంటాను.) ... రాయప్రోలువారు తెచ్చిన నవ్యత అమర్శములో "ప్రేమ విహ్వలత వివాహకు దారి దాటు అనుకునేరూ, కాదు. కాదేకాదూ, అది త్యాగముగా ఫలింపగలదు" అని వారి తొలి కావ్యాల సందేశము. ఇది ఆంగ్లుల మంచైతేనేమి, రవీంద్రుని మంచైతే నేమి, వారు తెచ్చారు. మేధావసుపు చిల్లపిల్ల వెంకటశాస్త్రిగారు ఈ దశా పరిణామాన్ని మెచ్చుకున్నారు. ఆ తరువాత కూడా ప్రేమ పుష్ప దశాల సుగంధాన్ని విరజిమ్మే కావ్యాలే వ్రాశారు రాయప్రోలువారు. ఒక్క కాళిదాసు తప్ప అలంకారాలు మరుగున పరిచే సౌందర్యాన్ని గుర్తించినవారు లేకపోయిరి మన వాఙ్మయంలో. ప్రేమయోగి ఎక్కడినుంచి వస్తాడు?

కవిగారి ఘనతను చూపించడానికి కాక పఠితల హృదయ పరివర్తనము కలిగించడానికి చేసిన రచనలు 'అభినవ కవిత' అని తేల్చారు రాయప్రోలువారు, 'అభినవ కవితా మండలి' ప్రారంభించి. కొయ్యబొమ్మల్ని కాక కోమలుల్ని నిర్మించండని గురజాడవారు ప్రబోధించారు. రవీంద్రునికి ప్రపంచ సన్మానము వచ్చింది. ప్రపంచ యుద్ధములో దేశ దేశాల రాజకీయ ప్రబోధము కలిగింది. వెయ్యి గొంతుకలు విచ్చి మ్రోశాయి. పల్లెపట్టు సౌందర్యము, జీవితంలోని రస ఘట్టాలూ, పౌరాణిక సన్నివేశ మాధుర్యమూ, దర్శకుల ప్రేమ, పలకరించే ప్రతి సౌందర్యమూ, కవితాసామగ్రే అయింది. సమాసాలూ, విపరీతాలంకారాలూ, గుక్క తిరగకుండా ప్రవహించే నిరంతరాయ వృత్తాలూ, భాషా శ్లేషణాలూ తగ్గాయి. ఎవరు పట్టితే వారు తమకు స్వాధీనమైన ఛందో ధోరణిలో తోచినంత అందంగా రచించ నారంభించారు.

ఇది తిరుగుబాటే, పెద్ద తిరుగుబాటు. ఇన్ని ప్రబోధ పరిస్థితులు తెలుగు దేశములో ఎప్పుడు వచ్చాయీ? ఇంత మార్పు కవిత్వంలో ఎప్పుడు వచ్చింది? విశ్వసాహిత్యానికి 'ఇదిగో ఆంధ్రుల ఉపద' అని ఇవ్వడానికి ఇప్పుడు వచ్చినంత కవితా

వస్తువు ఇదివరకు ఎప్పుడు వచ్చింది? బలవంతములైన సంకెళ్లు తెగిపోయాయి. 1910 లో గురజాడతో ప్రారంభించిన చైతన్యము, ఆయన సూచించిన దారులలో సాగక పోయినా, ఒకొక్క కవి ఒకొక్క శాఖని పెంచుకుంటూ పోవడముతో సుమారు 15 సంవత్సరముల కాలంలో కవిత్వ సమయాల బిగుతును సడలించి కవిని నైసర్గికమైన చైతన్యంతో విరాట్పురుషుని సుందర రూపము ముందు నిలబెట్టింది.

“ఈ తిరుగుబాటు క్షీణయుగ కవిత్వమ్మీద” ననడము చక్కగా విలువకట్టలేకా, కట్టడము సయించకా దాటుకుపోవడమవుతుంది గాని, సద్విమర్శ అవదు. పూర్వ కవుల వర్ణనలలోని చంద్రుణ్ణి చూడండి : ‘ముక్కంటి తలపువ్వు మున్నీటిలేబట్టి కైటభారాతి డాకన్ను దమ్మి’ అని శ్రీనాథుడు; ‘కలశపాథోరాశి గర్భవీచిమతల్లి కడుపారాలి’.... గన్నకొడుకు, అనలాక్షు ఘన జటావన వాటికి .... అనార్తవంపు బువ్వు’ అని పెద్దన; ‘చరమాద్రి దావాగ్ని సంప్లుష్ట సురసౌర భేయీ కరీషైక పిండమ’ని నంది తిమ్మన; ‘చలువ వెలుంగుతే మగడు జక్కవ నెచ్చెలి జోడు కోడె చుక్కల జవరాండ్రలో నునుపుకాడు జగంబుల చూడ్కి విందు” అని అయ్యలరాజు; “కుముద వనాళికిన్ బలుపు కోకము లాటకు నిల్పు, దిగ్వధూ సమితికి బూత” అని మరొకరు! గాథా వ్యక్తుల బాంధవ్యపు టచ్చులలో తీర్చిన రచనలే అన్నీ. ఆధునికుల రచనలు వినండి : ‘నీలాభ్ర సరసిలో నిండు జాబిల్లి రాయంచవలె విహారము సల్పుచుండె’ నని కృష్ణశాస్త్రి; ‘తాడి వనమున ఆగి చంద్రుడు తాను చెవియొగ్గెన్’ అని గురజాడ; ‘నీ వొక యప్సరః ప్రణయినీ కబరీచ్యుత పారిజాతమాలా విసరంబవో .... దీపికవో సురలోక లక్ష్మికిన్’ అని వేదుల; ‘తెప్ప వోలిక చంద్రబింబం తేలిపోతోఉంది నింగిని’ అని విశ్వేశ్వరరావు; ‘చందమామ విరుగబడి విరుగబడి వెసనవ్వు చున్నాడు’ అని పుట్టపర్తి. వెన్నెలను ‘శీత చంద్రాతప పాంతారాళ రమణీయ రజత తల్ప’ మని కృష్ణశాస్త్రి; ‘మోహినీ సాట్టహాస కోలాహలములు’ అని వేదుల; ‘ఆకాశపు ఎడారి అంతటా నిండి ఈ రేయి రేగింది ఇసుక తుపాను’ అని శ్రీ. శ్రీ; ‘వేయి సువర్ణ కాంత లొక పెట్టున నవ్విన హాసరాశులేమో’ నని ఇంద్రకంటి; ‘హేమంత చంద్రికా వశౌనగీతి దెసలంటనుయ్యేల లూగె’ నని భమిడిపాటి రామసోమయాజులు. నేటి కవి స్వంత దృష్టితో తన కనుభవమైన ఆనందాన్ని వర్ణిస్తాడు. ఊహించేపట్ల ఎవరి ఊహ వారిదే. శివతాండవాన్ని వర్ణిస్తారు వినండి : “నొసట కొసరిన మూడో కన్ను నిపురు లూదిన కొలిమి దెగడి నెగడి ద్రిప్పింది” అని కవికొండల; ‘నొసట జేగురుకంటు మసలి రేగిన మంటు పశ్చిమాంగణమంత ప్రసరించు వెరసంజ’ అని కందుకూరి రామభద్రరావుగారు; ‘ఎగుర గొట్టబడి విడిన జుట్టు ముడి నల్లగట్టు లాగు గనుపట్టు, గిరుల నట్టనడి దుముకునట్టి అట్టహాస నదిగట్టు’ అని వరాభిగారు .... వస్తువులో ఐక్యమూ వర్ణనలో విభేదమూ రెండూ ఉంటాయి. గోదావరిని గూర్చి ‘ఉప్పొంగిపోయింది గోదావరీ తాను తెప్పున్న తేలింది గోదావరీ’ అని బాపిరాజుగారూ; ‘రాజ నరేంద్ర సామ్రాజ్య వైభవ రమాదుల కనులతో గన్న భాగ్యశాలినివి’ అని రామభద్రరావుగారూ; ‘భద్రగిరి రామ పాదుకా స్పర్శనంబు గణన కెక్కిన కోటి లింగాలపూజ, కలిగి’న దానవని జాషువా; ‘భద్రాద్రి రఘునాథ పావన సేవనా పాదిష్ఠా విష్ణు పాదోదకమ్ము’ అని ఇంద్రకంటి వర్ణిస్తారు. ఓరుగల్లు కోటలో ‘అది తటాకము కా దాంధ్రకుమారీ, అరివీర దుస్సాధ్యమైనట్టి పరిఘ, అది కుంకుమముకా దాంధ్రకుమార, తెలుగు నెత్తుటి గడ్డ దేలిన దుమ్ము’ అని శేషాద్రి రమణ కవులూ; ‘అల్లని కోపమై వెల్గారి నెఱజాణ పతియించె నిచ్చోట భారతంబు’ అని దేవులపల్లి రామానుజరావుగారూ.

భేదము మాత్రమే కాదు వైరుధ్యమూ ఉంటుంది ఇద్దరి ఊహలకు. ఓరుగంటి నందిని చూచి విశ్వనాథ వెంకటేశ్వర్లుగారు ‘మోము మలంచి దుఃఖమున మున్గిన నీ యెద రాయిగాగ నే బాముల నెంచు కొంచు గడ బారెదవో, యలిగి యోరుగంటి రాట్ఛ్రీ మహనీయ హస్తమున చెందిర దాకిన గంగడోలు భాష్పమితవారి నల్లబడి పాకుడు వట్టినదే వృషేశ్వరా” అని పలవిస్తే, జాషువా గారు ‘యెమ్ములను పిండి మూలుగ లిగిరిపోవ కృషి యొనర్చెడు పశువుల వెండగట్టి రాతి నందికి గందపు బూతబూసి మ్రొక్కుచున్నది భువనంబు మోకరించి’ అని యీసడిస్తున్నారు. కృష్ణశాస్త్రి ‘అవధరింతువు ప్రతి దివసాంతమందు నిత్య నూతన తాండవ నృత్య కేళి, ఓయి నటరాజ తలలైన నూపలేక భువనములు దుర్భరానందమున మునుంగ’ అని కీర్తిస్తే, కొడాలి అంజనేయులు, ‘పశ్చిమాశా ముఖాంత గహ్వరమునందు గాఢ నిద్రాణమైన యేకాంతశిలకు పూలతావులతోడ కర్పూర దీప గీతములతోడ దివ్య ప్రభాతమయ్యె! భీకర వనమృగా భీల ఘోషణముల కదలి మెదలి యొరుంగదు కల్పములకు, బ్రాహ్మణోపనిషద్గాన పఠనములకు జడత మానునొ యేమొ ఈ చలువరాయి’ అని సవాలు చేస్తున్నారు. కొడాలి అంజనేయులుగారు ‘కాశీ రత్నం పూసేచోట, పందిలి ద్రాక్షలు ప్రాకేచోట, కొండకోనలో గంగాజలములు మిలమిలలాడ్తుతు మెరసేచోట కలకల లాడవె కవితాకన్య’ అంటే, తురగా వెంకట్రామయ్యగారు ‘కడుపు మంటల కింత గంజియైనా లేసి చిరుత బిడ్డల గోల భరియించగా లేక ఉరిపోసుకొనునట్టి ఇల్లాలి కడుపులో కుండమ్మ

ఆధునిక కవిత్వము

ఎటా చల్లించినా కవి అని సవాలు చేస్తున్నారు. ఈ రకపు వైవిధ్యము చైతన్యానికి లక్షణము. ఒకే కవికి వేర్వేరు క్షణాల్లో భావ భేదము కలగడమూ ఉన్నది. ఇంద్రకంటివారు కవితా సుందరిని ''రావే బర్హి శిఖాచక చ్చకితనేత్రా'' అని వెన్నెల రాత్రిలో ఆహ్వానించనూ ఆహ్వానించారూ, ఇంకొకవారు 'తేనె పాట కవిగారూ, ఈనాడా మీ కోతలు, మా జీవన యాత్రా యాతన కలిగించుకు తెలిగించని మహాకవీ జహాసనా మోయ లేమయ్యా—నీ పల్లకి'' అని నిర్మొగమాటంగా దులపనూ దులిపేర్చు. జాషువాగారు 'గాలిలీయు సముద్ర కల్లోల పంక్తిని గద్దించు....అధికార రేఖను' మన్నించారూ, 'ఈ రహదారిలో నడువు మీశ్వర దర్శన మబ్బునంచు నాధారములేని పుక్కిటి కథల్ వినిపించెడి మోసగా' ణ్ణి ఈసడించారు. వేదులవారు 'మానవుల ఆశలతో విధికిన్ నిరంతరానికము సాగు నీ కటిక నేల' ను తేలికగా తీసేశారూ, 'మోహినీ సాట్టహాస కోలాహలములు పండువెన్నెల లలమిన బ్రహ్మాండ' మును చూచి కీర్తించనూ కీర్తించారు. కృష్ణశాస్త్రిగారు ఆత్మవిశ్వాసముతో 'ప్రళయ ఝుంఝూ ప్రభంజనస్వామి నేను, మోహన వినీల జలధర మూర్తి నేను' అని చెప్పి, ఇంకొక పరిస్థితిలో 'రాజ రాజేశ్వరుడ వీవు ప్రభుడ వీవు, వీథి వీథుల వాడల విపినములను, భిక్షుకుని బోలె తిరుగాడు పేదనోయి' అని వినమితు లయారు. జీవనానికి వైవిధ్యము ఒక లక్షణము. ఆధునిక కవిత్వములో భావ వైవిధ్యము విరివిగా గోచరిస్తున్నది. భావ వైవిధ్యములో ఉన్న శక్తి కల్పనా వైవిధ్యానికి లేదు. ప్రబంధ కవిత్వములో కల్పనా వైవిధ్యము చంద్రుని మచ్చ, చీకటి, వంటి వాని వర్ణనలలోనూ, రచనా వైవిధ్యము చాతుర్వర్ణ్యమూ, పుష్పలావికలూ, సౌధరాజములూ వంటి వాని వర్ణనల లోనూ గోచరిస్తుంది. ఈ వైవిధ్యము కవుల భావ చైతన్యాన్ని కాక మేధా చైతన్యాన్నే ఎక్కువగా చూపిస్తుంది. ఒక నమూనా నుంచి వేర్వేరు నమూనాలను నిర్మించడము చైతన్య లక్షణము కాదు. ఆచారాభిమానమే అవుతుంది. చేసినంతలో క్రొత్త సృష్టి చెయ్యడము చైతన్య లక్షణము. అది ఆధునికులలో కనబడుతుంది. భైరవ కవి శ్రీరంగ మహత్వము చూడండి, ఒక్క సీసపద్య పాదము, 'ఎందు నెవ్వాని చరణార వింద రజము పేర్మి గౌతమ సంయమి పెండ్లి పెద్ద' అన్నది తప్ప మనలను పలకరించే పంక్తే లేదు. ఎందుకా ఏనుగుకాలి రచన ? 'నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నే నెగిరిపోతే నిబిడాశ్చర్యంతో వీరూ, నెత్తురు కక్కుకుంటూ నేలకు నేను రాలిపోతే నిర్దాక్షిణ్యంతో వీరె !' అన్న శ్రీ శ్రీ రచన చాలు, ఆ మొత్తపు పుస్తకం కంటె, బరువుగా తూగడానికి. నాటికి నేడు ప్రపంచం ముందు తెలుగుకవి యాచకుడుగా కాక, గారడీవాడుగా కాక, సంస్కృతకావ్య వైతాళికుడుగా కాక, విశ్వ సౌందర్య బంభరముగా నిలబడుతున్నాడు.

ఆధునిక కవిత్వములో కొత్తదనము ఏమిటి ? అని పండితులు నాడు అడిగేవారు. నేటికీ దక్షిణాంధ్రంలో అడుగుతూనే ఉన్నారు. వింత ఎక్కడున్నదంటే, ఈ అడిగే వారు కవిత్వంలో కొత్తదన మనగా ఏమిటి ? అని తర్కించుకోకుండానే ఈ ప్రశ్న వేస్తారు. వారిది జిజ్ఞాస కాదు, ఘరి సవాలు. వారి సవాలుకు ప్రతి సవాలు ఇదే : ''అసలు కవిత్వంలో క్రొత్తదన మంటే ఏమిటో తేల్చండి. అది ఆధునిక కవిత్వములో ఉంది''. ఈ మనకు కనబడే ప్రపంచ మంతా నిన్నటిదే. ఆ సూర్యుడే, ఆ చంద్రుడే, ఆ గాలే, ఆ ప్రేయసే, ఆ ఫలమే. మరి కొత్త అన్నది ఎక్కడ ఉన్నది ? ఎందు కిందరు జీవులూ పొందిన అనుభవమే పొందుతూ తృప్తి పడుతున్నారూ ? దీనిలో కొత్త ఏమిటి ? చెపుతున్నాను వినండి. చక్కగా ఏది అనుభవమైతే, అప్పటికి అది కొత్తే, అనుభవము కావాలి, గారడీ కారాదు. నంది తిమ్మనగారు చంద్రుణ్ణి 'చరమాద్రి దావాగ్ని సంప్లుష్ట సుర సౌరభేయీ కరీ షైక పిండమనగ' అని వర్ణిస్తే, అది కల్పన కనుక ప్రదర్శన మాత్రమై ఆలోచన రేపుతుంది. సూర్యుడు పశ్చిమాన్న అస్తమిస్తాంటే కదా. తూర్పున నిండు చంద్రుడు డుదయిస్తాడూ, మరి చరమాద్రి దావాగ్నిలో ఉదయాద్రి చంద్రుడు సంప్లుష్ట డవడ మనగా యేమిటీ ? అని. లేదా, చంద్రు డింతసేపూ వెలిగేడు గదా, తెల్లవారేముందు కాలి పిడక అయ్యేడా ? అని. దంష్ట్రాగ్ని నిర్దళద్దహన కీలల వియద్భ్రష్ట తారాలాజ పటలి పేటుల' అని ఎఱ్ఱనగారు వర్ణించగానే అగ్నికీలల్ని భ్రాష్ట్రములోపలికి ప్రవేశపెట్టుదురా ? అన్న సందేహము కలుగుతుంది. అనుభవమన్నదే ఉంటే, అది ఎప్పటికప్పుడు కొత్తగానే స్ఫురిస్తుంది. జనమంచి కామేశ్వరరావుగారి 'కృష్ణవేణి' చదవండి : ''పర్యంకంబున కృష్ణవేణితో చేయితలాడగ శయనించిన నా ప్రేయసి జేరితి ప్రేమోత్సుకతన్. పెదవుల భృశమ్ము మెరసే హాసము ముగ్ధ వయస్వినుమ మృదుహాసము ముత్యపు ముడియై నిర్వృతి నుండెన్. దేహయష్టిపై దృష్టి లేదు మన మూరకయే వేణి వసించున్. నేత్రద్వయ మొక భృంగద్వయమై కుంతలాల మధుపానము చేయున్. అవశంబగు నా పాణిద్వయమా కృష్ణవర్ణమౌ వేణిక నిమురుచు కేశబంధమున్ విదళించెన్. వేణి బంధములోని పాణిద్వయము బట్టి నిదుర జోగే కనుల నాల్పుచున్ నను జూచె మందస్మితాస్య అస్మత్ ప్రేమరాజ్ఞి. చిగురించిన చిరునవ్వు మోముతో జీరాడెడి కైశిక

పాశముతో నా మోము కప్పి తన మోము జేర్చి ననురాగ రక్త నాళ్లనతుష్టి.'' దీనిలోని నవ్యత ఏమిటి ? అనుభవమే. ఈ కావ్యము చదివి ముగించగానే చివరి పదిక్త్రుల చైతన్యపు స్పర్శతో నరనరాల్లో దాగుకున్న అనుభవము రూపమ్మంటుంది. అనుభవము కలిగించగలిగిన రచన కొత్తే, ఎప్పటికప్పుడు కొత్తే, ఎన్నిసారులు చదివినా కొత్తే. ఆధునిక కవిత్వములో అనుభవము కలిగించగలిగిన రచన కోకొల్లలుగా ఉంది. 'చనిన నాటుల వెనుగుకత్తులు పొదుట్టిన బండ ఈ పెనుగొండ కొండ' అన్నారు అనంతకృష్ణశర్మగారు. 'ఎంత బిగి కౌగి లించినా ఈ విశ్లేద మంతరించక యున్నదే' మన్నారు వెల్లాల ఉమామహేశ్వరరావుగారు. ''ఊరిలో అందరికి ఉత్సవమ్మేటు ఇంటింటి బాలురకు ఇది పండుగేటు, ఏ అబోధ నిరాశ ఏ మూస పొగ్ని ఇతని పండుగమీద ఇంత రగిలింది ?'' అని అడిగేరు ఇంద్రకంటివారు. 'ఆ రాటపు కపురుము తీసుక ఏరాటా పెట్టినా ఒకటే, ఆవేశపు ఆంధ్రుడు తగునని ఏ వేషం వేసినా ఒకటే' నన్నారు సంపత్. 'విను డదిగో విను డదిగో విన బడుతూ ఉన్నది (శ్రీకృష్ణుని వేణువు)' అని వినిపించారు బాపిరాజుగారు.. 'అసురసంజను చుక్క అగుపించెను, అపర దిక్సతి తిలక మనిపించెను' అన్నారు కవికొండలవారు. 'అంతె పేరున కంతే భార్యాస్థిగాని నిజము నా శరీరాస్థి కృష్ణార్పణమ్ము' అన్నారు విశ్వనాథవారు. 'ఎక్కడున్నావోయి వెఱ్ఱి శంకరుడా ఉంగాయి (కాత్యాయని) నీ కొరకు బెంగతో ఉన్నది' అన్నారు బొడ్డు బాపిరాజుగారు. 'ఎన్ని యుగముల మాట ఈనాటిదా తరుణి ఈ ప్రేమమాట' అని గణపతిశాస్త్రిగారు. 'పూరి గుడిసెలలో నైన బుత్తుగాని గీత ముల్లిక (బదుకు సాగింపలేను' అని బెళ్ళూరి శ్రీనివాసమూర్తిగారు. 'భూమి సమస్త వీధులు సముజ్జ్వలమైన సుధాసముద్ర వీచిమయి లాస్య రంగమున జిందులు ద్రొక్కుచు నున్న దౌర' అని పెమ్మరాజు లక్ష్మీపతి. 'ఈ జలదఖండ మెందో గతించు నించు కంతయేని చింతిలక కాలానువృత్తి' అని కుందుర్తివారు. 'కల్పవృక్షపు పూలజల్లులు, కామధేనువు పాలధారలు, భాగ్యదేవత వెల్ల గొడుగులు పల్లె కర్షకులు' అని చిరుమామిళ్ల పార్థసారథి గారు. 'పాడుపడు ఖిల్లాల పుట్టువు పాడుకొనుచును తూర్పు సనుమలు ప్రమోదు చిగురుచు పచ్చదనమున గగురు పొడిచి కవి' అని ముక్తేవి నూరపనేని కవులు. 'అలసిపోయినదొ వా వలెనె యా త్రోవ, ఆ యింటి ముందుగ వాగిపోయినది' అని దిగు మర్తి సీతారామస్వామిగారు.

మనము చూచీ కూడా గుర్తించని అనుభవాల క్రొత్త దనము మనము గుర్తించిన అనుభవాల కంటె సులువుగా తగులుతుంది. కాళోజీ నారాయణరావుగారిది ఈ అందము రూపుదార్చిన రచన. 'రాలు విసరినా రాకెట్ విసరిన కిట్టని వానిని కొట్టుటకే కద ?, అంటారూ, ''కుటిలమతులు దేశ మొగాలు వగటిలో రెండోరెండు ఠకాలు, చతురపర్గ విలాసం కొరకు దేశాల సర్వస్వం ముడిపెందుకు'' అంటారు. ఇందుపుర దుర్గపు జైలులో దాశరథివారు 'ఒక పాలమున్న ఇద్ది దేవ లము, వేలొక్కప్పు దుర్గంబు, నే ఒకటా ! జైలయి కాను పించెను. భవిష్యత్కాలమును దొట్టి చూపకమునే దాల్పునా ! కాల చక్రగమన స్వాభావికాపర్ష కల్పకమై రేపలవోను దుర్గ మును నీ బందీలె పాలింపగనే' అన్నారు. రాయప్రోలువారు 'పల్లెపడాల జీవము నిర్మోకొన్న పలినాటివీరుల రక్తనాళ పటిమ'ను జ్ఞాపకము చేశారు. రామిరెడ్డిగారు 'పారసీ కవి ప్రశాంతమును పల్లవ కోమలమైన' తెలుగుభాష తీపిని స్మరించారు. దువ్వ కొండలవారు దారిపక్కన గడ్డిపూలు 'దాక్కుని చూస్తాయి, దారంట గడ్డి నిరుక్కుని చూస్తాయి' అన్నారు. గోదావరి ఉప్పొంగిపోతే 'సర మూసవుటి సుయులు శిరమెగ్గి పలికెయి' అన్నారు బాపిరాజుగారు. వేసవిలో 'చిటుకమ్మ చిపర వేసిన పెగ గడ్డకు బాల సుంద్ర మొగమ్ము కోలవాలె' నన్నారు విశ్వ నాథవారు. 'విశ్వమంతా ప్రాణవిభుని సుందిరమైన వీథి వాకిలి యేది చెల్లెలా ?' అని అడిగేరు కృష్ణశాస్త్రిగారు. 'రోజా కనపడే నక్షత్రాల్లోనే రోజా కనపడని కొత్తదనం చూచి రోజా పొందని అనందానుభూతి పొందడం అంటేనే కవిత్వ' మట దాశరథిగా రంటారు 'పునర్నవం' లో.

మనము పొందని అనుభవాల్ని పట్టి కవి మనకు అందించినప్పుడు ఆ అనుభవాలు— సరికొత్తవి—మనలను గట్టిగా తాకుతాయీ, స్పందింపజేస్తాయీ, జల్లు మనిపి స్తాయీ. కవి ప్రతిభకు బిరుదైన పని సౌందర్యాన్ని సేక రించి చదువరికి అందించడమూ, చదువరిని అద్వారా విండ్ర మానవునిగా తయారు చేయడమూను. 'తొలి ప్రొద్దు తెమ్మెర త్రోవలో పయనమై పరువెత్తు కోయిలపాట' ను వినిపించారు కృష్ణశాస్త్రిగారు. 'చుక్కలన్ని కొండమీద సోకు జేసుకునే వేళ, పంటబోది పరపుడితో పకపక నవ్వేవేళ, సల్లగాలి తోట కంత చక్కిలిగిలి పెట్టేవేళ, మొక్కజొన్న తోటలో ముసి రిన చీకట్లలో మంచెకడ, చేరిన ప్రేయసులను చూపిస్తు న్నారు కొనకళ్ల వెంకటరత్నంగారు. పలుకులలో ధ్వని చిత్రమూ రచించారు—'నాగార్జునకొండలో రాత్రి'లో మొక్కపాటి కృష్ణ మూర్తిగారు వినండి : ''నీలికొండల నీలి గుస గుస, ఏటి తెలి క్రొన్నీటి గలగల, మబ్బుపుటాబుల నుపు పిలుపులు, మరగి పచ్చిలిపి నిన్నరయు పచ్చిలిని .... విపడరేగిన యేటి

ఆ ధు ని క క వి త్వ ము

హేహారులూ, కొండకోనల గ్రుప్పుమ్రిరిలియూ, రేయి నీ యేకాంత సేవలూ, కలత నిద్దురలో నీకై కలవరింతలలో నీలికొండల నీలి గుసగుస! ఏటిచెలి క్రొన్నెటి గలగల!'' ఏటి గలగలవలె కాలావధి దాటి సాగే పాట ఇది. వీరే 'కొండపల్లి స్వప్నము' లో 'కదలికాలము నీలి కలల నిద్దుర మంచు ముసుగులేయుని పల్లె గుసగుసలు' మూసరించారు. సుప్తాస్థికల చూపు మనలో కలిగించే కలతను 'ఏనాకు నేటికో నా యస్థిపంజరమ్మ' అని వివరించారు శ్రీ శ్రీ. 'తాళీవని' లో 'ఇలనిలంబడి శీతోష్ణములు సహించిన యుగాంత జీవుల' ను గుర్తించి చూపుతున్నారు వెనుమర్తి వెంకటరత్నంగారు. 'అవలింతంత యెత్తయిన చెట్లు' నూ 'పంప రింతంత ఇరుకైన కాలాన్ని' ఆరుద్ర చూపించారు. 'ఇలుదాటి పోయినవ్ .... మరలినదాక .... వెనుక మూడు కాళ్లతో తిరిగే' చల్లి ప్రాణాన్ని చూపిస్తున్నారు జాషువా గారు. 'శుష్కించు సెలయేటి విరహిణి కడుపులో నడగిన కదలి ప్రోతను' వినిపించారు కృష్ణశాస్త్రిగారు. 'నిమిసాని కొకరూపు నీలి తొంకరి మబ్బు, త్రుటికొక్క కళ సాంధ్య దివ్య తేజోరేఖ' అంటారు భమిడిపాటి రామ సోమయాజులు గారు. 'ఓ ఇంద్రగోపమా ! ఓ సాంద్ర తేజమా ! మౌన ముద్రాధారీ' అని సంబోధించి ఇంద్రధనుస్సు మౌన సౌందర్యమును అనుభవానికి తెస్తున్నారు బెళ్ళూరి శ్రీనివాసమూర్తి గారు. ''ఏనాటికైన నీ వేణునాళమును వాయింప వత్తు, నీ వాకిటికవెను నడియూస దలుపుం గడె చేసినైతు నీసుల మాపిరి బిగబట్టినైతు'' నని 'ఆశ' కు నాసకసజ్జికా రూపమిస్తున్నారు పాపినేని ఈశ్వరరావుగారు. 'కలికు గత్తుల దాల్చు నరహంతకుల యింట బానిసై భూదేవి పడియుండె నీవేళ, ధనికునకు దైవమే దాసుడయ్యెను చూడు' మన్నారు తురగా వెంకటరామయ్యగారు. 'భువనగిరి కోట యది మొగమెత్తు సింగ' మన్నారు పుట్టపర్తివారు. 'ప్రకృతి పుస్తకమందు దిరుగవేసిన యాకు మరల చూడడు కాలపురుషు' డన్నారు. 'అలసిపోయిన కన్నుల ప్రతిఫలించి సురనదియేని వైతరణిగా దోచు' నట దిగుమర్తినా రంటున్నారు. 'చుక్కలతో నిండి చక్కని రేయి తనువెల్ల కనులుగా గను' నట. 'ఏను తూనీగనై విహరించునపుడు విశ్వమంతయు సౌందర్య విభ్రమంబు, తేనెటీగనై పూదోట తిరుగునపుడు ధరణి యంతయు కర్మబంధముగ దోచు' నన్నారు. 'చిరము రుధిరాభిషేక ప్రసిద్ధి గన్న పెద్ద పులిగోళ్లు పసివాని ముద్దు పతకమందు బంగారు కొనల పసందుకేడ్చు' నట. ఈ సీతారామస్వామిగారి రచనలో నంతా కొత్త అనుభవాలే.

మరి ''ఆధునిక కవిత్వములో కొత్త ఏమిటీ'' అన్న ప్రశ్నకు అర్థ మేమిటీ ? కవిత్వములో ఉండవలసిన కొత్త ఆధునిక కవిత్వములో ఉంది. రాధాకృష్ణ పండితుల ప్రశ్నకు వత్తాము. ''ఆధునిక కవిత్వ తత్త్వ మేమిటి ?'' రచయిత పాండిత్య ప్రకటనానికి కాక చదువరి ఆనందానికి దారి చేసేటట్టు రచించడమూ, చదువరి మెప్పు కోసము కాక అతని అనుభవానికి దోహదము చేసేటట్లు రచించడమూ ఆధునిక కవిత్వాశయము. 'తాళీదళ సంపుట ప్రకర కాంతారము నుంచి కాక విశ్వసౌందర్యము నుంచీ, మానవుల అనుభవము నుంచీ వస్తువు సేకరించడము ఆధునిక కవిత్వాశయము. ఇంకొక కవి కన్న ప్రౌఢంగా చెప్పవలెనని కాక, గుర్తించగల కొత్త అనుభవాన్ని నూతన సౌందర్యాన్ని చదువరి కందించడము ఆధునిక కవి ఆశయము. వర్ణనా సౌందర్యాన్ని కాక వస్తు సౌందర్యాన్ని వెలయించడము ఆధునిక కవి కోరిక. ఈ యత్నంలో అలవాటుగా వచ్చిన ఛందో—, భాషా—, నియమాలు అతిక్రమించవలసి వచ్చినా సరే. కవితా సామగ్రి, భాష ఛందస్సు, వర్ణనా పద్ధతి వేటిలోనూ పూర్వాచారము మాత్రమే ఆధునిక కవిని నడపదు. మోచర్ల రామకృష్ణయ్యగారి వలె వ్రాయబోయేది శ్లోకాన్ని పోలినా, మకుటము వదిలేసి, ఒక వృత్తంలోనే రాయక పేరు కూడా మార్చేసుకుంటాడు ఆధునిక కవి. సన్నిధానము సూర్యనారాయణశాస్త్రులుగారి లాగ పూర్వ పరిచయము నిండిపోయిన ఇంద్రధనుస్సునైనా ''శ్రీయుత మిదే దేశము ? .... వాన రాబోవుచున్నది దాన నీదు రంగు దుస్తులు తడిసి హెురంగు తగ్గు'' నని కొత్తగా పలకరిస్తాడు. మల్లాది సూర్యనారాయణశాస్త్రులుగారి వలె గోదావరిని 'దప్పిక' లేని నాన తటి దగ్గఱజేరి .... దప్పిక చంపేసేనవిరో దూరంగా పోతావేమమ్మా' అని అడుగుతాడు. గడియారము శేషశాస్త్రులుగారి వలె ''నడచెడు తొంటిదారులు కనంబడ నట్టులు క్రొత్తదారు లేర్పడినవి, దారి చూపెడు దొరల్ తమ నీలపు కంటి యద్దములొత్తుడుగుచు చూచి చూపెదరు, తోయధి నేలను నేలతోయధిన్ పడినటులయ్యె నియ్యెడరు పట్టున గావలె క్రొంత దర్శనుల్'' అని అధునాతన సమస్యలను గురించే కలత పడతాడు. రామిరెడ్డిలాగ పల్లెపట్టు చైతన్యాన్నీ, కవికొండలవలె జానపద జీవితాన్నీ, విశ్వనాథవలె ఆంధ్ర ప్రశస్తినీ, నండూరి వలె దాంపత్య ప్రేమనీ కవితా సామగ్రిగా గ్రహిస్తాడు. రాయప్రోలూ, కాశూరి నరసింగరావూలవలె సంస్కృతభాషా జటిల భాషా, నండూరీ కవుకొండలా, బాపిరాజూలవలె జీవద్భాషా, వాడతాడు. గురజాడ వలె ముత్యాల సరములూ, పుట్టపర్తి నారాయణాచార్యులవలె జంపెలూ, శివశంకరులవలె గీత పద్యాలూ, అబ్బూరివలె ద్విపదలూ, బసవరాజువలె గేయాలూ, వేదులవలె వృత్తాలూ వాడతాడు. వర్ణనకు అలంకార కల్పనే తప్పనిసరిగా ఉపయోగించడు. కథమీదనే దృష్టి పెట్టుకుంటాడు గాని పక్క దాట్లు వేసి ఊహా వర్ణనలు చెయ్యడు. వసంత జయంత కంతుల్ని దింపుకోడు. ప్రకృతి దృశ్యాల్ని అమరకోశపు వృక్ష జంతు సామగ్రితో నింపి వెక్కసము చెయ్యడు. తనకు నచ్చిన వర్ణనే చేస్తాడు గాని సంస్కృత కవుల వర్ణనా పేకలను చింపిన ముక్కలు అతికి తయారు చెయ్యడు, తన వర్ణనల్ని. ఇదంతా ప్రబంధ కవిత్వముమీద తిరుగుబాటు కాదా ? కాక ఇంకేమిటీ ? ఇంత మాత్రము గ్రహించలేక బ్రతికి సాగిన ఈ పురోగామి ఉద్యమానికి తమ సొట్టకాళ్లడ్డు పెట్టిన కువిమర్శకుల నేమనాలి ?

నన్నయ వాగనుశాసనుడా?

★

శ్రీ నిడుదవోలు వేంకటరావు

ఆంధ్ర మహాభారతకర్త నన్నయ వాగను శాసనుడు కాకపోవుటచేత, ఆ వాగను శాసనునిచేత రచితమైనదని యప్పకవి చెప్పిన— ఆంధ్ర శబ్దచింతామణి, నన్నయపేర నారోపితమై, పదునేడవ శతాబ్దిని రచించిపనట్లు స్పష్ట మగుచున్నది. ఈ ఆంధ్ర శబ్ద చింతామణి, అప్పకవి మూలముననే మనకు తెలిసినను— ఆతడు తన గ్రంథము కన్న ముందుగ నిది లోకమున వెలసినట్లుగా నిట్లు చెప్పియున్నాడు. అప్పకవి గ్రంథ రచనా కాలము క్రీ. శ. 1656—ఆతడు. పీఠిక (1—50)లో

క. ఆలోకసుతుండు మొన్నటి
కీలక సమమున మతంగ గిరికడ నొసగెన్
బాల సరస్వతులకు, నతఁ
డోలి తెనుగు టీక దానికొప్పుగఁ జేసెన్''

అని బాలసరస్వతి టీక నుదాహరించియున్నాడు. ఇది కీలక సంవత్సరము. అప్పకవి రచన మన్మథ. క్రీ. శ. (1656). అమన్మథకు ముందు కీలక క్రీ. శ. 1608 అగుచున్నది.

అప్పకవి యుదాహరించిన[1] బాలసరస్వతి— బహు గ్రంథ రచయిత— అతఁడు రచించిన గ్రంథముల ననుసరించిన అప్పకవి బాలసరస్వతియు సమకాలికులనియు స్పష్ట మగు చున్నది. ఇంతకు బాలసరస్వతి ఈ టీక నెప్పుడు రచించెను అనునది సందిగ్ధముగనే యున్నది.

బాలసరస్వతి టీకా రచనాకాలము సందిగ్ధము

బాలసరస్వతికి గ్రంథము లభ్యముకాగానే టీక రచించె నని అప్పకవి చెప్పిన మాట యెంతమాత్రము సరి కాదని ఈ క్రింది బాలసరస్వతి రచించిన రచనలను బట్టి మనము గ్రహింపవచ్చును. బాలసరస్వతి రచించిన గ్రంథము లలో మనకీ క్రిందివి లభ్యమగు చున్నవి.

1. ఆంధ్రశబ్ద చింతామణి టీక. 2. చంద్రికా పరిణయము (ప్రబంధము) 3. యాదవ రాఘవ పాండవీయము (త్ర్యర్థి కావ్యము) 4. భర్తృహరి శతకత్రయము (తెలుగుసేత).

పై వానిలో నాలుగవ గ్రంథమునకు తప్ప తక్కిన వానికి నవతారిక లున్నవి. అందులో బాలసరస్వతి వంశ వృత్తాంతము, రచించిన గ్రంథముల వివరణము ఉన్నవి. వీని పరిశీలనము వలన టీకా రచనయే కాక, మూల గ్రంథము కూడ బాలసరస్వతియే రచించినాడని యూహ తట్టకపోదు.

బాలసరస్వతి అసలుపేరు వెంకట కృష్ణయ్య. ఇంటి పేరు ఎలకూచి. కాని వెంకటకృష్ణయ్య పేరు ముద్రిత గ్రంథములలో లేదు. వ్రాత ప్రతులలో నున్నది. మదరాసు ప్రాచ్య లిఖిత భాండాగారమున 1248 సంఖ్యగల ప్రతిలో— ''ఎలకూచీశ్వర కృష్ణయార్య సుతుడన్''— వేంకట కృష్ణయాఖ్యుం డనే నాంధ్ర శబ్ద చింతామణి తెనిగించెద'' అని కలదు. బాలసరస్వతీయమును ముద్రించునపు డీ విషయమును నెవ్వరు వ్యక్త పఱుపలేదు. ఈ గ్రంథావతారికలోని విషయములు పరిశీలింతము.

ఆంధ్రశబ్ద చింతామణి టీకావతారికలో బాలసరస్వతి తానీ టీక రచించుటకు ముందీ క్రింది గ్రంథములు రచించి నట్లు వ్రాసియున్నాడు.

సీ. భాష్యాదిక గ్రంథ పరిచయో దాత్తుఁడఁ
గౌముదీ నాటక కావ్యకవిని
భాషా వివరణాఖ్య భవ్య శాస్త్ర కరుండ
బాహట స్థాన నిబంధ నుండఁ
జంద్రా పరిణయాది సత్కృతి స్రష్టను
దీప్త వామన్న పురాణ ప్రబంధ
భ్రమరగీత ప్రబంధౌఘ కర్తను
దక్షిణ కాళికా తంత్ర చణుఁడ
గీ. ప్రకట యాదవ రాఘవ పాండవీయ
నాటక శ్లేషకవితా ప్రణాయకుండ

1. దీని నింకను బరిశీలింపవలసి యున్నది.

వలఘు కౌండిన్య గోత్రుండ నఖిలసుకవి
శాస్త్రతంత్రుడ బహుకళాధరుండ నేను.

పై పద్యమునుబట్టి బాలసరస్వతి ఆంధ్రశబ్ద చింతామణి టీకా రచనకు ముందు క్రింది గ్రంథములు రచించి నట్లు స్పష్టము.

1. కౌముదీ నాటకము
2. భాషా వివరణము
3. చంద్రా (చంద్రికా) పరిణయము
4. వామన పురాణము
5. భ్రమర గీతలు
6. యాదవ రాఘవ పాండవీయము

కాని బాలసరస్వతియే పైవానిలో నొకటియగు చంద్రికా పరిణయమున నెట్లు వ్రాసినాడో చూడుడు.

సీ. కడుఁ జాలిచెప్పెద కార్తికే యాభ్యుద
యాది కావ్యములు గుణాధికములు.
సల్పితిదగ "నాంధ్ర శబ్ద చింతామణీ
వ్యాఖ్యాన" మఖిల బుధాను మతము
వెలువుగ తెలుఁగు చేసితి వామన పురాణ
బాహటాది మహా ప్రబంధచయము
లాచరించితి......
గీ. . . . .
. . . . . షడ్భాషా వివరణ నాను
శాస్త్రములు రంగ కౌముదీ సంజ్ఞకంబు.

బాలసరస్వతి తాను చింతామణి టీకా రచనమునకు ముందు చంద్రికా పరిణయము వ్రాసినట్లు చెప్పి, తిరిగి ఆ చంద్రికా పరిణయములోనే[2] ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్యానము నంతకుముందు రచించినట్లుగా నెట్లు చెప్పి యున్నాడో దురూహ్యము. ఈ గ్రంథముననే కాక, యాదవ రాఘవ పాండవీయమునఁ[3] కూడ యెట్లు చెప్పుకొని నాడో చూడుడు.

సీ. కవి సమీహితరంగ కౌముదీ నామనా
టక విధాన ప్రతిష్ఠాఘనుండ
సారసారస్య సచ్చంద్రికా పరిణయ
ప్రముఖ శతాగ్ర ప్రబంధకర్త
ఆంధ్ర చింతామణీ వ్యాఖ్యాన, భాషావి
వరణాది బహుతంత్ర కరణ చణుఁడ
వేదశాస్త్ర పురాణ వివిధ సంగీత సా
హిత్యాది విద్యోప బృంహణుండ
గీ. ననఘు కౌండిన్య గోత్రుండ హరిపదాబ్జ
భక్తి శీలుండ వెలకూచి భైరవార్య
కృష్ణదేవు తనూజుడ నే విచిత్ర
కావ్య మొక్కటి నిర్మింపఁగా గడంగి."

ఆంధ్రశబ్ద చింతామణి అవతారికలో యాదవ రాఘవ పాండవీయము పేర్కొనబడినదని పైని సూచించి యుంటిని. అనగా యాదవ రాఘవ పాండవీయమంతకు ముందే రచితమైనది. అప్పుడు ముందు పుట్టిన యాదవ రాఘవ పాండవీయమున. ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యా ప్రసక్తి యెట్లు వచ్చినది ?

ఆంధ్రశబ్ద చింతామణి టీకా రచన మెట్లుండ నిండు. తక్కిన రచనల పౌర్వా పర్యము గమనింపుడు. చదువరులకు విషయము తెలియుటకై, ఆయా గ్రంథముల యందు పేర్కొనబడిన రచనలను క్రమముగా క్రింద చూపుచున్నాను.

ఆంధ్రశబ్ద చింతామణి వాఖ్యలో పేర్కొన్నవి.

ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యలో పేర్కొన్నవి

కౌముదీ నాటకము, భాషావివరణము, బాహటము, చంద్రా పరిణయము, వామన పురాణము, భ్రమరీ గీత, యాదవ రాఘవ పాండవీయము.

చంద్రికా పరిణయములో పేర్కొన్నవి

కార్తికే యాభ్యుదయము, ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్య, వామన పురాణము, బాహటము, షడ్భాషా వివరణము, రంగకౌముది.

యాదవ రాఘవ పాండవీయములో పేర్కొన్నవి

రంగకౌముది, చంద్రికా పరిణయము, ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్య, భాషా వివరణము.

---

2. చంద్రికా పరిణయము ముద్రితము. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తకశాలలో అసమగ్రప్రతి (అవతారికతో నున్నది) కలదు. ఆంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమున నేకొక ప్రతిగలదు.

3. ఇది తెలుఁగున గల త్ర్యర్థి (మూఁడర్థముల) కావ్యము లలో మొదటిది, అముద్రితము. మదరాసు ప్రాచ్య పుస్తక భాండాగారమున నున్నది. సంఖ్య 687.

నన్నయ వాగనుశాసనుడా?

ఒక కవి తాను రచించిన గ్రంథములలో కొన్నింటిని తన కృత్యంతరములలో పేర్కొనుట సహజమే. కాని పై బాలసరస్వతి చింతామణి వ్యాఖ్య మాత్రమట్లు పేర్కొను పద్ధతికి భిన్నముగ నున్నది. చింతామణి వ్యాఖ్యలో పేర్కొన్న గ్రంథములన్నింటికన్న నది ముందుగా రచితమని యూహింత మన్న, ఆ పేర్కొన్న గ్రంథములలో చింతామణి వ్యాఖ్య ప్రసక్తి యెట్లు వచ్చినది ? ఇంత యసందర్భముగనే కవియు, తన గ్రంథ రచనా సందర్భము తెలిపి యుండ లేదు. దీనినిబట్టి బాలసరస్వతి చింతామణీ వ్యాఖ్యా రచనా కాలము క్రీ. శ. 1608 కాదనియు, నావెనుక క్రీ. శ. 1656 ముందు జరిగినదని మాత్రమే మనము నిశ్చయింప గలము. ఇంకొక విచిత్రము.

బాలసరస్వతీయమునకు విపుల పీఠిక ఎంతో సుపరిష్కృతముగా వెలయించిన శ్రీ వఝ్ఝలవారి4 బాల సరస్వతీయ రచనా సందిగ్ధస్థితిని గూర్చి మాత్రము తెలుపలేదు !

ఈ బాలసరస్వతీయ రచనా సందర్భమే, ఆంధ్ర శబ్ద చింతామణి పదునాఱవ శతాబ్దినాటి నూతన సృష్టి యని స్పష్టము చేయుచున్నది.

అప్పకవి ఈ యాంధ్రశబ్ద చింతామణి సృష్టి తనతోనే ప్రారంభమైనదని గ్రహించియు, దానిని కప్పిపుచ్చుట కెట్లు వ్రాసినాడో చూడుడు.

ప్రబంధ మహిమ

క. ఇది చదివిన పిమ్మట మరి
 యొది యేనియు జదువు బుద్ధి యేలా పొడముస్
 బదపడి గ్రంథములన్నియు
 వెదకి వెదకి సారమెల్ల వివరింపంగన్. 1—7.

అప్పకవీయము జదివిన వెనుక తక్కిన గ్రంథములను అనగా నంతకుముందు రచితములైన వానిని చదువ నక్కరలేదుట. ఏల ? వాని యన్నింటిలోను 'ఆంధ్ర శబ్ద చింతామణి' లేదు గనుక. అప్ప కవియు గద్యలలో కూడ "ఆంధ్ర శబ్ద చింతామణి యను వ్యాకరణ శాస్త్రంబునందు" అని కలదు. కాబట్టి అప్ప కవీయమును, ఆంధ్ర శబ్ద చింతామణి అవతరణమును నొకే కాలమున సంభవించినవి.

ఈ గ్రంథవ్యాప్తికి కారణ మీ క్రింది రెండు గ్రంథములు.

అహోబల పండితీయము.5

అప్పకవికి వెనుక సరిగా నూటేండ్లకు. క్రీ.శ. 1751లో అహోబల పండితుడు (తెలుగుపేరు గాలి నరసయ్య— సంస్కృత నామము— ([illegible] అహోబలపతి) దీనిని కవి శిరోభూషణము అనుపేర నొక పెద్ద సంస్కృత వ్యాఖ్యానము రచియించెను. ఈ కవి శిరోభూషణ మన్నపేరు అప్పకవి నుండి గ్రహించినదే—"

"తొలుత నాంధ్రకవి శిరోభూషణమగు నన్నయ
 సవిశేషంబుగఁ జెప్పె— (1—3).

అహోబలపతి తాను అభినవ నన్నయభట్టాచార్యుడని చెప్పుకొన్నాడు. అసలు ఆంధ్రశబ్ద చింతామణి కర్తయే యొుక అభినవ నన్నయభట్టు— అట్టిచో అహోబలపతి— "నూత్నాభినవ నన్నయభట్టు" అగును గాని అభినవ నన్నయభట్టు కాజాలడు.

క్రీ. శ. 1858లో శ్రీ పరవస్తు చిన్నయసూరి బాలవ్యాకరణమును రచించి ప్రకటించెను. అది ప్రధానముగా ఆంధ్ర శబ్ద చింతామణి నాధారముగ చేసికొని రచితమైనదే. కాని సూరి, అథర్వణ కారికావళి, అహోబల పండితీయము వీనిని గూడ పరిశీలించి, వాని యందలి విషయములను కొన్నింటిని సంగ్రహించియే యున్నాడు. చిన్నయసూరి ఆంధ్రశబ్ద చింతామణి— భారత కవియగు నన్నయ రచించినదే యను విశ్వాసముతో దానిని గ్రహించెను. అది భారతకవి రచించినది కాకపోవుటచే బాలవ్యాకరణము ప్రాచీనభాషా సంప్రదాయములను, ప్రయోగ విశేషములను, పెక్కింటిని సమర్థించుటకు చాలక పోయినది. చిన్నయసూరియు, నన్నయను "వాగను శాసనులు" అని సగౌరవముగా పేర్కొన్నాడు.

ఆంధ్ర ఛందో వ్యాకరణ సంప్రదాయములు-అవ్యవస్థ

ఆంధ్రశబ్ద చింతామణి యందలి విశేషములు పరిశీలించిన నా గ్రంథము, పదునాఱవ శతాబ్దినాటి రచనమని స్పష్టపడును.

1. "వికృతి" పదము— ఇది 'తెలుగు' శబ్దమునకు బదులుగా చింతామణియందు ప్రయుక్తము.

---

4. బాలసరస్వతీయము, పీఠికాకారులు కళాప్రపూర్ణ వఝ్ఝలచినసీతారామస్వామి శాస్త్రిగారు— వావిళ్ల ముద్రణము— 1955.

5. అహోబల శబ్దము— అహోబిలమని యుండదగునని నే నెరిగినదే—అహోబిలం, అహోబిల— అని ఈ రెండింటికి యతిస్థాన ప్రయోగములు చూపితిని— బయ్య— బళయ్య— మొదలగుతద్భవములు ఓబల శబ్ద ప్రాచుర్యమును తెలుపు చున్నవి.

'వికృతి' పదము తెలుగు భాషా పర్యాయపదముగానే తెలుగు వ్యాకర్ణ లక్షణ గ్రంథకర్తలు వాడలేదు. ఇక చిన్నయ సూరి బాలవ్యాకరణ రచనమునకు ముందు పుట్టిన ఈ క్రింది తెలుగు వ్యాకరణములలో "వికృతి' పదమే లేదు.

1. పట్టాభి రామ పండితీయము: క్రీ. శ. 1820—వేదము పట్టాభిరామశాస్త్రి.

2. ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము: 1834—పుదూరి సీతారామశాస్త్రి.

3. తెలుగు వ్యాకరణము : 1836— రావిపాటి గురుమూర్తి.

4. తెలుగు వ్యాకరణము: 1856—ఉదయగిరి శేషయ్య శాస్త్రి.

5. లఘు వ్యాకరణము : 1857—వేదము వేంకట రమణ శాస్త్రి.

చిన్నయసూరియు, వికృత పదము, తెలుగు కావ్యములలో, కవి వ్యవహారములో కానరాకపోవుటచేత దానిని ప్రత్యేకముగ వివరింపవలసి వచ్చినది.

"వికృతి యగు దికారాంతముల యుపోత్త మేత్వంబు నకు బహువచనము పరంబగునపు డుత్వంబగు." అని సూత్రముచేసి, నెమెనెంటనే ఇచట 'వికృతి' శబ్దముచే సంస్కృత సమేతరంబు గ్రహింపవలయును" అని వివరించెను. (చూ. తత్సమ. పరిచ్ఛేదము 46 సూ.)

2. వర్ణ సమామ్నాయము—వివరించు సందర్భమున సంస్కృతమునకు ఏబది వర్ణములని— ప్రాకృతమునకు నలువది యని— తెలుగునకు ముప్పదియాఱని— చింతామణి.

కాని అప్పకవికి పూర్వనే తెలుగు వ్యాకరణ కారులు వర్ణసమామ్నాయము సి విధముగ విభజింపలేదు. కేతనాది వైయాకరణులు ఆదులు, కాదులు—అనిరేకాని సంఖ్యనీయలేదు.

తెలుగున వర్ణసంఖ్య ఏబది అని తెలిపిన వాడనంతుడు (క్రీ. శ. 1434). కావున చింతామణి రచన దాని తరువాతిది.

3. రేఫ రకారద్వైవిధ్యము. ఈ రేఫ రకార ద్వైవిధ్యము తొలుత నెఱింగించిన వారు శ్రీ తాళ్ళపాక పెద తిరుమలయ్యగారు. వీరి కాలము క్రీ. శ. 1550. చింతామణి యందిదిసూచితము. కావునది తరువాతిది.

4. చ. జ. ల దంత్య తాలవ్య విషయము.

ఇది చింతామణికి తప్ప— అందకుముందే తెలుగు వ్యాకరణము తెలుపలేదు. పై రెండును ప్రత్యేకమైన తెలుగు భాషకు ప్రధాన లక్షణములుగదా : తెలుగులో వ్యాకరణము వ్రాసిన వారికిది తెలియక పోయునదా ?

5. చింతామణి యందలి పారి భాషిక పదములు.

ద్రుతము, ద్రుత ప్రకృతికము, కళ— ఇవి పూర్వాంధ్ర వ్యాకరణముల నున్నవా ? వానిలో ద్రుతమునకు నాంతపదము అని వాడుక. ఇవియేకాక పరుషములు, సరళములు, మహద్వాచకము, మహతివాచకము, తద్ధర్మార్థకము— ఇవి యే వ్యాకరణము నందున్నవి ?

6. విభక్తి ప్రత్యయముల పరిణామము చూచిన (చతుర్థీ—విభక్తి కొఱకు) చింతామణి రచన నర్వాచీనము.

ఇంక నిట్టి వెన్నో చూపవచ్చును. ఆంధ్రశబ్ద చింతామణి నన్నయనాటి రచన కాదనుటకు శతాబ్ది నాటి రచన యెంత మాత్రము కాదని— సిద్ధాంతము.

ఆంధ్ర భాషా సాహిత్య చరిత్రలో నీ చింతామణి రచన కలవరము కలిగించినది. భాషా పరిశ్రమ చేయువారు, తెలుగు భాషలో వ్యాకరణములు, లక్షణ గ్రంథములు వీనిని ఆ మూలాగ్రముగా పరిశీలించి, ఆయా కావ్యముల యందలి భాషా పరిణామమును సమన్వయింప వలసి యుండెను. కాని అట్టి పని జరుగలేదు. ముఖ్యముగా భారతాది గ్రంథములు ముద్రణ ప్రారంభమైన నాటి నుండి, పండితులాంధ్ర శబ్ద చింతామణి (భారత కవి నన్నయదే అను మూహతో) ననుసరించిన బాల వ్యాకరణముననుసరించి చింతామణికి విరుద్ధముగ నున్న పాఠముల నన్నింటిని చింతామణి మతానుసారముగ దిద్ద నారంభించిరి. భారతమే కాక తక్కిన ప్రసిద్ధ కావ్యముల కిదే గతి పట్టింది.

కీర్తి శేషులు వేదము వేంకటరాయశాస్త్రిగారు శ్రీనాథ మహాకవి శృంగార నైషధమును— శ్రీనాథుడు చిన్నయసూరి బాలవ్యాకరణము చదువుకోలేదు కనుక— చిన్నయసూరి ననుసరించి పాఠములు జంకు గొంకు లేక సవరించినారు. కీర్తి మూర్తులు వర్ఝులవారు చింతామణి బాలవ్యాకరణ మతానుసారముగ ప్రాచీన కావ్య భాష నంతను దిద్దవలయునను యభిప్రాయము గలవారు.

ముఖ్యముగా నీనాడు— నన్నయను గూర్చి— భారతమందలి భాషా ప్రయోగములను గూర్చి, పత్రికలలో ప్రకటితము లగుచున్న నాదోప వాదముల కన్నిటికి మూలమీ ఆంధ్ర శబ్ద చింతామణి, బాల వ్యాకరణాదులే యగుట నిర్వివా

ధాంశము. ఈ నాడు సంప్రదాయసిద్ధమైన ఆంధ్ర వ్యాకరణ ఛ్ఛందో లక్షణ గ్రంథముల విషయమై పర్యాప్తమైన పరిశీలన జరుగవలసియున్నది. ఒక్కొక్క గ్రంథములో విశేషములను గూర్చి కూలంకషంగా చర్చ జరిగి సారాంశములు ప్రకటింపవలసి యున్నది. కాని కేవలం యేదో యొక వ్యాకరణ సథకముపై నాధారపడుట భాషాభ్యుదయ హేతువుకాదు. ఇట్టిదానికి స్వస్తి చెప్పుట మేలు.

ఈ నాడు మనకు ప్రాచీనాంధ్ర భాషా సంప్రదాయములు భాషా పరిణామము, శబ్ద వ్యుత్పత్తులు వీని నెఱుంగుటకు లాక్షణికుల బారి పడకుండా తప్పించుకొన్న శివకవుల గ్రంథములు, శాసనములు, సాధనము లగుచున్నవి. శ్రీ గిడుగు పంతులుగారి మతము ననుసరించి, మన భాషలోని కవి ప్రయోగము లన్నీ సేకరింప బడవలెను, ఆ నాడే మనము మన భాషా లక్షణములను కొంతవరకు నిర్ణయించుట కధికారులము కాగలము.

తెలుగు భాషలో చాలవఱ కట్టి సాధన సామగ్రి ఇంతకు ముందున్న తెలుగు వ్యాకరణ లక్షణ గ్రంథములలో నున్న. సంస్కృతములో నున్న నాంధ్ర వ్యాకరణములవలె తెలుగులో నున్న వ్యాకరణ లక్షణ గ్రంథములకు క్రమ పరిశీలన జరుగలేదు. వానిలో చాలవఱ కముద్రితములు— ఒక్క తంజావూరి పుస్తక శాలలో, సంకలనముగా నున్న లక్షణ గ్రంథము లున్నవి. అవి కాగితములపైని కూడలేవు. తాళపత్రములలోనే యున్నవి. ముద్రితమైనవి వ్రాత ప్రతులతో కూడ సరిచూడవలసిన ఆవశ్యకత చాలగా గలదు. ఇట్టి పరిశ్రమ జరిగి అముద్రితముగా నున్న విషయములు వెలుగులోనికి వచ్చినప్పు డాంధ్రభాషా లక్షణము సువ్యక్తము కాగలదు.

వైదిక సంస్కృతమునకు, లౌకిక సంస్కృతమునకు లక్షణము లేర్పఱచినట్లుగా, దేశభాషలలో కన్నడమునను హళె కన్నడము— హొస గన్నడము — అని యేర్పడినట్లుగా తెలుగులో ప్రాచీనాంధ్రభాష, నవీనాంధ్రభాష, అని రెండు భాషావర్గములుగా విభాజ్యమై, వానికి ప్రత్యేక ప్రత్యేక వ్యాకరణములు చారిత్రక రీతిని, శాస్త్రీయము, సంప్రదాయము సమ్మేళనము చేసిన పద్ధతిని రచితమైనచో, మనకు భాషా వివాదము లుండవు. వ్యాకరణము 'రణము'గా పరిణమింపదు. భాషా పరిశ్రమచేయువారల నాకర్షించును. తెలుగు భాషా భారతి, సంపూర్ణ వ్యక్తిత్వము ప్రత్యభి వ్యక్తము కాగలదు.

క్రీ. శ. 1881 లో శ్రీ వీరేశలింగము పంతులవారు ప్రథమ స్త్రీ పునర్వివాహమును తలపెట్టిరి. అప్పుడు కాకినాడయందు ప్రసిద్ధ వర్తకులగు శ్రీ పైడా రామకృష్ణయ్యగారు పంతులుగారికి నలువదివేల రూపాయిలు (ఇప్పుడు లక్షతో సమానము) విరాళమిచ్చిరట. ఆ సందర్భమున వసురాయ కవిచెప్పిన పద్యము.

ఉ. నీరధిగట్టె రాముఁ; డవనీస్థలి ముంచు నభర్తృకాశ్రుదుర్
నీరధిఁగట్టె వీరేశలి; నేర్పునగాచె వితంతు గర్భమున్
గూరిమిఁ గృష్ణుఁ,డిప్డు పదికోటులు గాచెదవీవు; రెంటికిన్
గారణమెన్న పైఁడి,యటుగావున సార్థక మాయెనీ మొదన్
పేరును, నింటిపేరు; నినుఁ బేర్కొన రాదెటు రామకృష్ణుఁడా!

ఏకాంత సేవ

★

శ్రీ కె. సభా

భగవాన్ !

ఏకాంతంగా కొన్ని క్షణాలు కూచుని నిన్ను ధ్యానించే సదవకాశాన్ని ప్రసాదించినందుకు నీకు ధన్యవాదములు సమర్పించుకొంటున్నాను. అనుక్షణమూ ఎందరెందరో భక్తులు స్తుతిస్తున్న ఈ ప్రపంచంలో ఏ మారుమూలలనుండియో విన్పించే నా స్వరాన్ని నువ్వు వింటున్నావు. అప్పుడే పుట్టిన పసి నిసుగుపై తల్లికుండే మమకారమే నీకు నాపట్ల ఉండక తప్పదు. ఎందుకంటావా ! నేనూ ఇప్పుడిప్పుడే నీ కోసం వెతుకుతున్నాను. భక్తి భావనోద్వేగం ఇటీవలనుండే నాలోని రక్తనాళాలలో ప్రవేశిస్తున్నది.

భగవాన్ !

నేనే చనిపోయానో—, నువ్వు నన్ను చంపావో—, తెలుసుకోగల విచక్షణాశక్తి నాకు లేదు. నాలో వస్తున్న ఈ మార్పును చూచినపుడు ఏదో అవ్యక్తానుభూతితో హృదయము పొంగిపోతున్నది. నువ్వు లేవని ఊరూరా ఉపన్యాసాలిచ్చిన రోజులు—, అంతా అబద్ధమని వెలువడే పత్రికల్లో విరివిగా ప్రచారంచేసిన దినాలు జ్ఞప్తికి వచ్చినపుడు నాలో ఆనాడు పురులు విచ్చుకొని నృత్యంచేసిన అహంకారము—, పడగలు విప్పి విషాన్ని వెదజల్లిన విద్వేషము—, ఒక్కొక్కటిగా స్మృతిపథంలో కన్పించి మరుగౌతున్నవి. ఆనాటి నేను చనిపోయాను. ఈనాడు క్రొత్తగా జన్మించాను. జీవితంలో చచ్చి బ్రతకడం అనేది ఇదే అనుకొంటాను.

సరాసరి నీ వద్దకు సూటిగా నడిచివచ్చే మార్గం ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నా—అలా నడవడానికి పాదాలు తహతహలాడుతున్నా—, హృదయం శరవేగంతో కొట్టుకొంటున్నా మనస్సు మొండిగా వ్యవహరిస్తున్న విషాద ఘట్టాలు స్ఫుటంగా కనిపిస్తున్నవి.

భగవాన్ !

నాయకులు— మేధావులు— మహాకవులు—సంపాదకులు—ప్రచురణకర్తలు—ఉన్నతాధికారులు వీరంతా నిర్మించే ఆనకట్టలను దాటుకొని సాహిత్యంతో స్వానుభవంతో నీ సాక్షాత్కార సిద్ధికై అల్లల్లాడిపోతున్న ఈ జీవన స్రవంతి నీ ప్రేమసాగరంలో విలీనమయ్యే దెన్నడు ప్రభూ !

ఉద్యోగాలూ—, సన్మానాలూ —పూలదండలు — ప్రశంసలు — ఆవిష్కరణలు అంకితాలనే ముళ్లకంచెలకు దూరంగా నాగజెముళ్లను తప్పుకొంటూ సూటిగా నీవైపు నడిచిరాగల శక్తినీ—ఆత్మ స్థైర్యాన్నీ, గుండె నిబ్బరాన్నీ ప్రసాదించమని నిన్ను కోరినపుడు నువ్వెంతో ఆదరంతో అభిమానంతో అందుకనువైన పరిస్థితులను కల్పిస్తున్నావు కానీ—,

అధర్మాన్నీ—, అన్యాయాన్నీ—, ఘోర పాపాలనూ—, విశృంఖలంగా విహరించే అవినీతినీ చూచీ—సహించీ— మౌనంగా ఉండగల ఓర్మిని మాత్రం ప్రసాదించలేకపోతున్నావు.

భగవాన్ !

సత్యాన్ని చెప్పడానికీ—చెబితే వినడానికీ—, వాస్తవాన్ని వ్రాయడానికీ—, వ్రాస్తే ప్రచురించడానికీ—, ప్రచురిస్తే చదివి ఆగ్రహోదగ్రులు కాకుండా ఉండడానికీ వీలుకాని ఈ ప్రపంచంలో ఎట్లా జీవించాలో—, ఏవిధంగా బ్రతకాలో తెలియక, తెలిసినవారూ కన్పించక, నిన్నిట్లా ఏకాంతంగా కూచుని అడుగుతున్నాను.

త్యాగరాజెంత పిచ్చివాడు ! నీ కోసమే పలవరించాడు. గానంలో, రాగంలో—తాళంలో—పల్లవిలో—, అనుపల్లవిలో—సాహిత్యంలో— ప్రత్యక్షరంలో నిన్నే సాక్షాత్కరించుకొన్నాడు.

రామదాసెంత అమాయకుడు ! ప్రజల సొమ్ము నీదే అనుకొన్నాడు. నీ కోసమే వెచ్చించాడు. నిన్ను తన వశం చేసుకొన్నాడు.

అలాంటి మహాత్ములు పుట్టిన నా దేశంలో, పోతనవంటి మహానుభావు లుదయించిన నా భూమిలో, ఈనాడు కవులు కవీశ్వరులు మహాకవులూ—, గానంలో రాగంలో—, పల్లవిలో అనుపల్లవిలో—గేయంలో—కావ్యంలో—, ప్రతి రచనలో మంత్రులను సాక్షాత్కరించుకొంటున్నారు. అంకితాలు—ఆవిష్కరణలు—ఆ వెనుక తతంగాలు—పదవులూ—ఉద్యోగాలు.

రామదాసు ప్రజల సొమ్ము నీదే అనుకొంటే ఈ రామ రాజ్యంలో ప్రజా ప్రతినిధి అనుకొంటున్నవాడు ప్రజల సొమ్ము నాదే అనుకొంటున్నాడు. ఆ వెర్రి రామదాసు నీకు గుడీ గోపురం నగా నట్రా వాహనాది సౌకర్యములు కల్గించాడు.

ఈ తెలివిగల ప్రతినిధి తనకు మేడ — తోటా — దొడ్డీ — తన బంధుమిత్ర పరివారాలకు ఆస్తిపాస్తులూ అన్నీ సమకూర్చుకొంటున్నాడు.

అంతా నీ లీల కాకుంటే ఏమనాలి ? ఆ రామదాసును కారాగారంలో పెట్టించావు ! ప్రజల సొమ్ము నిట్లా నాకోసమైనా సరే వెచ్చించరాదని ఆగ్రహించి అట్లా చేయించావు. ఈనాటి దాసులను ఎట్లా సత్కరిస్తావో ప్రభూ ! వీరికంతా నీ దేవలోకంలో మళ్ళీ ఎన్నికలు పెట్టించవుగదా !

భగవాన్ !

నీకు నైవేద్యం యివ్వాలనే సాంప్రదాయం ఉన్నది. ఇంట్లో పూజలో కాస్త చక్కెర నైవేద్యం అవసరమైంది. ఈనాడా చక్కెర కూడా అరుదైపోయినది ప్రభూ ! ఇహానికీ పరానికీ ఎంత తేడా ! స్వర్గంలో చక్కెర కరువుండ దనుకొంటాను. బహుశా అక్కడ కులాలు కూడా లేవని నా నమ్మకము. అసలు నువ్వేకులం వాడివో ఎవడూ చెప్పలేడు. అన్ని కులాల నేమిటీ—అన్ని ప్రాణాలనూ నువ్వు సమానంగా చూచుకొంటావు. లేకుంటే నువ్వూ నీ కుటుంబం ఎట్లా మనగలుగుతారబ్బా ! నీ వాహనం నందీశ్వరుడైతే మా అమ్మ వాహనం సింహమైపోయే ! ఎద్దుకూ సింహానికీ ఎంత చెలిమి ప్రభూ !

అమ్మగారి ఒడిలో విఘ్నేశ్వరుడు. ఆయనగారి వాహనం మూషికం. నీ మెడనిండుకూ నాగులే. ఈ నాగరాజులకు మూషికావికి ఎంత స్నేహం స్వామీ ! కాగా సుబ్రహ్మణ్యస్వామి వాహనం మయూరమైతే ఆ మయూరాన్ని చూచి ఈ నాగేంద్రులు భయపడరేం—,

మహాప్రభో నీ కుటుంబానికంటే పోషలిస్టు వ్యవస్థ ఎక్కడుంది ? నువ్వు కేపిటలిస్టు సృష్టించుకొన్న దేవు డంటారు కామ్రేడ్ ఎర్రయ్య.

భగవాన్ !

చచ్చిపోయిన ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన చలిచీమనైనా బ్రతికించే యోగ్యతలేని సైంటిస్టు శూన్యాన్ని ఆక్రమించి నక్షత్రాలను అధిగమించి ఆవెనుక ఏదో చెయ్యాలని ఆకసానికి ఎగబడి ప్రాకిపోతున్నాడు. తన్ను తాను తెలుసుకోలేని మానవుడు, తాను చచ్చిపోవడం అక్షరాలా సత్యమని ఎరుగలేని మానవుడు, ఎన్నో విపరీతమైన చర్యలతో లోకాన్ని బాధించడం ఆరంభించాడు. శోకానలాన్ని సృష్టించడానికి కృషి చేస్తున్నాడు.

ప్రతి రాజకీయవేత్తా, ప్రతి పార్టీ ప్రజలకోసమే, ప్రజాసేవకే సంటూ ప్రజల్ని బాగా ఉతికేస్తున్నారు. పరమేశ్వరా ! నీ ఉనికి ఎక్కడో ఈ మంత్రులకు తెలియకపోబట్టీ సరిపోయింది గానీ, తెలిసే గనుక ఉంటే ఈపాటికి అసలు ఎన్నికలే జరుగరాదనీ—, మాకు మృత్యువే సంప్రాప్తించరాదనీ—, లెక్కలేనన్ని వరాలకోసం నిన్ను వేధించి బాధించి ఉండేవారు.

భగవాన్ !

మాటలో — పాటలో — గాలిలో — వెలుగులో — సర్వత్రా వ్యాపించిన నిన్ను చూడాలనే ఆకాంక్ష కంటే—, నిన్ను కలుసుకోవాలనే తపన కంటే—, నీ మూర్తిత్వాన్ని హృదయపీఠంలో సుస్థిరంగా నిలుపుకోవలె ననే ఆశయం కంటె, రాజకీయ నాయకుల పరిచయభాగ్యమే బ్రహ్మానంద మనుకొంటున్న కవులకూ—, గాయకులకూ — పోతన అందగలడా ! త్యాగయ్య అర్థం కాగలడా ! వాల్మీకి స్థానానికీ—, వ్యాసుని పీఠానికీ—, నేటి కవి జీవితానికీ ఉన్న అఖాతం ఎంత పెద్దది ! ఎంత లోతైనది !

నీడవలె నన్ను వెన్నంటుతున్న నువ్వు నా దినచర్యను చూస్తున్నావు. నీకు తెలియకుండా నేనేమీ చెయ్యలేను. మనస్సు తప్పుదారిలో ఆలోచించినపుడు హృదయంలో నున్న నీ స్వరం విన్పిస్తున్నది. క్రమక్రమంగా నువ్విట్లా నన్ను బంధించావో—, లేక నేనే ఏదో ఉన్మాదంతో నీ బంధానికి చిక్కిపోయానో చెప్పలేను గానీ—, ఒకానొక మిత్రుడు నా పరిస్థితిని బానిస ప్రవృత్తిగా అభివర్ణించాడు.

ఎవరెవరికి బానిసలు ! అసలు బానిసత్వమంటే అర్థమేమిటి ? స్వేచ్ఛగా మాట్లాడే వీలులేని—, వ్రాసే అవకాశం లేని—, సత్యాన్ని చాటే అదృష్టంలేని నియంతృత్వ దేశాలలోని నా సోదరకవులు బానిసలా ? పదవులకో—ఉద్యోగాలకో—, మరే స్వార్థాలకో — పార్టీలకు — కులాలకూ — గ్రూపులకూ లొంగిపోతున్న నా మాతృదేశంలోని ప్రఖ్యాతి వహించిన కొందరో — లేక చాలమందియో కవీశ్వరులు బానిసలా ? ఏదీ పట్టించుకోక అజ్ఞాతంలో ఉన్నా, స్వాతంత్ర్య వాయువుల్ని పీలుస్తున్న పోతన, వేమన వంటి మహాకవుల కోవకు చెందినవారు బానిసలా !

భగవంతుని ఆరాధించడమే బానిసప్రవృత్తియైతే—, సత్యాన్ని లిఖించడమే బానిస ప్రవృత్తి యైతే—,

అహంకారాన్ని—నియంతృత్వాన్నీ—దోపిడీతనాన్నీ— అధికార వ్యామోహాన్ని —ఆరాధిస్తూ—, వాటికి నివాళు లెత్తుతూ వందిమాగధులై సాహిత్యపరమావధిని విస్మరించి, కవిత్వ

ఏకాంత సేవ

తత్వాన్ని మఱచి కేవలం పిడికెడు మెతుకులకై తమ్ము తామే మఱచిన మహాకవుల ప్రవృత్తి యెట్టిదో గదా !

భగవాన్ !

ఇదొక ఎడారి ! ఇక్కడ కార్చే కన్నీటికి విలువలేదు. ఇదొక అరణ్యం. ఇక్కడి విలాపానికి ఫలితంలేదు. ధర్మాన్నీ— న్యాయాన్నీ —సత్యాన్నీ—నీతినీ చాటే శక్తి స్తోమతులున్న సాహిత్యవేత్తలు —, కవులు—, సంపాదకులు—, రచయితలు—, అందరూ కాక పోయినా, చాలమంది తమ నిజస్వరూపాలను—తమ బాధ్యతలను విస్మరించారంటే ఎవ్వరూ పట్టించుకోరు. ఈ కంఠశోషను విన గలవాడివి—సానుభూతితో ఈ విలాపాన్ని ఆలకించగలవాడివి నువ్వు మాత్రమే.

భగవాన్ !

జీవితంలో ఎన్ని అపూర్వమైన అనుభవములను ప్రసాదిస్తున్నావు! కవులలో ఎన్ని తరగతులు ! రచయితంలో ఎన్ని వర్గాలు !! సారస్వతనందనంలో ఎన్ని సర్పాలు !!!

కులాల సాహిత్యం
మతాల సాహిత్యం
పార్టీల సాహిత్యం
పార్టీలలో గ్రూపుల సాహిత్యం
ప్రభుత్వ సాహిత్యం
ప్రతిపక్షాల సాహిత్యం
బహుమతుల కోసం సాహిత్యం—
సాహిత్యంకోసం బహుమతులు—
సాహిత్యంలో ఖూనీలు— అపరాధాలు— నేరాలు— పరిశోధనలు—
కులాలవారి సన్మానాలు
పార్టీలవారి సన్మానాలు.
వ్యావహారికవాదులు కొందరు—
గ్రాంథికవాదులు కొందరు.

మొత్తంమీద ఆంధ్ర సారస్వత నందనంలో ఫలాల నుండి నవరసాలకు మారు నీరసాలు చిందుతున్నవి.

దేశంలో అన్ని రంగాలతోపాటు సాహిత్యరంగాన్ని కూడా ప్రభుత్వం జాతీయంచేసివేస్తున్నది. కొన్నాళ్ళిలాగే జరిగితే ఆధ్యాత్మికరంగాన్ని కూడా ఈ ప్రభుత్వం జాతీయం చేసి ఊరుకొంటుంది. అప్పుడిట్లా ఏకాంతంగా నీ ముందు కూచుని నా కష్టసుఖాలు చెప్పుకోలేను. నిన్ను గురించి ఎట్లా పాడాలో ఎట్లా వ్రాయాలో—? విద్యాశాఖామంత్రి ఎవరిచేతనైనా వ్రాయించుకొన్న ఉపన్యాసాన్ని ఎక్కడో బహిరంగ సభలో స్పష్టంగా స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చదివితే ఏ కీచు గొంతో ముద్దుముద్దుగా ఆ వార్తలను ఆకాశవాణిలో ప్రసారం చేస్తుంది.

ఇట్లా చివరికి మనస్సులపైన—హృదయాలపైనా—భావాలపైనా—పరోక్షంగా పడుతున్న బానిసముద్రలు చీకటి దయ్యాలై ఆంధ్రసాహిత్య ప్రపంచంలో దోబూచులాడుతున్నపుడు రాత్రుల్లో సరిగ్గా నిద్ర పట్టడంలేదు !

"కాటుక కంటినీరు" పద్యం జ్ఞాపకానికి వస్తే "లావొక్కింతయు లేదు ..... అంటూ హృద్గీతి విన్పించినపుడు నియంతృత్వదేశాలలోవలె .... ఈ దేశంనుండి కూడా స్వేచ్ఛగా బ్రతుక లేని సాహిత్యవేత్తల వలస యీ దశాబ్దంలోనే ఆరంభమవుతుందా అనే అనుమానం కలిగి హృదయం కంపిస్తుంది. ఏదో చెప్పాలని పెదవి విప్పితే అనంతకోటి సత్యాలు అనర్గళంగా నయాగరా వలె ప్రవహిస్తాయి. ఏదో వ్రాయాలనుకొంటే సెలయేటివలె అక్షర పంక్తులు నృత్యాలు చేస్తూ శివతాండవాన్ని స్ఫురింపజేస్తాయి. అంతా నీ లీలలు గాక మరేమిటి భగవాన్ !

అక్కడ వేణుగాన జనితాంగజ రాగవిమోహచిత్తవై
చొక్కెడు గోపకామినులఁ జూచి హసించి దయార్ద్రదృష్టిచే
రక్కున గారవించి పరమార్థ మొసంగిన చిన్ననాటి నీ
చక్కదనంబుఁ జూడ మనసైనది చూపుము నందనందనా !

—నందనందన శతకము.

పండిత విలియం కారీ

★

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

"తెలింగ (తెలుగు), కర్నాటిక్ (కన్నడం), తమిళం, మలయాళం, సింగాలీస్ (సింహాళం)— ఈ అయిదు భాషలలోను తెలుగు బహుధా పరిణతి చెందిన భాషగా కనబడుచున్నది. ఇది కష్టమయిన భాషయే అయినను, నేర్వదగిన భాషలలో ఇది యొకటి. ఇందు విభక్తి వైవిధ్యము గలదు. ఈ కారణమున, ఈ భాషలో సులభముగా, సుందరముగా, ఎక్కువ తక్కువలు లేకుండగను భావప్రకటన చేయుటకు ఎక్కువ అవకాశము గలదు."

కలకత్తాలోని ఫోర్టు విలియం కాలేజీలో సంస్కృత, వంగ, మహారాష్ట్ర భాషలలో ఆచార్యపదవి నలంకరించిన పండితుడు, బైబిలు అనువాదమును నలుబది భాషలలో ప్రచురించుటకు తోడ్పడిన బహుభాషాభిజ్ఞుడు నగు డాక్టర్ విలియం కారీ చేసిన తెలుగు భాషా ప్రశంస ఇది. 1814లో ఆయన ప్రచురించిన తెలుగు వ్యాకరణము నందలి మున్నుడిలో ఈ ప్రశంస అందాలు దిద్దుకొన్నది. తెలుగుభాషను గురించి ఇంతగా ప్రశంసించిన ప్రముఖ పాశ్చాత్య పండితులలో బహుశః కారీయే ప్రథము డనదగును.

తెలుగు నభ్యసింపవలె నను తలంపుతో కారీ భారతావనికి రాలేదు. తొలినాళ్లలో మన దేశమునకు వచ్చిన పాశ్చాత్య పండితులవలె, అతడును క్రైస్తవ మతమును ప్రచారము చేయు నభిలాషతోనే మన దేశమునకు వచ్చెను. కాని వివిధభాషా నిలయ మగు మనదేశములో మత ప్రచారము చేయుటక్కు విదేశ భాషయగు ఆంగ్లము అంతగా తోడ్పడదను సత్యమును గ్రహించి కారీ, భారతీయ భాషాభ్యసనము చేసెను. సంస్కృత భాషా సారస్వతములను మథించినగాని భారతదేశమునందలి వివిధ భాషలలోను తగినంత పరిజ్ఞానము గడించుటకు వీలు కాదను సత్యమును కూడా గ్రహించినవా డగుటచే, అతడు తొలుత సంస్కృత భాషాధ్యయమునకు పూనుకొనెను. కాల క్రమమున, బెంగాలీ, మరాఠీ, తెలుగు మొదలగు పెక్కు భాషలలో అతడు పాండిత్యము గడించుటయే కాక, ఆయా భాషలకు సంబంధించిన వ్యాకరణ గ్రంథములు కూడ రచియించెను. భారతీయ భాషలనేకాక గ్రీక్, లాటిన్, హీబ్రూ మున్నగు పాశ్చాత్య భాషలను కూడ అతడు అధ్యయన మొనర్చెను. ఆ నాళ్లలో విలియంకారీ వంటి బహుభాషావేత్త మఱొకరు లేరనుట నిజమునకు దగ్గరగా నుండును.

కారీ తన తెలుగు వ్యాకరణమునకు వ్రాసిన మున్నుడిలో తెలుగు, తమిళము మున్నగు దాక్షిణాత్య భాషలను గురించి ముచ్చటించుచు ఇట్లనెను: "The languages of India are principally derived from the Sanscrit. The structure of most of the languages in the middle and north of India, is generally the same, the chief difference in them lies in the termination of the nouns and verbs, and in those deviations from Sanscrit orthography which custom has gradualy established in the countries where they are spoken..." తన సంస్కృత వ్యాకరణమునందుకూడ కారీ పై యభిప్రాయమునే ప్రకటించెను. కనుక, కారీ దృష్టిలో భారతీయ భాష లన్నియు సంస్కృత జన్యము లనుట నిస్సంశయము. ఈ యభిప్రాయమును ఒక్క కారీయే కాదు, ఆ నాటి పాశ్చాత్య పండితులు పలువురు బలపరచియుండుట గమనింపదగు విషయము.

డాక్టర్ విల్కిన్స్, కోల్‌బ్రూక్ ప్రభృతులు కూడ భారతీయ భాషలకు సంస్కృతము జనని యనియు, సంస్కృత భాషా సాహాయ్యము లేకుండ ఈ భాషలలో ఒక్క వాక్యమైనను వ్రాయుట వీలుపడ దనియు పేర్కొనిరి. ఈ సిద్ధాంతములను సహేతుకముగా ఖండించి, తెలుగు, తమిళము మొదలగు దక్షిణ దేశభాషలు సంస్కృత భాషాజన్యములు కావనియు, అవి ఒక ప్రత్యేక భాషా కుటుంబమునకు చెందిన వనియు తొలుదొలుత పేర్కొనినవాడు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్. ఎల్లిస్ సిద్ధాంతమునకు సమగ్ర స్వరూపము నొసగినవాడు డాక్టర్ కాల్డ్‌వెల్. అంతేకాదు, దక్షిణ దేశ భాషా కుటుంబమునకు ద్రావిడభాషా కుటుంబమని నామకరణము చేసినవాడు కూడ కాల్డ్‌వెల్ యే.

పండిత విలియంకారీ

ఒకవైపు మత ప్రచారము, ఇంకొకవైపు భాషాధ్యయనము, మరొకవైపు గ్రంథరచనము, వేరొకవైపు గ్రంథ ముద్రణము, మఱియొకవైపు ఉద్యోగధర్మ నిర్వహణము— ఇంత బహుముఖమైన కార్యక్రమమును కడు సమర్థతతో నిర్వహించుటయే కాక విజయములను కూడ సాధించిన కారీ నిజముగానే ప్రశంసార్హుడు ! ఈ విషయాదికమును స్మరణకు తెచ్చుకొన్నప్పుడు, అతడెంత అదృష్టవంతుడో ! అనిపించును. కాని దుఃఖ పూరితమైన అతని జీవితమును గుర్తునకు తెచ్చుకొన్నచో, గుండె దిటవుతో ఆ బహుముఖమైన కార్యక్రమము నతడెట్లు నిర్వహింపగలిగెనో ! అను ఆశ్చర్యము కలుగకపోదు. జీవితములో అడుగడుగున అతడెన్నో కష్టముల నెదుర్కొనెను. ఒకసారి అతని అచ్చుకూటము అగ్నిప్రమాదమునకు లోనయ్యెను. కాగితములకట్టలు, బల్లలు, కుర్చీలు మొదలగు వానితోపాటు పెక్కేండ్లు పరిశ్రమించి తయారు చేసిన వివిధ భాషా వ్యాకరణముల వ్రాతప్రతులు, రామాయణానువాదము మొదలగునవి కూడ పరశురామప్రీతి అయ్యెను. అందుల కాతడు కంట తడిపెట్టక పోలేదు, కాని నిరుత్సాహము చెందలేదు. మరియొకప్పుడు మక్కువకొలది సృష్టించుకొన్న సుందరోద్యానము వెల్లువలకు రూపు లేకుండ పాడయ్యెను. అప్పుడును నిరుత్సాహము చెందలేదు. పైపెచ్చు, అకుంఠిత మయిన కార్యదీక్షతో, అచంచల మయిన విశ్వాసముతో కారీ మరల తన పనిపాటలలో నిమగ్నుడయ్యెను.

విలియంకారీ మన దేశమునకు 1794లో వచ్చెను. అప్పటి కతడు ముప్పది మూడేండ్ల యువకుడు. మరణించు నాటి కతని వయస్సు డెబ్బదిమూడేండ్లు. ఈ నలుబదేండ్ల సుదీర్ఘకాలములోను, అతడు మరల తన దేశమగు ఇంగ్లాండునకు వెళ్లలేదు. వెళ్లవలె ననుతలంపు కూడ అతనికి కలుగలేదు. ఒకచోట కారీ వ్రాసికొనినట్లుగా, అతని తలంపులన్నియు భారతావనియందే లగ్నమై యుండెను. మత ప్రచారము మీది ఆసక్తితో అతడు మన దేశమునకు వచ్చెను, ఆ యభిలాషతోనే అతడు భారతీయ భాషల నభ్యసించెను. అయినను భారత దేశమును తన రెండవ స్వదేశముగా భావించి, నలుబదేండ్లు భారతీయ భాషా సపర్య చేసిన డా. కారీ భాషా జిజ్ఞాసువులకు ఆదర్శప్రాయుడు !

నార్తు ఆంప్టన్‌లోని పౌలర్స్‌పరీ అనునొక గ్రామములో ఎడ్మండ్ కారీ దంపతులకు 1761 ఆగస్టు 8న కారీ జన్మించెను. ఎడ్మండ్ కారీ ధనికుడు కాడు, సామాన్య గృహస్థు. నేతవృత్తి నాధారము చేసికొని అతడు కాలము వెళ్లదోయుచుండెను. అప్పటి రాజకీయ మత పరిస్థితులు అంత తృప్తికరంగా లేవు. మత సిద్ధాంతములు వివాదగ్రస్తములై యుండెను. బాల్యమున కారీ అల్లరి చిల్లరిగా తిరిగెను. తొలుత అతడొక చర్మకారుని యొద్ద పనికి కుదురుకొనెను. కాని ఆ రోజులలోనే అతని మనస్సు మత ప్రచారమున లగ్నమయ్యెను. ఒకవైపు మత సిద్ధాంతములను గురించి తలపోయుచునే, అతడు గ్రీక్, హీబ్రూ మున్నగు భాషలను అభ్యసింప సాగెను. కాలము గడుచుకొలది, అతనిలో మత ప్రచార వాంఛ బలీయ మయ్యెను. అదియే తన జీవిత లక్ష్యమని అతడు భావించెను. అందుల కనుగుణముగా, బాప్టిస్టు చర్చివారు మత ప్రచార మొనర్చుటకు కారీ అర్హుడనియు నిర్ణయించిరి. మన దేశమునకు వచ్చిన మొట్టమొదటి బాప్టిస్టు మిషనరీ అతడే !

డాక్టర్ థామస్ అనునొక బాప్టిస్టు ఆహ్వానముపై అతనితోపాటు కారీ సకుటుంబముగా మన దేశమునకు బయలుదేరెను. థామస్ స్నేహపాత్రుడు. అతని ప్రధానవృత్తి వైద్యము. కారీకి పూర్వమే అతడు కలకత్తాకు వచ్చి, అచట బెంగాలీ నేర్చుకొనెను. బైబిలులోని కొన్ని భాగముల నతడు బెంగాలీలోనికి అనువదించెను కూడ. కాని అతడు వట్టి దుబారా మనిషి. అందువలన, చేసిన అప్పులు తీర్చలేక, అతడు అపకీర్తి పాలయ్యెను. అతని సలహా ననుసరించియు, ఆ నాటి పరిస్థితులను పురస్కరించుకొనియు కారీ తొలుత కలకత్తాలో గాక తన్నగరమునకు నలుబదిమైళ్ల దూరములో నున్న ఒక గ్రామమున దిగెను. అటుపిమ్మట తన నివాసమును శ్రీరాం పురమునకు మార్చుకొనెను.

థామసు వద్ద కారీ బెంగాలీ నేర్చుకొనెను. కాని మత ప్రచారము చేయు నవసరమున, సంస్కృత భాషాధ్యయనము చేసినగాని బెంగాలీలో పాండిత్యము గడించుటకు వీలుపడదను విషయమును గ్రహించి, సంస్కృతము నేర్చుకొన మొదలిడెను. బైబిలును సంస్కృతము చేయదలచి, కారీ గీర్వాణ భాషలో గట్టి కృషి చేసెను. బెంగాలీలో తగినంత పరిజ్ఞానము కలిగిన పిమ్మట, అతడు థామసు ప్రారంభించిన బైబిలు అనువాదమును పూర్తి చేయుటకు పూనుకొనెను. కొన్నాళ్లకది పూర్తి అయ్యెను. దానిని బెంగాలీ పండితులకు చూపించి, వారి ఆమోదమును పొందిన పిమ్మటనే అతనికి తన రచనపై నమ్మకమేర్పడెను. పిమ్మట ఆ అనువాదమును ముద్రించుటకుగాను అచ్చుకూటమొకటి ఆవశ్యక మయ్యెను. కారీ ఒక ముద్రణ యంత్రమును కొని, అచ్చుకూటము నెలకొల్పి, అచ్చుపనులలో నిమగ్నుడయ్యెను. కాని 1799లో కురిసిన

వానలకు ఫలితముగా అతని కృషి నిష్ఫల మయ్యెను. అచ్చు పడిన ఫారములు మున్నగునవి వెల్లువలో కొట్టుకొని పోయెను.

ఇట్లుండగా, అప్పటి గవర్నరగు లార్డ్ వెల్లెస్లీ ఒక ప్రకటన కావించెను. 'దేశ భాషలలో తగినంత పరిజ్ఞానము సంపాదించిన సివిల్ ఉద్యోగులకే బాధ్యతాయుతము లగు పదవులు లభింపగలవు'— అనునది ఆ ప్రకటనలోని ముఖ్య విషయము. తత్ఫలితముగా, సివిల్ ఉద్యోగులకు దేశభాషలు బోధించు నుద్దేశముతో కలకత్తాలో ఫోర్టు విలియం కాలేజి స్థాపింప బడెను. ఆ కళాశాలలో కారీ సంస్కృత వంగ భాషోపన్యాసకుడుగా నియమింపబడెను. అప్పటి అతని జీతము నెలకు 500 రూప్యములు. కొన్నాళ్లకు అతడు మరాఠీ కూడ బోధింపజొచ్చెను. మరి కొన్నాళ్లకు, నెలకు వెయ్యి రూపాయల జీతముమీద అతడు ఆచార్యపదవిలో నియమితుడయ్యెను. ఆ నాళ్లలో అంత పెద్ద జీతముతో రాజభోగముల ననుభవించుచు జీవితము గడపవచ్చును. పై పెచ్చు, కారీ ప్రభుత్వ అనువాదకుడుగా కూడ నియమితుడయ్యెను. ఇందువలన అతనికి సంవత్సరమునకు 300 పౌనుల ఆదాయము లభించెను. జీతము ఎక్కువగుకొలది, అతని దృష్టియంతయు శ్రీరాంపురముమీదనే లగ్నము కాదొడగెను. ముద్రణాలయమును విస్తరించు కార్యక్రమమునకును, బాప్టిస్ట్ సంస్థను అభివృద్ధి చేయుటకును అతడు జీతములోని అధికభాగమును వినియోగించెను.

స్వయముగా తాను భాషాధ్యయనము చేయునప్పటి కంటె, ఇతరులకు భాషా బోధన కావించునప్పుడే వ్యాకరణములయు, నిఘంటువులయు ఆవశ్యకతను కారీ బాగుగా గుర్తించెను. కనుకనే అతడు తొలుత బెంగాలీ వ్యాకరణమును, బెంగాలీ నిఘంటువును సంతరించుటకు పూనుకొనెను. కాలక్రమమున మరాఠీ (1805), సంస్కృతము (1806), పంజాబి, (1812), తెలుగు, (1814), భూటానీస్, (1826) మొదలగు భాషలకు వ్యాకరణములను, మరాఠీ (1810), బెంగాలీ, (1818), భూటానీస్ (1826) మున్నగు భాషలలో నిఘంటువులను ప్రచురించెను. 1813లో కారీ తన ఆప్తమిత్రుడగు, ఫుల్లరున కొకజాబు వ్రాయుచు అందులో ఇట్లు పెర్కొనెను: "ఇప్పుడే నా తెలుగు వ్యాకరణపు ప్రెస్సు కాపీ పూర్తి అయినది. పంజాబీ వ్యాకరణపు తుదిపుట అచ్చులో నున్నది. కర్ణాట వ్యాకరణపు ప్రెస్సుకాపీ కూడ తయారయినట్లే. కాశ్మీర్, పుష్టో, బిలోచి భాషల వ్యాకరణముల రచనకు కావలసిన విషయములను సేకరించితిని. ఒరియా వ్యాకరణమును మొదలిడితిని. బర్మన్ వ్యాకరణమును ఒక్కసారి సరిచూచి ప్రకటించు భారము నాపై గలదు."

ఇటుల వివిధ భాషలలో వ్యాకరణ గ్రంథముల ముద్రణముతో పాటు, బైబిలు అనువాదముల ముద్రణమును కూడ కారీ నిర్వహించుచుండెను. తొలుత క్రొత్త నిబంధనను సంస్కృతము, ఒరియా, హిందూస్థాని, గుజరాతీ భాషలలోనికి అనువదించి, ఆ యనువాదములను ప్రకటించెను. అటు పిమ్మట క్రొత్త నిబంధనను తెలుగు, కన్నడము, చైనీస్, పంజాబీ, బర్మన్ మొదలగు భాషలలోనికి అనువదింప బూనుకొనెను. ఇట్లనుటచే పై భాష లన్నియు కారీకి తెలిసియుండెనని భావింపరాదు. కాని పెక్కు భారతీయ భాషలలో అతనికి పరిజ్ఞానము గలదు. ఈ బహుముఖమైన అనువాద కార్యక్రమమునందు అతడు పలువురు పండితుల సహాయమును పొందెననుట సుస్పష్టము. కాని ఆ యనువాదముల ముద్రణ భారమును కారీ స్వయముగా నిర్వహించినట్లు తెలియుచున్నది.

ఆ నాళ్లలో మన దేశమునందలి వివిధ భాషలకును ముద్రణాక్షరములు లేకుండెను. కనుక శ్రీరాంపురం ప్రెస్సువారొక ఫౌండ్రీని స్థాపించి ముద్రణాక్షరములు పోత పోయించిరి. కాని 1812— మార్చిలో ప్రెస్సులో ఏర్పడిన అగ్ని ప్రమాదమువలన, కారీ కృషి చాలావరకు నిష్ఫల మయ్యె ననియే నుడువవలసియున్నది. మూడున్నర టన్నుల సీసము కరిగిపోయెను. అచ్చు ఫారములు, కేసులు, కుర్చీలు, కాగితములు, వ్రాత ప్రతులు మొదలగునవి దగ్ధమయ్యెను. 10,000 పౌనులు విలువచేయు వస్తువులు నష్టమయ్యెనని అంచనా కట్టిరి. ఈ నష్టమునకు కారీ అంతగా విచారించలేదు. కాని పెక్కేండ్లు కష్టపడి తయారు చేసిన వ్రాత ప్రతులు నశించుటను చూచి మాత్రము అతడు మిక్కిలి విచారించెను. ఈ ప్రమాదము జరిగిన పిమ్మట కారీ ఫుల్లరు కిట్లు లేఖ వ్రాసెను: "ఇక ఎట్టి ప్రమాదము సంభవింపకున్నచో పది పదునైదు దినములలో ఒక భాషలో అచ్చుపనులు ప్రారంభింతుము. మరొక భాషలో అచ్చుపనులు ప్రారంభించుటకు ఇంకొక నెల పట్టవచ్చును. ఆరు నెలల కాలములో పరిస్థితు లన్నియు చక్కబడ వచ్చునని ఆశించుచున్నాను." ఫుల్లర్ ఒక్కడే ఇంగ్లాండులో 10,000 పౌనుల సేకరించి కారీకి సహాయము చేసెను.

భారత దేశములో క్రైస్తవ మతమును, క్రైస్తవ వాఙ్మయమును వ్యాప్తి మొనర్చుటకు కంకణము కట్టుకొన్న కారీ తల్లక్ష్య సాధనకై అహోరాత్రములు కృషి యొనర్చెను. మత ప్రచారముతోపాటు, అతడు చర్చి, పాఠశాలలు మొదలగు వానిని నెలకొల్పసాగెను. శ్రీరాం పురమునకు సమీపమున ఒక చోట ఐరోపీయ బాలుర కొక పాఠశాలను, భారతీయుల కొక పాఠశాలను స్థాపించెను. ఐరోపీయ బాలురకు హీబ్రూ,

పండిత విలియం కారీ

సంస్కృతమును లేక పర్షియన్ భాషలు బోధింపదలచెను. బెంగాలీద్వారా భారతీయులకు విద్యా ప్రదానము జరిగెను. భోజనవసతి కూడ కల్పింపబడుటచే, ఈ పాఠశాలలు ప్రజల యాదరమును చూరగొనెను. భారతీయుల పాఠశాలలో క్రైస్తవేతరులు కూడ కొందరు చేరినట్లు విదిత మగుచున్నది. ఈ కార్యక్రమమున కారీకి డాక్టర్ మార్ష్‌మన్ అనునాతని తోడ్పాటు పరిపూర్ణముగ లభ్యమయ్యెను.

అటుపిమ్మట కారీ మార్ష్‌మన్‌లు ఒక కళాశాలను స్థాపించిరి. అందులో క్రైస్తవేతరులు కూడ చేర్చుకొనబడిరి. క్రైస్తవ మతమునందు గాఢానురక్తిగల క్రైస్తవులకు తన్మత వాఙ్మయమును బోధించుటయు, విద్యార్థులకందరకు ఉన్నత విద్యా సౌకర్యము కల్పించుటయు తమ లక్ష్యము లని కారీ పేర్కొనెను. బెంగాలీ ద్వారా విద్యాబోధన జరిగెను. సంస్కృత భాషా సారస్వతములకు ప్రాధాన్య మొసగబడెను. ఈ కళాశాలకు డెన్మార్క్ పాలకుడు ఆర్థికముగా సాహాయ్యము నలుపుటయే కాక, డిగ్రీలు ఇచ్చునట్టి విశేషాధికారమును కూడ కళాశాల వారికొసగెను.

స్వయం కృషిచే పైకివచ్చిన కారీ సహనముతో ఎన్నో కష్టముల నెదుర్కొనెను. తానేర్పరచుకొన్న లక్ష్యములను సాధించు నిమిత్తము ఆ కష్టపరంపరను లెక్కసేయక అతడు ఆత్మ ప్రత్యయముతో కృషి యొనర్చెను. అతని జీవితమునందలి తుదిభాగము కూడ కష్టములతోనే గడచెను. శ్రీరాంపురం వారికిని, ఇంగ్లాండులోని బాప్టిస్ట్ వారికిని నడుమ వైమనస్యము లేర్పడెను. తత్ఫలితముగా, కారీకి ఆర్థిక సహాయము లభింపలేదు. అందులకు తోడుగా, ఫోర్టు విలియం కాలేజీలో ఆచార్య పదవుల సంఖ్యను తగ్గించుటతో, అతనికి తక్కువ జీతము రాదొడగెను. అంతేకాదు, అనువాదక పదవిని రద్దు చేసిరి. అందువలన ప్రతి సంవత్సరము లభించుచున్న 300 పౌన్ల ఆదాయము లేకుండ పోయెను. కళాశాలకై అమెరికాలో సేకరింపబడిన ద్రవ్యము కూడ అతని చేతి కందలేదు. ఈ వివిధ కారణముల వలన కారీ ఆర్థికముగా దెబ్బతినెను.

బాల్యమునుండియు పువ్వు లన్నను, పూల మొక్కలన్నను కారీకి ప్రీతి మెండు. రాయల్ హార్టీ కల్చరల్ సొసైటి, లండనులోని లినియన్ సొసైటి మొదలగు సంస్థలలో అతడు సభ్యుడుగా నుండెను. వ్యయ ప్రయాసల కోర్చి అతడొక సుందరోద్యానమును నిర్మించెను. దానిని ప్రాణపదముగా చూచుకొనెడివాడని వేరుగ నుడువ నవసరములేదు. కాని దురదృష్టవశమున, అది రెండుతడవలు వెల్లువలకు పాడయ్యెను.

ఇటుల, ఆపదలందు ధైర్యము వహించియు, కష్టములను సహనముతో ప్రతిఘటించియు డెబ్బదిమూడు గ్రీష్మములు గడపిన డాక్టర్ విలియం కారీ 1834వ సంవత్సరము జూను 9న మరణించెను.

బృందారణ్యము సేమమా? యచటిగో బృందంబులున్ లెస్సలా?
నందుండున్ సఖియున్ సుఖాన్వితులె, నానాగోప గోపాలికా
సందోహమ్ములతో హలాయుధుఁడు కృష్ణస్వామి క్రీడింతురా?
ఇందూ, నందుని మందనుండి కద నీవే తెంచుటల్ రాకలన్.

మందస్మేరముతో, వయఃకలనతో, మాధుర్యగానంబుతో,
కందర్పాయుత మూర్తితో, వ్రజములం గాంతావళీ సేవ్యుఁడై
మందం గోవులఁగాచుచో నిపుడు ప్రేమం గృష్ణు వీక్షించితే
ఇందూ, నందుని మందనుండి కదనీవే తెంచుటల్ రాకలన్!

పుసులూరి సోమరాజా మాత్యకవి

ఏటుకూరి కవి

★

శ్రీ. బాచిమంచి శ్రీహరిశాస్త్రి

ఆంధ్రసాహిత్యాకాశంలో శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య గారిని ఒక ప్రముఖ తారగా నెన్నవచ్చును. అయితే కాల కర్మదోషంవల్ల, అట్టి వినీలాకాశంనుండి ఆ మహోజ్జ్వల తార, రాలి పడిపోయింది. జీవులకు పుట్టుట, గిట్టుట అనునవి నైజమైన పనులు. ఎంతవారికైనా సరే! తప్పవు. "మాంధాతా చ మహీపతిః కృతయుగాలంకార భూతోగతః" అన్నారు పెద్దలు. కృతయుగానికే అలంకారప్రాయులైన, మాంధాతాది మహిపతులేమి? రామకృష్ణాది అవతారములేమి? షోడశ మహారాజులేమి? కాలానుగతంగా తమ తమ అవతార సమాప్తి చేసుకొని వెళ్లిపోయారు. వారి కీర్తి మాత్రం చరిత్రలో స్థాయిగా ఉన్నది. పాంచభౌతికమైన యీ శరీరం ఒక లెక్కలోనిది కాదు. ఎవరికైనా సరే! పారంపర్యతస్థాయిగా నిల నిల్చేది ఒక్క కీర్తి మాత్రమే. అట్టి కీర్తి మాత్రం శేషించినవారిని కీర్తిశేషులని అంటాము. అయితే, సర్వే సర్వత్రా గతించినవారి నందరినీ కూడా, కీర్తిశేషు లనడానికి మాత్రం వీల్లేదు. కీర్తిశేషులైన విశ్వదాతల చరిత్ర చూడండి! వారు చూపిన విశ్వమానవ సౌభ్రాత్రత వల్లనూ, శ్రీవారు స్థాపించిన ప్రజాహిత సంస్థలవల్లనూ వారి కీర్తి అజరామరమై వెలయుచున్నది. వారు నేడునూ, మన కండ్ల యెదుట ఉన్నట్లే తోస్తుంది. భౌతికదేహాన్ని త్యజిస్తే మాత్ర మేమి? కీర్తియే ముఖ్యము గదా!

శ్రీ వేంకటనరసయ్యగా రట్టి కీర్తిశేషులలో నొకరని చెప్పవచ్చును. విశేషించి సప్త సంతానాల్లో ఒకటిగా లెక్కింపబడే కావ్య నిర్మాతలు కూడా వారు. వారి కవితా వైదుష్యం ప్రసాద గుణభూయిష్ఠమైనది. కవితాజగత్తుకు వారి ప్రతి పద్యం ఒక గీటురాయి వంటిది. వారిది క్రొత్త పోకడ. "తొల్లి నడల్పు కిప్పటి విధుల్ నిరసింపక ప్రాత క్రొత్తలం దుల్లముచేర్చి దేశి కవితోచిత మార్గములన్ గమించు మా కొల్లని దేమి కద్దు? వివిధోజ్జ్వల కావ్య కథార్థయుక్తు లంద ల్లరిపాలు గాని కవితా నవమానెద మెల్లవేళలన్", అన్నారు. వారి పద్దెము లన్నియు మార్దవమైన, నడకతోఁ జెలువొందుచుండును. వారివి మహోన్నతమైన భావములు. వారి హృదయం వెన్న వంటిది. భారతం వారికి ఉగ్గుబాలతో జీర్ణమైనది. నిండైన తెలుగుదనాన్ని అన్వేషించడం కోసం వారు చాలా త్యాగం చేశారు! "తెలుగు వెల్గునకుగా నిలువెల్లను ధారవోసితిన్" అని వ్రాకుచ్చారు. గురుదేవులవెంట బయలుదేరి అనేక శిల్పక్షేత్రాలు దర్శించారు.

హంపీ నగరంలోని జీర్ణ శిల్పాలు వారి హృదయాన్ని కరగించివేసినాయి. తుంగభద్రానదిని సందర్శించునప్పటికి, పూర్వం ఆయా నదిలో స్నానా లాడిన అష్టదిగ్గజాలు గుర్తు కొచ్చారు చప్పున. అందువల్లనే, ఆనాటి స్థితిగతుల నూహించి "ప్రాతస్సంధ్యల నష్టదిగ్గజములీ పాదస్తరంగంబులం దీతల్ గొట్టిన" వైనాన్ని విచారంతో వెల్లడించారు. రతనాల శిల్ప మునదగినటువంటి హంపీ నగరం, శ్రీకృష్ణదేవరాయుల శుద్ధాంతం, ఆయన చేటికా పరివృతుడై మజ్జనమాడు కోనేరు, నేడు మన్నై పోయాయని చెపుతూ "దురదృష్టవంతుడవు నీవే! నాటికిన్, నేటికిన్" అన్నారు. మరియు, "ముత్యాలశాల సాహిత్యలక్ష్మి గదించు విశ్వకావ్య జయమ్ము విఫలమయ్యె .... తీరైన శిలల శృంగారలక్ష్మి వహించు శిల్ప సౌందర్యమ్ము శిథిలమయ్యె" నని గుండెలు కలగిపోయేటట్లుగా బాధపడ్డారు. హంపీక్షేత్రమందలి ప్రత్యణువును, వేంకటనరసయ్యగారు దీక్షతోఁ బరిశీలించారు. "రాయలు కొల్వైన రచ్చపట్టులు చూచి, గుండె నీరై గోడు గుడిచినాము, వల్లకాడగు రాణివాస శైథిల్యముల్ వీక్షించి కన్నీరు విడిచినాము" అని చెపుతూ "కొదువ లేకుండ వాల్మీకి కోకిలమ్ము పాడిపోయిన గుర్తు లిప్పటికి గలవు", అని ఆయా గుర్తులు పరిశీలించారు.

మహాకవిత్వ దీక్షావీధిలో నేమి, పద్యాన్ని తీర్చిదిద్ది, నడిపించే కూర్పు నేర్పులో నేమి, నాటి 'కవిబ్రహ్మ' కీనాటి మన 'కవిబ్రహ్మ' ఏమాత్రం తీసిపోడు. ఆయన 'కలము' 'ఖడ్గము' పట్టిన దిట్ట అయితే, యీయన 'కలము' 'హలము' పట్టిన మేటి. ఈయన మొదట్లో చాలాకాలం వఱకు 'కాటుక కన్ను దొరగిలి, కాడికి రాక, పెడంకెవేసి, కొండాటకమాడు' కోడెల్ని స్వాధీనం చేసుకొని బంగారు పంటలు పండించిన రైతుబిడ్డ 'మన కవిబ్రహ్మ'; అటుపిమ్మట కప్పురపు భావాలతో వలపెక్కించే జిలుగుంగూరుపు టాణిముత్యపు సరుల్గా,

పద్యాల్ని నడిపిస్తూ కవితా వ్యవసాయం చేసిన హాలికుడు. అమృతస్రవంతిలో జీవన సిద్ధి పొంది, భావాల్ని జోడు గుర్రాలపై సవార్లు చేయిస్తూ, పోయినంతవఱకు హాఱు లేకుండా కలాన్ని పోనిచ్చిన సిద్ధహస్తుడు, మన ఏటుకూరి.

చిట్టి ముత్తెములవంటి యొరవడితో, సత్కళా పటిమంలో ఉండే 'విశ్వసృష్టి'ని గమనించి తెల్పిన ప్రజ్ఞాశాలి ఆయన. సాటి కవిసోదరులను సంబోధిస్తూ, "పదునిడి గండ కత్తెరకు బ్రాణములొడ్డి, మహాంధ్ర మండలీ హృదయము చూఱకొన్న సుకవీశ్వరు దివ్య కవిత్వ దీక్షతోఁ గదలిన యాంధ్ర భారత ముఖమ్మున నీ ప్రతిభా సమున్నతిన్ మెదిపి మెఱుంగుపెట్ట కిటు మిన్నులు పట్టి చరింతు వేలరా ?" అని మందలించారు. పూర్వం బంగారు తూగుటుయ్యెలల్లో దూగుతూ బ్రహ్మరథం పట్టించుకుని ఏమాత్రం కొంగు చాపకుండా అగ్రహారాదికము లందిన మహాకవి పుంగవుల సంతతివాడవై యుండి కూడా "అంగడి పెట్టి దివ్య కవితామృత మమ్మెదవా ? కవీశ్వరా !" అని పూర్వ కవుల గౌరవాతిశయంతో కూడిన జీవనాన్ని యీనాటి యువ కవులకు తెలియజేస్తూ ప్రబోధించారు. తెలుగులో జీవకావ్య కళ దిద్దిన మహా మహుడు శ్రీ వేంకటనరసయ్యగారు. నిష్కర్ష స్వభావంతో, ఆంధ్రజాతికి స్వతంత్రోద్బోధ గావించి దుఃఖ ప్రపంచార్థ సంకలితుడైన రైతు నుద్ధరించిన ధీశాలి. గొప్పకు, గొప్పగా ఆయన యశము గొలుసులు వాతీనదని చెప్పవచ్చును. ఆంధ్రికి క్రొత్త క్రొత్త మేలిమి సరాలు కూర్చిన పూజారి ఆయన.

"ఆ కోపేరున గోపు పెద్ద మలకయ్యల్ దాటి, యిర్వాల కుస్ జే కొన్నట్టి పొలంబు చేరుగడ 'నిర్చి' చికాకుతో నాగలి పన్నుకుంటూ మా సేద్యగా డొకడు తన కవితాసృష్టిని బ్రదర్శించాడు. చూడు" ఈ సందర్భంలో "ఆకుం గంటము పట్టి గిల్కిన మహాత్మా ! నిన్ను హర్షింతురా ?" అని ప్రాచీన కవుల్ని ప్రశ్నించాడు. రైతు జీవనమంటే, ఈయనకున్న ప్రత్యేకాదరం వర్ణింప నలవిగానిది. 'వెనుక ముందు లేకుండా ఉన్నది యావత్తు ఖర్చు పెట్టుకొని తిరిగే దీనులైనవారిని పోషింపఁజాలినవా డొక్కరైతే' యని తత్ప్రతిభ వివరిస్తూ, "మిను వట్టి నలుదెసల్ మెఱసిపోయినగాని, కను తెప్పఁ గొట్టడా కర్మయోగి, మండు వేసవి నిప్పు చెండుచుండినఁ గాని, కాయముడా పడా కష్టజీవి, అరుగాలము లేమిడై కృశించిన గాని, పడిపంచఁ ద్రొక్కడా భాగ్యశాలి, చుట్టపక్కా లిల్లు చూఱగొన్నంగాని, తన్నుఁ దా నెఱుగడా ధర్మరాజు", అన్నారు. లవలేశమైనా, గర్వ గంధం సోకనటువంటి, నవనీత సదృశమైన దన్నారు రైతు మనస్సు. అతని ప్రతి రక్తకణంలో గూడా స్వాతంత్ర్య జీవనం స్ఫురిస్తూ ఉంటుందన్నారు. కవి—కర్షకు డైనప్పుడు వాని సౌభాగ్య మిలా ఉంటుందని వివరిస్తూ :

"జిలుగుం గూరుపుటాణి ముత్తెపుసరుల్, చిక్కార్చి శయ్యోపరిన్
నలు పెఱుపుప్పొడి పల్కు కప్పురము విన్యాసించి, భావాదులన్
వల పెక్కించుచు, జీవనమ్ము రస సంపన్నమ్ముగావించు, నీ
పంటకెల్ నిత్యము కొల్లలాడెదను గావ్యశ్రీ తపోభాగ్యమున్" అన్నారు.

కొండ మేర దున్నుకొందామనుకున్న రైతుకల్లా—బట్ట తడుపు జల్లు పడేసరికి పని కాస్తా కుంపై పోయింది. అప్పుడా రైతు వాలకా న్నెలా సహజంగా వర్ణించారో చూడండి :

"కట్టు సడలించి పెఱుదుల బట్టి పిడిచి
బైరవానమ్ము గట్టుపై నాఱవైచి
నిలువుగాళ్లను సెగ ముక్కు నిప్పుగొట్టి
చుట్ట ముట్టించెఁ బొగ మబ్బు లుట్టిపడగ !

సింగారపు మల్లె పొదుల్ని నీరాడించి, అందులో మోసు లెత్తిన లేత పచ్చికను కల్పులీసే కళ్యాణి, ముత్తెముల మాదిరిగా తన మేనియందు చెమ్మట బొట్లు దొగాడుచుండ— పళ్లకు మడమలు మార్చే తోటమాలి, యీయన కథలకు ప్రధాన పాత్రలు. కొమరుఁ బ్రాయపు మదముతో, తీగె జొంపాల నూయేల లూగే కులుకులాడు లైన పల్లె పడుచులే యీయన కథానాయికలు. పల్లెపడతుల సౌందర్యాన్ని వర్ణించి చెప్పే సందర్భంలో పూర్వ కవుల నుద్దేశించి యిలా సవాల్ చేశారు.

"అలయక రాజుతోడ మధురాసవ మానెడు దివ్యకాంతలన్
మలచిన సిద్ధహస్తమున—మంచెకుఁ జేరువ నున్నకాపు కో
డలి,- నయగారి పల్కుల మిటారము,నానడ తీరు,కన్నులన్—
జిలుకు సమాయికత్వము రచింపుము నీ పసగాన నయ్యెడిన్."

పల్లెపట్టుల పూదోటలలోని పుష్ప సౌందర్యాన్ని గూర్చి వీ రెలా తెలిపినారో చూడండి : "ఆకు పాయలనందు నీ—రాడు కతనఁ బడుచు తుమ్మెద తెక్కలు తడిసిపోవ—వెచ్చ పుప్పొడి విరజిమ్మి విందుసల్పె—బుష్కలమ్మగు మధువుతోఁ—బుష్పలక్ష్మి". ఇంతటి మనోహరమైన భావ శబలతతోఁ గూడిన కవితా విన్యాసం, పురా పుణ్యలేశం లేకపోతే లభింపజాలదు. ఆయన నడచిన త్రోవ విలక్షణ మైనది. ఏమాత్రమైనా బుష్యంశ అనేది లేకుంటే— ఏదో మామూలుగా పద్యాలు వ్రాయాలంటే వ్రాయవచ్చు గాని, యిలాటి 'కల్పన' మాత్రం సాధ్యపడనేరదు.

వారి "క్షేత్రలక్ష్మి" కావ్యంలోని ప్రతి పద్యం మణిపూస వంటిది. దేశానికి "రైతే" వెన్నెముక వంటి వాడని 'బాపూజీ' చెపుతూ వచ్చిన పరమ సత్యాన్ని ఎన్నడో గుర్తించి, కలాన్ని నడిపిన మహనీయుడు. రైతులు పొలాల్లో భుజించే— ఆహారాన్ని గూర్చి, వారి ఆరోగ్య భాగ్యాన్ని గూర్చి యెంత సహజంగా వర్ణించారో చూడండి :

"పప్పు పచ్చడి వాయ పదునురాఁదిగిచిన—
దొలిముద్దకే నోట జలము గ్రమ్మ,
అఱచేతిలో గుజ్జు పెఱసిపోవు కొలంది—
ఉచ్చిళ్ళనాల్కపై కుదుటు చూపు,
పెరుగు మీగడ జిడ్డు పేరుకొన్న కొలంది—
దంతవఙ్క్తికాంతి దమ్మ సడలు,
తలియలో నన్నంబు తఱుగుచున్న కొలంది—
'గట్టించు దేపులు గడలుకొనును.
ఇంత కెంత దిన్న నంత కమ్మదనంబు
ఇంట దిన్నదాని కినుమడించు
గన్వపడెడువారి గర్భ సౌలభ్యంబు
లాతివారి కెట్లు 'లభ్య' మగును ?

ఓ కవీశ్వరుడా ! నీ కందుఖాటుకాని పనాల్ని, అసంగతమైన, దేవతాప్సరో బృందాల్ని, వర్ణించడాని కెగ్రబాకుతా వెందు కయ్యా ! చందనము లెందుకు ? మకరందము లెందుకు ? ఆనంద మిచ్చునట్టి 'రైతు' భజనం లేదా కావ్యాల్లో నింపి వర్ణించడానికి ? అన్నారు ఏటుకూరి. మీరు పచ్చి శృంగార రసంతో నింపి ఒలకబోసే కవిత్వా లనేవి "గారడి కాక, మా కడుపు కక్కుఱితిన్, దొలగింపనేర్చునే !" అన్నారు.

స్వర్ణంలో విలువ లేదని నేడు మనం గుర్తిస్తున్న "నగ్నసత్యా"న్ని, వా రెన్నడో తెలుసుకొన్నారు. స్వర్ణాభరణాల్లో మునిగితేలే కావ్యసుందరు లందరికన్నా గూడా, వారి కలం నుండి ఉద్భవించిన "కాపు పడతి" సహజ సౌందర్య మెలా ఉందో చూడండి :

"మంజుల మంజీర శింజితమ్మట లేదు—
వెలికడియాలదా విభ్రమమ్మ,
క్రమకంకణ ఝణత్కార మిచ్చట లేదు—
ఉపవలయాల దా యుజ్జ్వలమ్మ
చీనాంశుక ప్రభాచిత్ర మిచ్చట లేదు—
దడిమంపుఁ గోకదా ధవళిమమ్మ,
శ్రీ గంధ పరిమళాశ్లేష మిచ్చట లేదు—
సుంకుపుప్పొళ్ళదా సురభిళమ్మ.
సూర్య హారాది మండన స్ఫూర్తి లేదు
నల్లలుందాళి మాత్రమే నగల తీవి
కావ్యసుందరి యని కల గందువేమొ ?
కవుల వర్ణనకం దదీ 'కాపు పడతి.'

మట్టి ఊడలు ఊయలల్లాగా కట్టి తూగుచున్న కొమరు బ్రాయపు పడతులయొక్క "అంగ సంస్పర్శకై, పవనాంకుర ములు—పులకరించుచున్నవి, చెంగావి వలువమీద" అన్నారు. కృత్రిమ విషయాలకు—యెన్నడూ వారు ప్రాధాన్య మివ్వలేదు. వారు చెప్పిన "జవగల కబ్బముల్ బ్రదుకు జెప్పెడివే మితర ప్రమేయ ముల్" అన్న వాక్యం ముమ్మాటికి యదార్థమైనది. ఈ మహా కవి కాలగర్భమం దణగియున్న మన ప్రాచీన వీరగాథలు త్రవ్వి అందు పల్నాటి వీరచరిత్ర కొక రూపాన్ని కల్పించారు. పల్లె పట్టునగల ప్రకృతి దృశ్యాల్లో వీరు ప్రతినిత్యమూ విలీ నమైపోయే స్వభావము కలవారు.

అప్పట్లో శ్రీ పాములపాటి వేంకటకృష్ణయ్య చౌదరిగారు అధ్యక్షులుగా, శ్రీ అవుల గోపాలకృష్ణమూర్తిగారు కార్య దర్శిగా, అఖిలాంధ్ర ప్రజా వక్షాన శ్రీ 'కవిబ్రహ్మ' గారి కఖండ సన్మానం జరుపుట కొక ఆహ్వాన సంఘ మేర్పడింది. 'సన్మాన సంచిక' కూడ సగం అచ్చయింది. కాని, విధి మరొక విధంగా శాసించింది. వారిని స్మరించడం ఒక విధంగా "పుణ్య స్మృతే"తుంది. విజయవాడలో జరిగిన కీ. శే. చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రులవారి పట్ట ప్రదానోత్సవ సభకు వీరొక పద్యం పంపించారు. అందలి కూర్పెలా ఉందో చూడండి :

"ప్రాక్తన శైలికిన్ భరతవాక్యము,నాంది వినూత్న శైలికిన్,
సూక్తిబహుశ్రుతుల్ పలుకుచుందురు మీకవితంగుఱించి,త్వ
త్ప్రోక్తము లార్ష సూత్రముల పోల్కిఁ బఠించెదరాంధ్ర భారతీ
భక్తులు, పూర్వ పుణ్య విభవ వ్యయ లబ్ధములేతదర్థముల్!

మఱొకసారి కీ. శే. శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారిని గూర్చి యిలా అన్నారు :

"గంగోత్తుంగ తరంగరింగణ సదృక్షంబైన నీ శైలితో
లుంగీ కట్టిన కావ్య కన్యకలు వేలుం లక్ష లున్నారునీ
బంగారంపు కవిత్వ వస్తువులతోఁ బైపోటికిన్ నిల్చిమా
పింగాణీ సరుకమ్మకొన్నయెడ కాఫీ నీళ్లకున్ గిట్టునా?"

శ్రీ ఆచార్య రంగాగారు శ్రీ వేంకట నరసయ్యగారి సన్మాన సంచికకు వ్రాసిన వ్యాసంలోని క్రింది పంక్తులు—ఏటుకూరి వారి కవితా ప్రతిభకు నిక్షేపాలములు. "చూచుటకా వారొక రైతుబిడ్డ. ఇరవై సంవత్సరముల ప్రాయముల వరకు రైతాంగజీవి. పొలముల బలం, పంటల పొలి, నల్లరేగడ, అడవుల అందము, కొండల ఔన్నత్యం, పశువుల సేవ, వాగుల పరుగు, ఉరుముల మెరుముల ఘుమఘుమార్భటులు, తా నొక్క రైతుబాలుడై, గ్రామీణుడై నిండుగా అనుభవించుచూ, కేకలు—కూకలు వేసుకుంటూ, రైతాంగపు ఏలపదాలు పాడు కొంటూ, మొక్కజొన్న కండెల చిద్విలాసము, సజ్జ జొన్న కంకుల చిక్కదనము, కొత్తిమిర్రి సుగంధము, సెనగపులుపు, కంది యెఱ్ఱందనము, పెసర పసిమి, తన కవితా హృదయ మందు చేర్చుకుంటూ, పెరిగిన ఆనాటి పిల్ల కవీశ్వరుడు !

"వారి పద్యాలలో ఆ గుంటూరు మిరపకాయలలోని చుఱుకు, ఆ యెఱ్ఱని చక్కందనము ఉన్నాయి. ఆనాటివారి

వాగ్ధోరణిలో నా భావనా దృష్టికి గోచరించిన వివి. ఆ చిన్నవాటి పల్నాటివీరుల పల్లె పదాలు, దట్టీ గట్టి బయల్దేరుచున్న బాల చంద్రుని జబర్దస్తీ, అపుల వెన్నెలలో నుండీ, బయలు వెడలుచున్న తీవ్రత, ఆ విశాలమైన ఛాతీ, ఆ చారడేసి కళ్ళు, ఆ భయంకరమగు కరవాలము, ఆ దుముకుచున్న అంగరాను, ఆయన వెనుకనే కసుపట్టు సైన్య నివహాలు, వారి పాదాల వద్దనే నురుగులు గ్రక్కుచూ, మరణించినవారికి పునర్జన్మ నీయగలననే నాగాపగా జలములూపూ! ఏమాదృశ్యము ! ఒక్క క్షణములో భయంకరముగా నుండెను. మరొక్క క్షణములో ఉత్సాహజనకముగా, ఇంకో క్షణమందు, ఉద్రేకపూరితముగా "నేనే ఆ యుద్ధమందు చేరుతున్నా, బాలచంద్రుని బలగాలలో ఒక్కరినైనా! బాలచంద్రుని కలలో ఒక్కటిగా మారుతున్నా! ఆ నరసింగరాజును పట్టుకుంటున్న బాలు నొక వైపుగాం జేరుకున్నా" నన్నట్లు తన్మయుడనై పోతిని. అంతటి భావనా శక్తి, చిత్రకళా వైదగ్ధ్యము హృదయాకర్షణ బలం ఆ యువక కవీంద్రుని కవనములో, పాటలో, మాటలో, ఉన్ననా నాడు."

ఈయన స్మృతి మహాకవులను సైతం కదలించివేసింది. ఈయన లేని వెలితిని గూర్చి 'శ్రీ జాషువ కవి'—"మేనికిన్ గుదుపుం గూర్చు కవిత్వ మల్లగల దక్షుండేడి నీ పూడిసన్," అంటూ,

> "శీతలమై, సుధా ప్రణయ చిహ్నితమై, కవితా ప్రపూతమై,
> చేతము సూచు, నీ కవికి చిక్కటి కౌగిట నెన్నివారులో
> పూతలుం బూయు నా తనువు పొంగులు భంగమొనర్చియేకళా
> భూతలి కేగినావు కవి పుంగవ ! వేంకట నర్సయాగ్రణీ!
> "కదమున్ ద్రొక్కుచు నిక్కు నీ కలము దగ్ధంబౌటచే దెబ్బతి
> న్నది సాహిత్యము" అని చాలా విచారపడ్డారు.

పల్లె ప్రాంతపు ప్రకృతి సౌందర్యాన్ని శ్రీ వేంకట నర్సయ్యగా రెలా జబ్బన చూలు లొనర్చినారో చూశారా !

> "చిగురుగొమ్మల లేత చెంగావి ముసుగులో
> గుసగుసల్ పచరించు కొదమ గుత్తి
> అలివిరి నెత్తావి బరువుపే రెమ్మతో
> బింపిళ్ళుగూసెడు పిల్లగాడ్పు
> ఆకు బొత్తుల కొక్కలల్లార్చి తుమ్మెదల్
> పుక్కిలింలించిన కమ్మ పువ్వు దేనె
> గమని కాడల యల్లికలుబిందు నిగ్గుతో
> నీడ లాడెడు మంచునీటిబొట్టు
> హస్త సంస్పర్శ కొక వింత హంగుదెచ్చె
> శ్రమము పోకార్చ వీవనల్ నెమకితెచ్చు
> జిహ్వ కింపగు సమృతమ్ము చిలికితెచ్చు
> గులుకు ముత్యాల సరములు గ్రుచ్చి తెచ్చు.

అరయూ ప్రకృతి సౌందర్యా న్ననుభవించలేని వారిని గూర్చి :

> "ప్రకృతి శాసించు సర్వ ప్రపంచ మిట్లు
> రైతుబిడ్డల కిడిన సిరాజనమ్ము
> లందుకొనలేని విశ్వ సన్యాసు లెట్లు
> గగన హర్మ్యాలు నిర్మింపంగడగినారో ? అన్నారు.

శ్రీ రాధాకృష్ణ పండితులవద్ద నుంచి కూడ బిరుదులు పొందవచ్చును. ఎంతో మహాకవిగా ఘనత సంపాదింపవచ్చును. కాని, యీ ప్రకారంగా ప్రకృతిలో విలీనమై "ప్రజాకవి" గా చలామణి కావడ మెంత మాత్రము సాధ్యము కానివని. తొలి నోములు ఫలించడంవల్లనే యీ కవికీ యదృష్ట మబ్బినది. ఈ విషయాన్ని "కలమున్ బట్టిన నాటి నుండియు, నెదో కళ్యాణ మాసించు నా వలకేల్; చేసిన పుణ్యమేమొ ? యిదియే వాంఛింతు నీ జన్మకున్ హాలమున్ బట్టిన నాటి దృశ్యములు—ప్రత్యక్షమ్మలై నా తలంపుల గిర్గింతలు పెట్టుచుండునని శంబున్ దీరు తీయంబులన్" అని వారి స్వానుభవాన్ని వెలిబుచ్చారు.

కేవలం ఆర్థికదృష్టితో బరికించేవారికి మాత్రం, శ్రీ వేంకటనర్సయ్యగార్ని గూర్చి స్మరించడంగాని, వారి కవితా వైదుష్యాన్ని ప్రశంసించడంగాని, వృధా యని తోచవచ్చును. "అకారణ బంధులు గారె ? సత్కవుల్" అన్నారు మన పెద్దలు. ఆ కాలంలో చాళుక్య ప్రభువులకు నన్నయభట్టేమి చుట్టము ? మనుమసిద్ధి నృపాలునకు తిక్కన మేనత్త కుమారుడా ? ఏమి ? ఎవరికైనా అట్టి చుట్టరికమే సుమండీ ! భవతు. శ్రీ వేంకట నర్సయ్యగారి స్మృతిచిహ్నంగా నేను వారిపై వ్రాసిన ప్రశంసాపద్యములం దొక్కటి మాత్ర మిట నుదహరించి యింతటితో యీ వ్యాసము ముగిస్తున్నాను.

> "జీవమ్ము గల కైత సృష్టించి
> ముంగల బాటం జూపినది మా "ఏటుకూరి!"
> శృంగారమగు క్షేత్ర జీవనమ్మును తెల్గు
> నాట నాటినదిమా "ఏటుకూరి!"
> తెలుగు వెల్గునకుగా నిలువెల్ల వెచ్చించి
> రాటుదేలినదిమా "ఏటుకూరి !"
> సమకాలికోన్నత సాహిత్య వనములో
> పాట పాడినది మా "ఏటుకూరి !"
> అనెడి హర్షానం బొంగి మీ కాంధ్రజనులు
> నలుపు సన్మానమునకెద సంతసించె—
> బంపుచున్నాడ ! తోచిన పద్యములను—
> అందుకొనుమయ్య సుకవి సఖ్యము దలిర్ప."
> "కవుల చరితంబునందు నీ ఘన చరిత్ర—
> ఏటుకూరికవీంద్ర ! వర్ధిల్లునుగాక."

పాము

★

శ్రీ త్రిపుర

శేషాచలపతిరావ్ అద్దంలో చూస్తూ దువ్వుకుంటూ "ఇవాళ నీపేరు అలఖ్ నిరంజన్" అని చెప్పేడు అద్దంలోని శేషాచలపతిరావ్‌తో. అద్దంలోని శేషా.... నవ్వి "గొప్ప మజా, స్కాండ్రల్, నీ సంగతేం చెప్పను. అవును కానీ, నీకు ఎడం పాపిడేమీ బాగులేదు ఇవాళ. కుడిపాపిడిలాగు. టై నాట్ కింద డింపుల్ బాగులేదు. షోల్డర్స్ ఇంకా స్క్వేర్ చెయ్యి" అన్నాడు.

విండ్సర్ నాట్ కింద డింపుల్ దిద్ది, పాపిడి కుడిచేసి, మళ్లీ బ్రష్‌చేసి, బుగ్గల్లోని డింపుల్స్ ప్రాక్టీస్‌చేసి, అద్దం పక్కని పిన్‌చేసి ఉంచిన క్లాస్‌టైంటేబుల్ చూశాడు.

"మొదటి రెండు పీరియడ్సూ ఉండాలి. మూడూ, నాలుగూ స్కిప్ చెయ్యొచ్చు."

హాస్టల్ గేటు దాటుతూ "పవర్, బ్రేవరీ, ఎడ్వెంచర్. నేను నేతాజీని, హిట్లర్‌ని. వినండి, బుద్ధిలేని, బలంలేని బాస్టర్డ్స్.... మిమ్మల్ని హతమార్చేస్తాను. పారాహుషార్.... లక లులక్షలుగా క్రిముల్లాగ బతుకుతున్న మిమ్మల్ని రూపురేఖలు లేకుండా చేస్తాను...." పిడికిలి బిగపట్టి, హాస్టల్ వేపు కాలేజీ వైపు చూపించి గట్టిగా చెయ్యి ఊపేడు.

జోరుగా వచ్చే రిక్షాని తప్పించుకుని హిందీలో బూతులు తిట్టేడు.

'మొదటి రెండు పీరియడ్స్ కూడా స్కిప్ చెయ్యొచ్చు. దశాశ్వ మేథ్ ఘాట్‌కి వెళ్తాను' అని అనుకుంటూనే లైబ్రరీ వేపు తిరిగి, 'అలఖ్ నిరంజన్! నిన్ను.. నన్నే.. నేను డిసీవ్ చెయ్యగలను తెలుసా' అని లైబ్రరీవేపు నడవడం మొదలు పెట్టేడు.

సెక్షన్ లైబ్రేరియన్ టేబుల్‌మీద గుట్టలు గుట్టలుగా రిబైండ్ చేసిన పుస్తకాలు పేర్లు రెజిస్టర్‌లో రాసుకుంటున్నాడు. నేరుగా లోపలికి పోయి బీరువాల్లో పుస్తకాల టైటిల్స్ చూడడం మొదలు పెట్టేడు అలఖ్ నిరంజన్.

చీర రెపరెపలు.

సున్నితంగా మాటలు.

కంటి చివర నుంచి చూస్తే, సెక్షన్ లైబ్రేరియన్ టేబుల్‌మీద వేళ్ళు. లేడీ.... జింక.... డీర్.

ముఖం తిప్పి చూసేడు.

తనవేపే చూస్తూంది ఉమాదే.

అప్రయత్నంగా కళ్లతో నవ్వేడు అలఖ్, అప్రయత్నంగా కళ్లతో నవ్వడం అలవాటు చేసుకున్న నిరంజన్.

హిందీలో అంది : నా కార్డ్ మరిచిపోయాను. శనివారం త్రివేదీ సెమినార్‌లో ఎస్సే సబ్మిట్ చెయ్యాలి. మీ కార్డ్ మీద ఛాసర్‌మీద బుక్స్ ఏమేనా ఇప్పిస్తారా ?

ఆ క్షణంలో చిరునవ్వు మాయమయిపోయింది. నిరంజన్ కళ్లల్లో, క్షణంలో కళ్లల్లోని నవ్వుని మాయం చెయ్యడం అలవాటు చేసుకున్న అలఖ్ కళ్లల్లో : ఇంగ్లీషులో అన్నాడు : కారిడార్ లోకి రండి.

గాజు అద్దాల కిటికీ దగ్గరగా వెళ్లి, వెనక్కి తిరిగి, కోపంగా అన్నాడు, "నా కార్డ్ ఎప్పుడూ జేబులో పెట్టుకుని తిరగను. మీ రెవరో నా కింకా బాగా తెలియదు. తెలియని ఆడవాళ్లందరికీ సహాయంచేసే షివల్రస్ మనిషిని కాను."

ఉమా కళ్లల్లో మెఱుపులాగ కోపం .....

"ఇవ్వలేకపోతే యివ్వనని మృదువుగా చెప్పొచ్చు. గొంతుకలో అంత థండర్ అవసరంలేదు."

విసురుగా చీర మెఱుపు మాయమయింది.

మళ్లీ తెర ఎత్తబడింది. తను అనుకోకుండానే, అకస్మాత్తుగా. అయితే, తన భవిష్యత్తుకి ఆకారం తానే యిస్తాడు. ఇప్పుడు జరుగుతున్నది తను ఎప్పుడో ఊహించి మనస్సు మారుమూలల్లో తొక్కి పడేసి ఉంచిన నాటకంలోని ఒక భాగం.

తెర ఎత్తేసింది కాలం, కాస్త ముందుగానే.

అయితే తను ఎప్పుడూ సిద్ధమే.

'జగదేవ్ .... జగదేవ్ ! .... '

'జీ.'

'ఈ అల్మైరా తాళాలియ్యి.'

తాళాలు తీసుకుని బీరువా తెరిచి రెండు పుస్తకాల తిరగేశాడు.

జగదేవ్ అక్కడే నిలబడ్డాడు.

ఒక చివరన షర్వుడ్ నావల్ ఒకటి కనిపించింది.

'ఇదిగో. నువ్వు అన్ని రకాల మనుషులికీ తాళా లిచ్చే స్వాన్. ఎలా అడ్డదిడ్డంగా పెట్టేశారో చూడు. ఈ పుస్తకం యిక్కడేమిటి చేస్తూంది. తీసుకువెళ్లి ఫిక్షన్‌లో పెట్టు. మీకు బుద్ధిరాదు. ఎన్నిసార్లు లైబ్రేరియన్‌చేత తిట్లు తిన్నా.'

జగదేవ్ గొణుక్కుంటూ పుస్తకం తీసుకుపోయేడు.

అల్మైరాలోంచి ఛాసర్‌మీద లెగూయీ రాసిన పుస్తకం పైకి తీసేడు. కోట్ పక్కకి లాగి, షర్ట్‌కీ, బెల్ట్‌కీ మధ్య పుస్తకాన్ని తోసి, మళ్లీ కోటు గుండీలు పెట్టాడు. ఎడం చెయ్యి అడ్డంగా పెట్టుకుని జగదేవ్‌ని పిలిచి తాళాలు యిచ్చేశాడు.

కౌంటర్ దగ్గర :

''పండిట్జీ, ఇంకా కాస్త విజిలెంట్‌గా ఉండాలి. పుస్తకాల దొంగలు ఎక్కువయి పోయారు. ఇవాళ నాకు కావలసినవి ఒకటీ కనిపించలేదు. ఇష్యూ కూడా అవలేదు. మీరింత ఇనెఫిషెంట్‌గా ఉంటే మేము కంప్లెయిన్ చెయ్యవలసొస్తుంది.'' కోపంగా, వికెట్ తోసుకుని విసురుగా పైకి వచ్చేశాడు అలఖ్ నిరంజన్.

లైబ్రరీ దగ్గర చెట్టుకింద కేంటీన్.

చెట్టుకింద బల్లమీద కూర్చుని నాలుగు సమోసాలు తిని, టీ తాగుతూ చుట్టూ ముసిరే ఎర్ర కందిరీగల్ని ఛాసర్‌తో అప్పటికే ఆరు చంపేడు.

'ఇంకో అయిదు నిముషాల్లోపల ఉమ పైకి రావాలి .... వచ్చితీరాలి' అనుకున్నాడు. రిస్ట్‌వాచ్ విప్పి చేత్తో పట్టుకున్నాడు. సాసర్ బల్లమీద ఉంచి, కప్ మాత్రం చేత్తో పట్టుకుని లైబ్రరీవేపు తిరిగి నిలబడ్డాడు..... నాలుగు నిముషాల నలభయి సెకండ్లు ...... నలభయి ఐదు ...... ఏభయి .... ఏభయి ఎనిమిది ....

అయిదు నిముషాలు.

ఉమ లైబ్రరీ మెట్లు దిగి వస్తూంది. దగ్గరగా వచ్చింది.

'హలో. మీరు రెండు సెకండ్లు ఆలస్యం. చూశారా. స్టాప్ వాచ్‌లాగ పట్టుకుని ఎలా లెక్కపెట్టున్నానో. ఈసారికి క్షమించేను .... రండి. మేనర్స్ గురించి బాధపడితే మీకు కావాల్సిన బుక్ దొరకదు. మీ హృదయంలోని మిక్స్‌డ్ ఫీలింగ్స్ నాకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా ......

ముందుకు, దగ్గరగా అడుగు వేసింది ఉమ.

.... అయినా, మీరు ఒప్పుకుంటారు .... రండి.'

ఉమ నవ్వింది. బెంచ్‌మీద కూర్చుంది.

'గులాబ్‌జామున్ కూడా చేశాడు శర్మాజీ. స్వీట్స్ అంటే అసహ్యం నాకు. స్వీట్స్ అంటే ఇష్టపడేవాళ్లని మెషిన్ గన్‌తో షూట్ చేద్దామనిపిస్తుంది. కాబట్టి సమోసాలు. ఏమంటారు. అండ్ టీ .... ఇదిగో మీకు కావలసిన పుస్తకం. మన ఫ్యూచర్ అసోసియేషన్‌కి చిహ్నంగా యీ ఆరు కందిరీగల కళేబరాల్ని ఛాసర్‌తో చంపి సిద్ధంగా ఉంచేను...... వద్దు. మీరు మాట్లాడడానికి ప్రయత్నించకండి. నేనే అంతా మాట్లాడేసిన తరువాత మీకు అవకాశం యిస్తాను .... మీరు నాకు జూనియర్. మీపేరు ఉమాడే. గౌహతిలో బి. ఏ. చదివేరు. ఇక్కడ బెంగాలీ టోలాలో అంకుల్ దగ్గర ఉన్నారు..... తరువాత, నాసంగతి. బెలూచిస్తాన్, జర్మనీ నా స్పిరిట్యుయల్ హోమ్స్. ఇంఫాల్‌లో ఫోర్టీన్త్ ఆర్మీలో పని చేశాను, కెప్టెన్‌గా. కోర్ట్ మార్షల్ చేసేరు కారణాంతరాలవల్ల. ఇక్కడ—ముప్ఫయి సంవత్సరాల వయస్సులో—యూనివర్సిటీలో చదవడానికి కారణాలు :

ఒక్కొక్క వేలూ మడుస్తూ చెప్పేడు.

'' .... ఒకటి: నాకు హోమ్ లేదు. బంధువులు లేరు. రెండు ! ఉద్యోగాలు చెయ్యడానికి కావలసిన టెంపరమెంట్ లేదు. మూడు : హోటల్స్‌లో ఎప్పుడూ ఉండడానికి కావలసిన డబ్బు లేదు. నాలుగు : యూనివర్సిటీలో చదువు నా ఎస్టిమేట్ ప్రకారం చాలా చవక.

''చూశారా .... నాలుగు నిముషాల్లో, నాలుగు నెలల పరిచయం అయితేగాని తెలియని విషయాలన్నీ చెప్పేశాను. కాలానికి ఏదీ వదిలెయ్యకూడదు .... ''

సమోసాలు, టీ వచ్చాయి.

ఉమ తినడం మొదలుపెట్టింది.

''రిమార్కబుల్ ! మీరు చాలా డెలికేట్‌గా రెండు వేళ్లతో సమోసాలని చిన్న చిన్న ముక్కలు చేసి గ్రేస్‌ఫుల్‌గా నోట్లో పెట్టుకుని అవి బాధతో ఏడుస్తాయేమో అన్న భయంతో మెల్లమెల్లగా తినడం అలవాటు చేసుకోలేదు. ఎడ్మిరబుల్.''

సమోసాలు అయిపోయాయి.

''ఇప్పుడు మీరు మాట్లాడొచ్చు.''

''మీరు విచిత్రమయిన వ్యక్తులు. అన్ని విషయాలు చెప్పేరుగాని మీ దగ్గర లైబ్రరీ కార్డ్ లేకుండానే యీ పుస్తకం ఎలా తెచ్చారో చెప్పలేదు.'' కుడిచేతివేళ్ల గోళ్లతో బెంచ్‌మీద వరసగా చప్పుడు చెయ్యడం మొదలుపెట్టేడు.

"హార్స్ రైడింగ్ యిన్ చండికా .... చాలాకాలం క్రింద చండిక అనే ఫిల్మ్ చూశాను. అందులో గుర్రాలు పరుగెట్టుంటే యిదే చెప్పుడు. చండికా ఆన్ హార్స్ బేక్ ..... ఐదడుగుల పద కొండున్నర అంగుళాల పొడవూ, నూట ఎనభయి పౌన్ల బరువూ మనిషిని. ఈ పది ఔన్సుల బరువు పుస్తకాన్ని తేడానికి లైబ్రరీ కార్డ్ ఉండాలా ? .... ఇస్యూ కౌంటర్ దగ్గర పండిట్జీ బాగా తెలుసులెండి. అడిగి తెచ్చాను. మీరు నాలుగు రోజు లుంచుకుని నాకు తిరిగి యిచ్చేయండి."

ఉమ తెలివైనపిల్ల.

అంది : నన్నొకమాట చెప్పనిస్తారా. మీరు చాలా నెర్వస్ మనుష్యులనుకుంటాను. దాన్ని కప్పిపుచ్చడానికి ఈవిధంగా మాట్లాడుతారు .... అంతేనా ? ఉమ కళ్లల్లోకి సూటిగా, తీవ్రంగా చూశాడు నిరంజన్.

'మీరు సైకాలజీ పుస్తకాలు చదివినట్లున్నారు. లేక పోతే ఎవరో అంటే విన్నారు. అంత సులభంగా లేబుల్ అంటించకండి. మీ మంచికి చెప్తున్నాను. నేను డేం .... జి .... ర .... స్ మనిషిని.'

'శర్మాజీ !'

రూపాయినోటు యిచ్చి చిల్లర తీసుకున్నాడు.

'నన్ను మరచిపొండి. ఈ సెప్టెంబర్ వెదర్ నన్ను సర దాగా మాట్లాడ్డానికి ప్రోత్సహించింది. అంతే. మీ కింకా చిన్న వయస్సు. గుడ్‌బై.' లేచి, గిరుక్కున తిరిగి పెద్ద పెద్ద అడు గులు వేస్తూ బిర్లా హాస్టల్‌వేపు నడిచిపోయాడు, అలా పెద్ద పెద్ద అడుగులు వేస్తూ నడవడం అలవాటయిపోయిన అలఖ్ కి.

బ్రోచా హాస్టల్ దగ్గర బస్ ఎక్కేడు. ఖాళీగా ఉంది.

గోడో లియాకి రెండు టిక్కట్లు అడిగేడు.

'ఒక్కడికే రెండెందుకూ' అడిగేడు కండక్టర్.

'అది నీ కవసరంలేదు. ఒకటి నాకూ, రెండోది నా స్పిరిట్‌కీ' అన్నాడు అలఖ్.

రూయా హాస్టల్ స్టాప్ దగ్గర అమెరికన్స్‌లా కనిపించే ఒక జంట ఎక్కేరు. అతను లావుగా, పొట్టిగా : ఆమె సన్నగా, పొడుగ్గా, అందంగా.

'లైక్ క్వీన్' అనుకున్నాడు. క్రిందటి సాయంత్రం సాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఒక పెద్ద గ్రూప్ దిగిందిట. ఆ గ్రూప్ లోని వాళ్లే గాబోలు అనుకున్నాడు.

కండక్టర్‌తో 'గేంజిస్‌కి టికెట్స్' అన్నారు వాళ్ళు.

కండక్టర్‌కి బోధపడలేదు.

'గోడోలియాకి యివ్వు' అన్నాడు అలఖ్.

వాళ్లవేపు చూసి అన్నాడు : 'మీకు యిష్టమయితే సహాయం చెయ్యగలను. నేనుగూడా గేంజిస్ వేపే వెళ్తున్నాను.'

థేంక్స్‌తో ఉక్కిరిబిక్కిరిచేసిన తరువాత అన్నారు : 'గ్రూప్‌తో తిరగడం థ్రిలింగ్‌గా ఉండదు మాకు. అందుకే ముందుగా బయలుదేరేము. లక్కీగా నువ్వు కలిసేవు.'

'నువ్వు హిందూవేనా ? ఇజిప్షన్‌లాగో, స్పెనియర్డ్‌లాగో ఉన్నావు.' అని అడిగేడు సగ అమెరికన్.

పరిచయం చేసేడు : 'నా పేరు జేమ్స్ ఎలియట్, ఈమె మిసెస్ ఎలియట్ .... క్వీనీ ఎలియట్.'

'లైక్ క్వీన్ !' నిజమే, అనుకున్నాడు నిరంజన్.

'నేను హిందూని కాను. ముస్లిమ్‌ని. నా పేరు బైరాంఖాన్. మీరు గేంజిస్ చూడొచ్చు. కాని టెంపుల్స్‌లోకి రానీ యరు.'

'ఇదిగో యిక్కడే దిగాలి.'

క్వీనీ దిగడానికి తన చెయ్యి యిచ్చి సహాయం చేశాడు.

ముగ్గురూ దశాశ్వమేధ్ వేపు నడచేరు.

జేమ్స్, క్వీనీ దృశ్యాల్ని 'త్రాగుతున్నారు.'

లస్సీ దుకాణంలో బెంచ్‌మీద కూర్చున్నారు.

ఛోక్రాని పిలిచి "మూడు గ్లాస్‌లు తీసుకురా. బాగా భంగ్ కలుపు" అన్నాడు.

అప్పుడే కలలోంచి లేచి ప్రపంచాన్ని కొత్త కళ్లతో చూస్తున్నట్లు చూస్తున్నాడు, జేమ్స్ గుంపులుగా రోడ్‌మీద నడిచే ఇండియన్ ప్రజల్నీ, టాంగాల్నీ, ఎక్కాల్నీ.

క్వీనీ మధురమైన స్వరంతో, 'నువ్వు యూనివర్సిటీలో చదువుతున్నావా ?' అని అడిగింది.

"ఇక్కడ యూనివర్సిటీలో యిడియట్స్ తప్ప ఎవరూ చదవరు. నేను తోళ్ల వర్తకం చేస్తాను. యూనివర్సిటీ డైరీలో ముసలి ఆవులు చేరానికొస్తే కొనడానికి వచ్చేను. నాది మీర్జాపూర్ హెడ్‌క్వార్టర్స్.'

ఛోక్రా లస్సీ తెచ్చి టేబుల్‌మీద పెట్టేడు.

'ఇందులో భంగ్ వేయించేను. చాలా థ్రిల్లింగ్ డ్రింక్' అని, జేమ్స్ చెవిలో ఏదో అన్నాడు. జేమ్స్ మొదట షాక్ అయి, తరువాత ఏమనాలో తెలియక నవ్వేడు.

లస్సీ మెల్లగా తాగేరు ముగ్గురూ.

జేమ్స్ ఎంతయిందో అడిగి, జేబులోంచి వాలెట్ తీసి, మెల్లగా కూడబలుకుతూ లెక్కపెట్టి యిచ్చేడు. వాలెట్ లావుగా, నోట్లతో వానాకాలం కప్పలాగుంది.

'పదండి గేంజెస్ దగ్గరకు పోదాం.'

ఘాట్ వేపు నడిచేరు.

వెల్లువతో గంగానది బురదనీరు ఉరకలేస్తూ ప్రవహిస్తూంది. విజృంభించి మెట్లమీద కెరటాలు పగిలి సుడిగా వెనక్కి తిరుగుతున్నాయి.

''క్రాస్ చేద్దామా.''

''వయొలెంట్‌గా ఉన్నట్లుంది. అవేనా బోట్స్ ? చాలా ఫ్లిమ్సీగా కనిపిస్తున్నాయి'' అన్నాడు జేమ్స్.

''ఏమీ భయంలేదు. ఇంతకంటే వరద ఎక్కువ ఉన్నప్పుడు కూడా తీసుకుపోతారు యీ పడవవాళ్లు. పోనీ డౌన్ స్ట్రీమ్ పోదామా ?''

జేమ్స్ ముఖంలో భయం. 'వద్దు. రిస్క్ తీసుకోవడం మంచిదికాదు. క్వీనీ కూడా ఉంది.'

థ్రిల్స్ కావాలి నీకు. కవర్డ్.

'సరే, నీ కేమేనా బనారస్ బ్రోకేడ్స్ కావాలా' అడిగేడు క్వీనీని.

క్వీనీ ముఖంలో సంతోషం. 'చాలా కొందామని ఉంది. ఆ దుకాణాలకి తీసుకువెళ్లు .... ప్లీజ్.''

విశ్వనాథ్ గల్లీలోకి తీసుకువెళ్తూ ఆగేడు అలఖ్.

జేమ్స్‌తో అన్నాడు : ఇక్కడ జేబుదొంగలు ఎక్కువ. మీ దగ్గర వాలెట్ ఉంచడం మంచిదికాదు. ఇక్కడ జేబు కొట్టేవాళ్లందరూ నాకు తెలుసు. వాలెట్ నా దగ్గరుంచితే ఏ భయమూ లేదు.''

జేమ్స్ తొందరగా కోట్ లోపలి జేబులోంచి వాలెట్ తీసి అలఖ్ కి యిస్తూ : ''ముందే చెప్పినందుకు చాలా థేంక్స్' అన్నాడు.

గల్లీలోకి వెళ్లారు.

చాలా రద్దీగా ఉంది. క్వీనీ దుకాణాల్లో వేళ్లాడగట్టిన చీరెల్నీ కంచు, యిత్తడి సామానుల్నీ ఆశ్చర్యంగా చూస్తూంది.

జేమ్స్ పొట్టి కాళ్లతో వెనుక నడుస్తున్నాడు.

దుకాణాల సేల్‌లు కాకుల్లాగ పిలుస్తున్నారు.

బీహారీ పల్లెటూరు గుంపొకటి గొడవచేస్తూ ముందు నడుస్తూంది.

ఆబోతు ఎదురుగా, ఆంకెవేస్తూ వేగంగా దూసుకుంటూ పరుగెత్తుతూ వచ్చింది.

బీహారీ గుంపు అరుచుకుంటూ చెదరిపోయి వెనక్కీ ముందుకూ గోల పెటుతూ పరుగెడ్తూంటే ....

'రన్' అని గట్టిగా అరిచి,

ఇద్దరి చేతులూ పట్టుకుని పరుగెత్తేడు.

'వాట్ ద హెల్ యీజ్ ద మేటర్ నౌ'' అంటూ పొట్టి కాళ్ల జేమ్స్ చెయ్యి విదిలించుకుంటూ అడిగేడు.

'శ్ .... హిందూ ముస్లిమ్ రయట్.' క్వీనీ చెయ్యి పట్టుకుని పరుగెత్తుతూనే ఉన్నాడు.

బీహారీ మూక మధ్య జొరబడ్డారు.

క్వీనీ చెయ్యి కూడా వదిలి అలఖ్ ఇంకా వేగంగా ముందుకు దూసుకుపోయి గల్లీలోంచి పైకి పోయాడు.

చౌక్‌లోంచి ఈడ్‌చేసి యింకో చిన్న గల్లీలో జొరబడి 'సంగమ్' బార్ చేరుకున్నాడు.

గట్టిగా వూపిరి బిగించి ఒక నిముషం నిలబడ్డాడు. పేంట్ జేబులో చెయ్యి పెట్టి బరువుగా, దబ్బుగా ఉన్న వాలెట్‌ని సంతృప్తిగా తడిమేడు. వాలెట్ పైకి తీసి, నోట్లు పైకి లాగి, వాలెట్‌ని కాలవలో విసిరేశాడు. బార్ లోపల అడుగు పెట్టేడు. సగం బార్ నిశ్శబ్దంగా ఉంది. హాల్ అద్దంలో జుత్తు దువ్వుకుని, రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. జేబులో నోట్లు మళ్లీ చూసుకున్నాడు. అర వయికి పైగా పది రూపాయల నోట్లు. అద్దంలో చూస్తూ, కుడికన్ను గట్టిగా మూసి నాలిక పైకి పెట్టి మళ్లీ లోపలికి మడిచి, ఎడంచెయ్యి చూపుడువేలు పెదవులమీద నిలువుగా నిలిపి మెల్లగా అన్నాడు, ''ఎవరికీ చెప్పొద్దు .... సక్కర్స్.''

బార్‌లో నిశ్శబ్దం. బూత్స్‌లో తొంగిచూస్తే ఎవరూ లేరు. పక్క గదిలో బెనర్జీ డెస్క్ దగ్గరికి వెళ్లాడు. కునుకు తీస్తున్నాడు బెనర్జీ, డెస్క్‌మీద ముఖం పెట్టుకుని. చప్పుడు చెయ్యకుండా డెస్క్‌మీద తాళాలు తీసి, వెనక గదిలోకి వెళ్లి బీరువా తెరిచేడు. కింద అరలో కార్నూన్‌జిన్ బాటిల్ తీశాడు. బెనర్జీ దగ్గరకు వచ్చేడు. డెస్క్‌మీద వంగి బెనర్జీ వీపుమీద గట్టిగా చరిచేడు. ఉలిక్కిపడి కోపంగా, బాధగా, భయంగా, అర్థంలేని అరుపులు అరుస్తూ లేచాడు బెనర్జీ.

కళ్లు రెపరెప లాడించి శేషాచలపతిన్ని చూసి బెంగాలీలో అన్నాడు :

'అబ్బ. ఎంత దెబ్బ కొట్టేవు. రావుబాబూ. ఇంత మిట్ట మధ్యాహ్నం వచ్చేవేమిటి. ఎవరూ లేరు కుర్రాళ్లు.'

'నువ్వు యిలా తలుపులు తీసిపెట్టి కునుకు తీస్తుంటే లిక్కర్ స్టోర్ అంతా ఖాళీ అవుతుంది. ఒక గంటలోనే. ఐస్ ఉందేమో చూడు.'' బెనర్జీ లోపలికి వెళ్లాడు ఐస్ కోసం.

అలఖ్ అక్కడే సోఫాలో కూర్చుని బాటిల్ మూత తీసేడు.

బెనర్జీ ట్రేలో ఐస్, వైన్ గ్లాస్‌లు, నిమ్మకాయలు పట్టుకొచ్చాడు. గ్లాస్‌లలో మూడు పెగ్‌లు జిన్ పోసి ఐస్ ముక్కలు వేసి బెనర్జీ కొకటి యిచ్చి, తను సిప్ చెయ్యడం మొదలు పెట్టేడు.

బెనర్జీ గడగడ తాగేసి గ్లాస్ ఖాళీచేసి మాట్లాడడానికి గొంతు సవరించుకుంటుంటే, 'మాట్లాడొద్దు. నన్ను వదిలి నీ పని నువ్వు చూసుకో—అంటే, మళ్లీ ముఖం డెస్క్‌మీద పెట్టి పడుకో! అన్నాడు అలఖ్.

బెనర్జీ కళ్లు మూసుకునే చిరునవ్వు నవ్వి తిరిగి సమాధి లోకి వెళ్లిపోయాడు. ....

కుడి జేబులో ఆరు వందల రూపాయలు. ఎడం జేబులో ఉమాదేకి జాగా. సెంటిమెంటల్ మూడ్‌లోకి పోవచ్చు.

" .... బాల్యం .... బాల్యపు అనుభూతులు .... బాల్యం నన్ను విరామం లేకుండా మెత్తగా వెంటాడుతూంది. ఏళ్లు గడచిన కొలదీ, ఎడారిలాంటి 'యధార్థం' గుండెలో బలమైన వ్రేళ్లతో పాతుకుపోయి స్థిరపడ్డకొలదీ, ... నా వెను కనే నీడలా వచ్చి వీపుమీద పచ్చటి వేళ్లతో తట్టి పిలు స్తున్నా రెవరో .... జీవితానికి అర్థంలేదు, అంతా శూన్యం అని తెలుస్తున్న కొలదీ, నా పూర్ణ శక్తితో వెనక్కి .... వెనక్కి పరుగెడుదా మనుకొంటాను .... తిరిగీ, నా బాల్యంలోకి ..... క్షణానికీ, క్షణానికీ, క్రియకీ, క్రియకీ సంబంధంలేకుండా బ్రతకడం .....

పవర్, ప్రెచెరీ ....;

జిన్ కైపు ఎక్కుస్తుంటే వాచాలత్వం, దెబ్బలాడడం సోపానాలు స్కిప్ చేసి సెంటిమెంటల్ మూడ్‌లో ప్రవేశించి అందులోంచి మెల్లగా జరిగి, కళ్ల నీళ్ల ప్రవాహంలో పడ్డాడు.

సాయంకాలం ఏడు గంటలకు యింకా కొంచెం మత్తు ఉండగానే, మెల్లగా తూలుకుంటూ హాస్టల్ చేరుకున్నాడు శేషాచలపతి.


బట్టలన్నీ విప్పేసి, నగ్నంగా మంచంమీద పడుకొని, పది నిముషాల తరువాత చల్లటి నీరుతో ముఖం కడుక్కుని, అద్దంలో చూసుకుంటూ "ఎలా ఉంది, అలఖ్ నిరంజన్, యీ దినం ?" అని అడిగేడు అద్దంలోని శేషాచలపతిని.

"రేపు నీ పేరు సాల్వడార్ డాలీ. ఏం చేస్తావో" అని అద్దంలోని శేషాచలపతి విషపు నవ్వు ఒకటి మధురంగా నవ్వేడు.

ఉ. నన్నయ తిక్కనాది రసనల్ గురియించిన చాటుభారతీ
మన్ననల నింకఁబోలు; ననుమాత్రము తద్రస మబ్బదెందుహా !
జున్నులలోనఁ జిన్నిపువు జున్నొటు లట్టులు పద్దియంబులన్
మిన్నలు చాటువుల్ రససమృద్ధి ననిర్వచనీయ మాధురిన్.

ఉ. గౌతమిఁ గట్టి కాలువలు కాటను ద్రవ్వినకాలమందు సం
భూతుఁడనైతి నాఁడు, పదుమూఁడగు నేఁడుల యీడు తల్లికిన్ !
మాతకులేమి బాల చట మంటిని మోసెడు యుప్పరమ్మలే
ప్రీతిని నన్నుఁ జన్గుడిపి పెంచిర దేటి ఋణానుబంధమో!

— వసురాయకవి



చిత్రము 2

బెన్ నికల్సన్

★

"ఏ ఇంగ్లీషు చిత్రకారుడు ఆధునిక చిత్రకళకు బాగా తోడ్పడినది అని అడిగితే బెన్ నికల్సన్ అని చెప్పని కళావిశారదులు వుండరు." —జాన్ రస్సెల్.

శ్రీ ఎస్. వి. రామారావు

19 వ శతాబ్దం మొదటినుండి వచ్చిన చిత్రకారులను చూస్తే వారిలో ఎంతో పట్టుదల, ఒక నూతన విషయాన్ని చెప్పాలనే బలమైన వాంఛ కనిపిస్తుంది. దానికోసరం వారు సంఘానికి చాలచాల దూరంగా వెళ్లవలసి వచ్చింది చిత్రకళలో. అందువల్లనే వారు సంఘంచే దాదాపు వెలివేయబడ్డారు. ఈ శతాబ్దపు చిత్రకారులను వారి జీవితాలను చూస్తే వారు ప్రజలనుండి ఎంత అనాదరణను పొందారో తెలుస్తుంది. ప్రజలు ఎప్పుడు అన్ని రంగాలలోను తల దూర్చాలనే మనస్తత్వం గలవారు. అందువల్ల అన్ని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం, తొందర ఎక్కువ మందిలో కనిపిస్తుంది. కుతూహలం ఉంటే తెలుసుకోవచ్చు. తెలుసుకోడానికి విమర్శనాపూర్వక దృష్టి, ఎదుట వానిని అర్థం చేసుకునే శక్తి అవసరం. ఎదుటవానిని అర్థం చేసుకోకుండా ప్రతిది తెలుసుకోగలం అనుకునేవారితోనే వస్తుంది చిక్కు, ముఖ్యంగా చిత్రకారులకు. ఎన్నో నూత్న భావాలకు, రంగాలకు దారితీసిన ఈ 19 వ శతాబ్దం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. భావాలలో ఒక ఝంఝామారుతం లేపింది ఈ యుగం. చిత్రకళలో ఊహించలేని మార్పులను తీసు

కొచ్చింది—ప్రగతినే మార్చింది. చిత్రకారుల్ని ప్రజలనుండి వేరు చేసింది. అందరు చిత్రకారులు దాదాపు ఎన్నో కష్టాలకు లోనయ్యారు వారి నూత్న మార్గాన్వేషణా సమయంలో. అయినా పట్టు విడువక తాము నమ్మిన విషయాల్ని క్రొత్త పద్ధతులలో చిత్రిస్తూ నిలచినవారు విజయపరంపరలను లోగొన్నారు తర్వాత. అలా విజయం తర్వాత విజయం సాధించినవారిలో బెన్ నికల్‌సన్ ఒకరు.

కొంతమంది చిత్రకారులు ఎంతో వ్యయ ప్రయాసలకు లోనవుతారు చిత్రకళాభ్యాసంలో. డబ్బు లేకనో, ఇంటి వద్ద వారు అంగీకరించకనో కొంతమంది బాల్యంనుండి చిత్రకళపై అభిలాష ఉండి ఏదోవిధంగా దానిలో జీవితమంతా కృషిచేస్తారు. మరికొంతమంది ఏ నలభైయ్యో ఏటనో లేక అరవై ఏటనో ప్రారంభిస్తారు కళాభ్యాసం. కొంతమంది కుటుంబమే కళాకారుల నిలయమై ఉంటుంది. అటువంటి కుటుంబాలలో తర్వాత వచ్చే తరంవారికి అంత కష్ట ముండదు ఆ రంగంలో. అంతకుముందే కుటుంబమంతా కళారంగానికి సంబంధించినవారితో పరిచయాలు ఏర్పడిఉంటాయి గనుక మార్గం సుగమ మవుతుంది. కొంతమంది అసలు యీ కళారంగాలకు సంబంధించని కుటుంబాల నుండి వస్తారు. వారు చిత్రకారులుగ స్థిరపడాలంటే చాల శ్రమతో కూడుకున్న విషయం. మరో విచిత్రమైన రకంవారు ఉన్నారు. వారు తమ కుటుంబంలోనివారి మాదిరిగా చిత్రకారులు అవడానికి కృషి చేస్తారు. కాని అంతవరకు తెలిసిఉన్న కళా సంఘాలతో, పెద్దలతో సంబంధాల్ని తెగతెంచుకుని క్రొత్త మార్గాలను త్రొక్కుతూ క్రొత్త పరిచయాల్ని సమకూర్చుకుంటారు. అందరికంటే ఈ తెగవారు బహు ఘటికులు. ఎంత బలమైన అడ్డునైనా పట్టుదలతో ఎంతకాలమైనా ఓర్చి, దాటి విజయం పొందుతారు.

బెన్ నికల్‌సన్ వేసిన చిత్రాలు మొదట అమ్ముడుపోక గ్యాలరీలలో అలా గోడలకు వ్రేలాడుతూ ఉండేవి ఎప్పుడూ. గ్యాలరీ యజమానికి, నికల్‌సన్‌కు గూడ కష్టంగానే ఉండేది. అయినా ఓర్పుతో తాను నమ్మిన పద్ధతిలోనే చిత్రిస్తూ వచ్చారు ఒకరికి నచ్చినా నచ్చకపోయినా. ఈ పట్టుదలే ఈనాడు ఆయనకు విజయపరంపరలను తెచ్చింది. ప్రపంచ ప్రసిద్ధ ఆధునిక చిత్రకారులలో ఒకరుగా గుర్తింపబడ్డారు.

బెన్ నికల్‌సన్ చిత్రకళా ప్రదర్శన యిప్పుడు జరుగుతున్నది. లండన్‌లో రెండు ప్రయివేటు గ్యాలరీలు ఒక్కసారిగా ప్రదర్శిస్తున్నాయి వీరి చిత్రాల్ని. ఇలా ఒక్కసారి రెండు ప్రదర్శనలు ఒక్క చిత్రకారునివి జరుగడం విచిత్రం. ఈమధ్య యిలాంటి పెద్దపెద్ద ప్రదర్శనలను ఏర్పాటుచేయడం ఎక్కువైంది లండన్‌లో. ఇవి ముఖ్యంగా కళాభిలాషులకు, ప్రజలకు ఒక చిత్రకారుని గురించి ఎంతో విషయాన్ని యిస్తాయి. పికాసో గ్రాఫిక్స్ ప్రదర్శన ప్రారంభమైంది నేటినుండి.

బెన్ నికల్‌సన్ ఏప్రిల్ 10, 1894 లో డెన్‌హెమ్‌లో (ఇంగ్లండులో) జన్మించారు. తండ్రి సర్. విలియమ్ నికల్‌సన్. ఆయన ఆ కాలంలో ప్రఖ్యాత చిత్రకారుడు ఇంగ్లండులో. తల్లి మేబెల్ ప్రిడ్, మేనమామ జేమ్స్ ప్రిడ్ గూడ చిత్రకారులే. బెన్ నికల్‌సన్ తల్లిదండ్రులకు పెద్దవాడు కాని, ఎంతో వ్యత్యాసముంది తండ్రికి నికల్‌సన్‌కు. తండ్రి ఎంతో సరదా అయిన వ్యక్తి. ఎప్పుడు విందులకు పెద్ద పెద్దవారిని ఇంటికి పిలవడం, తాను వారి యిండ్లకు వెళ్లడం, కబుర్లు చెప్పడం, స్నేహితులతో కలిసి మెలిసి ఉండేవాడు. ఆయనకు సంఘంలో పెద్ద గౌరవం ఉంది. బెన్ నికల్‌సన్ ఎవరితోను సరదాగా తిరగడు, తాను ఉన్నదే తన ప్రపంచం. ఎప్పుడూ ఏకాంతంగా, మనుష్యులకు సాధ్యమైనంత దూరంలో ఉంటాడు. తండ్రి లాంటి సరదాలు, విందులు నచ్చవు.

తల్లినిగూర్చి, తండ్రి చిత్రాలగురించి నికల్‌సన్ అంటాడు: ''మా నాన్న వేసిన ''స్టిల్—లైఫ్'', ప్రకృతిదృశ్యాలు'' అన్ని ''సికర్ట్'' వేసిన చిత్రాలులా ఉంటాయి. అవి ఆయన కాలంలో ఎంతో ప్రఖ్యాతి పొందాయి. ఆ చిత్రాలలో కవితా మాధుర్యం ఉంది. కాని, ఆయన మేధావి కాదు.

''మా అమ్మ కుటుంబంలో అందరికంటె చాలా తెలివి గలది. ఎంతో అందమైనది. మా ఇంటికి వచ్చిన స్నేహితులు పెద్దలు మా నాన్నతో ఎంతోసేపు చిత్రకళను గురించి మాట్లాడడం, మా నాన్న జోక్‌లు విసరడం ఆవిడకు నచ్చేదికాదు. 'వంట యింటిలో బల్ల శుభ్రం చేయాలి' అని లేచిపోయేది. (నిజానికి మా అమ్మకు ఆ అవసరం లేదు. చాల ధనికుల మవడంవల్ల ఎంతోమంది నౌకర్లున్నారు యింట్లో అన్ని పనులు చేయడానికి.)''

దీన్నిబట్టి చూస్తే తల్లి పోలికలు చాలవంకు యితనిలో వచ్చాయనిపిస్తుంది. అసలు రచయిత అవ్వాలని ఎంతో ఆశపడ్డాడు. కాని ఎందువల్లనో అది ఫలించలేదు. మొదటినుండి స్వతంత్రభావం కలవాడు. ఈ స్లేడ్ స్కూల్లో చేరాడు. అంతగా రుచించలేదు స్కూలు పద్ధతి. అతనిలో ఏమాత్రము స్కూలు ప్రభావం పడలేదు. ఫ్రాన్స్ వెళ్లి ఫ్రెంచి నేర్చుకున్నాడు. మిలాన్ వెళ్లి ఇటాలియన్ భాష నేర్చుకున్నాడు. ఇలా యూరప్ తిరిగాడు. చిత్రాలు వేసేవాడు అడపాదడపా. అలా 27 వ ఏడు వరకు ఏమంత చెప్పుకోదగ్గ 'విశేషాలేమి లేవు అతని జీవితంలో. ఫ్రాన్స్‌లోని కళాప్రదర్శనలు అతనిలో చాల

చాల మార్పులు తీసుకొచ్చాయి. ఆధునిక చిత్రాలంటే అభిలాష విపరీతంగా పెరిగింది.


ఒకసారి పాల్ రోసన్‌బర్గ్ గ్యాలరీలో పికాసో క్యూబిస్ట్ చిత్రం చూచాడు. బహుశః 1915 నాటి పికాసో చిత్రమై ఉంటుంది. ఆ చిత్రం ఎంతో బలంగా ఆకర్షించింది. జీవితంలో మర్చిపోలేనంతగా నాటుకపోయింది హృదయంలో. ఆ చిత్రంలో ఒకచోట పికాసో ముతుక ఆకుపచ్చని రంగు వాడాడట. అది యింతింతని చెప్ప నలవికానంత ఆకర్షణీయంగా ఉందని ఇప్పటికీ తన చిత్రాలలోని స్థాయిని చూడవలసి వస్తే ఆ చిత్రంతో పోల్చుకుంటానని వ్రాశారు. తర్వాత 3 సంవత్సరాలు తన మొదటి భార్యతో కలిసి చిత్రాలు వేశారు. కాని అవి అంతగా నచ్చక వేసిన చిత్రాలపైనే మరల మరొక చిత్రం వేసేవారు. ఈ 3 సంవత్సరాలు అతనికి తన చిత్రకళలో ఎన్నో పరిశోధనలకు అవకాశం కల్గించింది. అప్పుడే గియటో, సిజాన్, మతీస్ డిరైన్, బ్రాక్, పికాసో, మాన్‌ద్రియాన్‌ల ప్రభావం అతని చిత్రాలపై పడింది. కాని ఎక్కువ చిత్రాలు ఆ కాలంలో వేసినవి మిగలలేదు. తర్వాత 12 సంవత్సరాలకుగాని మోక్షం—అంటే ఇతని చిత్రాలకు పేరు రాలేదు. ఇంతకాలం పట్టింది తన కాళ్లపై తాను నిలబడి "ఇదీ నా పద్ధతి చిత్రకళలో" అని చెప్పడానికి.

మొదటునుండి యితని చిత్రాలు చూస్తే మనకు ఒకటి తోస్తుంది. ఎంత తండ్రి పద్ధతి నచ్చకపోయినా తండ్రి వేసిన సబ్జక్ట్ ఇతనిని వదలలేదు. ఇతని మాటల్లో: "మా నాన్న వేసిన స్టిల్‌లైఫ్‌లు, ఆయన చిత్రాలలోగల కవితామాధుర్యం నన్ను బాగా ఆకర్షించాయి. ఆయన సేకరించిన నాజూకైన మచ్చలు, చారలు గల కూజాలు, పాన పాత్రలు, పలు పలకల గాజు గ్లాసులు, పాత్రలు ఇంటినిండా ఎక్కడ చూచినా ఉండేవి. అటువంటివాటి మధ్య ఉన్న అనుభవం జీవితంలో మఱువ రానిది. మా నాన్న మాదిరిగా చిన్న చిన్న చిత్రాలు వేయడం అంటే నాకు చాల యిష్టం." ఎన్నో చిత్రాలు ఈ పాత్రలతో ఉన్నవి వేశారు. స్టిల్ లైఫుకు మారుపేరు నికల్‌సన్ అనవచ్చు. ఇతన్ని తలుచుకుంటే స్టిల్ లైఫులు గుర్తుకొస్తాయి—హెన్రీ మూర్‌ను తలుచుకుంటే వయ్యారంగా పండుకున్న నగ్నస్త్రీలు జ్ఞప్తికి వచ్చినట్లు. ఎన్నో ప్రకృతి దృశ్యాలను వేశారు. భవంతులు, చర్చిలో గల స్తంభాలు, తోటలోని చెట్లు వేశారు. కాని ఎందువల్లనో అవి ఈయనకు పట్టువడలేదు స్టిల్ లైఫులంతగా. గాలిలో తేలిపోతున్నట్లు ఉంటాయి ఈయన చెట్లు భవంతులు. వాటికి, భూమికి గల అవినాభావ సంబంధం, బలమైన ఆకర్షణను చూపలేకపోయారు. ఈ చిత్రాలు నికల్‌సన్‌వి అంటే నమ్మలేనంత పేలవంగా, చవుకగా ఉంటాయి. అది గ్రహించే గాబోలు ఆయన అవి వేయడం మానుకున్నారు తర్వాత తర్వాత. మనుష్యుల చిత్రాలు వేసినట్లు ఎక్కడా కనుపించదు. ఇతని పరిధి బహు పరిమితం. అది దాటి బయటకు రారు. ఆ పరిధి స్టిల్ లైఫు. ఈ పద్ధతి అతని జీవితానికి గూడా వర్తించవచ్చు. ఆయన యిల్లు, ఆయన తప్పితే అందరిలా అందరితో కలసి మెలసి తిఱుగరు. ఈమధ్య ప్రముఖ కళా విమర్శకులు వీరా, జాన్ రస్సెల్ ఇతని ఇంటికి వెళ్లితే (స్విట్జర్లండులో ఉంది ఇల్లు) నోటీసు 3 భాషలలో వ్రాసి తలుపుకు అతికించి ఉందట. (యూరపులో అందరికి ఇంగ్లీషు రాదు.) దానిలో "మీరు కొండ దిగి క్రిందకు వెళ్లి వచ్చే ముందు ఫోన్‌చేసి రండి" అని. ఆయన యిల్లు చిన్న కొండపై ఉంది. ఇతని ఫోటోగ్రాఫులు సంపాదించడంగాని, ఇతనితో మాట్లాడడంగాని బహు కష్టం. తన చిత్రాలే మాట్లాడేటప్పుడు తనతో పనేమిటనే తత్వం ఆయనది. ఇలా నివసించే తత్వంగల వ్యక్తి చిత్రాలు గూడ ఒక స్టిల్ లైఫ్‌కు పరిమితమై ఉండడంలో ఆశ్చర్యంలేదు.

చిత్రము (1) లో ఉన్న స్టిల్ లైఫ్ చూస్తే ఎంత పేలవంగా ఉందో, ఆచిత్రం ఇప్పటి ఆయన స్టిల్ లైఫ్‌లతో పోల్చి చూస్తే తెలుస్తుంది. ఎక్కడ ఏ వస్తువు ఉంచాలి, ఎలా ఉంచాలి అన్న సమస్య అతనిని బాధించినట్లు కన్పిస్తుంది ఈ చిత్రంలో. ఒక దారి తెన్ను తెలియని స్థితిలో ఉన్న చిత్రం. అయినా చిత్రకారునికి చిత్రించడానికి ఏర్పాటు చేసుకున్న వస్తువులపై ఉన్న మక్కువ కన్పిస్తుంది. పిల్లవానికి చిత్రించడంలో ఉండే ఆతురత యిందులో కనిస్తుంది. వస్తువులను ఎంత తేలికగా చిత్రించవచ్చు అనే సాధనలో ఉన్న




చిత్రము 1



చి త్ర ము 3

చిత్రం. ఇది 1927లో చిత్రించారు. నిమ్మసండ్ల బద్దలు, కత్తి ఎంతో అందంగా ఉన్నాయి. చిత్రంలో స్థాయిలేకపోయినా ముందుముందు వేసే చిత్రాలకు పునాదులు ఇందులో ఉన్నాయని స్పష్టంగా కన్పిస్తుంది. 1933—35ల మధ్య వేసిన చిత్రం (3) చూస్తే చిత్రకారునిలో వచ్చిన మార్పులు కనిపిస్తాయి. ఇక్కడ చిత్రకారునికి చిత్రంపై అధికారం ఉంది. ఒక వినూత్న పద్ధతిలో చెప్తూ కవితా మాధుర్యాన్ని జోడించగల్గారు. ఇక్కడ పాత్రలు, టేబిల్, దూరంగా ఉన్న గోడ అన్నీ కలిసి ఒక ఏకత్వాన్ని ఇస్తున్నాయి. పాత్రల రూపాలు ముఖ్యంగా కంటికి కనుపించే రూపాలుకాక ఊహారూపాలుగా ఉన్నాయి. పలకలమయమై వివిధ అంతస్థులలో ఏర్పరచబడ్డాయి. ఇవన్నీ ఆయన తండ్రి పోగుచేసిన ఇంటిలోని పాత్రల రూపాలేమో ! వాటినే మరలమరల వేస్తూ ఇప్పటికి ఇలా మలచ గలిగారేమో ! ! చిత్రం ఒకటిలో ఏ వస్తువు కా వస్తువు తన స్థానాన్ని గట్టిగాపట్టుకుని ప్రక్కదానితో కలవడం లేదు. కూజావేరు, నిమ్మబద్దలు, టేబిల్ కత్తి అన్ని వేరు వేరుగా ఉన్నాయి. ఇది భిన్నత్వంతో కూడుకున్న చిత్రం. ఇప్పటి చిత్రం (3) చూస్తే చిత్రాకారునియొక్క పరిపక్వ దశ తెలుస్తుంది. మొదటి దానిలో చిత్రమంతా రంగులతో చిత్రించారు. రెండవదానిలో కొన్నిచోట్ల మాత్రమే రంగులు చిత్రించి మిగిలింది దాదాపు తెల్లగా వదలివేసారు. రంగును వాడటంలో ఎంతో పరిమితి ఉంది రానురాను వారి చిత్రాలలో. అందరి చిత్రాకారులలా చిత్రమంతా రంగు ఉండాలనే పద్ధతిగాదు. ఇది మరొక విశిష్టత నికల్సన్‌లో. ఈ విశిష్టత ఎంతో సాధనపై వచ్చింది. ఎన్నో చిత్రాలు పూర్తిగా వేశారు రంగులలో, ఎన్నో, రేఖాచిత్రాలు వేశారు. యూరప్ తిరిగి భవంతులు, చర్చిలు, చెట్లు, కొండలు విడివిడిగా రంగులలో వేస్తు పిట్నీ అన్నీ కలిపి ఒకే చిత్రంలో రంగులువేస్తూ చివరికి అన్నీ వదలి ఒకటి రెండు రంగులలో, ఒకే స్టిల్ లైఫ్‌ను కేంద్రీకరించి వేస్తున్నారు.

మరల మార్పు కొద్దిగా, బహుకొద్దిగా, కల్గింది ఈయన చిత్రాలలో. ఇది ఉబ్బెత్తు చిత్రాలను చేయడం. నిజానికి చిత్రాలను అందరు చిత్రిస్తారు. కాని ఈయన చేస్తారు. ఈయన చేసే పద్ధతిని శిల్పాలనాలా చిత్రాలనాలా అనే సందిగ్ధత వెలిబుచ్చారు, నా మిత్రుడు ప్రపంచ విఖ్యాత విమర్శకుడు సర్. హెర్బర్ట్‌రీడ్. ఇది కొద్దిగా క్లిష్టమైన విషయమే. ఈయన చెక్కకుగలా బల్లపరుపు భాగమును పలువిధాల ఎత్తులలో చెక్కివాటికి రంగులు వేస్తారు. ఇవిచూస్తే ఈ భాగాలు చిత్రంలో శిల్పాలులాగ ముందుకు వచ్చి ఉంటాయి. ఇప్పుడు ఎక్కువగా ఇటాలియన్ చిత్రకారులు ఎన్నో రకాలుగా చేస్తున్నారు ఇలాంటి చిత్రాలు. ఇలా చేసిన చిత్రాలలో నికల్సన్ సబ్జెక్ట్ కు ప్రాధాన్యత ఇవ్వలేదు. వివిధ రకాల ఆకారాలను చిత్రించారు అంతే. చిత్రంఏమిటో—అంటే స్టిల్‌లైఫో, మనిషో, మనిషితలో, ప్రకృతి దృశ్యమో వీటి వివరణ ఉండదు. విభిన్న ఆకారాల కలయికలే ఈ చిత్రాలు. దీన్ని Composition అని అంటారు ఆయన. ఇటువంటి వాటిని వివరించడం ఎంతో కష్టం. వీటిని చూడాలిగాని వివరించి వ్రాయలేం. చిత్రము (4) ఈ మాదిరి దానికి చెందినది. చెక్కమందాన్ని పలు విధాలుగా చెక్కి, రకరకాల ఆకారాలను మలచి వాటికి రంగులను వేసినది. ఒక ఆకారానికి మరొకదానికి గల సంబంధం, ఒక ఏకత్వం ఈ చిత్రం చూపుతుంది. ముఖ్యంగా దీన్ని రంగులలో చూస్తే



చి త్ర ము 4

ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. లేతరంగులను వాడతారు ఈయన, చిత్రమంతా అక్కడక్కడ ఆకారాలకు తెలుపువదలి, మధ్య మధ్య కొన్ని ఆకారాలకు బలమైన ముతుక ఇటుకరంగు, నలుపురంగు, గులాబిరంగులు వాడతారు. ఇవన్నీ కలిసి రంగుల రంకులరాట్నం తిరిగినట్లు చిత్రంలో తిరుగుతూ ఎంతో శోభను వెదజల్లుతాయి చిత్రాలు. మరొక చిత్రం (2)లో పేకాట ముక్కలను పేర్చారు బల్లపైగల గుడ్డపై, ఎరుపు, నీలం రంగులు ముతుకవి వేశారు. ఆకుపచ్చని గీతలు గుడ్డపై అడ్డంగా గీశారు. బలమైన రేఖలు, పేకముక్కలకు వెనుక ఇచ్చిన నీడ ఎంతో గట్టిగా ముక్కలను పట్టుకున్నట్లు అనిపిస్తుంది. పే ముక్కలు గుంపుగా ఒక్కచోటనే ఉన్నా బల్ల అంతా ఆక్రమించినాయా అనే అభిప్రాయాన్ని కల్గిస్తాయి. బహు ముచ్చటైన చిత్రం.

ఇప్పటి చిత్రాలలో ఎక్కువగా రంగుకంటే ఆకారాలకు ప్రాధాన్యత ఇచ్చారు నికల్సన్. చిత్రం అంతటా ఏ ఒక్కచోటో, రెండు చోట్లో ముతుకరంగు వాడి, మిగిలినదంతా రేఖలతో పూర్తి చేశారు. ఒక్క కప్పుసాసరు చిత్రాలు ఎన్నో ఉన్నాయి. రంగులేదు. సన్నని దారములాంటి లైన్లు చిత్రాలలో నటిస్తాయి. ఈ రేఖను ఎంతో హృద్యంగమంగా వివరించారు విమర్శకులు డేవిడ్‌లూస్— "గాలి, నీరు, వెలుతురు మాదిరిగా ఈ రేఖలు రాగమయ ప్రకృతి దృశ్యంలో అడ్డుగా నిలచిన కొండలనే రంగులను చీల్చుకుపోతాయి" అని. ఆహా! ఎంతటి వర్ణన! నికల్సన్ చిత్రాల్ని మాటలలో చదవడం ఈయన ఒక్కరే సాధించారు. ఎంతగా డేవిడ్‌లూస్‌ను కదిలించకపోతే ఇలా వ్రాస్తారు! అందుకేగాబోలు ఫ్రెంచి విమర్శకులు ఛార్లెస్ ఎస్టినే "నేటి ఇంగ్లీషు కళలో ఉన్నత స్థాయికి ఉదాహరణ బెన్‌నికల్సన్, హెన్రీమూర్, గ్రహమ్ సదర్‌లాండ్." అన్నారు. విమర్శకులు ఎమిలీ గినార్ ఇతనిని ప్రముఖ ఇంగ్లీషు చిత్రకారులు గెయిన్స్‌బరో, కాన్‌స్టబుల్, బోనింగ్‌టన్, టర్నర్‌ల స్థాయిలో చేర్చారు.

ఇతని చిత్రాలు అందరికి నచ్చుతాయి. చిత్రాలలోని వర్ణ సమ్మేళనం అటువంటిది. ప్రకృతిలోని కాలాల మార్పులలో ఉండే శోభ ఈ చిత్రాలలో ఉంటుంది. అందుకే అందరిని ఆకర్షించగలవు. ఇతనిలోని నిజాయితిని గర్వాన్ని ఎరుగున్నవారు పొగుడుతారు. స్నేహితులకు తగినంత సహాయం చేసే తత్వం ఉంది. నికల్సన్ అంటారు. "1930లో మాన్‌ప్రియాన్ లండన్‌కి వచ్చాడు కాందిశీకుడుగా. అప్పుడే పరిచయమైంది అతనితో. అప్పుడు అతనివద్ద అసలు డబ్బులేదు. మా గ్రూపుకు దగ్గరలోనే (అంటే గాబో, హెన్రీమూర్, బార్బారాహెప్ వర్త్ అన్నమాట!) అతనికి ఒకరూము సంపాదించాం హేమ్‌స్టెడ్‌లో. ఎంతో ఎంతో కష్టపడి అతని చిత్రాలి అమ్మే ప్రయత్నం చేసేవాళ్లం. 30 పౌండ్లకు 40 పౌండ్లకు అమ్మేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చేది." (ఆచిత్రాలు ఇప్పుడు ఒక్కొక్కటి 10,000 పౌండ్లు 15,000 పౌండ్లు ధర.)

బెన్ నికల్సన్ చిత్రాలు చూస్తే అతనిపై మాన్‌ప్రియాన్ ప్రభావంపడ్డట్లు కనిపిస్తుంది. విపరీతమైన ప్రభావం ఉంది మాన్‌ప్రియాన్‌ది. బ్రాక్ ప్రభావం గూడ ఎక్కువగా ఉంది. నికల్సన్ అంటాడు—"బ్రతికిఉన్న చిత్రకారుల ప్రభావం ఉంది నాపై. నాపై చైనీస్, గ్రీక్, స్పానిష్, ఫ్రెంచి, ఇటాలియన్‌ల ప్రభావం ఉంది. సజీవమైన కళ అంటూఉంటే అది ఈ కాలంలోనే ఉంది ప్రపంచంలో. టోబి, రోత్‌కో, శామ్‌ఫ్రాన్సిస్, బుర్రీ, పాస్‌మోర్‌ల చిత్రాలంటే ఎంతో ఇష్టం." ఇతని చాల చిత్రాలు ఈ ప్రదర్శనలలోను అక్కడక్కడ విడివిడిగా ఇతర చోట్లను చూచినమీదట, ఇం తమంది, ఇన్ని దేశాల ప్రభావం ఉన్నట్లు నాకు కన్పించదు. ఆ దేశాలంటే, ఆ చిత్రకారులంటే అభిమానం ఉండవచ్చు. అదివేరు విషయం. ప్రభావం వేరువిషయం. మాండ్రియాన్ బ్రాక్‌ల మిశ్రమం బెన్‌నికల్సన్ అనిపిస్తుంది నాకు. ఇది తప్పవచ్చు. కాని నా అభిప్రాయం. అలా అని ఇతను ఈ ఇద్దరిని కలిపి తన చిత్రాలుగా చేశాడనిగాదు. వారిద్దరినుండి తన మార్గానికి కావలసిన సూత్రాలను సంపాదించారని.

ఏది ఏమైనా విజయం ఇతన్ని చాలాకాలానికి వరించింది. 1952లో కార్నేగి ఇంటర్నేషనల్ మొదటి ప్రైజు రావడం నుండి ఈయనపేరుపైకి ప్రాక ప్రారంభించింది. 1956నుండి గొగన్‌హామ్ మొదటి బహుమతి రావడం ప్రారంభించింది. ఇప్పుడాయన తమ భార్య ఫెలిసెటాస్ వోగ్లర్‌తో స్విట్జర్లండ్‌లో ఉన్నారు. ఈ విడ ప్రసిద్ధ ఫోటోగ్రాఫర్. ఇంగ్లండు పేరును ఆధునిక చిత్రకళలోకి చిరస్థాయిగా ఎక్కించిన ప్రతిభాశాలి బెన్‌నికల్సన్. ఇంగ్లీషువారు సగర్వంగా, ఏ దేశవాసులైనా గర్వాతిశయంతో చెప్పుకోదగ్గ చిత్రకారుడు. ఈయన ప్రభావం ఆధునిక యువ చిత్రాకారులలో విపరీతం. దాదాపు అన్ని ప్రసిద్ధ గ్యాలరీలు ప్రపంచంలో ఈయన చిత్రాలను కొన్నాయి. ఈయన పేరులేనిది ప్రపంచ చిత్రకళా సంచయం పూర్తిగాదు. ఈయన అంటారు "నీకు నీవే 'నేను బాగా అభివృద్ధిలోకి వచ్చే చిత్రకారుడను. ఏదో ఒకరోజు ఒక మహత్తరాన్ని సాధించవచ్చు' అని అనుకోవాలి." నిజానికి ఇలా అనుకోకపోతే ఏ సృజనాత్మక కళాకారుడు ఏది సాధించలేడు. ఇది ముఖ్యంగా యువచిత్రకారులలో అవసరం. అలా అని కృషి చేస్తేనే మనం ఏదో ఒకటి సాధిస్తాం ఏదో ఒకరోజున.

కోహీరు శాసనము

శ్రీ ఎం. రంగకృష్ణమాచార్యులు

ఆంధ్రప్రదేశ రాజధానియగు హైదరాబాదునకు సుమారు 75 మైళ్ల దూరమున మెదకు మండలములోని జహీరాబాదు తాలూకాలో హైదరాబాదు నుండి పర్లీ—వైద్యనాథ్ బ్రాడ్‌గేజి రైలుమార్గమున 'కోహీరు' అను గ్రామము కలదు. దీనికి పూర్వము ఓంకార పట్టణమను పేరుండినట్లు స్థానికులు చెప్పుకొందురు.

అచ్చటచ్చట శిథిలములైన శాసన ఖండ శిలా ఫలకములు విరివిగా గానంబడుచున్నవి. 'వీరసంగయ్య' కట్ట అను మందిరమున గల విగ్రహముయొక్క నాలుగు వైపుల నొక శాసనము గలదు. దానిని దిగువ యథామాతృకముగా పొందుపరుచు చున్నాడను.

మొదటివైపు

స్వస్తిసమస్త భువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభా!
మహా రాజాధిరాజ! పరమేశ్వర!
పరమేశ్వర పరమ భట్టారకమ్
సత్యాశ్రయకుళ తిళక చాళుక్యా భారం
శ్రీ మా
(తర్వాతి భాగం లేదు)

రెండవవైపు

"మహేశ్వరం సాహిత్య విద్యా పారాళయం
సుభట నారాయళం, విజయలక్ష్మి నివాసం
కీర్తి విళాసం పరచక్ర వేతాళాహ"
(తర్వాతి భాగంలేదు)

మూడవవైపు

శ్రీ భువనైక మల్ల దేవ పాదపంకజ భ్రమరం
శ్రీమత్ పంపపేర్ మానెడీగాళూ
శకవర్ష 991 నెయిసియ్యా సంవత్సర పుష్య
(తర్వాతి భాగం లేదు)

నాల్గవవైపు

శుభచంద్ర సిద్ధాంత దేవర గుడ్డం
పిడవళ చావుండ మయూ
మాడిసిథ సదిగే ఖండ స్వబిత
(తర్వాతి భాగంలేదు)

ఇది కన్నడ శాసనము. శ్రీ నన్నెచోడ మహాకవిరాజ విరచితమైన కుమారసంభవమున

మునుమార్గ కవితలోకం
బున వెలయఁగఁ దేశికవితఁ బుట్టించి తెనుఁ
* గు నిలిపి రంధ్ర విషయమునఁ
జనసత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్.

అను పద్యమున సత్యాశ్రయ శబ్దము కలదు. శాసనమందును 'సత్యాశ్రయ కుళ తిలక' అని పేర్కొనబడి యున్నది. ఈ బిరుదము రెండవ పులకేశి పొందెను. పృథ్వీవల్లభ ! అను బిరుదమును అతడే పొందియున్నాడు. పూర్వ పశ్చిమ చాళుక్య ఉభయులును వీనిని వాడుకొనిరి. నన్నయార్యుడును భారతమున "సమస్త భువనాశ్రయ సత్యాశ్రయ కులశేఖరా !" అని రాజరాజ నరేంద్రుని సంబోధించి యున్నాడు. శకవర్షము 991 కి క్రీ. శ. దాదాపు 1068 ప్రాంతమగుచున్నది. 1068—1076 వరకు కల్యాణి చాళుక్యరాజగు రెండవ సోమేశ్వరుడు పరిపాలించెను. ఈతని సామంతరాజా పంపపేర మానడి. ఈతడే సిద్ధాంత దేవర అను గురువర్యునకు అర్చకత్వము నొసంగి పై శాసనమును వేయించెను.

శాసనప్రతి పూర్తిగా లభింపమి తదితర విషయములు పూర్తిగా తెలియడంలేదు. చరిత్రజ్ఞులు పరిశీలించి ఈ శాసనమందలి చరిత్రాంశములు లోకమునకు వెల్లడించగలరని ఆశించెదను.

---

* గును నిలిపి రంధ్ర విషయం
బునఁ జనిఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్.

సూక్తిసుధాకరము

★

శ్రీ క్షేమేంద్ర

(1) **A dictionary of quotations** అని దీనికి ఆంగ్లమున పేరు. ప్రస్తుతమునకు కీర్తిశేషులైన రచయితల గ్రంథముల నుండి మాత్రమే ఇందు సూక్తులు గ్రహింపబడినవి. ఈ విషయమును సంపాదకులే పీఠికలో చెప్పిరి. మరియు "మానవులకు సత్కవులు అకారణ బంధువులు. అనుభవపూర్వకములు, సుధామయములు, శాశ్వతములు, దేశకాలాతీతములు నగువారి ఉక్తులే సూక్తులు. ఆ సూక్తుల కాకరమైనదీ సూక్తి సుధాకరము .... సమష్టి జ్ఞాన ప్రధానమె సూక్తి సుధాకరముయొక్క యాశయము" అని యీ గ్రంథము స్వరూప స్వభావములను గూర్చి చెప్పిరి.

దాదాపు 708 శీర్షికల క్రింద 404 గ్రంథాల నుండి ఏరబడిన సూక్తులతో సమకూర్చబడిన బృహత్ గ్రంథమీ సూక్తి సుధాకరము.

సూక్తులు సేకరించు పని చేసినవారి (31) పేర్లు కూడ ముందొక పట్టికగా నీయబడినవి. వారిలో కొందరు బ్రతికియున్న రచయితల సూక్తులనే ఏరినారు. కాబట్టి సంపాదకులు పీఠికలో చెప్పినదానికి విరుద్ధముగా వ్యవహరించినట్లు స్పష్టమవుతున్నది.

గ్రంథము చివర ఏఏ రచయితల రచనల నుండి ఇందు పేర్కొనబడిన సూక్తులు గ్రహింపబడినవో ఆ విషయమును సూచించుటకు "కావ్యములు—కవులు" అను శీర్షికను నొక పట్టిక ఈయబడినది.

పేర్కొనబడిన సూక్తుల కక్కడి కక్కడే అడుగున తద్రచయిత, గ్రంథము, గ్రంథభాగము, సంఖ్య ఈయబడుటను సంపాదకు లొక నియమముగా పెట్టుకొనినారు.

ఇది సూక్తిసుధాకర మనబడు గ్రంథముయొక్క స్థూల స్వరూపము.

ఇట్టి గ్రంథములు ఆంగ్లమున కొన్ని గలవు. భాష ఏదైనను ప్రణాళిక యొకటియే గదా! సంపాదకుని శక్తి సామర్థ్యములనుబట్టి—ఇట్టి గ్రంథములకు ప్రామాణికమైన స్థితి కలుగును. సూక్తులను తానుగా సేకరింపకపోయినను, సేకరింపించుటలోను, సేకరింపబడి వచ్చిన సూక్తులలో గల సూక్తి లక్షణమును పరీక్షించుటలోను, ఉచితములైన శీర్షికల క్రిందకు వచ్చునట్లాయా సూక్తులను వింగడించుటలోను, సూక్తిగతమై యున్న సూక్ష్మ సుకుమార భావ వైశిష్ట్యమును సంభావించి శీర్షికకు కూర్చుటలోను, కూర్చబడిన సూక్తుల ఆకరములను యథాతథముగను—విస్పష్టముగను సూచించుటలోను సంపాదకుడు ప్రదర్శించు బుద్ధి కౌశల్యముతో గూడిన నిజాయితిని బట్టియే వాని శక్తి సామర్థ్యములు వెల్లడి యగును.

1877 వ సంవత్సరమున **Dictionary of thoughts** అను గ్రంథమును **Tryon Edwards** అనునతడు ప్రకటించినాడు. అదియు ఈ సూక్తి సుధాకరము వంటిదే. ఆయన చేసిన ఏబది సంవత్సరముల కృషి ఫలితముగా ఆ గ్రంథము వచ్చినది. ఆ దృష్టితో చూచినపుడు ఈ సూక్తి సుధాకరము చాల త్వరగా వచ్చినది. మూడు సంవత్సరములలో వచ్చినది.

ఇట్టి గ్రంథములవలని ప్రయోజన మేమి?—ఒక విషయమును గురించి, మంచి ధీశక్తి కలిగిన మానవు లేవిధముగా నాలోచించిరి? అను విషయము నెరుగుటయే ప్రయోజనము. ఫలానా విషయమును గురించి ఫలానా ఫలానా పెద్దలింపా విధములుగా చెప్పిరి అని మరొకడు చెప్పుట కుపకరించుటయే ప్రయోజనము. మనకు తెలియని గాని, తెలిసిన గాని, పెద్దలు ఫలానా ఫలానా విషయముల గురించి ఇట్టి ఇట్టి అభిప్రాయములు కలిగియున్నారని మనము తెలిసికొనుట కవకాశము కల్పించుటయే ప్రయోజనము. అవసరము వచ్చినపుడు దానిని గురించి ఆ రచయిత అక్కడ ఇట్లనినాడని మన ముదాహరించుకొనుటకు వీలగుటయే ప్రయోజనము.

పైకి చూచుటకి గ్రంథము బాగుగనే యున్నది గానీ లోనికి చూచినచో గందరగోళముగా నున్నది. ఆ గందరగోళ మంతయు సంపాదకత్వము లక్షణము.

---

(1) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి ప్రచురణ.

దగ్గర దగ్గరగా 708 శీర్షిక లున్నవని మొదట చెప్పబడినదిగదా ! అవన్నియు తప్పనిసరిగా నుండవలసిన యోగ్యత గలవికావు. ఉన్నదానికి యోగ్యత కలదన్నచో ఆవిధముగా నుండవలసినవి మరికొన్ని లేవు. ఉదాహరణకు కోపనుడు—కోపము—అక్రోధనత అన్న మూడు శీర్షికలు చూడుడు. కోపములో కోపనుడైనవానిని గూర్చియు, కోపమును గూర్చియు, కోపము లేకపోవుటను గూర్చియు చెప్పనగును. నిజమునకా మూడింటి క్రిందను గ్రహింపబడిన సూక్తు లొక శీర్షికకు సరిపోవునవిగనే యున్నవి. అట్లే—, అనపత్యత—సంతానము; పౌరుషము—వీరత్వము—శౌర్యము; దాంపత్యము—భార్యాభర్తలు; దైవబలము—దైవయోగము—విధి; యతి—సన్యాసి; యోగి—ఋషి; సేవకధర్మము — సేవకవృత్తి; పుత్రుడు — కుపుత్రుడు—సుపుత్రుడు; కులము—కులధర్మము; కాలము—కాల ప్రభావము; కార్యవిచారము— కార్యగతి—కార్యశూరత—కార్యసాధన; కర్మ—కర్మానుభవము;—ఇట్టివి శీర్షిక లీ గ్రంథమున విపరీతముగా నున్నవి. కొందరి ట్లనుకొనవచ్చును: అందందు గల సూక్ష్మభేదములను చూపించు నుద్దేశ్యముతో సంపాదకు లట్టి శీర్షికల నుంచినారేమో అని. అట్టి దేమియును లేదు. కొన్నింటిలో సూక్తులే పునరుక్తములైనవి. మరి కొన్నింట ఆ భావములే పునరుక్తము లైనవి. "అసమయము" అన్న శీర్షిక క్రింది సూక్తులకును "అనుచితము" అన్న శీర్షిక క్రింది సూక్తులకును అర్థమును విచారించి భావించుచో భేదము కన్పించదు. కాదు సంపాదకు లుంచిన శీర్షికల కన్నిటికిని ఉండవలసిన యోగ్యత కలదు. అని అన్నపుడు మరొక ప్రశ్న పుట్టుచున్నది. "అధర్మము"—"అధర్ములు" అనియు, "అపకారము"—"అపకారి" అనియు శీర్షిక లున్నవిగదా ? ఇట్టివింకను కలవు కదా ? ఆ లెక్కను చూచినచో "అజ్ఞానము" అన్న శీర్షిక ప్రక్కన "అజ్ఞానులు" శీర్షిక ఉండవలయును గదా ? పరమార్థ మాలోచించినచో అజ్ఞాను లుండుటను బట్టియే అజ్ఞానమని యొకటున్న దనుకొనుచున్నాము—మరి "అధికారము" న్నపుడు "అధికారి" ఏల లేకుండవలయును ? "ఉపకారము" తోపాటు "ఉపకారి" లేకుండుట యుచితమా? ఇట్టి ప్రశ్నలకు సమాధానము లుండవు. శీర్షికల నేర్పాటు చేయుటలో సంపాదకు లొక నియమమును పాటించుట పెట్టుకొనలేదు. ఏవో తోచిన శీర్షికల క్రిందకు దొరికిన సూక్తులను నెట్టి సర్దుబాటు చేసి సూక్తి సుధాకరమును తయారు చేసినట్లున్నది. మరికొన్ని విచిత్రములు చూడుడు : "నాస్తికత" అన్న శీర్షిక కలదు. అది రెండు శీర్షికలుగా గలదు. ఒకటి 'సమర్థన' రెండవది 'నిరసన'. "ఆస్తికత" అన్న శీర్షిక గలదు. అది యొకటిగనే యున్నది. దాని విషయమున 'సమర్థన', 'నిరసన' లేవా మరి ? మరియు తాత్త్వికవిషయము లన్నింటికిని రెండు ముఖములు కలవు. ఆ రెండు ముఖములను నిరూపించు వాక్యములు గలవు. సంపాదకులా యన్నింటిని కూడ గ్రహించి యుండవలసినది. ఒక్క పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోనే బహు తాత్త్వికవిషయముల నిరసన యున్నది. అట్లే కొన్నింటి సమర్థన యున్నది. మరి వాని నేల సంపాదకులు గ్రహింపలేదో తెలియలేదు.

ఇక ఈ గ్రంథమున గల సూక్తులలో కొన్ని ఆయా శీర్షికల కనుగుణముగా లేవు. "మనస్సు" అను శీర్షిక క్రింద "తలపున నణచిపెట్టు దరము కాకుండు" అని యొక సూక్తి యున్నది. తలపు అనగా మనస్సు అని సంపాదకు లెట్లను కొనిరో తెలియదు. అది మనసుయొక్క పని గాని మనస్సు కాదు. "అప్రియము" అన్న శీర్షిక క్రింద "ఒరులే యవి యొనరించిన నరవర—" ఇత్యాది తిక్కన్నగారి పద్య మీయబడినది. ఆ పద్యములో అప్రియ మన్నమాట యున్నదనియే సంపాదకులు చూచిరి గాని ఏ యర్థము నిరూపించుటకా పద్యము భారతమున వ్రాయబడినదో చూడలేదు. ఏది పరమ ధర్మమో దానిని చెప్పుటకా పద్యము వ్రాయబడినది. అందువలన అది "అప్రియమునకు" తగినది కాదు. "అంతశ్శత్రులు" ఇత్యాది నన్నయ్యగారి పద్య మీయబడినది. ఆ పద్యమునకా శీర్షికతో నెట్టి సంబంధమును లేదు. సంపాదకులు మరల దానిని తీసుకొనిపోయి "అపకారి" క్రింద పడవేసినారు. అక్కడ కూడ దాని ఔచిత్యము విచార్యమే యగుచున్నది. "పని యదనున జేయక మూల్గు వానికీ—" ఇత్యాది పానుగంటివారి సూక్తి "అదను" అను ప్రత్యేకమైన శీర్షిక పెట్టిన సంపాదకు లక్కడ నీయక దానిని "ఆలస్యము" క్రింద చేర్చుట నేమనవలయునో తెలియుటలేదు. "పతనము" శీర్షిక కీయబడిన వేమన్నగారి సూక్తి అర్థము విచారింపబడినట్లు తోచదు. 'కూలబడిన నరుడు' లోని 'కూలబడు'టకు పతన మర్థముకాదు. చితికి పోవుట యర్థము. ఇట్లే మరియు "ఆత్మహత్య" అన్న శీర్షిక క్రింద "పాపమ్ము చేసికొని బావిలో పడితే, పై మురికియే గాని పాపాలు పోవు" అన్న "పల్లె పదాల" లోని సూక్తి ఈయబడినది. విచారించినచో అది ఆత్మహత్యకు సంబంధించినదిగా తోచదు. 'బావిలో పడితే' అనగా దిగుడు బావిలో స్నానము చేయుటకు పోవుట. ఎండ వేళప్పుడు— అబ్బ ! ఇక ఈ ఎండకు తట్టుకోలేం— త్వరగా పోయి బావిలో పడితేగాని ప్రాణం నిలువదు— అని అనుకొనుట పల్లెటూళ్ళలో నున్నది. అందువలన 'బావిలో పడితే' అన్న దానికి ఆత్మహత్య అర్థముకాదు. అది ఆత్మహత్యయే యైనచో 'పై మురికియే పోవుట' యేమి ? ప్రాణము లున్నగదా పై మురికి పోవుట యున్నది ? పల్లెటూళ్ళలో గల ఒక పాపాత్ముని, తదాచారము ననుసరించి ఒక జానపదుడా విధముగా హేళన చేసినాడు. అది అంతమాత్రమే. అర్థమును విచారించ నందున సంపాదకులాత్మహత్య క్రింద జమకట్టినారు.

ఈ విధముగా అర్థమును విచారింపక కూర్చిన సూక్తులింకను చాలగలవు. "వేశ్య" అన్న శీర్షిక క్రింద ".... లోకములోన వేశ్యలుం గాకులవంటివార లటుగాన ప్రమాదము చేరనిచ్చినన్." అన్న సారంగు తమ్మయ్య వైజయంతీ విలాసములోని పద్య మీయబడినది. మొదటి రెండున్నర పాదములు లేని పద్యమిది. ఈయబడినంతవరకు దానికేమి యర్థము ? వేశ్యలు కాకులు. వారిని చేరనిచ్చిన ప్రమాదము. ఇంతేకదా ? వేశ్యల చేరనిచ్చిన ప్రమాదమున్న దట్లుంచినచో వేశ్యలు కాకులని చెప్పబడుటలో విశేషమేమి ? ఆ పద్యములో ముందుండవలసినది కూడ ఉన్నగాని వేశ్యలను కాకులని తమ్మయ ఎందుకనినాడో తెలియదు. "కాకులు రావిపండ్లదిని క్రక్క శిలామయ దేవమందిరానీకములందు రావులు జనించును. సజ్జన చిత్తవృత్తి యవ్యాకుల లీలరాతి గుడివంటిది లోకములోన వేశ్యలుం గాకులవంటివారు...." ఇది పద్యము. ఇపుడు చూచుకొన వచ్చును కాకులని వేశ్యల ననుటలోని సారస్యము. మరొకటి. "పురుష భవంబు నొందుట యపూర్వము జన్మములందు' ఇదొక సూక్తి. పోతన్నగారి భాగవతములోనిది. ఈ సూక్తి "సంతానము" అన్న శీర్షిక క్రింద ఈయబడినది. కొడుకు యొక్క పుట్టకకు సంబంధించినదని ఈయబడ్డట్లున్నది. నిజమునకది జీవుని పరంపరలో పురుష జన్మము గొప్పదని చెప్పుచున్నది. ఇక్కడ పురుష శబ్దము మనుష్యుడని. పురుష భవం బనగా మనుష్య జన్మమని. అందువలన దానికా శీర్షికతో సంబంధములేదు.

సంబంధము లేనివి సమకూర్చ బడినట్లే సంబంధమున్నవి కొన్ని సమకూర్చబడలేదు. "శీలము" శీర్షిక క్రింద తిక్కన్నగారి భారతము నుండి ".... శీల సామగ్రిలేని దుశ్చేష్టితునకు"అను పద్యము గ్రహింప బడినది. ఆయన భారతములో శీలమనవేమో చెప్పు పద్యమున్నది. దానిని సూక్తి సుధాకరమిట పేర్కొనలేదు. "ఒలసి మనో వాక్కాయంబుల ద్రోహాభావ మఖిల భూతముల యెడం గలిమి వినుశీలము...." (శాంతి. 3—147). మరియు "బంధువులు" శీర్షిక క్రింద "ఆ పద పుట్టిన వేళను ప్రాపకులై వచ్చువారు బంధువులరయన్—" అను రామనామాత్యుని గయోపాఖ్యానము (2—34)లోని పద్య మీయబడి యుండవలయును. గయోపాఖ్యానములో నుండి సూక్తులు ఇతరత్రా గ్రహింపబడినవి. ఆ యర్థమునిచ్చు తిక్కన్నగారి సూక్తి యున్నను రామనామాత్యుని నిర్వచనమువలె చక్కగా నున్నది గదా ! ఒక విశేషమేమనగా నీ గయోపాఖ్యానములోనిదిగా "శ్రద్ధ" అను శీర్షిక క్రింద ఉదాహరింపబడిన పద్యమా గ్రంథములోలేదు. అది యెక్కడిదో తెలియదు.

ఈ విధముగా చాల సూక్తులు ఆకరములు జాగ్రత్తగా నీయబడనందున గుర్తించుట కష్టముగా నున్నది. ముఖ్యముగా నివి నాలెండు రకములుగా నున్నవి. కొన్నింటికి ఊరక ఫలానా పుస్తకమని వ్రాయబడును. ఆ పుస్తకములు ప్రసిద్ధములు కావు. చూడుడు— "శాంతి దూత. 24" పుట. 21; "నీతి పదములు. 1—14" పుట. 28, "వత్సర మాలిక" పుట 85, 94, "విశ్వకర్మ పురాణము" పుట 89, "అహల్యాబాయి." పుట 259, "శృంగార షష్ఠము" పుట 268, "సౌగంధిక ప్రసూన సంగ్రహము" పుట 269, "ప్రశ్నోత్తరీ మణిమాల" (ప్రశ్నోత్తర మణిమాల) పుట 376, "జ్ఞాన ప్రకాశ శతకము" పుట. 505, —కొన్నింటికి కేవలము రచయిత పేర్లీయబడును. ఆ సూక్తులాయా రచయితల యే రచనల నుండి గ్రహింపబడినవో తెలిసికొనుటకు వారి అన్ని గ్రంథములను పునము పునః వెతుకవలయును. చూడుడు—. "బసవరాజు అప్పారావు" పుట 34, "హరిభట్టు" పుట 116, "ఆ. నారాయణదాసు" పుట 126, "విక్రమ దేవవర్మ" పుట 142, 143, "పానుగంటి" పుట 174, 'నా. కృ. రావు" పుట. 390, "చ. గ. శాస్త్రి" పుట 512, "పా. సోమన." పుట. 615, 623,— మరికొన్నింటికి రచయితలను గ్రంథములను మాత్రమే పేర్కొని వదలుట జరిగినది. "సోమనామాత్యుడు. సీమంతినీ కల్యాణము", "శేషము వేంకటపతి. శశాంక విజయము," "మండచిట్టి కామశాస్త్రి. మార్కండేయ పురాణానువాదము" (పుటలు. 869, 820, 560,) "అయ్యలార్యుడు. భాస్కర. రామా." "హరిభట్టు. మత్స్య పురాణము" "పిల్ల. పిన. జైమిని" (పుటలు. 140, 363, 515). ఆశ్వాసములు— పద్య సంఖ్యలు తప్పుగా నీయబడినవి చాలగలవు.— 147వ పుటలో "అనంతా మాత్యుడు. భోజరాజీయము IV— 108" అని యున్నది తప్పు. 362 పుటలో "పిల్ల. పిన. జైమిని. VII—227" అన్నది తప్పు. 556వ పుటలో గల "సూరన. కళా. VII— 294" తప్పు. ఈ విధముగా వీనిని పేర్కొనుచు బోయినచో అంతుండదు. చిన్నచిన్న పొరపాట్లక్రింద, అచ్చుతప్పులక్రింద నెట్టివేయ దగినవి లెక్కలేనన్ని గలవు. 383వ పుటలో "కనుపర్తి అబ్బయామాత్యుడు—కవిరాజ మనోరంజనము 11—93" అన్నది III-93అని యుండవలయును. 388వ పుటలో "కుమారధూర్జటి. కృష్ణరాయ. 9' అన్నది '92 అని యుండవలయును. 607వ పుటలోని "మారన. మార్కం VII— 154 అన్నది VIII—154 అని యుండవలయును. 671వ పుటలోని "సూరన. కళా. VII— 241." అన్నది VII—247 అని యుండవలయును. ఇట్టి వచ్చు తప్పులక్రింద జమవేసినప్పటికిని తప్పులసంఖ్య ఎక్కువగా నున్నది. ఈ తప్పులకేమిగాని గ్రంథములు రచయితలు గూడ అట్లుండుట చాల శోచనీయము. పాల్కురికి సోమనాథుడు వాదప్రకరణమన్న గ్రంథమును వ్రాసినట్లు 449 పుటలోను "కావ్యములు—కవులు" పట్టికలో 9వ పుటలోను కలదు. పండితారాధ్య చరిత్రలోని వాదప్రకరణమునుండి ఉదాహరణము గైకొనబడినది. వాద ప్రకరణమును ప్రత్యేక గ్రంథముగా పేర్కొ

నుట, మరియు దానిని రెండు చోట్లను పాదప్రకరణమని వ్రాయుట శోచనీయముగాక మరేమి ? 537వ పుటలో "ధేనువకొండ వెంకయ్య. జంగంకథ" అన్నది తప్పు. విరాట పర్వము జంగంకథ అనుటయొప్పు. 645వ పుటలో "జంగం సుబ్బయ్య. దేసింగురాజుకథ" తప్పు. నిడిగంటి వీరయ్య యొప్పు. చింతలపూడి యెల్లనార్యుడు రామాయణము వ్రాయ లేదు. ఆయన రాధామాధవము వ్రాసినాడు. సూక్తి రాధా మాధవము నుండి గ్రహించి (పుట 740) "రామా" అని సంకే తించుట "కావ్యములు—కవులు" పట్టికలో పేర్కొనుట రెండును తప్పులే. ఎడపాటి ఎఱ్ఱన వ్రాసిన గ్రంథము మల్హణ చరిత్రగాని "శృంగార మల్హన" కాదు. కావ్యములు—కవుల—పట్టికలో ఇచ్చుట 813వ పుటలో సూక్తి క్రింద సూచించుట రెండును తప్పులే. 885 పుటలో గయో పాఖ్యానము జంగంకథ వ్రాసినది "ధేను. వేంకయ్య" అని యున్నది. అది తప్పు. దానిని వ్రాసినది ధేనుకొండ తిమ్మయ్య.

మరియు కొన్ని విచిత్రములున్నవి. ఏగంటివారి వచన ములనుండి రెండుమూడు చోట్ల సూక్తులు గ్రహింప బడి నవి. ఒకచోట "ఏగంటివారి వచనాలు. బి. రామరాజు. సం" (పుట 507) మరొకచోట ఊరక "ఏగంటివారి వచనము" (పుట 545) ఇంకొకచోట "గా. లక్ష్మయ్య. ఏగంటి బి. రా. రాజు. తె. జా. సా" (పుట 777.) మొదట డాక్టరు బి. రామరాజు గారు ఆ వచనాలకు సంపాదకులని చెప్పబడినది. చివరకు రామరాజు గారి తెనుగు జానపద గేయ సాహిత్యము అన్న గ్రంథము నుండి సంగ్రహింపబడినట్లు చెప్పబడినది. మధ్యలో ఏమియు చెప్పబడక గాలిలో దొరికినట్లు వదలివేయబడినవి. నిజము నకు శ్రీరామరాజుగారి పేరెత్తిన రెండుచోట్లగల సూక్తులు ఆయన తె. జా. గే. సాహిత్యము 394, 395 పుటల నుండి సంగ్రహింప బడినవే. అంతమాత్రముచేత నొకచోట శ్రీరామ రాజుగారు సంపాదకు లెట్లయిరో దురూహ్యము. అది యట్లుండె. మరొక విచిత్రము.

రాకన్మానవు హాని వృద్ధులు మహారణ్యంబు సండాగినన్
పోకన్మానదు దేహమే విధమునన్ పోషించి రక్షించినన్
కాకన్మానవు పూర్వ జన్మ కృతముల్ కాగల్గ వర్ధంబులున్
లేకన్మానవ దెంత జాలిపడినన్ లేముల్ సిరుల్ భూస్థలిన్.—

ఇదొక పద్యము. ఇందలి మొదటి పాద మొకసూక్తిగా నీ సూక్తి సుధాకరము 794వ పుటలో నున్నది. ఆ పాదమున కాకరము "రామదాసు చరిత్ర" అని ఈయబడినది. 181వ పుటలో నాల్గవ పాదము గ్రహింపబడి అకరము "రామదాసు చరిత్ర. పుట 78" అని చూపబడినది. 68వ పుటలో రెండవ పాద ముదాహరింపబడినదై "ప్రాచీన చాటువు 11— 135 అని ఆకరము చూపబడినది. దీనినేమన వలయును. పొర పాటనవలయునా ? అజాగ్రత్త అనవలయునా ? నిర్లక్ష్య మనవలయునా ? ఒక పద్యములోని రెండు పాదముల నొక్క పుస్తకములోను, మరొక పాదము నింకొకచోటను చూచుట సంభవమా ? ఇట్లొక్కొక్క చోట ఒక్కొక విధముగా ఆకరమీయబడిన వింకను గలవు. భట్టుమూర్తి వసుచరిత్ర లోనివని కొన్ని సూక్తులు— పుటలు. 117, 161, 354 మొదలుగాగల చోట్ల, రామరాజు భూషణుని వసుచరిత్రలోనివని ఒకచోట, పుట. 218. రామరాజ వసుచరిత్రలోనివని 599, 717, 741 మొదలైనపుటలలో సూక్తులున్నవి. ఈ చివరిదానిని "రామరాజ. వసు." అన్నదానికైన అచ్చు పొరపాటుగా ననుకొన వచ్చును. అయిదారుచోట్ల అచ్చుతప్పులు పడి ఒక్కచోట అదేతప్పు ఒప్పు పడుట ఆశ్చర్యము. 863వ పుటలో "రామ రాజ. వసు" అనియే యున్నది. మరియు "నరస భూపాలీయము" లోని సూక్తి 150 పుటలోను, "కావ్యాలంకార సంగ్రహము" లోని సూక్తులు 217, 218 పుటలలోను గలవు. ఆ పుస్తక మున కారెండు పేర్లునుగలవుగదా అనుకొన్నచో "కావ్యములు కవులు" పట్టికలో కావ్యాలంకార సంగ్రహకర్త భట్టుమూర్తి యనియు, నరస భూపాలీయకర్త మూర్తి కవి యనియు స్పష్టముగా విడివిడిగా రెండు గ్రంథములు— ఇద్దరు రచయితలుగా నీయబడియున్నది. ఆ పట్టికలో వసుచరిత్రకర్త రామరాజ భూషణుడు— ఇట్టివి వెయ్యి పుటలు గ్రంథము నను అల్లుకొని యుండుట వల్లనే సంపాదకు లేమాత్రమును బాధ్యతను గుర్తించి ప్రవర్తించలేదని చెప్పవలసి వచ్చు చున్నది.

కొన్ని సూక్తులు పాఠభేదములతో ముద్రింపబడి యున్నవి. మరి సంపాదకు లేయే ప్రతులను సంప్రదించిరో తెలియదు. 594వ పుటలో బద్దెన నీతిశాస్త్ర ముక్తావళి నుండి గ్రహింపబడిన పద్యము, మూల గ్రంథమున అడుగున నీయబడిన పాఠభేదములతో కలగాపులగము చేయబడి గ్రహింపబడినది. సూక్తి సుధాకరములోని పద్య మిట్లున్నది.

'వారని యల్కఁజేసి కడవన్ బలవంతుడు విగ్రహించినన్
దూరము పోవుటొండె వినతుండయి వానిన చొచ్చుటొండెగా
కీరన మెత్తికోల్ మతి విహీనత నేనుగుతోడ లావునన్
బోరెడు వెమ్మచంద మది బుద్ధియె . . . ."

నీతిశాస్త్ర ముక్తావళిలోని పద్య మిట్లున్నది. పాఠభే దములు మాత్రమే చూపబడుచున్నవి.

"వారని యల్కఁజేసి బలవంతుడు పైకొని విగ్రహించినన్
. . . .
. . . . తావెసన్
బోరుట, నీతిమార్గ మిది భూనుత రాజ మనోజభూభుజా!"

మరొకటి చిత్రకవి సింగనార్యుని బిల్హణీయము లోనిది. సూక్తి సుధాకరము 852వ పుటలో పద్యమిట్లున్నది.

"సంగీత విద్య కెలమిన్,
సంగడి సాహిత్యవిద్య సరిగా రెండున్'

మంగళవతి కలిగిన యీ
రంగు వచింపంగ దరమె లావణ్యనిధీ!"

అసలు గ్రంథమున చివరి రెండు పాదములును ఇట్లున్నవి.—

"మంగళవతి ! కూడిన నా
సంగతిఁ జెప్పంగఁ దరమె సంగీతనిధీ!"

మొదటిదాని విషయమున ఏమిచేసినను సూక్తి సుధాకరమున నీయబడిన పద్యము అర్థవంతముగా నున్నది. ద్వితీయ పద్యమట్లులేదు. మూలమునందలి పాఠమే సముచితము. సంగీత విద్యా విశారదయైన కూతును సాహిత్య విద్యావేత్తను చేయుటకుగాను తానేర్పాటుచేసిన గురువువద్ద చదువుకొన వలసినదని చెప్పుట కుపక్రమించిన రాజు వాక్యమా పద్యము. అందువలన సూక్తి సుధాకరములోని పాఠముచితముగా లేదు. పైగా ఆ పాఠ మెక్కడ నుండి సంపాదింపబడినదో తెలియదు. అచ్చుతప్పులనుచు త్రోసివేయ తగిన వెన్నియేని గలవు. "హీనాధికారుడగును గర్మంగాడు ముక్తి కర్హుడు" పుట. 175. "గర్మంగాఁడు" తప్పు. 'కర్మికాడు.' అని యుండవలయును. "బలుకుటకు మూలములటంచుఁ బలుకబడియె" పుట. 899 "బలుకుటకు" తప్పు. " 'బడుటకును' అని యుండవలయును. అచ్చుతప్పులనగా నిట్టివి. ఉదాహరింపబడుచున్న ఇరువది పంక్తులలో మధ్యలో రెండులేక పోవుట కూడ అచ్చుతప్పైనచో అట్టి దొకటి 448 పుటలో నున్నది. "నాస్తికత" శీర్షిక క్రింద ఈయబడిన సూక్తిలో నాలుగైదు పాదముల మధ్య రెండు పాదము లెగిరిపోయినవి. అవి ఎగిరి పోయినందున అయిదవ పాదమున కనర్థ మేర్పడు చున్నది. అనర్థమును 'అచ్చు' గమనింపదు. సంపాదకులైనను గుర్తింపవలయును.

అముద్రిత గ్రంథములను, పూర్తిగా లభింపని గ్రంథములను లభించి అచ్చైన గ్రంథములవలెనే ఈ సూక్తి సుధాకరమున పేర్కొనబడినవి. ముమ్మడి మల్లన శ్రీ రామస్తవ రాజము. పుట. 50. (ఇది ముద్రింపబడిన జాడలేదు. ప్రస్తుతము లభ్యమువుటలేదు) గ్రహింపబడిన సూక్తి ఆంధ్రకవి తరంగిణి పదియవ సంపుటము 194వ పుటలో నున్నది. ఇట్లే 162వ పుటలోని భానుకవి. పంచతంత్రిలోని సూక్తి కవి తరంగిణి ఎనిమిదవ సంపుటము 252వ పుటనుండి గ్రహింపబడినది. 322 వ పుటలోని పెద్దయకవి మాఘ మహాత్మ్యములోని సూక్తి కవితరంగిణి తొమ్మిదవ సంపుటము 71 వ పుటలోనిది. 520 పుటలోని లింగముకుంట రామకవి ఆనంద కానన మహాత్మ్యములోని సూక్తి కూడ తొమ్మిదవ సంపుటములో 173 వ పుటలో నున్నది. లభింపని గ్రంథములలో చిమ్మపూడి అమరేశ్వరుని విక్రమ సేనము, భోజరాజ నీతిభూషణము, కందనామాత్యుని నీతి తారావళి, రావిపాటి త్రిపురాంతకుని మదనవిజయము, పేరంరాజు జక్కన పెమ్మయ సింగ మణి శతకము (పుటలు 443, 446, 593, 652, 822) ఇత్యాదులున్నవి. ఇందువలన రెండు ఇబ్బందులున్నవి. ముద్రితములేవో, లభించినవేమో అన్న భ్రమను కల్గించుట మొదటిది. ఈ భ్రమ తొలగించుకొని చూచినచో ఏ ప్రతినుండి, ఏ ఉద్ధరింపబడిన గ్రంథమునుండి ఈ సూక్తులు గ్రహింపబడినవో తెలియక పోవుట రెండవది. అందువలన ఆయా సూక్తులయోగాము తెరుకబడుటలేదు. మరొక్క సంగతి. "పెమ్మయ సింగ మణి" అను మకుటములో లభించిన పద్యములు పది పన్నెండు కంటె ఎక్కువ లేనట్లు తెలియుచున్నది. ఆ పద్యము లింకను కలవేమో అనియు, బహుశః అది శతకమేమో అని శ్రీ ప్రభాకర శాస్త్రిగా రనుమానించిరి. ఆ పద్యములనుదాహరించిన ప్రయోగ రత్నాకరకర్త ఆ పద్యములు 'జక్కన'విగా చెప్పినాడట. విక్రమార్క చరిత్ర వ్రాసిన జక్కనయే ఆ పద్యములకును కర్త యైనచో జక్కన ఇంటిపేరు తెలియదనవలయును. చాగంటి శేషయ్యగారికి తెలియదు. సూక్తి సుధాకరమున జక్కన ఇంటిపేరు "పేరంరాజు" వారని చెప్పబడి యున్నది. దీనికి ప్రమాణమేమో తెలియదు.

ఊరక పూర్వకవి చాటువులని కొన్ని పద్యములు 189, 190 పుటలలోనుదాహరింపబడి యున్నవి. వాని ఆకరములు తెలియవు.

గ్రంథ మిట్లున్నది కదా ! గ్రంథాతమున నున్న "కావ్యములు— కవులు" పట్టికను చూడబోయినచో అది దీని పితామహుడుగా నున్నది. అందు రచయితలు పేర్కొనబడని గ్రంథములు కొన్ని— తెనుగు జానపద సాహిత్యము, విశ్వకర్మ పురాణము ఇత్యాదులు,— అసలా రచయితలు వ్రాయని గ్రంథములు కొన్ని— మార్కండేయ పురాణము, హరిభట్టు, శివలీలా మహాత్మ్యము, నిశ్శంక కొమ్మన, సుభద్రా కల్యాణము, తాళ్ళపాక తిమ్మకవి, సకలనీతి కథాసారము, ఎఱ్ఱన, ఇత్యాదులు,— మరియు విచిత్రములు కావ్యము "దశమ గ్రహము"—కవిపేరు "చాటువు"—కావ్యము "పరకీయ"—కవి "క్షేత్రము,"—కావ్యము "భక్తి రసామృతము"—కవి "పూర్వకవి" — కావ్యము "సీత చెఱ" — కవిపేరు "స్త్రీల రామాయణము"— ఇత్యాదులు. సూక్తులనసలు గ్రహింపకయే పట్టికలో చేర్చబడిన గ్రంథములు కొన్ని.— నీలా సుందరీ పరిణయము, కూచిమంచితిమ్మకవి, పంక్తి రథోపాఖ్యానము, క్రాలేటి లక్ష్మీ నరసింహకవి, ప్రతాపాగ్నరీయము, కోలాచలం, ఇత్యాదులు. ఇక గ్రంథములో సూక్తులుదాహరింపబడి ఈ పట్టికలోని కెక్కని గ్రంథములకు రచయితలకు లెక్కయేలేదు. క్రీడాభిరామము (సూక్తి. పుట 867) దేవవ్రత చరిత్ర. (పుట 947), మునలమ్మ మరణము (పుట. 630) బిల్వేశ్వరీయము (పుట. 185) రామరాజీయము. (పుట. 650) శశాంక విజయము. (పుట. 355) విద్వత్కర్ణామృతము (పుట. 226)— ఇక దీని కంతుండదు. పింగళి సూరన్న కళా పూర్ణోదయము గూడ లేదు.

కీర్తి శేషులైన కవుల గ్రంథములనుండియే ఇందలి సూక్తులు గ్రహింపబడినట్లు చెప్పబడినదిగదా ! నిజముగా

నీందలి సూక్తుల కర్తలందరును కీర్తిశేషులన్న నమ్మకమే మున్నది ? నన్నయ తిక్కనాది మహాకవులేదో కీర్తిని సంపాదించినారు గనుక ఇంకను శేషించి యున్నది గనుక, వారు కీర్తిశేషులని వారిని చూడగనే తెలియును. కాని మిగిలిన చాలమంది అట్లు లేరే. చెంగల్వరామకవి, తనికెళ్ల ప్రకాశశాస్త్రి, తనికెళ్ల లక్ష్మీనారాయణశాస్త్రి, కుమారి సుందరి— ఇట్టివారెప్పటి వారో చెప్పనిచో తెలియదు. సంపాదకులు తాము గ్రహించిన సూక్తుల కర్తల కాలము నిచ్చియుండవలసినది. అవుడీ అనుమానమున కాస్కారముండి యుండదు. నారునాగనార్యకవి యొక్క ఆర్యవాణి నుండి (పుట. 40) సూక్తి గ్రహింపబడినది. ఈ సంపాదకుల మాటను నిజము పట్టుకొన్నచో ప్రస్తుత మా కవిలేనివాడు కావలయును. కాని పరమేశ్వరానుగ్రహమువలన ఆయన చల్లగా బ్రతికి బట్టకట్టుచున్నట్లు తెలియుచున్నది. ఆయన రాయలసీమలో కవి. సంపాదకులీ విషయమున నేమి చెప్పగలరో మరి ? గ్రంథ సంపాదకత్వము నిత్య సంధ్యావందనము వంటిది. సరిగా చేసినచో నేమియును లేదుగాని చేయనిచో మాత్రము మహాపరాధము.

సూక్తులను సేకరింపించుటలో సంపాదకులొక క్రమమును పాటింపలేదు. వ్రేలెడు సూక్తికి బారెడు పద్యముదాహరింపబడుట చాల చోట్ల గలదు. "అజ్ఞానము" "అవివేకము" అను శీర్షికల క్రిందగల రెండవ, అయిదవ ఉదాహరణలు చూడవచ్చును. అందు కొంతవదలిన నాల్గవ పాదము, పూర్తి నాల్గవ పాదము మాత్రమే సూక్తులు. పై పాదములన్నియు అనవసరము. సూక్తులవలె కనిపించనివి సూక్తులవలె గ్రహింపబడినవి. 776వ పుటలో "అన్యోన్య విరుద్ధ భాషణము లాడిన తత్ఫల మాతడందెడున్" అన్నది తిక్కనగా రొకందుకు వ్రాసిరి. వీరొకందుకు గ్రహించిరి. "రసము" అన్న శీర్షిక క్రింద గలవి వాక్యములో సూక్తులో నిర్ణయించుటకు మనతరముకాదు. నన్నయ్యగారు "ఉత్తమ జ్ఞాన వృద్ధునా నుండెనేని బాలుడయ్యును పూజ్యుండు బ్రాహ్మణుండు" అని యొకచో వ్రాసిరి. సూక్తి సుధాకర గ్రంథమునకు "బ్రాహ్మణుండ"క్కరలేదని తెలియక వ్రాసిరి. అందుకని '.... బాలుడయ్యును పూజ్యుడు" వరకే సూక్తి సుధాకరము "జ్ఞాని" శీర్షికతో గ్రహించినది. "పూజ్యుల'లో మరల బ్రాహ్మణుండు కలడు : (పుట. 534)

ఇట్లు స్థూలముగా సమీక్షించినచే ఈ బృహత్ గ్రంథమేయొక్క విషయమునను పూర్తిగా నమ్మదగిన స్థితిలో లేదని స్పష్టపడుచున్నది. ఇక ప్రత్యంశ పరీక్ష మొదలు పెట్టినచో మరల మొత్తము గ్రంథమును 'ఎడిట్' చేయుటయగును.— ఇట్టి సంకలన గ్రంథములయందు సక్రమముగా నుండుట యన్నదే గుణము. సక్రమముగా లేనిచో దోషములు బహుముఖములుగా నుండుట కవకాశము కలదు. తదవకాశమును పురస్కరించుకొని ఈసూక్తి సుధాకరము తయారైనది. కనీసము సూక్తులను శీర్షికల క్రింద ఒక వరుసలో— కవుల కాలము ననుసరించిగాని, అకారాదిగాని— సమకూర్చుటకైనను సంపాదకులు యత్నము చేయలేదన్నచో, ఆయా సూక్తులు పద్యములో— వచనములో గూడ తెలియరానంత పరిస్థితి ముద్రణలో కల్పించినారన్నచో, ఏమి సక్రమముగా చేసినారని చెప్పవలయునో అంతుబట్టుటలేదు. ఏదో ఇంత గ్రంథము— కొన్ని శీర్షికలతో, కొన్ని సూక్తులతో వచ్చినది. అంతవరకే సంతోషింపవలయును. తృప్తి పడవలయును.

త్వరితము సేయక కార్యము
చిరంతన విమర్శనముగఁ జేసి యొనర్పన్
ధరణీశ్వర ! యొటు పడడు
పురుషుడు సిద్ధియును వాని బొందు దృఢముగన్.

అనుసూక్తియు "కర్మ విపాకంబు గడవంగలావె" అనునదియు రెండును ఈ గ్రంథముననే (పుటలు. 930, 165) గలవు.—

ఉ. చిత్తరులుత్త వత్తకవి చెత్తలు సత్తరు లుత్తమోత్తముల్
ముత్తియు బత్తిబుత్తియును మొత్తము రిత్తము క్రొత్తక్రొత్తలౌ
పొత్తము లెత్తనుత్తరము పొత్తగు నెత్తరివత్తు గుత్తమా
చిత్తరపుత్తి సత్తియగు చెత్తలు కత్తళమత్తు చిత్తమా !

శ్రీపతి భాస్కరశాస్త్రి.

తెలుగులో ఉత్తమ నాటకాలు

★

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి

పై శీర్షిక క్రింద జూలై నెల భారతిలో వ్రాయుచు శ్రీరంగశ్రీ యనువారు మా తాతగారి ప్రతాపరుద్రీయమును గూర్చి వ్రాసిన విషయములకు సమాధానము ఆవశ్యకమని తోచి ఈ క్రింది యట్లు వ్రాయుచున్నాను :

"1897లోనే నెల్లూరులో వేదం వేంకటరాయ శాస్త్రిగారి ప్రతాపరుద్రీయము వెలువడినది. వారప్పటికే 'నాగానందము', 'ఉత్తర రామచరిత్ర', 'మాళవిక' నాటకములు అనువాదము చేసినారు. అంతటితో తృప్తి పొందక చరిత్రలోని ఒక ఇతివృత్తమును గైకొని 'ప్రతాప రుద్రీయము' రచించినారు. దీనిపైన 'ప్రతిజ్ఞా యౌగంధ రాయణము' ప్రభావము కన్పించుచునే యున్నది." (పుట. 11)

"ఇంక ప్రతాపరుద్రీయము చరిత్రరీత్యా— ఇది వాస్తవము కాదందురు. పైగా గోదావరి తీరము నుండి ఢిల్లీకి పడవలు వెళ్లుట అసంభవము. అందుకే త్రిపురనేని రామస్వామి చౌదరిగారు 'ఔర వేంకటరాయశాస్త్రి' అని ఆక్షేపణ చేసినారు. పైగా ఈ నాటకములో ప్రధానవస్తువు ప్రతిజ్ఞా యౌగంధరాయణము లోనిది. ఆమాట రచయిత ఎచ్చటను తెలిపినట్లు లేదు. పైగా పేరిగాడి దర్బారు మున్నగునవి చాల తక్కువ రకపు అభిరుచుల తెలుపుచున్నవి." (పుట. 15)

(1) 1897 ప్రతాపరుద్రీయము ప్రకటింపఁ బడినది సరియేగాని నెల్లూరిలోకాదు. మదరాసులో.

(2) వారప్పటికే నాగానందమును అనువదించినది వాస్తవమే (1891లో) కాని నాటికి ఉత్తర రామచరిత్రను గాని మాళవికనుగాని అనువదించి యుండలేదు. ఈ రెంటిని 1920లో అనువదించి ప్రకటించిరి. నాటికి అనువదించి ప్రకటించి యుండిన రెండవ నాటకము అభిజ్ఞాన శాకుంతలము. 1896లో ఈ రెండు నాటకములలోను ప్రయత్నపూర్వకముగా పాత్రోచితముగా భాషను ప్రయోగించినారు.

(3) ప్రతిజ్ఞా యౌగంధ రాయణము నందలి పిచ్చివాని ఇతివృత్తము యుగంధరుని దానినిపోలి యుండుట వాస్తవమే కాని 'ప్రభావ' మనగా నెట్టిది ? ప్రతాపరుద్రీయ ప్రకటన కాలము 1897అని వీరే ఒప్పుకొని యున్నారు. నాటికి సంస్కృత వాఙ్మయములో భాసుని పేరు వినుటయే గాని ఎవరును ఆతని నాటకములను చూచినవారు లేరు. ప్రాచీనులుండిరేమో. క్రీ. శ. 1913లో శ్రీ మహామహోపాధ్యాయ టి. గణపతిశాస్త్రిగారు త్రివేంద్రములో భాసనాటకములను కనిపెట్టి మొదటిసారి ప్రకటించిరి. నాటి నుండి యే భాస నాటకములు మనకు లభ్యపడినవి. అవి వెలువడిన పిమ్మట తాతగారు తెప్పించి చదివి అంతకు పదునాల్గేండ్లకు ముందే చాలవరకు తత్తుల్యముగా తాము నాటకము వ్రాసినందులకు ఎంతో ఆశ్చర్యపడిరి. ఐనను ప్రతాపరుద్రీయమందలి కల్పన 'ప్రతిజ్ఞ'లోకానరాదు గదా. ఈ విషయము తమకు తెలిసి యుండిన 'శ్రీరంగశ్రీ'గారు పై విధముగా వ్రాసియుండరు.

తాతగారికి కథావస్తువు దొరికిన విధమును వారే ఇట్లు ప్రతాపరుద్రీయ ప్రథమ ముద్రణావతారికలో వ్రాసి యున్నారు. నాటికి చరిత్ర తెలియదు. వీరభద్రరావుగారి ఆంధ్రుల చరిత్ర వెలువడలేదు. "ఓరుగంటి ప్రతాపరుద్ర మహారాజును తురకలు ఢిల్లీకి ఖయిదు కొనిపోయిన కథ లిఖితముగాని ముద్రితముగాని నా కెచటను దొరకలేదు. నే నెనిమిదేండ్ల వయసున నుండగా మా నాయనగారు వేదము వేంకటరమణ శాస్త్రులవారు తమ మిత్ర బృందములో నీ కథను ప్రస్తుతించునపుడు నేనును వింటిని. వారు చెప్పుటలో నీ కథ అరగంటకూడ పట్టలేదు. ఇటీవల నేను ఆంధ్ర జనవినోదినీ ముద్రణాధి కృతుఁడనై యుండఁగా 1883 సంమున ఈ కథను నాకుఁ దోచినట్లు విరివిచేసి యల్లి కథారూపమునఁ బ్రచురించి యుంటిని. పిమ్మట 1896 సం. జూలై నెలలో దానిని నాటకోచితముగా రూపుచేసి, ఈ నాటకమందలి గద్యభాగమును మాత్రము వ్రాసి నా మిత్రులకుఁ జూపితిని...."

కాఁబట్టి రచనకు ప్రతిజ్ఞా యౌగంధ రాయణము ఆధారముకాదు, దాని ప్రభావమునులేదు. రచనకు అధారమేమనగా పరంపరగా వచ్చుచుండిన జనశ్రుతి. ప్రతాపరుద్ర చక్రవర్తిని మహమ్మదీయులు పట్టుకొనిపోఁగా

ఆయన మంత్రి యుగంధరుడు పిచ్చివానివలె నభినయించి ఉపాయముగా తన రాజును విడిపించుకొని వచ్చెననునది మాత్రమే పెద్దలు చెప్పుకొనుచుండిరి. ప్రతాప రుద్రీయ నాటక ప్రకటనానంతరము శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు మొదలైనవారు చరిత్ర పరిశోధించి ఇది వట్టి జనశ్రుతి మాత్రమేగాని చరిత్రకాదని తేల్చినారు. ప్రతాపరుద్ర చక్రవర్తి నాటిరచనలైన కేయూర బాహు చరిత్ర, మార్కండేయ పురాణము మొదలలైన వానిలో యుగంధరుడు ప్రాచీనుడుగా చెప్పఁబడి యున్నాడు. మా తాతగారు వట్టి ఆభాణకమును (Iradiiion) మాత్రము గ్రహించి కల్పించి, పెంచి వ్రాసినారు. ప్రథమ ముద్రణ ములో సేనాపతిపేరు కమాలావు అనియున్నది. ద్వితీయ ముద్రణము నాటికి చరిత్ర తెలిసి భేతాళరావని మార్చినారు. విద్యానాథుఁడు చారిత్రక పురుషుఁడును సమకాలికుఁడును, కాని నాటకమందలి అతని చర్య యంతయు కవికల్పన. ఇంతేకాదు నాటకములో మిగిలిన దంతయు— రాజును శత్రువులో యుద్ధములో ఖైదు చేయఁజాలమని తలఁచి, వేఁటలో, నిద్రలో ఖైదు చేయుట, మంత్రి రామేశ్వర మందుండుట, విద్యా నాథుఁడు రాజును ఓడలో దర్శించి అంగుళీయమును గ్రహించుట, మంత్రి రామేశ్వరము నుండి వచ్చునరికి తాను పోయి రహస్యమును ఎఱిగించుట, పేరి గానిని రోగి ప్రతాపరుద్ర మహారాజా వేషముతో ప్రజలకు చూపుట, చెకుముకి శాస్త్రియొక్క నీతి ప్రయోగము, యుగంధరుఁడు ఢిల్లీకిపోయి, పెద్ద పెట్టెని, చెకుముకి శాస్త్రిని, బేతాళరాయని తనకు సాయముంచుకొని, వర్తకుల మూలమున రాజును విడిపించి ఓడలలోనికి రప్పించి, ఉపాయ ముగా ఓడలను హంగ్లీ చేర్పించి అటనుండి స్వదేశమునకు తెచ్చుట— ఇదంతయు తాతగారు నాటకమునకు కల్పించు కొన్న సంవిధానము. దీనికి మూలముగాని ఆధారముగాని లేదు. ఈ విషయమంతయు ఇటీవలి ప్రతాపరుద్రీయ ముద్రణలకు ఉపోద్ఘాతముగా నేను వ్రాసి ప్రకటించియే యున్నాను.

(4) త్రిపురనేని వారి రచనను గూర్చి— వీరు ప్రతాప రుద్రీయమును చక్కగా పరిశీలించినారో లేదో నాకు తెలి యదు గాని వారి యాక్షేపణకు అవకాశము నాకు కనఁబడలేదు. 'గోదావరీ తీరమునుండి ఢిల్లీకి పడవలు పోయినవని ఎచ్చ టను నాటకములో లేదు. తాతగారు జాగ్రత్తగానే వ్రాసి యున్నారు. ప్రతాపరుద్రుడు 'గోదావరీ దక్షిణ తీరమున అడవి ముఖమున నొక చెట్టు క్రిందనిద్రించు చుండెను' నాటక కథా సంగ్రహము పుట 2) ద్వితీయాంకమున (పుట 22) ఖుస్రూఖాను వాక్యము. 'మన్ముదండంతా నడ్పుకొని, రాజా యెక్క ఉన్నాడు అక్కడెల్లి రాజాకి వేట సిబ్బంది కొంచెం ఉంటుంది గన్క షుళభంగా రాజాకి పట్కుకొని....' తృతీ యాంకమున మొదట గోదావరి దక్షిణ తీరమున అడవి ముఖము' అని యున్నది. ఎచ్చటనో చెప్పలేదు. ఓరుగంటి సమీపమని లేదు. విద్యానాథుని స్వగతములో కూడ రాజు పట్టుబడిన చోటు ఓరుగంటికి చాల దూరమనియే యున్నది. "అనభ్యస్త రాజకార్యుండను ఎట్లుఎట్లు కార్య ధోరణిం బారింతును (ఇంచుక ఆలోచించి) ఇట్లగుంగాక— ఈ కొణిరి వాడ కరిగి కరణ ప్రభృతి రాజకీయులు సిడ్రిప్పి రేపు మధ్యా హ్నము మంత్రి సన్నిధి నుండెద. .... రాజ ముద్రికలు వేసి యుంచుకొని గ్రామాధికారులకు చూపెదను. సన్నాహ శాసనము నకు ఇరువది ప్రతులు వ్రాయించెద. అందులోనే ప్రతి గ్రామాధికరణకుఁడును తన శాసనమును తాను పుచ్చుకొని కడకు వానిని పై గ్రామాధికరణకునికి తత్క్షణమే పరుగు టపామీఁద పంపునట్లు వ్రాయించెద. అన్నిటికిని ఇతరులను కను మొఱఁగి రాజ ముద్రికయే వేసెద. ఈ ప్రయోగముచే గ్రామగ్రామంబున సవారి, పదునార్గురు బోయలు, వెంటరా బంట్రౌతులు, జోడు దివ్వటిగాండ్రు వీరినెల్లనేను చేరక ముందే పుట్టించి యుంచెద. ఆహా ! రాజముద్రికా ప్రభా వము"

దీనినిబట్టి ప్రతాపరుద్రుఁడు వేటాడిన ప్రదేశము ఓరుగంటికి చాలదూరమని తెలియుచున్నది. విద్యానాథుఁడు రాజముద్రికయే లేనిచో అంత త్వరితముగా ఆ మఱునాటి మధ్యాహ్నము మంత్రి సన్నిధి నెట్లుండగలడు ? ఇరువది గ్రామంబు లన్నందునను గ్రామ గ్రామమున సవారి యన్నం దున నా ప్రదేశము ఎంత లేదన్నను ముప్పది నలువది మైళ్ల దూర ముండవలయును గదా. మనము మామూలుగా నడచిన కొందరు గంటకు మూడు మైళ్ళు, బలాఢ్యులు నాలుగు మైళ్ళు, పోగలము. విద్యానాథుడు, అంతటి ఈతగాఁడు రాత్రియంతయు నడచిపోయి చేరియుండలేడా ? లేడేమో. చాల దూరమేమో. గోదావరిమీఁద పడవలు పోవునట్టి ప్రదేశమేమో. బహుశః ఓరుగంటినుండి ఒక వందమైళ్ల యున నుండునా ? ఇరువది గ్రామములు, గ్రామము గ్రామ మునకు ఐదుమైళ్ల దూరము సరాసరిగా వేసికొన్నను వంద మైళ్లగుచున్నది.

పైగా గోదావరిని దాటుటకే పడవలుగాని ఈ పడ వలు ఢిల్లీవఱకని ఎచటనులేదు. పంచమాంకమున చెకుముకి శాస్త్రి వాక్యములు చూడుఁడు. 'వలీఖాను గోదావరిదాఁటి ఎనిమిదామడ నడచినాఁడు. ఢిల్లీకి మేఘాల మీఁద ఎగిరిపోవు చున్నాఁడు.' మామూలుగా గోలకొండనుండి ఢిల్లీ నలువదిరోజుల

నడక ప్రయాణము. పూర్వము సైన్యములట్లు పోవుచుండినట్లు చరిత్రలో తెలియు చున్నది. ఓరుగల్లు నుండి ఇంకనొక రెండు దినములు వేసికొనినను ఎంత లేదన్నను ఓరుగంటి నుండి మఱియొక మార్గమున నలువది లేక నలువదియైదు దినములు కావచ్చును. కాబట్టి పరీఖాను ప్రతాపరుద్ర మహారాజును ఓరుగంటికి దూరముగా నుండిన గోదావరి తీరపు అడవిలో పట్టుకొన్నాడు. అచట గోదావరి పడవలచే దాటు వలసిన వెడల్పు. అచటనే బోటులో విద్యానాథుడు రాజును దర్శించి దాదాపు ఇరువది గ్రామముల మీదుగా బయలుదేరి సవారిలో వచ్చి యుగంధరుని దర్శించెనని కవి హృదయము. ఇంతాశ్చర్య పడుటకేమియు కానరాదు. మఱి 'శార వేంకటశాస్త్రి' ఏమో, వింతగానే యున్నది. చౌదరి గారు ప్రతాపరుద్రీయ నాటకమును చదువకయే వ్రాసి యుందురని తలంపవలసి యున్నది.

పడవలను గుఱించి నాటకములో సందేహమునకు అవకాశము లేకుండునట్లు వ్రాయుబడియే యున్నది. పెద్ద సెట్టి తన దారినిట్లు సుల్తానుతో చెప్పును.

"గోవాపురియు, సముద్రము,
రావణ లంకయును, సాగరంబును, పొగ్లీ,
దేవనది, యమున వైభవ
శేవధి ఢిల్లీ పురిపు ప్రశిసన్నిధియువో"

ఎంత సరిగా నున్నది! రాజును మంత్రి చెఱ విడిపించి నప్పుడును కొలిచినట్లున్నది. ఢిల్లీ వదలిన తర్వాత—

"పెద్దసెట్టి— ఏలినవారు ఒక కొన్నియేని నిజమంగళా లంకారములు ధరింపరాదా ?

రాజా— విశ్వనాథ క్షేత్రమున ప్రాయశ్చిత్తమై, విశ్వ నాథ పూజయై (యుగంధరుని పాదములు చూపుచు) ఈ పాద ములను నా స్వహస్తములఁ బూజించి, పిదప.

సెట్టి— తురకలు తిండికి లేవఁగానే లంగరు లెత్తి నారము. నిద్ర వేఁగినంతనే చాపలెత్తినారము. ఉభయ వేగ ములఁ బోవుచున్నవి. 'రేపే విశ్వనాథ సేవ."

కాశీ నుండి తెలుఁగు సైన్యము రక్షణతో ప్రతాప రుద్రుడు మరలి వచ్చిన దిశ ఈ భాషితములలో తెలియును. నవమాంకము—

వెట్టివాడు డప్పు వాయించుచు— (ఉచ్చైస్స్వర ముతో) సామే ఈయాల పెద్ద మంతిరిగారు ఉగందర దేముడు గారు సాకలాయన పేరాయన్ని ఢిల్లీ నుంచి తీసుకొచ్చి పట్నం వొచ్చి శేరినారు (డండండండం) పేరాయన్ని యెత్తుకెళ్లిన తురకోడి బుఱ్ఱ కొట్టించి తెచ్చినారు (డండండండం)...... మంతిరి గారికి మా రాజా కాశీదాకా యెదురెల్లి (డం) ఉచ్చ వంతో (డం) పట్నంలోకి తీసకొచ్చినారు. మా రాజుగారిని పట్నంలోకి తేవడానికి బేతాళ నాయనింగోరు దండుతో యెదు రెల్లినారు...."

అనఁగా కాశీ నుండి సైన్యములతో ఓరుగంటికి నడకయే. ఢిల్లీనుండి తెలుఁగు సైన్యములు రాజునంటి వచ్చు చుండినవని అష్టమాంకములోని రాజా వాక్యములు తెలుపు చున్నవి. రాజా—.... ఈయోడల నున్న పదివేలుగాక నదిపాడుగు నను నా బలము ఏఁబది వేలున్నదిగదా. మనమేల ఢిల్లీని పట్ట గూడదు. "యుగం— చచ్చినపాము. పట్టి నిలుపుకొనుటకీ సన్నాహము చాలదు."

వేటను గురించి యొకమాట. రాజా వేటకు పోయిన వాఁడు ఇంటి పెరటిలో వేఁటాడలేదు. మామూలుగా వేఁట యనునది నగరమునకు చాల దూరపు టడవిలో జరుగును. దుష్యంతాదుల వేఁటలు మన మెఱుఁగమా. పైగా ఒకటి రెండు దినములు జరుగునదియుగాదు. విద్యానాథుఁడే రాజ దర్శనమునకు 'నెల దినములు వేచి యుంటిని. రాలేదు.' అని బోటులో చెప్పినాఁడు. అందులకే యుగంధరుఁడు వేఁటకు పోవలదని బుద్ధిచెప్పి రామేశ్వర యాత్రకు వెడలినాఁడు. 'ఆహా ! ఈ పాటున కెల్ల నా దోషమేమూలము. ఆ మహా మహుఁడు యుగంధర దేవుని పలుకుఁ బాటింపక వేఁట కరిగిన ఫలమిది.' వేఁటలో నొంటి జిక్కి నందుననే శత్రువు చేతపడి నాఁడు. ఒంటి చిక్కుటకు దూరముపోయి యుండఁడా ?

వస్తు విట్లుండఁగా విమర్శకులు 'శార వేంకటరాయ శాస్త్రి' యని యాశ్చర్య పడినది ఎంత తొందరపాటు ! 'శార రామస్వామి చౌదరి !'

(5) శ్రీరంగశ్రీగారు పేరిగానిదర్పారు తక్కువ రకపు అభిరుచులను చూపుచున్నదని వ్రాసినారు. ఇది వారివారి రసా స్వాదనమునుబట్టిఁ అనఁగా చదువరుల అభిరుచినబట్టి వచ్చు విమర్శయే. పేరిగాఁడు చాకలివాఁడు ఒకపాటి రాజాస్థానమును ఎఱిఁగినవాఁడే యైనను వానికి విద్యానాథ జనార్దనులు నేర్పిన దంతయు వాని యనుభవమునకు ఎన్నడును రానిది. పైగా ఈ యంకమును వ్రాయుటలో కవి యుద్దేశము సమకాలిక వాఙ్మయాభిరుచులమీఁద దెబ్బతీయుట. చాల తక్కువ రకపు అభిరుచుల మీఁది దెబ్బ కాఁబట్టి దానికి తగినట్లే యున్నది. చక్కని సంగీతమును మెచ్చుకొనక, చక్కని నృత్య మును సాగనీయక మంచి కవిని త్రోసి రాజని— 'కవిత్వమంటే పెతిమనిసికీ తెలియాల సాకలోడికి మంగలోడికి తెలియాల'

అని యను చుండిన వారిమీద దెబ్బ ఈయుంకము. ఇది లేనిచో నాటకము చెడదు. ఇది లేకయే ఆడవచ్చును. ఈ క్రింది వాక్యములు చూడుడు.

"పేరి.... కయిూస్పర్గ్లా శెప్పవయ్యా ఈలాంటి కయిత్తం శెప్పేవోళ్లు ఇంకమీదయినా ఉంటా రా ఉండరా?

కవి— ఇట్టి కవులు ఇక పుట్టగలరు.

పేరి— యప్పుడు యక్కడ ? నాకిట్టాంటి కవులే గావాల, యివరంగా శెప్పు.

కవి — ఇంక ఆరు నూ ఱేండ్లకు వేఱు దొరతనములో కొన్ని తావుల మీాబోటి రసజ్ఞులే బహుళ మగుదురు. వారికై మీాబోటి రసికులే కవనములు సేయుదురు...."

ఆఱు నూ ఱేండ్లు— క్రీ. శ. 1323+600—1923 దాదాపు కవికాలము. ప్రతాపరుద్రుని నుండి ఆఱు శతాబ్దములు. ఇంత చుఱుక్కనిపించు విమర్శ తక్కువ రకపు అభిరుచియా !

ప్రతాపరుద్రీయ నాటకము మీద చక్కని విమర్శ బయలు వెడలలేదు. పండితు లెవరైనను ఆ పనికి పూను కొందురుగాక.

శ్రీరంగశ్రీ సమాధానము

★

తెలుగులో ఉత్తమ నాటకాలు సమీక్ష చేయుచు 'ప్రతాపరుద్రీయము' నాటకము గూర్చిన ప్రసక్తి చూచి, తన్నాటక కర్త వేదం వేంకటరాయ శాస్త్రిగారి మనుమలు తన్నామకులు వ్రాసిన ప్రతివిమర్శ 'భారతి' సంపాదకులు దయతో పంపగా పరిశీలించితిని. ఇంత విపుల వివరణమును చేసి తాతగారిని సమర్థించుటకు మనుమలు శ్రమపడినను మా తొలి సమీక్షలోని వాక్యములు మార్చుకో నవసరములేదని తోచి ఈ సమాధానము చెప్పవలసిన వచ్చినది. సహృదయ పాఠకులు మన్నించెదరుగాక !

తాతగారిని వెనుకవేసికొనివచ్చి, మనుమలు తెలిపిన విషయములలో ముఖ్యముగా అయిదు యంశము లున్నవి. వానిలో మొదటిది.

(1) ప్రతాపరుద్రీయము వెలువడిన కాలము, స్థలము గూర్చి. 1897లో వెలువడిన మాట సరియేనని మనుమలు ధ్రువపరచి, అది 'ప్రకటింపబడినది' మద్రాసులోకాని నెల్లూరులో కాదని చెప్పబూనినారు. ముద్రణ మద్రాసులో జరిగినను, రచన ప్రదర్శన మొదలయినవి నెల్లూరిలోనే. మేము సమాలోకనము చేసిన అంశము తెలుగు నాటకముల రంగస్థల ప్రయోగ విధానము గూర్చియే ! అందుచేత ప్రతాపరుద్రీయ నాటకము ఎచ్చట ముద్రణ పొందినను రంగస్థలమున కెక్కినది తొలుత నెల్లూరిలోనే కదా ! అది గుర్తించిన చాలును.

(2) నాగానందము, ఉత్తరరామ చరిత, మాళవిక మొదలగు సంస్కృత నాటకముల అనువాదము గూర్చి మఱొక ప్రతిపత్తి—జూనియర్ వేంకటరాయశాస్త్రిగారు లేవదీసినారు. 1891 లో నాగానందము వెలువడినట్లు ఒప్పుకున్నారు. ఉత్తరరామ చరిత, మాళవిక 1920 లో ప్రకటించిన కారణముచేత అంతకుముందు అనువదించలేదన్న వీరి మాట తాతగారి ప్రతిభ తెలియని మనుమలు కొంచెము అంచనా తక్కువ చేసి చెప్పిన మాట అనవచ్చును. 1920లో ఈ సంస్కృత నాటకానువాదముల ముద్రణ జరిగినదేమో కాని, 1890—1900 మధ్యకాలములోనే అనువాదములు జరిగియున్నవి. ఆ కాలములో నాటకరచన సంస్కృతభాషానువాదములతోనే ప్రారంభమైనది. కొందరు పండితులు ఉత్తరరామ చరిత అనువాదముచేసినారు. అభిజ్ఞానశకుంతలము సైతము అనువదించినారు. వేదంవారు, నాగానందముతోపాటు, మాళవిక, ఉత్తరరామచరిత వంటివి కూడ అనువదించినారు. కాని ప్రకటించకపోయియుండవచ్చును. ఈ సమీక్షకుని ఉద్దేశము అప్పటికే యనువాద నాటకములు సంస్కృతమునుండి వచ్చినవనియు, అట్టి యనువాదకులలో వేదంవా రొక్కరనియు తెలుపుట. అంతేకాక ఈ సంస్కృతానువాద నాటకములలో ఏ యొక్కటి యును ప్రదర్శనార్హత పొందలేదని నిరూపించుట. అంతే. ఈ ప్రతిపాదన అంగీకరించిన చాలును.

(3) ప్రతిజ్ఞా యౌగంధరాయణములోని పిచ్చివాని యితివృత్తము యుగంధరుని దానిని పోలియుండుట వాస్తవమే యని తాతగారి తప్పు మనుమడు స్వీకరించి 'ప్రభావ మనగా నెట్టిది ? యని శంకించి, భాస నాటకములు

తెలుగులో ఉత్తమనాటకాలు

1913 లో త్రివేంద్రమునుండి మహామహోపాధ్యాయ టి. గణపతిశాస్త్రిగారు ప్రకటించువఱకు ఎవ్వరికిని తెలియవే, 1897 లో వెలువడిన ప్రతాపరుద్రీయముపై— ప్రతిజ్ఞా యౌగంధరాయణము ప్రభావము పడుట కెట్టి అవకాశ మున్నది యని అమాయకముగా ప్రశ్నించిరి. తాతగారి పాండిత్యము గూర్చి, వారి మనుమల కంటె హెచ్చు గౌరవముగల మాకు, వేదంవారికి భాస నాటకకథల గూర్చి విశేష జ్ఞానము కలదన్న విశ్వాస మున్నది. గ్రంథరూపమున అచ్చులో వెలువడకున్నను భాస నాటకముల కథలైనను ఆకాల పండిత లోకములో ప్రచారములో నున్నవి. ఆ కాలమే యననేల ? కాళిదాసు కాలములోనే బహు ప్రచారములో నున్నవి. కాళిదాస మహాకవి తన మేఘదూత కావ్యములో ఈ కథ గ్రామములో వృద్ధులకు సైతము తెలియు నన్నట్లు పేర్కొని యున్నాడు. "ఉదయన కథాకోవిద గ్రామ వృద్ధాన్" అంతేకాక ప్రతిజ్ఞా యౌగంధరాయణము కథనే యీ మందాక్రాంతములో సూచించియున్నాడు.

"ప్రద్యోతస్య ప్రియ దుహితరం వత్స రాజోఽత్ర జహ్రే
హైమం తాల ద్రుమవన మభూ దత్ర తస్యైవ రాజ్ఞః
అత్రోద్భ్రాన్తః కిల నళగిరి స్తంభముత్పాట్య దర్పాత్
ఇత్యాగంతూ న్రమయతి జనోయత్రబంధూ నభిజ్ఞః."

అంతేకాక తన కాలములో సుప్రసిద్ధుడుగా భాసుని గూర్చి కాళిదాసు తన మాళవికాగ్ని మిత్రములో పేర్కొనినాడు.

కావున కాళిదాసు కాలములోనే గ్రామవృద్ధులకు సైతము తెలిసిన 'ప్రతిజ్ఞా యౌగంధరాయణము' కథ పండితశ్రేష్ఠులైన వేదము వేంకటరాయశాస్త్రిగారికి తెలియదని పలుకుటకు వీలులేదు. పైగా ఈ కథ, తమ తండ్రిగారు మిత్రబృందమునకు చెప్పుచుండగా విని 1883 లో తమకు తోచిన విధముగా విరివిచేసినట్లును, 1896 లో నాటకోచితముగా రూపుజేసినట్లును గ్రంథకర్తే తెలుపుకొన్నారు.. వారికి కథ లిఖితముకాని, ముద్రితముకాని ఎక్కడను దొరకలేదట ! ఈ మాటలు ప్రతాపరుద్రీయ నాటకము పీఠికలో 'శాస్త్రి' గారే ఒప్పుకొన్నారు. అసలు వీరి తండ్రిగారివలన విన్న కథ, 'ప్రతిజ్ఞా యౌగంధరాయణమే'. దానిలో రాజు పట్టుబడగా విడిపించినవాడు యుగంధర మంత్రి. అతడు పిచ్చివాని వేషములో వికృతరూపముతో వికారచేష్టలతో విశిష్టభాషలు చేసి ఉపాయముతో రాజును విడుదల చేసెను. ఇట్టి వికృతవేషము, బ్రహ్మరాక్షసి వరప్రసాదము చేత లభించెనని చెప్పి భాస మహాకవి ఔచిత్యము పాటించెను. ఆ కథ తీసికొని వేదంవారు కాకతీయ ప్రతాపరుద్రునకు ముడి పెట్టినారు. అందుచేత 'ప్రతిజ్ఞా యౌగంధరాయణము కథా 'ప్రభావము' వేదమువారిపైన పనిచేసి 'ప్రతాపరుద్రీయము' ప్రకటింపజేసిన దనుటలో 'తప్పేమి యొప్పే యగున్ !'

(4) ప్రతాపరుద్రీయము చరిత్ర రీత్యా వాస్తవము కాదని పలువు రాడినమాట పాటిగా మేము తెలియజేసినాము. నిజమునకు ఢిల్లీ సుల్తాన్ ఎవ్వరును ప్రతాపరుద్రుని బందీగా తీసుకొనిపోలేదు. ఢిల్లీ సుల్తాన్ బందీ చేసినది, గోల్కొండ నవాబు తానీషాను. అది వేఱువిషయము.

ప్రతాపరుద్రుడు బందీ అయినమాట నిజమే, కాని ఆతనిని బందీ చేసినవాడు వేఱు. విడిపించినవాడు వేఱు. ఆ వ్యక్తి దండనాథుడు రాయబంది విమోచనుండను రాయ బిరుదము దాల్చినవాడు. బందె వదలిన తరువాత ప్రతాపరుద్రుడు తిరిగి తన రాజ్యము నేలుకొనలేదు. గోదావరీనదీ తీరములో ఒకచోట తపస్సు చేసికొని కాలము గడిపినవాడు. పైగా యుగంధర మంత్రి లేడు. జనార్దనమంత్రి లేడు. పేరిగాడు లేడు. ప్రతాపరుద్ర నాటకమే బూటకమని త్రిపురనేని రామస్వామి చౌదరిగారు తాము వ్రాసిన గీతములో వెటకారము చేసినారు.

తెలిసికోర యుగంధరుండను
తెలుగు బ్రాహ్మణ మంత్రి లేడుర
తెలిసికోర జనార్దనుండను
తెలుగు బ్రాహ్మణ మంత్రి లేడుర
వినర వేంకటరాయశాస్త్రుల
పిచ్చివాడును గూడ లేడుర
పేరిగాడను పెద్ద చాకలి
వెధవ యంతకుమున్నె లేడుర
తెలుగుబిడ్డా ! తెలుగు చరితను
నేటికైనను తెలుసుకోరా !

అని చరిత్రలో వాస్తవమును తెలిసికోమని తెలుగు బిడ్డను సంబోధించి త్రిపురనేనివారు తమ సూతాశ్రమ గీతాలలో ప్రబోధము చేసినారు.

ఢిల్లీ కేగిన మాట యుత్తది
ఢిల్లీ సుల్తాన్ బట్టు టుత్తది
ఓరుగంటి ప్రతాపరుద్రుని
ఓరుగంటిని జేర్చు టుత్తది
ఆ యుగంధరమంత్రి దీనిని

అంత చేసెను అనుట యుక్తి
ఔర ! ఔర ! ప్రతాపరుద్రుని
నాటకంబదె బూటకంబుర ! ......

ఇంక ప్రతాపరుద్రుని కథలో బందెపోవుట గూర్చి ...గీతములో తెలిపిన చరిత్రాంశములు గమనింపదగి యున్నవి.

ఓరుగంటి ప్రతాపరుద్రుడు
బందె పోవుట వాస్తవంబే
బందె తీర్చిన మానలీ డొక
బ్రాహ్మణోత్తర దండనాథుడు
రాయబంది విమోచకుండను
రాయ బిరుదము దాల్చె నాతడు.
బందె వదలిన పిదప రాజ్యము
వేల లేదు ప్రతాపరుద్రుడు
సిగ్గు చేతను గౌతమీనది
చెంత జేరుచు తపము జేయుచు
బందెనీడెను బొందెవీడుచు
భూతలేశ్వరుడంతెగాని
ఓరు గంటిని మరల గంటను
నొక్కనాడును జూడలేదుర !

ఈ విషయములు చిలుకూరి వీరభద్రరావుగారు, ...మలా లక్ష్మణరావుగారు మున్నగు పరిశోధకులు బయలు పెట్టిన ఆంధ్రుల చరిత్రలో నున్నవి. పాపము ! వేదంవారికీ చారిత్రకాంశములు తెలియవు. అందుచేతనే పొరపాటు జరిగి పోయినది. ఆ నాటి చరిత్రనేకాక భూగోళము కూడ వారు తారుమారుచేశారు. 'గోదావరి' నదిలో పడవలు ఢిల్లీకిపోయినట్లు యమునానది పైన ఓడలు మసలినట్లు ఏమేమో వ్యూహలు ...న్ని తమ నాటకములో జొప్పించినారు. ప్రతాపరుద్రుడు పరిపాలన చేసినది ఓరుగల్లు. దానికి సమీపములో ఎక్కడను గోదావరి లేదు. ఇటు 'రామ గుండము' కాని అటు 'భద్రగిరి' కాని పోవలెను. ఎటు పోయినను యేబది, నూరుమైళ్ల పై మాట. అంత దూరము వేటకు పోవుట అసహజము. పోయెనే యనుకొందము. గోదావరి నదీ తీరమున నుండగా పట్టుబడుట జరిగినది. పట్టుకొన్నవారు వల్లీఖాన్, ఖుస్రూ ఖాన్ వంటి దళపతులు లేనేలేరు. ఈ తురకలు, ప్రతాపరుద్రుని 'గోదావరి' పడవలో కొలువు తీర్చి యున్న రాజును కనిపెట్టి తదుపరి— అడవి ముఖములో నది ప్రక్కన చెట్టు క్రింద నిద్రించి యుండగా బంది చేసిరట. అక్కడ నుండి పడవలలో ఢిల్లీ తీసికొని పోయిరా ? ఎక్కడ గోదావరి తీరము? ఎక్కడ ఢిల్లీ ? ప్రతాపరుద్రీయము నాటకము పది అంకములు. వీనిలో మూడవ అంకము జరిగిన చోట్లు—'గోదావరి గట్టు' 'దోనెకడువు' "లోతట్టు పడవ" వీనిని చూచి— ఈ స్థలమునకును ఢిల్లీకిని ముడిపెట్టిన యెడల, 'గోదావరి' పడవలకు 'యమున'లోని ఓడలకు ఎక్కడ లంగరు అందునో?

చివరి భాగములో పెద్ది సెట్టిపడవను ఢిల్లీలోని యమునా నదీ తీరములో చూపించి సుల్తాన్ వారిని తరలించుకొని వచ్చి నది తమ్మాలముగానని 'ప్రతాపరుద్రీయ' కర్త తన నాటకములో చూపెను. ఎక్కడ యమున ? ఎక్కడ ఓరుగల్లు ? మధ్య అంతీలమీద నడిచెనే యనుకొందము, అప్పుడు కూడ ఈ మధ్య ఇరువదియొక్క గ్రామములేవా యున్నది ? నలుబది రోజులు పట్టు ఢిల్లీ – ఓరుగల్లు ప్రయాణము భూమిమీద జరిగినదా ? సముద్రము మీదనా? ఇవి యన్నియును అసంగతములే. ఆ నాటి చరిత్రకాని భూగోళముకాని తెలిసి వ్రాసినదికాదు. పైగా ఓరుగంటికిని ఢిల్లీకి మధ్య ఒక్క గోదావరి మాత్రమే కాదు, నర్మద, గంగ, యమున ఇట్టి నదులెన్నో యున్నవి. వాటిని దాటుట యెట్లు ? పడవలలో సంభవమా ? ఇట్టి ప్రశ్నలెన్నో ఉదయించును.

పైగా పెద్దసెట్టి చెప్పిన దారి ప్రయాణములో అతని పడవలు తిరిగిన తావులు తెలియజేయునుకాని ఓరుగంటికిని ఢిల్లీకి గల మధ్య మార్గము సూచింపదు.

గోవాపురియు సముద్రము
రావణ లంకయును సాగరంబును హుగ్లీ
దేవనదియు, యమున వైభవ
సేవధి ఢిల్లీ పురీశు శ్రీ సన్నిధియున్.

అనుటలో – ఎక్కడ గోవా ? ఎక్కడ హుగ్లీ ? దేవనది యెచ్చట ? యమున యెచ్చట? ఎక్కడ సాగరము ? ఏ సాగరము ?

ప్రతాపరుద్రుని బంధీగా కొనిపోయిన మార్గము కాని విడిపించి తెచ్చిన మార్గముకాని గోదావరి, గంగ, యమున మొదలగు నదులపైన పడవలమీద సాగలేదు. పైగా యమునా నదిలో ఓడ లెన్నడు ప్రయాణము చేయలేదు. అది యెచ్చటను సముద్రములో కలియదు. గంగానదిలో ప్రయాగ వద్ద త్రివేణీ సంగమము చేయును. అచ్చట నుండి కూడ గంగానదిలో ఓడలు తిరిగినట్లు నిదర్శనములు లేవు. కాశి నుండి కాలినడక ప్రయాణము కష్టసాధ్యమైనది. హుగ్లీ నదీ ముఖద్వారము దాటి ఓడలు పయనింపలేదు. పోని పయనించెనే యనుకొందుము. ఎక్కడ గంగ ? ఎక్కడ

హంగ్లీ ? ఎక్కడ గోదావరి ? ఎక్కడ ఓరుగల్లు ? ఈ యసంగతములనే – హేళన చేయుచు రామస్వామి చౌదరిగారు తమ గీతములలో వెక్కిరించినారు.

ఢిల్లీ దగ్గర గంగయుండెనో ?
గంగ యొడ్డున ఢిల్లీ యుండెనో ?
గంగ మీదను బడవ యెక్కిన
ఓరుగంటిని జేరగలడే ?
ఔర ! వేంకటరాయశాస్త్రీ
ఔర వేంకటరాయ శాస్త్రీ
ఎంత బొంకును బొంకితివి
చచ్చి యొచ్చట నుంటివో కద !

ప్రతాపరుద్రీయములో పడవల ప్రయాణము మాట అసంగతముగానే యున్నది. దానిని ఎట్లో సమర్థించినను, అది అంత సమర్థనీయముగా లేదు. తాతగారి చరిత్ర, భూగోళ జ్ఞాన రాహిత్య మెంత బలపరచినను అసమర్థనీయమే !

(5) 'ప్రతాపరుద్రీయము' నాటకములో పేరిగాని దర్బారు చాల తక్కువరకపు అభిరుచుల చూపుచున్నదని మా యభిప్రాయమే కాదు, నాటకము చూచిన సహృదయుల అందరి అభిప్రాయమును. దీనిమూలముగా కవిత్వమును గూర్చి— ఆఱు నూరేండ్ల తరువాత వచ్చు అభిరుచులను ఆక్షేపించుటకు తలపెట్టిన హేళనమని—అది గొప్ప వ్యంగ్య నిదర్శనమని తాతగారి తక్కువ రకపు అభిరుచులను మనుమలు సమర్థించినారు. కాని, ఇది కాలోచిత పద్ధతిని గమనించినచో నిలుచునది కాదు. కాకతీయ ప్రతాపరుద్రుని కాలములో విద్యానాథుని వంటి పండితులును, జాయప వంటి దండనాథు లుండినట్లు, సంస్కృతాంధ్ర కవిత్వములు, నృత్య గీత సాహిత్యములు మహోన్నతస్థాయి నందుకొన్నట్లు నాటి గ్రంథములే సాక్ష్యములు. 'ప్రతాపరుద్ర యశోభూషణము' 'నృత్తరత్నావళి' 'గీతరత్నావళి' ఆనల్పగ్రంథములు. నాటికాలమును అభిరుచులను గర్హించుట వివేచనతో కూడిన పని కాదు. పేరిగానిచేత వెర్రికూతలు కూయించి, నాటి విద్యా విభవమును వెక్కిరించుట వివేకరహితమైన కార్యము. 'మోర్సింగ్' వంటి వాద్యములా కాలములో లేవు. కాని అట్టి దానిని చూపించి, హేళనము చేయుట . కాలజ్ఞాన శూన్యతను తెలియజేయును. (Anachronism) పేరిగాడి దర్బారులోని ఉచితానుచితజ్ఞత లటుంచి, సామాన్య సభ్యతను కూడ లక్ష్యపెట్టని అశ్లీలములు పలికించిన నాటకకర్త హాస్య మెంత తక్కువ రకములోనిదో విలువ కట్టవచ్చును. వైణికుడు, గాయకుడు, మార్దంగికుడు, మోర్సింగువాడు కలిసి పల్లవి పాడిన తరువాత పేరిగాని మాటలు—షష్ఠాంకములో పేరిగాని దర్బారు :

"పేరి : ఒకపాలి నానొక బేపిని పెంచినా, అది కార్తిలో ఆడబేపిని చూస్తే యింతకంటా యెయ్యింతలు కుయికుయికుయి అనేది దానికంటా దీని యిసేసం యేంటీ అంటా;"

దీనికి విద్యానాథుని విమర్శ : 'పలిన వారు చమత్కారముగా పలుకుచున్నారు.' చిత్తకార్తి కుక్కల జేబులాటలో చమత్కారము చూచిన మహాపండితుల అభిరుచి నేమనవలయును !

ఈ ప్రతి విమర్శకు సమాధాన మింతటితో చాలును. తాతగారి గురించి మనుమలు గౌరవముతో పల్కిన వాక్కులతోనే ఈ సమాధానము ముగించుచున్నాము." "ప్రతాపరుద్రీయము నాటకముమీద చక్కని విమర్శ బయలువెడలలేదు." పండితు లెవరైనను ఆ పనికి పూనుకొన్నచో ఈ నాటకము ఎంత నికృష్టమైనదియో తేలిపోవును.

~~~~~~~~

ఆ. వె. విభవ సభవం జేయ వీరేశలింగంబు
గ్రామ్య గమ్యం జేయ రామమూర్తి
కంగకూగి గిడుగు కింకిణీధ్వానము గల్గి
ఠక్కరగ్గలీగ రాంధ్రభూమి.

— వసురాయకవి
~~~~~~~~

కానాల నరసింహకవి

★

ఒక పరిశోధకుడు

జూలై నెల భారతిలో కానాల నరసింహ కవినిగూర్చి వ్రాసిన వ్యాసకర్త ఇతని గూర్చి మరికొన్ని విశేషములు పత్రికాముఖముగా తెలుపమని కోరిరి. ఆ విశేషముల కొన్నింటిని తెలియజేయుచున్నాను.

ఈ నరసింహకవిని గూర్చి కీర్తిశేషులు వీరేశలింగము పంతులుగారు తమ కవుల చరిత్ర మూడవ భాగమున 1 నిట్లు వ్రాసియున్నారు.

"ఈ కవి హరివంశములోని యాశ్చర్య పర్వమునందలి శేషపర్వముల నెనిమిదాశ్వాసముల పద్యకావ్యముగా రచించెను. ఈతడు నందవరీక నియోగిబ్రాహ్మణుడు. వాసిష్ఠగోత్రుడు. వేంకటేశయామాత్య పుత్రుడు. వాసస్థలము తరిగొండ గ్రామము. శేష ధర్మ గ్రంథమును తరిగొండ నృసింహస్వామి కంకితము చేసెను." ఆ వెనుక యీ రచయిత కాలమును గూర్చి యిట్లు గలదు.

"ఈతని" కాలము తెలియరాలేదు.

ఆంధ్ర విద్వజ్జనాచార్య నన్నపార్య (?)
సుజన గుణమానసోత్పల సోము సోము
సురుచిరాలంకృతి భ్రాజి సోమయాజి
సత్కవి సనాథు శ్రీనాథు సన్నుతింతు."

అని యాంధ్ర కవులను వర్ణించుచో దమనందవరీకులలో సుప్రసిద్ధులైన పెద్దనాది కవులను సహితము వర్ణించి యుండలేదు. ఇంతమాత్రముచేత నితడు పెద్దనాది కవుల కంటె బూర్వుడని కాని వారి సమకాలికుడని కాని చెప్ప వలనుపడదు. ఇతడించుమించుగా నూట యేబది సంవత్సరముల క్రింద నుండి యుండవచ్చును." ఆవెనుక యెనిమిదాశ్వాసముల నుండి పద్యము లుదాహరింపబడినవి. వానిని యీ వ్యాసాంతమున నిచ్చెదను.

ప్రస్తుతము వ్యాసకర్త లిచ్చిన పాఠము—

"విద్వజనాచార్య నన్నపార్య
మజన గణమాని సోత్పల సోము సోము
సురుచిరాలంకృత భ్రాజి సోమయాజి
కవి సనాథు శ్రీనాథు.

తరువాత కొంచెము శిథిలము—దీనికి తోడు కవి నిందను కూడ చేసెను (అదియు శిథిలము). (పుట 83).

శ్రీ వీరేశలింగం పంతులుగా రిచ్చిన పాఠములో—

"సత్కవి సనాథు శ్రీనాథు సన్నుతింతు" యని యుండుట చేత నా పద్య మంతటితో పూర్తి య్యైనది. అది సీసపద్య గీతము—ఆ వెనుక కవిస్తుతి పద్యము లేనట్లు వారు "పెద్దనాది కవులను వర్ణించియుండలేదు" అని వ్రాయుటయే సాక్ష్యము—

దీనినిబట్టి నరసింహకవి శ్రీనాథునికి యనగా క్రీ. శ. 1460 ప్రాంతములకు తరువాతి వాడని నిశ్చయముగ జెప్పవచ్చును. ఇక వీరేశలింగము పంతులుగా "రీత డించుమించుగా నూటయేబది సంవత్సరముల క్రింద నుండి యుండును" అని యూహించినారు. వారా భాగము వ్రాసిన కాలము క్రీ. శ. 1897. అప్పటికి నూట యేబది యేండ్లనగా, క్రీ. శ. 1750 ప్రాంతము నరసింహకవి కాలము అని చెప్పవచ్చును. దీనిని పరిశీలించుటకు తరిగొండ వెంకమాంబ చరిత్ర మనకు కొంత తోడ్పడుచున్నది.

ప్రసిద్ధ కవయిత్రియు యోగవిద్యా విశారదయు నగు వెంగమాంబయు నరసింహకవియు నొకే వంశమునకు సంబంధించినవారు. ఆ సంబంధము నిట వివరించుచున్నాను.

నరసింహకవి	వెంగమాంబ
నందవరీకుడు	నందవరీక వంశము.
వసిష్ఠగోత్రులు.	వసిష్ఠ గోత్రము.
ఇంటిపేరు కానాలవారు.	పుట్టింటిపేరు కానాలవారు.
తాత కృష్ణ యామాత్యుడు.	తండ్రి కృష్ణార్యుడు.
తరిగొండ నృసింహభక్తుడు.	తరిగొండ నృసింహభక్తురాలు

1. ఈ మూడవభాగ మిప్పటికి అరువది యేండ్ల క్రిందట (క్రీ. శ 1903) ముద్రితమైనది. మొదటి రెండు భాగములు పునర్ముద్రణ మందినవి. కాని హెచ్చు మంది కవులున్న యీ భాగము ముద్రితము కాలేదు. ఈనాడు మనకు తెలియని కొంతమంది కవులను గూర్చి యీ భాగము తెలుపగలదు.

కానాల నరసింహకవి

తరిగొండ వెంగమాంబకు పుట్టింటి పేరును, మెట్టి నింటి పేరును గలవు, కాని యామె మహా యోగినియై, యీ నామావధులను దాటి తరిగొండ వెంగమాంబగా శాశ్వతముగా సారస్వతమున వ్యవహృతమైనది—పుట్టింటివారు కానాలవారు. అత్తవారింటి పేరు ముంజేటివారు. ఈ విషయము స్పష్ట పరచుటకు వెంగమాంబ 2ద్విపద భాగవతావతారిక యందలి విశేషముల నిచ్చుచున్నాను.

"ద్వి. ధరపైని వెలయు నం దవరాన్వ యుండు
గురుతర సువసిష్ఠ గోత్ర సంభవుడు
కానాల వంశ సాగర హిమాంశుండు
నైన కృష్ణార్యున కతి భక్తితోడ
నంగన యగు మంగమాంబ గర్భమున
నంగతి కృష్ణుండు నైదోడుగాగ
వెంగమాంబిక ప్రభవించి లింగాంగ
భంగంబు కొఱకు సుబ్రహ్మణ్య గురుని
చరణాబ్జ యుగళి హృజ్జలజ మందుంచి
యరసి పూజించి త దనుమతి వడసి
వరునగా ముంజేటి వంశ భూషణుడు
గురుతర శ్రీవత్స గోత్ర సంభవుడు
ఘనుడైన తిమ్మయార్యాగ్రణి పుత్రు డనగ
జనులెన్న వెంకటాచలపతి పాద
వనజ యుగ్మంబు భావంబునందుంచి."

పై భాగము ననుసరించి వెంగమాంబ తండ్రి కానాల కృష్ణార్యుడని స్పష్టము.

నరసింహకవి తన వంశ క్రమము నిట్లు చెప్పియున్నాడు.

అహోబిల మంత్రి వంశమున—

వెంగామాత్యుడు
|
కృష్ణయామాత్యుడు
|
వేంకటేశామాత్యుడు
|
నరసింహకవి.

ఇచట నరసింహకవి తాత—కృష్ణయామాత్యుడు—తరిగొండ వెంగమ తండ్రి కృష్ణయామాత్యుడు—ఇతడే నరసింహ కవి తాత యైనచో, నతడు నవీను డగును. ఏలననగా తరిగొండ వెంగమాంబ 3 క్రీ. శ. 1794—1877 వఱకును జీవించినది. కావున నామె తండ్రి క్రీ. శ. 1750—60 ప్రాంతమువాడు. అప్పుడు నరసింహ కవి యాతని మనుమడే యైన వెంగమాంబను, నెఱిగి యుండక తప్పదు. కాని గ్రంథమున నట్టి సూచనలు లేవు. వెంగమాంబయు తన తాత పేరు చెప్పలేదు. ఈ సందర్భము ననుసరించి చూచిన నీతడు క్రీ. శ. 1800 ప్రాంతమువా డగుచున్నాడు. వ్యాస కర్త యీ గ్రంథ మెప్పుడు వ్రాయబడినది మొదలగు వివరము లిచ్చినచో, నింతకన్న నీ కవి కాల నిర్ణయము సూక్ష్మముగ చేయుటకు వీలు కలుగును. అంతవఱకును నిది నిశ్చ యకము కాదు.

ఇక వీరేశలింగముగారు కవుల చరిత్రయం దిచ్చిన పద్యము లిందు ప్రకటించుచున్నాను. వ్యాసకర్త యీ పద్యములు వారివద్ద నున్న ప్రతిలో నున్నవో లేవో తెలుపగోరుచున్నాను.

చ. పటుతర మేఘమండల విభాసిత సౌధ చయో పరిస్థితో
త్కట వరహేమ కుంభ సముదాయ ధగద్ధగి తోరు కాంతి వి
స్ఫుట చపలాకృతి న్మెఱయఁ జూడగ వచ్చిన వారలెల్ల ని
చ్చట గల చంచలల్ గడున చంచల లంచు భ్రమింతురం గనల్—(1 ఆ)

చ. ఘన విషజంతు పూరిత మగాధమురూపము దీనిఁ జూడు నీ
వౌనరఁగఁ గూఁతు నీయవు తిలోదక మీయవు గాన దానవా
తనువులు జీర్ణతం బొరసె దారుణ రూప సమేత కూపమం
దును బడియున్నవార మతి దుఃఖ సమాకులతన్ మహా
త్మకా (2 ఆ)

శా. దారాపత్యయుతుం డకించనుడు విద్వాంసుండు వేదాంతమా
ర్గా రూఢుండును వృత్తిహీనుడును నిత్యానందుడున్ శ్రోత్రియుం

---

2. వెంగమాంబ మహాభాగవతము నంతను ద్విపద కావ్యముగా వ్రాసినది. ఇందలి విశేష మేమనగా, పోతన భాగవతము నందలి పద్యములకు ద్విపద లున్నను—గ్రంథము ముద్రితము కాలేదు. మొదటి యాఱు స్కంధములు మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములోను (తిరుపతి), కొన్ని స్కంధములు వేంకటేశ్వర విశ్వవిద్యాలయములో నున్నవి. పై పంక్తులు మద్రాసు పుస్తక భాండాగారమున డి. సంఖ్య 1013 నుండి గ్రహింపబడినది.

3. Literary and philosophical works of Tarigonda Vengamamba A woman Saint-article in English by N. Venkata Rao M. A. Journal of the Madras University, Section A. Vol. XXX January 1958 PP 17-29.

నాకు తెలిసిన కథ

★

శ్రీ ఆదివిష్ణు

వాచీ చూచుకున్నాను. పన్నెండున్నరయింది.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. ఈ రోడ్డు చూడటానికి చాలా అందంగా ఉంది. నిలబడ్డ చోటునుంచి ఎడంపక్కన ఒక మైలు కుడిపక్కన ఒకమైలు పొడుగునా రోడ్డు స్పష్టంగా కనుపిస్తోంది. అక్కడక్కడ చిన్నచిన్న గుంటలు లేకుండా ఉంటే ఆ తారురోడ్డు ఇంకా అందంగా ఉండేది. రోడ్డు పక్కగా ఫర్లాంగుకి ఒక్కటి చొప్పున పెద్దపెద్ద చెట్లు తప్పించి నీడనిచ్చే చల్లని చోటు చెప్పుకునేందుకేమీ లేదు.

చాలా దూరంగా ఉన్న పొలాల నుండి వచ్చే చిన్నసైజు రణగొణధ్వని మినహాయించి మరింకో శబ్దం వినిపించడంలేదు. ఎండ తీక్షణంగా ఉంది. మేనెల ఎండలు ఈ ప్రాంతంలో దారుణంగానే ఉంటాయిట. ఆగిఆగి వచ్చే వర్షంకంటే తీవ్రమైన ఎండపట్ల ఒక విధమైన అభిమానంగల నాకూ ఈ ఎండని చూస్తూంటె చిరాకు కలుగుతోంది. చేతిలో ఉన్న జేబురుమాలు బాగా తడిసిపోయింది. ఇలాంటప్పుడు టర్కీటవలు వెంట నుంటే ఎంత బాగుండేదోగదా.

బస్సు వచ్చేజాడ కనిపించడంలేదు. అక్కడికి దగ్గర్లో ఉన్న స్టేషన్లో రైలుదిగి మట్టిరోడ్డు వెంటనడిచి ఈ రోడ్డు చేరుకుంటూండగానే ఒక బస్సు రావడం గూడా జరిగింది. మరో బస్సు రావడానికి ఎంతసేపు పడుతుందో ఏమిటోగదా ఖర్మం.

ఈ రోడ్డుగానీ, దగ్గర్లో ఉన్న రైలుస్టేషనుగానీ, నేను వెళ్ళబోయే ఊరుగానీ నాకింతకు మునుపు తెలీవు. అంత అవసరమొస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. రెండు రోజుల క్రితం కేంప్‌నుంచి అద్దెగదికొచ్చేను. గదిలో రాజేశ్వరి రాసిన ఉత్తరం కనిపించింది. అది గదిని చేరుకుని అప్పటికి వారం రోజులై ఉంటుంది. కేంప్‌లో ఉంటడంవల్ల నాకు తెలిసింది కాదు. లేకపోతే వారం రోజుల క్రితమే, బిక్కుబిక్కుమనే ఈ రోడ్డుమీద ఇలాగే నిలబడి ఉండేవాడిని.

రాజీ ఉత్తరాలకీ, రాజీమాటకీ విలువ ఉంది. రాజీ నాకు దూరమైనా, నాపట్ల ఆమెకు అలక్ష్యభావ మేర్పడినా ఆమెను గౌరవించడంలో నాలోపమెన్నడూలేదు.

ఆమె దేనికీ, ఎప్పుడు భయపడలేదు. భయపడదు. అలాటిరాజీని ఒక్కసారిగా పిరికితనం ఆవరించింది. ఈ ఉత్తరంలో తన పిరికితనాన్నంతా వ్రాసుకుంది. ఆమె వ్రాసిన ఉత్తరం చదివి కలత చెందడం ఇదే మొదటిసారి.

—నరిపోయేంత నీడనిచ్చే ఈ చెట్లులేకపోతే ఇంకెంత ఇబ్బంది పడిపోయేవాడినో. దిగులూ, కొంత భయంకూడా కలిగేవి. ఎండ నిప్పులు చెరుగుతోంది. వయస్సులో ఉన్న నేనే ఈ ఎండకి ఇంత తల్లడిల్లి పోతున్నానుగదా, అదే ఎండలో వయస్సు మళ్లిన మనిషెవరైనా నా స్థితిలో ఉంటే ?

నేనేనాడూ ఈ ఎండలూ, వడగాల్పులూ వగైరాల గురించి పట్టించుకోలేదు. అథవా ఆ విషయాలెవరైనా నా దగ్గర తీసుకొస్తే చెవొగ్గి వినేవాడినీకాదు. ఎండల గురించి గొప్పగా చెప్పుకునే వాళ్లమాటమీద నాకు విశ్వాసం లేకపోగా చులకన భావమూ కలిగేది. అలాటిది నేనీనాడు అనుభవిస్తోన్న శ్రమని గమనిస్తూంటే నాపైనాకే జాలికలిగింది. నవ్వుకున్నాను.

జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించేను. ఒక పర్యాయం రోడ్డువైపు చూసేను. ఎక్కడా బస్సువచ్చే జాడ కనుపించడంలేదు. చెట్టు మొదట్లో చోటుచేసుకుని కూర్చున్నాను.

వాళ్ళ ఊరుకెలా చేరుకోవాలో ఉత్తరంలో విపులంగా వ్రాసింది రాజీ. మా ఊరునుంచి పదిమైళ్ళు బస్సుమీదొచ్చి అక్కడ రైలెక్కి దాదాపు ఏభై మైళ్ళు ప్రయాణంచేసి ఇక్కడదిగి, మళ్లా ఇక్కడ్నుంచి పాతిక చిల్లరమైళ్ళు రాబోయే బస్సుమీద వెళ్లాలిట. మరీ చిన్న పిల్లాడికి చెప్పినట్లు ఈ వివరాలన్నీ దేనికసలూ అని మొదట్లో అనుకున్నాను గానీ, ఈ ప్రయాణంలో ముఖ్యంగా ఇక్కడ ఇంత అవస్థపడాలని తెలుస్తే అలా కొట్టిపారేసే వాడినికాదు.

మా ఊర్లో కాఫీ [illegible] బయలు దేరాను. ఆ కాఫీనీళ్ళు తప్పించి దార్లో మరేమీ పుచ్చుకోనే లేదు. ఇప్పుడు తెలుస్తుంది. ఆకలిబాధ ! ఎన్ని సిగరెట్లు కాలుస్తే మాత్రం ఏంలాభం ?

వెంటనే మరో భయంకరమైన ఆలోచన తట్టింది. ఇలా సిగరెట్టు మీద సిగరెట్టు తగలేస్తే, మిగిలున్న రెండు సిగరెట్లూ అయిపోడానికి సరిగ్గా పదినిముషాలు పట్టదు. అని కాస్త గట్టిగ్గాలంతైన మీదట, కొనుక్కుందామనుకున్నా ఈ అడవిలో ఎవరమ్ముతారు. ఈ ఆలోచనరాగానే, కాల్చే సిగరెట్టుని కాస్త తాపీగా కాల్చడం ప్రారంభించేను.

—పాపం.. రాజేశ్వరి అక్కడెంత భయపడుతున్నదో గదా.. చిన్న విషయాలని భూతద్దంలోంచి చూడటం రాజేశ్వరి కిష్టం లేదని నాకు తెలుసు. అలాటిది, నన్ను వెంటనే ఉన్న పళంగా వచ్చేయమని రాసిందంటే అక్కడ పరిస్థితి ఎలా గుందోగదా.

భాస్కరాన్ని ఒక్కసారే చూశాను. అయితే మాత్రం— మరిచిపోలేని మనిషి. రాజీ పెళ్లయిన కొత్తలో ఇద్దరూ మదరాసు వెడుతూ ఒకరాత్రి భవదీయుడి ఆతిధ్యంపొందారు. అతన్ని పరిచయం చేసింది రాజీ. వాళ్లిద్దరూ నాతోగడిపిన ఆకొద్ది గంటలూ మరో జన్మలో కూడా గుర్తుంటాయనడంలో అతిశయోక్తి లేదు.

అతని భావాలలాగానే భాస్కరం చాలా అందమైన మనిషి. అన్ని విధాల రాజీకి తగిన భర్త. అదృష్టం పండిందని అప్పుడు అనుకున్నాను. లేకుంటె అతడెక్కడ ? నేనెక్కడ ? అతి సాధారణమైన నాలాటి గుమాస్తా బ్రతుక్కి రాజీ భాగస్వామిని అయితే— ఆమె అనుభవిస్తో సుఖాశాంతులేమయ్యేది.

ఇంకా నయం— మేమిద్దరం కలిసి తిరుగుతున్న రోజుల్లో 'నిన్ను ప్రేమించాను రాజీ' అని కవిత్వం చెప్పానుగాదు. చెప్పినా ఆ పిల్లకాదనే మాట నిజం. ఆ పైన భాస్కరాన్ని పెళ్లాడి 'చూశావా సోదరా! ఇంత భాగ్యాన్ని వదలి నిన్ను పెళ్లాడతా అని నీకు మాటిస్తే నాగతేమయ్యేది' అని నా మొహం ముందే అనేసి ఉండేది.

నా అంత పిరికివాడూ, మొహ మాటస్థుడూ, బిడియస్థుడూ మరొకడు ఉండడు. ఒక విధంగా ఈ సుగుణాలే ఆమె ప్రయోగించబోయే వాడియైన బాణాల్లాంటి మాటల నుంచి నన్ను తప్పించాయని గూడా చెప్పుకోవచ్చు.

రాజీ నేనూ ఒకే ఊళ్లో పుట్టాము. అక్కడే పెరిగి పెద్దవాళ్లయ్యాము. మా రెండిళ్లూ పక్కపక్కనే ఉండేవి. రాజీ వాళ్లనాన్న రాజకీయాల్లో తిరిగి, జైళ్లకెళ్లి ఇప్పుడు ఒకానొక ప్రముఖ రాజకీయ వేత్తగా స్థిరపడ్డారు. వాళ్లకున్న మేడలాటి హోదా రోజురోజుకీ పెరిగిపోవడం నిజంగా వాళ్ల అదృష్టమే. అలాటి వాళ్లకి నేనెంత ? అందుకనే, నోరువిప్పి నా మనసులోని మాట రాజీతో చెప్పలేదు.

ఒక పెద్ద గండం రాజీకి నానుంచే తప్పింది.

తీవ్రమైన ఎండలో నడిరోడ్డుమీద నిలబడ్డ నాలాటి వాడు జరిగిన కథ నెమరు వేసుకోడానికి తగిన కారణం లేక పోలేదు. ఏమీ తోచనివాడు గోళ్లు గిల్లుకుంటూ పాత విషయాలు గుర్తుచేసుకుంటూన్నాడంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. పైగా— రాజీ రాసిన ఈ ఉత్తరం ఒకటి, గడిచిన కథని యావత్తు కదిలిస్తుంది.

ఏడాదిన్నర క్రితం సంక్రాంతికి సెలవుపెట్టి మా ఊరు వెళ్లాను. రాజీ పుట్టింటికి వచ్చిందని తెలిసింది. ఆ సాయంత్రం వీలు చేసుకుని ఆమెను పలుకరించడానికి వెళ్లాను. అప్పుడు రాజీ చాలా కొద్దిసేపు మాత్రమే మాటాడింది. అవుతే ఆ మాటల వెనక— ఆమె మనసులో ఏదో దాచుకున్నట్టు కనుపించింది. ఆమె మొహంలో ఏదో వెలితి, ఆమె మాటల్లో ఏదో నిరుత్సాహం పసిగట్టాను. ఏమైనా రాజీ మునుపటి రాజీలా లేదు. ఆ మార్పుకి కారణమేమిటో నాకై నేను అడగాలనిపించలేదు. వెంటనే తిరిగి ఇంటి కొచ్చేను.

భోజనాల దగ్గర చెల్లి చెప్పింది. రాజీకీ వాళ్లాయనకీ ఏవో భేదాభిప్రాయాలు వచ్చేయిట. అతనితో పోట్లాడి పుట్టింటికి వచ్చేసిందట. మళ్లా తిరిగి ఆ ఇంటికి వెళ్లనని మంకుపట్టుపట్టి కూర్చుందిట.

అదిరిపోయాను.

మంచి మనుషులు చాలా కొద్దిమంది ఉంటారు. వాళ్ల మంచితనం ఒక పట్టాన పూర్తిగా బోధపడదు. నిజమే నేను. కాకుంటె, భాస్కరంలో ఇంత ఊహించరాని పొరపొచ్చే లుంటాయి ? అతను భార్యని ఆదరించలేనంత మూర్ఖుడా! నేను నమ్మలేక పోయాను.

ఆఫీసు కెళ్లాల్సిన క్రితంరోజు రాజీ కబురు పెట్టింది. వెళ్లాను. కాఫీ ఇచ్చింది. తాగేను. వెళ్లిపోతున్నావటగా అన్నది. అవునన్నాను. మళ్లీ ఎప్పాళ్లకి కలుసుకుంటామో నన్నది. నవ్వి ఊరుకున్నాను. ఏమి మాటాడాలో రాజీక్కూడా తోచింది కాదేమో నన్ను. ఖబుర్లు చెప్పమన్నది. నేనేం చెప్పలేదు.

కాసేపటికి నేనడక్కుండానే భాస్కరం గురించి చాలా చెప్పింది. విన్న తర్వాత భాస్కరం పట్ల గౌరవం పెరిగిందేగాని, అతనిపట్ల నా నమ్మకం చెదిరి పోలేదు.

భాస్కరం వాళ్లు ఏమంత ఉన్నవాళ్లు కారుట. అతను చదువుకుంటూన్న రోజుల్లో సుభద్ర అనే అమ్మాయితో అతనికి పరిచయం ఉండేదిట. భూమి గుండ్రంగా తిరుగుతుందన్న

మాటెంత నిజమో, ఆడపిల్లల్తో పరిచయం ప్రేమలోకి దించడమన్నది అంత నిజమని మా శోభనాచలం అంటూండే వాడు. సుభద్రని భాస్కరం మనసారా ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని మాటా ఇచ్చాడుట. సుభద్ర ఒక పేద బడి పంతులి కూతురు. ఆ పిల్ల భాస్కరాన్ని నమ్ముకుంది.

అలాటిది కాస్తా భాస్కరం తాలూకు బలహీనత వల్ల ఆ పిల్ల జీవితంలో ఓడిపోయింది. భాస్కరం వాళ్లనాన్న గారి మాటని కాదనలేక పోయాడు. ఆయన తన బాగుకోసం, తన సుఖంకోసం చేసే ప్రయత్నాలకు తలొంచాడు. రాజీని పెళ్లి చేసుకున్నాడు. హోదాని పెంచుకున్నాడు. భవిష్యత్తుని సుఖప్రదం చేసుకున్నాడు. కానీ సుభద్ర ఆశలనీ, ఆ బడి పంతులి గౌరవాన్నీ మంటలో కలిపాడు.

ఈ విషయాలన్నీ రాజీతో మరొకళ్లూ మరొకళ్లూ చెబితే భాస్కరాన్ని కొంతైనా శంకించడానికి అవకాశముండేది. కానీ, సాక్షాత్తూ భాస్కరమే ఇవన్నీ చెప్పాట్ట.

రాజీ అన్నది—

“ఒక మాటు చెప్పి ఊరుకుంటే నేనంత పట్టించుకునే దాన్ని కాదు. రోజూ ఆయన ప్రేమ కథచెప్పి ‘నాకు నిష్కృతి ఉందా రాజీ ! నేను ద్రోహిని కదూ !’ అంటూ నా చెవిదగ్గర ఇల్లు కట్టుకుని చెపుతూంటే వినేదానికి నా కెలా ఉంటుంది? నేను వారికి భార్యని. నాకు చెప్పవలసినవీ, చెప్పి నొప్పించకూడనివీ వుంటాయి. ఆ యింగితం లేదు. కేవలం నా సహనాన్నీ, నా మంచితనాన్నీ పరీక్షించాలనే ఉద్దేశ్యంతో మితిమీరి పోతూంటే నేనేమైపోతాను ? నాగురించి ఆయనేమైనా ఆలోచిస్తున్నారా ? భార్యల ముందు తన ఘనతనిలా చాటి చెప్పుకోవడం సంస్కారమా ? నిజం రావ్ ! విసిగిపోయాను.”

ఇదంతా విని నేను చాలా బాధ పడ్డాను.

మనిషిలో బలహీనత ఎంత పనైనా చేస్తుంది. అతని బలహీనత రాజీ ఉద్దేశ్యంలో నేరమే కావచ్చు. తాను లోగడ చేసిన తప్పుకి జీవిత పర్యంతం దిగులు పడటం, ఎదటివారి సానుభూతి పొందడానికి ప్రయత్నించడం ఏమంత ఆశ్చర్యమైనదీ, చిత్రమైనదీ కానేకాదు.

రాజీకి ఎన్నో విధాల నచ్చ చెప్పాను. ఆమె నామాటలు వినిపించుకోలేదు. అంతలోనే విషయం మార్చి నా పెళ్ళి ప్రయత్నాల గురించి మాటాడింది. జవాబు తిన్నగా చెప్పడం ఇష్టం లేక ఇంటి కొచ్చేశాను.

రెండు నెలల తర్వాత రాజీ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. రాజీ భాస్కరం దగ్గరికి వెళ్ళిపోయిందిట. అతనికి తీవ్రమైన జబ్బు చేసిందిట. కడుపులో ఏదో పుండో పుట్టిందని వైద్యులు నిర్ణయించారు. ఆపరేషన్ చేశారు. ఆ విషయం భాస్కరం రాజీకి వ్రాయలేదు. రాజీ మావగారు చాలా భయపడుతూ ఉత్తరం వ్రాశారుట. ఆ ఉత్తరం చదివి క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా వెళ్ళి పోయిందిట.

అతనికి ఆపరేషన్ జయప్రదంగా ముగిసింది. రాజీ మనసు కుదుటపడింది. ‘ఇంతజబ్బులో వుండికూడా మీరు నా కెందుకు ఉత్తరం వ్రాయలేద’ని రాజీ అడుగుతే అతను నవ్వి అన్నాట్ట ‘రాజీ గారికి భక్తుడిమీద కోపం గదా మరి’ అని. రాజీ రాస్తుంది. ‘ఇంత మంచి మనిషిని నే నెందుకు అపార్థం చేసుకున్నానా’ అని ఇప్పుడు చింతిస్తున్నాను. నన్ను దేవుడు గూడా క్షమించలేడు.’

నవ్వు వచ్చింది నాకు.

ఆడవాళ్లందరూ ఇంతేనా? లేక మా రాజీ ఒక్కర్తేనా? తన తప్పుని తాను చెప్పుకుని కుళ్ళి పోతున్నప్పుడు అర్థంగాని అతని ‘మంచితనం’— ఈ రోజున ఆపరేషన్ జరిగి స్వస్థత చేకూరిన తర్వాతగానీ అర్థం కాలేదంటే, నవ్వు రాదూ మరి. ఇందులో ఆమెకు కనిపించిన ‘మంచితనం’ ఏమిటో మా రాజీ కొక్కర్తెకే తెలియాలి.

ఆ తర్వాత ఆమె దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాలన్నీ సవ్యంగానే ఉన్నాయి. వాళ్లాయన ఆమె పట్ల ఎంత అభిమానం, ఆదరణా చూపిస్తుంటారో వాళ్లాయన ఎంత చక్కగా బొమ్మలు గీస్తారో వాళ్లాయన ఎంత తియ్యగా పాడతారో వగైరాలే ఆ ఉత్తరాల తాలూకు ముఖ్య విషయాలు.

కానీ, మొన్న వచ్చిన ఉత్తరంలో—

—దూరంగా బస్సు మోత వినిపించింది. ఆత్రంగా లేచి నిలబడ్డాను. ఒళ్లు దులుపుకుని రోడ్డుమీదకు వచ్చాను. అప్పటి వరకూ నీడచాటున కూర్చుని హఠాత్తుగా ఎండలోకి వచ్చానేమో కళ్లు తిరిగాయి, ఒళ్లు తూలినట్టయింది. సర్దుకు నిలబడి రోడ్డు చివరివైపు దృష్టి నిలిపాను. అంత దూరంలో ఎఱ్ఱటి దుమ్ము మబ్బులాగా పైకి లేచింది. ఉన్న కొద్దీ బస్సు దగ్గరవుతున్నట్టు మోత వినిపిస్తోంది. అమ్మయ్య బ్రతికేను.

బస్సు ఫర్లాంగు దూరంలో ఉండగానే చెయ్యెత్తి నిలబడ్డాను. బస్సు వచ్చింది. జాలి లేని దానిలా నన్ను దాటనూ దాటింది. ఎండతో దిక్కు తోచక చస్తున్న నా మొహాన్ని ఇంత దుమ్ము ప్రసాదించి మరీ వెళ్ళిపోయింది.

బస్సు కనుమరుగైన తర్వాత ఏడుపొచ్చింది. బస్సు తప్పిందే అన్న బాధకి ఈ ఎండొకటి జతయ్యింది. గబగబా చెట్టు మొదల

ట్లోకి వెళ్ళిపోయి నా చేతుల్లో మొహాన్ని కప్పుకుని కుళ్ళి కుళ్ళి ఏడిచాను. జీవితంలో చాలా తక్కువ సార్లు ఏడ్చిన వాళ్ళలో నే నొకణ్ణి. బాగా గుర్తుండి పోయే ఏడుపుల్లో అదొకటి.

ప్రకృతి యావత్తూ నామీద పగబూనినట్లుంది. ' మాన వాధముడిని బుగ్గి చెయ్యవలె' అన్నట్టు నాస్పైన విజృం భిస్తోంది. దాహం. గొంతుక అరిపోయింది. ఆకలి. మెలికలు తిరిగిపోతున్నాను. గట్టిగా అరవాలని ఉంది. అరిచినా అడవిలో మొరాలకించేనాథు డెవడూ ఉండడు. ఉన్నా వచ్చి ఆదుకునే సహృదయతా ఉండదు. పోతే, నాకు చాతనయ్యింది ఏడుపు. అయినా ఓపికలేని తర్వాత ఏడుపుమాత్రమే మొస్తుంది నా పిచ్చిగానీ.

దిగాలుపడిపోయాను.

ఇక్కడ నా స్థితి ఇంత అధ్వాన్నంగా ఉంది. అక్కడ రాజీ ఎంత ఖంగారు పడిపోతుందోగదా. ధైర్యం చెప్పటానికి ఆత్మీయుల సాన్నిధ్యం ఎంతైనా అవసరం. రాజీ ఉత్తరం రాసి పది రోజులు గడిచాయి. ఏరోజు కారోజు నాకోసం ఎదురు చూస్తూనే ఉంటుంది పాపం. నే నెంతకీ రాకపోవడంతో నన్నే విధంగా భావించిందో ఏమో ?

పిచ్చెత్తినట్టయింది. కసిగా పళ్లు కొరుక్కున్నాను.

మళ్లా కారు శబ్దం వినిపించింది. ఒక నిశ్చయానికి రావడం గూడా జరిగింది. ఏం జరిగినా సరే—రోడ్డుకి అడ్డంగా నిలబడాలి. నా అవసరాన్ని చెప్పుకోవాలి. వింటారా సరేసరి. లేదూ—దౌర్జన్యం చేస్తైనా సరే నా కోరిక నెర వేర్చుకోవాలి. ముందు ఈ రాకాసి ఎండబారి నుంచి తప్పు కుంటేనే గాని నాకు మనశ్శాంతి లేదు.

అప్పటికే రోడ్డు మధ్యన నిలబడి ఉన్నాను. ఎండ తీక్ష్ణంగా ఉంది. వడగాడ్పు రివ్వున వీస్తూనే ఉంది. దాహం, ఆకలి. కాళ్లు తేలిపోతున్నాయి. కళ్లు తిరుగుతున్నాయి. శక్తి నంతా కూడగట్టుకుని అలాగే నిలబడిపోయాను.

వచ్చేది చిన్నకారు. వేగంగా వస్తోంది. వొచ్చేసింది. రెండు చేతులూ చాపి నిలబడ్డాను. అంతే నా వళ్లు తూలి పోయింది. నేలమీద ఒరిగిపోతునట్టు జ్ఞాపకం.

* * *

కళ్లు విప్పాను. మంచంమీద పడుకున్నట్టు గ్రహించగలి గాను. గభాలున లేచి కూర్చున్నాను.

“నో .... నో .... లేవకండి.” అన్నా డతను.

అతనికి పాతిక సంవత్సరా లుంటాయి. మనిషి ఆజాను బాహువు. ఎత్తుకి తగ్గ శరీర సౌష్టవం తీర్చిదిద్దినట్టుంది. అతని చేతిలో తుపాకి ఉంది. తుపాకిని తుడుస్తూ కిటికీ దగ్గర కూర్చుని ఉన్నాడు.

చిన్న గదైనా చక్కగా అలంకరించి ఉన్నది. ఎక్కువ భాగం, దుప్పి కొమ్ములూ, పులి చర్మాలూ వగైరాలే ఆ గదికి అలంకారాలు. కొంత మూఢయ్యింది.

“పాపం .... ఆ ఎండలో ఎంతసేపట్నుంచి నిలబడి ఉన్నారో” చేతిలోని తుపాకిని గోడమీద మేకులకు తగిలిస్తూ అతనే అన్నాడు

“ముందు ఈ నిమ్మరసం తాగండి.” అన్నాడు గ్లాసు నా ముందుంచుతూ.

గబగబా తాగేశాను. అతను నావైపు తృప్తిగా చూశాడు.

“నా పేరు సత్యనారాయణ. పరిచయస్థులు సత్యమని పిలుస్తారు. మీరీ ప్రాంతాలకి కొత్తవాళ్లనుకుంటాను.”

అవు నన్నట్టు తలూపి మా వూరుపేరు చెప్పాను.

“అలాగే కనిపించారు. ఒక విధంగా నేను కృష్ణాజిల్లా వాడిననే చెప్పాలి. మా పెత్తల్లి నన్ను దత్తత చేసుకోడంతో యీ జిల్లా వాడినైపోయాను. చదువు సంధ్యలు కృష్ణా జిల్లాలోనే జరిగాయి. చదువైన తర్వాత ఉద్యోగం చేయవల సిన అవసరం లేకపోవడంతో ఈవూరొచ్చి పొలం గట్రా చూసుకోడం మొదలెట్టాను. కాలం గడవటానికి 'వేట' ని అల వాటు చేసుకున్నాను. ఈ చుట్టు పక్కల అడవులు వేటకి అను వైనవి. వేట నుంచి తిరిగొస్తూండగానే మీరు కలిశారు. ఆవేళ వేటలో చేతికి పని దొరకలేదు” అన్నాడు అతను నవ్వుతూ.

నాకు వేటగాళ్లన్నా, వేట అన్నా మొదట్నుంచి సదభి ప్రాయం లేదు. కారణం లేకుండానే అభిప్రాయాలు చెప్పడం చాలామందికి నచ్చకపోయినా ఇది మాత్రం నిజం. సాధార ణంగా వేట పట్ల అభిమానం చూపేవాళ్లకి లోకమంతా ఆ 'జంతువులే' నని నా వూహ. అది హాస్యాస్పదమైతే కావచ్చు. అయినా యీ భావం నానుంచి దూరం కాలేదు.

వేటమీద అతనికి గల మోజా నాకు భరించరానిదే నైనా, సత్యం పట్ల నాకా క్షణంలో గౌరవం కలిగింది. అతనో వేటగా డైతేనేం ? ఆ చనువూ, ఆ స్నేహం—చాలు.

“ఆ కారు .... మీదేనా ?” నిర్ధారణ చేసుకునేందుకు అడి గాను.

“అవును. గర్వం కాదనుకుంటే నేను బ్రహ్మాండంగా డ్రైవ్ చేయగలను. అంత స్పీడులో వస్తున్న కారులో, స్టీరింగు దగ్గరనే కూర్చోకపోతే మీకు గొప్ప ప్రమాదం జరి గుండేది” చివర్ని నవ్వేశాడు.

"థాంక్స్" అన్నాను.

గుమ్మం దగ్గర అలికిడయ్యింది. ఒకావిడ అక్కడ తచ్చాడుతుండటం గమనించాను. అతను ఆమెను చూచి అన్నాడు.

"లోపలికి రా."

ఆమె వచ్చింది. అతని కుర్చీ పక్కన నిలబడ్డది.

"వీరు ...." అతను నన్ను ఆవిడకి పరిచయంచేసే ఉద్దేశాన్ని నా పేరు తెలీకపోవడంతో ఆ క్షణానికి ఆపుకున్నాడు.

సిగ్గుపడ్డాను. ఇంతవరకూ కనీసం నా పేరైనా చెప్పక పోడం అన్యాయమే మరి. పేరు చెప్పాను.

"కొండదేవర గుట్ట దగ్గర స్పృహతప్పి పడిపోయారు." ఆ దంపతుల సంస్కారానికి ముచ్చటపడ్డాను.

అంతలో పనిమనిషి పళ్ళూ, బిస్కట్లూ, పాలూ తీసుకొచ్చింది. అవి టీపాయ్‌మీదుంచి వెళ్ళిపోయింది.

"అవి తీసుకోండి" అత నన్నాడు.

సత్యం వేటగాడైతేనేం—అతని ఆదరణ ?

"అవసరమైన పనుంటేనే గాని యీ ప్రాంతాల్లోకి ఎవ్వరూ రారు. మన జిల్లాలవాళ్ల కిక్కడేం తోచదసలు. అన్నట్టు అడగడం మరిచాను—ఏవూరు వెడుతున్నారో ...."

చెప్పాను.

"ఆ ఊరెళ్లాలంటే బస్సు కోసరం మళ్లా మీరు కొండదేవరగుట్ట దగ్గరికే వెళ్లాలి. మనం ఆ గుట్టకి మూడు మైళ్ల పక్కనున్నాం."

"ఈ రాత్రికి నేను వెళ్లిపోవాలి."

"ఈపక్క ప్రయాణాలు అనుకున్నంత తేలిక్కాదు, మాష్టారు. బస్సులు వా టిష్టమొచ్చినప్పు డొస్తాయి. పైగా చీకటి పడిందంటె ప్రయాణాలు తప్పనిసరిగా మానుకోవాలి. మీరీపూట కిక్కడ భోజనం చేయండి. రేపుదయం మిమ్మల్ని బస్సెక్కించే బాధ్యత నాది. సరేనా" అన్నా డతను అనునయంగా.

మరొకప్పుడైతే అలాగే ఉండిపోదును. కానీ,

"అవసరంగా వెళ్లాలి. ఉత్తరమొచ్చి పదిరోజులైంది. భాస్కరమని నా మిత్రుడు చావు బ్రతుకుల మధ్య నున్నట్టు ఉత్తరంలో ఉంది. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. వాళ్లకి నేను చాలా కావలసిన మనిషిని ......"

ఇంకా ఏం చెప్పేవాడినో తెలీదుగాని వాళ్లిద్దర్లో ఎవ్వరూ మాటాడకుండా గుడ్లప్పగించి నావైపు చిత్రంగా చూడటంతో మాట లాపేశాను.

క్షణంలో ఆవిడ పూర్తిగా మారిపోయింది. తలొంచేసింది. చేతుల్తో కళ్లు మూసుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తోంది. అతను ఆమెను దగ్గరికి తీసుకున్నాడు.

"ఏమిటిది సుభద్రా! మరీ పసిపిల్లలా. తప్పు కదూ'!

సుభద్రా! సుభద్రా! ? నా చేతిలోని యాపిల్‌పండు ప్లేటులో ఉంచి ఆ యిద్దరి వైపూ చూస్తూండిపోయాను. అతను నా అవస్థని గమనించేడు కాబోలు—

"మరేమీ లేదు. మీరేం ఖంగారుపడకండి రావుగారూ సుభద్ర కాస్త సుస్తీ మనిషి అంతే" అన్నాడు.

ఆవిడ అతని మెడని కావిలించుకుంది. అతను ఆమెను పక్క గదిలోకి తీసుకెళ్లాడు.

నాకేం తోచకుండా ఉన్నది. దారిని పోతున్న దానయ్యని యిలా రావడమేమిటీ, వచ్చి వాళ్ల ఆతిథ్యం పొందడ మేమిటీ, పొంది వాళ్ల మనస్సు నొప్పించేలా మాటాడట మేమిటి ?

ఇంతకీ భాస్కరం ప్రియురాలు సుభద్ర, ఈ సత్యం భార్య సుభద్ర యిద్దరూ ఒక్కళ్లేనా ? ఈమాటు సత్యం నాకు నచ్చని అసలైన వేటగాడి బొమ్మ రూపంలో నా కళ్ల ముందు తచ్చాడినట్టయింది. కొంచెం భయపడ్డాను.

మరో పది నిమిషాల్లో సత్యం నా గదిలోకి రానే వచ్చాడు. నన్ను కూర్చోమని చెప్పి అన్నాడు.

"సుభద్రకి ఫిట్సు రావడం కొత్తకాదు. ఈ పల్లెటూళ్లో నేటి వైద్యు లొక రున్నారు. ఖబురంపాను. రేపుదయానికి మీ ప్రయాణం ఎటూ వాయిదా వేసుకోవలసిందే. తప్పదు. కొంచెంసేపు రెస్టు తీసుకోండి. మళ్లీ భోజనానికి పిలుస్తాను." అని చెప్పి నామాటైనా వినకుండా వెళ్లిపోయాడు.

చాలా తమాషైన సన్నివేశంలో ఇరుక్కున్నాను. ఆలోచనలతో తల వేడెక్కిపోతున్నది. తలుపుకి గడియవేసి మంచం మీద వాలిపోయి గట్టిగా కళ్లు మూసుకున్నాడు.

తలుపు శబ్దమైతే కళ్లు విప్పాను. తలుపు తీశాను. నౌకరు నిలబడి ఉన్నాడు. అతని చేతిలో టవలూ సబ్బూ ఉన్నాయి. స్నానం చేయవలసిందిగా చెప్పాడు. దొడ్లోకి వెళ్లాను.

స్నానం ముగించి నా గదిలోకి వచ్చేసరికి సత్యం కుర్చీలో ఉన్నాడు. సిగరెట్టు ముట్టిస్తూ—

"సుభద్రకి మళ్లా తెలివి తప్పింది. మరో గంటలో స్పృహ వస్తుందని వైద్యుడు చెప్పాడు" అన్నాడు.

మనసుల్లో నొచ్చుకున్నాను.

"ఆ .... అన్నట్టు మీ మిత్రుడికేం జబ్బుటా" అడిగాడ తాపీగా.

"లోగడ అతనికి కడుపులో పుండు పుట్టింది. ఆప రేషను చేసి బాగుచేశారు. మళ్లా మొన్నీ మధ్యనే అలాంటి జబ్బేదో వచ్చిందిట. హాస్పటల్లో చేర్చారుట. చాలా గాభరా చేస్తున్నట్టు ఉత్తరం వచ్చింది."

ఇక్కడ కాసేపాగి, అతని మొహంవంక పరిశీలనగా చూచి మళ్లా మొదలెట్టాను.

"నాకు భాస్కరంతో అట్టే పరిచయం లేదు. వాళ్ల అత్తవారి ఊరు మా వూర కావడంవల్ల వాళ్లావిడ ద్వారా అతను నాకు తెలిశాడు." అన్నాను.

అతనేం మాటాడలేదు. తన నొసటిని చేత్తో రాసు కున్నాడు. మరో చేతిలో సిగరెట్టు వెలుగుతోంది. రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడచిన తర్వాత వాచీ చూచుకొని అన్నాడు.

"అప్పుడే ఏడైపోయింది. మీరు భోజనానికి లేవాలి మరి."

భోజనం నా కొక్కడికే వడ్డించారు. అతను నవ్వుతూ అన్నాడు.

"సుభద్రా నేను తర్వాత భోంచేస్తాము. ముందు మీరు కానివ్వండి."

మధ్యాహ్నం పీడించిన ఆకలి యిప్పుడు లేదు. ఎలా గోలా భోజన మయ్యిం దనిపించుకున్నాను. అతను వక్కపొడి డబ్బి, సిగరెట్టు పాకెట్టు నాముందుంచి—

"అవసరమైతే పిలవండి. ఈ రాత్రికి కమ్మగా నిద్ర పోండి" అన్నాడు గది దాటుతూ.

చిత్రమైన ఆతిథ్యం !

నిద్ర పట్టడంలేదు ! ఆ యింట్లో అంతా నిశ్శబ్దంగా ఉంది. అందరూ నిద్రపోతున్నట్టున్నారు. ఏమీ తోచకపోడంతో మంచంమీంచి లేచాను. వాచీ చూసుకున్నాను. పది గంటలు. గదిలోంచి వరాండాలోకి వొచ్చాను. సత్యం కనిపించాడు. పేము కుర్చీలో తలని పైకెత్తి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. నన్ను చూడగానే సర్దుకు కూర్చుని అడిగాడు.

"నిద్ర పట్టడంలేదులా గుంది."

"అవును."

"పాపం .... మనసంతా మీ మిత్రుడిమీద ఉండి ఉంటుంది."

ఏమిటీ పరామర్శ ?

"ఒక విషయం అడిగేదా ?" అన్నా డతను.

"అడగండి."

"మీకు సుభద్ర గురించి ఏమీ తెలీదా ?"

ఉలిక్కిపడ్డాను. ఈ రకమైన ప్రశ్న ఇంత హఠా త్తుగా అడుగుతాడని తెలీదు నాకు. వెంటనే జవాబు చెప్ప లేకపోయాను.

"నిజం చెప్పాలి."

"మీరు ఏ సుభద్ర గురించి అడుగుతున్నారో అర్థం గాకుండా ఉంది."

అతను నవ్వేశాడు. తర్వాత అన్నాడు.

"నే నూహించినంత వరకూ మీకు ఇద్దరు సుభద్రలు తెలుసు. అవునా ?"

ఇలాటి మనిషికి నేనేమని చెబుతే నచ్చుతుంది ?

"నిజానికి నాకే సుభద్రా తెలీదు. రాజీ చెప్పిన మీదట భాస్కరానికి ఎవరో సుభద్ర అనే అమ్మాయితో పరిచయ మున్నదన్న సంగతి మినహా మరింకేమీ తెలీదు." అన్నాను.

అతను తేలిగ్గా నవ్వేడు. చూస్తుంటే యీ మనిషికి నవ్వడం 'హాబీ'లా గుంది.

"సాక్షాత్తు ఆ సుభద్రే నా భార్య ! ఇది మీరీపాటికి వూహించే ఉంటారు. అవుతే యిది నిజమా అని నన్ను అడగ సంశయించి వూరుకున్నారు. కదూ."

సత్యం మనసులు చదవగల నేర్పరి. అప్పటికీ నేనేం మాటాడలేదు.

"సుభద్ర మా మాస్టారి కూతురు. నాకు భాస్కరం బాగా తెలుసు. అతను సుభద్ర నెంత ప్రేమించిందీ, ఆ దరి మిలా అత నెవర్ని పెళ్లి చేసుకున్నదీ తెలుసు. ఆ తర్వాత మాస్టారి అనుమతిమీద సుభద్రని నేను పెళ్లి చేసుకున్నాను. నా దగ్గర అన్నీ ఉన్నాయి. భాస్కరానికిలేని ఆస్థీ, హెూదా, పరపతీ అన్నీ ఉన్నాయి. కానీ మాస్టారు ! నేను భాస్కరాన్ని కాదు. కాలేను" అన్నాడు బాధగా అతను.

నా మనసు చివుక్కుమంది.

ఆ తర్వాత అతనేదో మాటాడా లనుకున్నాడు గాని మాటాడలేకపోయాడు. నా చేతిని గట్టిగా నొక్కుతూ.

"పోయి పడుకోండి ప్లీజ్." అన్నాడు.

—ఆ ఉదయం మే మిద్దరం అతని కారుమీద కొండ దేవరగుట్ట దగ్గరికి బయలుదేరాం. కానీ అతను కారుని అక్కడ ఆపలేదు. తిన్నగా తీసుకొచ్చి నిన్న నే దిగిన రైలు స్టేషను దగ్గర ఆపేడు. నా కిదేం అర్థంకాలేదు. కారు దిగుతూ అదే అడిగాను.

"మరో పావు గంటలో మీవూరికి రైలుంది. తిరిగి వెళ్లిపోండి."

"నేను వెళ్లవలసింది మావూరు కాదు. భాస్కరం వాళ్ల వూరు."

అతను నా మాట వినిపించుకోలేదు. స్టీరింగ్ దగ్గర కూర్చుని డోరు లాక్కుని అన్నాడు.

"భాస్కరం యింక లేడు మాస్టారు ! నాలుగు రోజుల క్రితమే ఈ దారుణం జరిగింది."

నా నెత్తిని పిడుగు పడినట్లయింది. ఇంకా వివరించి చెప్పవలసిన బాధ్యత అతనిది. కాని అప్పటికే అతని కారు చాలా దూరం వెళ్లిపోయింది.

కమ్మని లతాంతములకు మ్మొనసి

★

శ్రీ సంపత్కుమార

"కమ్మని లతాంతముల...." యన్న పద్యము నన్నయ గారిది. ప్రస్తుతము లభ్యమగు భారత ప్రతులయందు ఆ పద్య మీ క్రింది విధముగా ముద్రితమయి యున్నది—

"కమ్మని లతాంతముల కుమ్మొనసి వచ్చు మధు
పమ్ముల సుగీత నినదమ్ము లెసఁగెంజా...."

—ఆది. 5—138.

ఈ ఉదాహృత పద్యభాగము వివాదముల కాస్పదముగా నున్నది. దీనిని బట్టియే మిగిలిన పద్యభాగమంతయు. పయి పాదమున 'లతాంతములకుమ్మొనసి' యని యున్నది. 'లతాంతములకున్ మొనసి' యనునది 'లతాంతముల కుమ్మొనసి' యని యెట్లగును ? ఆంధ్ర శబ్ద చింతామణి యందు ద్రుత సంధి సందర్భమున—

"లుగ్వా ద్రుత ప్రకృతి కాత్పరతస్సర శే స్థిరేచనన్యస్యాత్
అలుకిచ సంశ్లేషస్యాత్
బిందుం ప్రవదంతితం క్వచిత్ కేచిత్."

అని సరళ స్థిరములకు ముందున్న ద్రుతమును గూర్చి మూడు సూత్రములున్నవి. 'సరళ స్థిరములు పరమైనప్పుడు ద్రుతమునకు లోపము వికల్పముగా నగును. లోపము కలుగునప్పుడు సంశ్లేషయగును. ఒక్కచో ఆ ద్రుతమును బిందువుగా గూడ చెప్పుదురు' అని ఈ మూడు సూత్రముల భావము. ఈ సూత్రముల వలన '—కుమొనసి', '— కున్మొనసి' '— కుంమొనసి' యను మూడు రూపము లేర్పడును. కావున ఈ మూడు రూపములలో నేదో యొకరూపము పద్యమందుండ వలెను గాని ఏతద్భిన్నముగా '— కుమ్మొనసి' యని ద్విత్వ మకారముగల పాఠము ముద్రిత మగుట సరియైనది కాదు గదా.

పైన చెప్పిన దానిని బట్టి ముద్రిత పాఠము తప్పగు చుండగా, ఉండవలయుననుకొను మూడు రూపములలో నేది యున్నను గూడ ఆ పద్యమందు నియతముగా నుపయోగింప వలసిన ప్రాసయతి తప్పును. 'కుమొ' లేక 'కున్మొ' లేక 'కుంమొ' ప్రాసయతి చెల్లింపవలసిన స్థానము. 'కమ్మని' లోని ద్విత్వ మకారమునకు కేవల మకారముగాని, న—మల సంయుక్తముగాని, బిందుపూర్వకమకారముగాని ప్రాస చెల్లుటకు వీలులేదు. అందువలన పై మూడు రూపములలో బిందు పూర్వక మకారముగల '— కుంమొనసి' యను రూపము ప్రయుక్త మయినట్లుగా భావించి అప్పకవి దీనినొక ప్రాసభేదముగా చెప్పినాడు. బిందు పూర్వకములయిన న—మలకు ద్విత్వములగు న— మలతో ప్రాసచెల్లును. ఈ ప్రాసకు 'అనునాసిక ప్రాసమ'ని అప్పకవి పేరిడినాడు.

అయితే నన్నయగారు 'అనునాసిక ప్రాస' జన్మకు హేతువుగా అట్టి ప్రాసమునుపయోగించినారా యన్నది విచారణీయ మయినది. నిజమునకు ప్రాస విశేష మిచ్చట లేదన్నది యొక అభిప్రాయము. ప్రాచీన కాలములో ద్విత్వ మకారము వ్రాయవలసిన స్థలములలో బిందు పూర్వక మకారము వ్రాయుచుండెడివారు. అనగా 'తమ్ములు' అని ద్విత్వ మకారముతో వ్రాయుటకు బదులు 'తంములు' అని బిందు పూర్వక మకారము వ్రాయుచుండెడివా రన్నమాట. ఈ పద్ధతి లోనే.... "నన్నయ "కమ్మని" అని వ్రాయడానికి 'కంమని' అని వ్రాసుకొని 'లతాంతములకున్ మొనసి' అన్నప్పుడున్న ద్రుతానికి స్థిరమైన మకారం పరమవుతుంటే పూర్ణ బిందువుచేసి 'లతాంతములకుం మొనసి' అనే పూర్ణాను స్వార రూపాన్ని తయారు చేసుకుని 'కంమని'లోని బిందు పూర్వక మకారానికి 'లతాంతములకుం మొనసి'లోని బిందు పూర్వక మకారానికి ప్రాసయతిని సరిపెట్టుకున్నాడు." (ధ్వని— లిపి— పరిణామం. పు. 170— 171) అయితే అప్పకవి 'కమ్మని' ద్విత్వ మకారముతో '—కుంమొనసి', బిందు పూర్వక మకారముతో తననాడు గోచరించుటజేసి దానిని ప్రాస విశేషముగా భావించియుండును.

'కమ్మని లతాంత....' పద్యము 'లయగ్రాహి'. ఈపద్యమందు సరూపాక్షర యతికి బదులు ప్రాసయతి యుపయో

గింప బడును. ఇట్లు ప్రతిపాదమున నాల్గుచోట్ల చొప్పున మొత్తము పద్యమందు పదునారు చోటులని నీ ప్రాసాక్షర ముండును. పై పద్యమందా పదునారు స్థలములివి— (1) కమ్మని, (2) కుమ్మొనసి, (3) మధుపమ్ము, (4) నినదమ్ము (5) చూతమ్ము, (6) కిసలయమ్ము, (7) ముకుళమ్ము, (8 ముదమ్ము, (9) వాచా, లమ్ము, (10) కులమ్ము, (11) మధు రమ్ము, (12) అనిశమ్ము, (13) భా, రమ్ము, (14) నికరమ్ము, (15) చయమ్ము, (16) వనమ్ము. (ఇవి ముద్రిత ప్రతిలోని రూపములు) ఈ పదునారింటిలో రెండవది 'కుంమొనసి' యని యుండవలెననిగదా యనుకొన్నది. అట్లే మొదటిది 'కంమని' యనిగదా. దీనినిబట్టి మిగిలిన పదునాల్గు చోట్ల గూడ ద్విత్వ మకారముకాక బిందుపూర్వక మకారమే యుండ వలెను గదా. అనగా 'మధుపంము' 'నినదంము' అనురీతిగా. అట్లే యున్నవనియు చెప్పబడుచున్నది.

పయి పదునారు స్థలములలో మొదటిది రెండవది తప్ప మిగిలిన పదునాల్గు స్థలములందలివి విభక్తి ముకార ములు. విభక్తి ముకారములు బిందు పూర్వకములుగా నుండునా యన్నది విచారణీయము. ఈ సందర్భమున కవసర రములైన చింతామణి సూత్రములివి. (1) 'స్యాద మహతాం సోశ్చము'. (2) 'తదుపరి పునర్ముబా ప్రాచామ్', అమహ త్తులకు 'ము' ప్రథమైక వచన ప్రత్యయముగా విధింప బడినది. కావున మొదటి సూత్రముచే 'వనము, ధనము' మొదలగు రూపములు సాధింపబడినవి. మొదటి సూత్రముచే విహితమయిన 'ము'పై రెండవ సూత్రము 'ము—బు'లను చెప్పుచున్నది. ఈ ము— బులు వికల్పముగా విహితములు. అవియు పర్యాయములుగా వచ్చును. అనగా 'వనము + ము' అని, వనము + బు అని. ఈ సందర్భమున బాలసరస్వతి 'ఉపదేశేఽజ మనాసిక ఇత్, అనుపాణినీ యాధారముగా విభక్తి ముకారములోని ఉకారమునకు లోపము చెప్పినాడు. అప్పుడు, వనమ్ + ము, వనమ్ + బు అని యుండును. ఆ పైన నీ రెండింటిలో మొదటి దానిని గూర్చి 'మొదలి మకారము సున్నయు వికల్పముగా నగును' అని 'వనంము' అను రూపమును సాధించినాడు. ఆ తరువాత 'మోనుస్వారః' అనుపాణినీ యాధారముతో 'వనంబు' సాధించి నాడు. 'వనంము' సాధనలో 'వనంబు' సాధనలోని ప్రామాణ్యము లేదు. 'మొదలి....' అన్న అతని వాక్యమే ప్రమాణము. కాగా 'వనంము' బాలసరస్వతీయ రూపమే య్యైనది. ('మొదలి.... వాక్యములో 'సున్నయు' ననుటచే వనమ్ము అను ద్విత్వ ముకార రూపము గూడ సాధ్యమగునని భావము). కాని ఈ సందర్భ మున అహోబలుడు మరొక విధముగా రూపసాధన నెరపి నాడు. వనమ్ + ము అని యుండగా 'చౌసరేనుస్య బిందు స్స్యాత్ మౌసరే మేళనం భవేత్' అను అధర్వణుని కారిక ననుస రించి మ్ + ములకు మేళనము కలిగించి 'వనమ్ము' అను రూపము సాధించినాడు. ఈ అధర్వణ కారిక 'తదుపరి....' అన్న చింతా మణి సూత్రమునకు పూరకము. అందువలన నన్నయ— అథ ర్వణ— అహోబలుల మతమున 'వనమ్ము' అని ద్విత్వముకార రూపమే సిద్ధించునుగాని, బిందు పూర్వక ముకార రూపము— వనంము— సిద్ధింప వీలులేదు. బాలసరస్వతి వ్యాఖ్యకు మూలము కన్పింపదు. దీనిచే నన్నయగా రాలయగ్రాహి యందు ఆ పదునాల్గు స్థలముల యందును ద్విత్వముకార మునే ప్రయోగించిరి గాని బిందు పూర్వక ముకారమును— అనగా 'మధుపంములు' ఇత్యాదిగా ప్రయోగింప లేదనుట స్పష్టము. అగుచో 'కమ్మని' పదపు వ్రాత పద్ధతి విషయ మట్లుండగా 'మధుపమ్ములు' మొదలగువానియొక్క నన్నయా భిప్రేత వ్రాతపద్ధతి ననుసరించి 'కుమ్మొనసి' యని యున్ననే ప్రాస సరిపోవును గాని 'కుంమొనసి' యని బిందు పూర్వక మకారమున్నచో సరిపోదు. (అప్పకవి దానిని ప్రాస విశేషముగా చెప్పుటవేరు.)

ఇక 'కమ్మని' వ్రాతపద్ధతి విచారణీయము. 'కమ్మని' వంటి పదములు పూర్వము బిందు పూర్వక మకారముతోడనే వ్రాయబడు చుండెడి వనుటకు ఆధారమేమో స్పష్టము గాదు. తాటాకు వ్రాత ప్రతులలోని వ్రాత లాధరము కావ చ్చును. కీర్తి శేషులు చిలుకూరి నారాయణరావుగారు 94 భారతపు వ్రాత ప్రతులను సంపాదించి, వాని యాధారమున పూర్వపు లేఖన పద్ధతిలో 'గరుడోపాఖ్యానము'ను తమ ఆంధ్ర భాషా చరిత్రలో ఒకటవ అనుబంధముగా ముద్రించినారు. గరుడోపాఖ్యానమును పరిశీలించినచో ద్విత్వ మకారము ఉండ వలసిన చోట్ల ఆ ద్విత్వముతో బాటు బిందు పూర్వకము గూడ అయియున్నట్లు నియతముగా చూపబడినది. అనగా 'ఇమ్ము' అన్నది 'ఇంమ్ము' అని యుండును గాని ద్విత్వ విరహిత ముగా 'ఇంము' అని ఉండదు. ఈ విషయ మిట్లుండగా ఈ వ్రాతప్రతులు చాల అర్వాచీనములు. వీని ననుసరించి నన్నయ నాటి వ్రాతపద్ధతిని నిరూపింప బూనుటకుదురదు. వీరికన్న నన్నయగారి నాటి, తత్పూర్వ పరములు అయిన శాసనముల ద్వారా నిరూపించుటకు వీలున్నది.

ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు 'శాసన పద్యమంజరి' అనుపేరుతో రెండు సంపుటములు (1930, 1937) ప్రక టించినారు. రెండింటియందు కలిపి మొత్తము 130 శాసనము లున్నవి. ఈ శాసనములు క్రీ. శ. 770 (అద్దంకి శాసనము) ప్రాంతమునుండి ప్రారంభమగును. వీనిలో ద్విత్వ మకారము

నకు బదులు బిందు పూర్వక మకారమున్నట్లు కన్పించదు. ద్విత్వ మకారమే కన్పించును. ఉదా. 'దమ్మ పురంబున దమ్మువులు' (పు. 1. శాసనకాలము. 770 ప్రాంతము.) 'కొమ్మసాని' (పు. 8. శా. కా. 1030) 'అతనితమ్ముణ్ణన్వయ' (పు. 11. శా. కా. 1046) 'కమ్మనాండును (పు. 38. శా. కా. 1072) 'కమ్మనాంటిరోని' (పు. 43 శా.కా. 1073 'ఫలమ్ము' (పు. 76. శా. కా. 1146) ఇట్లెన్నియొ యైన నున్నవి. ఈ శాసనములన్నియు నన్నయగారికన్న పూర్వమునుండి నన్నయగారి తరువాతి కాలమువరకు గలవి. ఈ విధముగా జూచినచో 'కమ్మని' వంటి పదములు నన్నయగారి కాలమున బిందు పూర్వక మకారముతో— 'కంమని' అనువిధముగా వ్రాయబడు చుండెడివని చెప్పుటకేవిధముగను వీలులేదు. (శ. స. 1732 నాటి రెండు శాసనములలో నొకదానియందు 'తంమ్మన్న' యని బిందు పూర్వక ద్విత్వ మకారముతో నొక రూపమున్నది. శా. స. సం. ద్వితీయ భాగము. పు. 33. మరొక దానిలో 'తంమంన్న' యని బిందు పూర్వక మకార రూపమున్నది. ఈ రెండు శాసనములు గంజాముమండలము శ్రీకాకుళము తాలూకాకు సంబంధించినవే. ఈ శాసనములు నన్నయగారికి మిగుల నర్వాచీనములన్న విషయము గుర్తింప వలయును.) 'కమ్మని' వంటి పదములలోనే కాక 'ఫలమ్ము' వంటి పదములలోని మకారము కూడ ద్విత్వముగానే యుండెడి దని స్పష్టము. కావున నన్నయగారు 'కంమని' అని వ్రాసి కొన్నారన్న మాట యుక్తి యుక్తముగా కనిపింపదు.

ఇట్లు చూడగా నన్నయగారాదియుగ్రాహియందు 'కుమ్మొంనసి' యున్నది తప్ప మిగిలిన పదునైదు స్థలములలో ద్విత్వ మకారమునే ప్రయోగించినారనుట నిశ్చయము. ఆయన రచించిన వ్యాకరణము దృష్ట్యా, శాసనముల దృష్ట్యా ఇది స్పష్ట మగుచున్న విషయము.

ఇక 'కుమ్మొంనసి' యొక్కటే వివాదనీయముగా నిలబడి నది. ఇది గూడ ద్విత్వ మకార సహితమే యని నిశ్చయింప వచ్చును. కాని 'కుమ్మొంనసి' యని సాధించుటెట్లు ? 'కేచి ద్విదంత్య భేదత్వ మనుస్వార మకారయోః' అని అథర్వణా చార్యుడు అనుస్వారమునకు మకారమునకు అభేదము చెప్పి యున్నాడు. దీనితో 'కుంమొనసి'లోని అనుస్వారమునకు మకారముతో నభేదము చెప్పబడినది. ఈ అభేదము చెప్పుట వలని ప్రయోజనమేమి ? పద్యమందలి 'కుంమొనసి'లో బిందువున్నను ద్విత్వ మకారముతో ప్రాస చెల్లుననుటకే యభేదము చెప్పుట యెట్లు పనికి వచ్చును ? ఇట్లు చెప్పి నచో నీకారికను మాత్రమే ఆధారముగా గొని 'సంయమి— రమ్యము' అనువానికి ప్రాస చెల్లుననుటకు కూడ వీలు కలుగును. కాని అట్లు కాదుగదా. నిజమునకీ 'కే చిద్విదంత్య....' అన్న కారిక 'బిందుం ప్రవదంతి....' యనుదానికి పూరకముగా భావించవలెను. కారికయందు అభేదత్వమును చెప్పుట బింద స్థితిగల రూపమును మకార స్థితిగల రూపమును గూడ సమ్మతించుటయే యగును. అనగా 'కుంమొనసి' అనియు 'కుమ్మొంనసి' అనియు రెండు రూపము లుండునని దాని భావము. 'శడయోర భేద' అనుదానిచే 'అగ్ని మీళేపురోహితం—' 'అగ్ని మీడే పురోహితం' అను రెండు రూపములును సాధువు లగు చున్నవి. డలల కభేదము చెప్పుటచే 'జలనిధి' జడనిధి యను రెండు రూపములును సాధితము లగుచున్నవి. ఇట్లే సంయుకారిక యందు చెప్పబడిన యభేదమును గూడ అను సంధించుకొనవలయును. "శబ్దానా మంత్య భాగేష్వయోను స్వారః ప్రదృశ్యతే, తస్యాది పరతో మస్స్యాత్" అని అచ్చు పరమగునపు డనుస్వారమునకు మత్వము చెప్పిన అథర్వణుడు మకారము పరమగునపు డనుస్వారమునకు మత్వము చెప్పక యభేదమును చెప్పుట యేమి ? అని ప్రశ్నింపవచ్చును. మకారము పరమగునప్పుడను స్వారమునకు తప్పక మకారము వచ్చుననుట అథర్వణ మతముకాదు. అనుస్వార రహిత రూపము కూడ నుండుటయు సమ్మతమే. కావున నిట్లు చెప్పబడినది. అంతేకాని అభేదము చెప్పినంత మాత్రమున ప్రాస సరిపోవు ననికాదు. సరిపోదుకూడ. అసలిట్టి ద్రుతసంధిలో బిందు వుండుటయే చాల తక్కువయని కేచిత్— క్వచిత్ పదము లతో నన్నయగారు సూచింపగా, మకారముండుట అంతకన్న అరుదని మరల కేచిత్ పదముతో అథర్వణా చార్యులు సూచించి యున్నాడు.

అదియునుగాక 'కమ్మని' యని ద్విత్వ మకారము వ్రాసికొని, దానికి 'కుంమొనసి' యని బిందు పూర్వక మకార మును నన్నయగారు ప్రాస చెల్లించిరనుట సమంజసము గాదు. 'కుమ్మొంనసి' యనియే ప్రయోగించి యుందురు. ఈ రూపము చింతామణిచే సాధింపబడకుండుట వింతకాదు. సాధింపబడలేదు కావుననే అథర్వణ కారికకవకాశము కల్గినది. దానిచే నిది సాధువగును. మరియు నన్నయగారు బుప్రాసము తప్ప విశేష ప్రాసమని చెప్పదగిన ప్రాసలను ప్రయోగించ లేదు. ఈ విధముగా యీలయ గ్రాహియందు సర్వత్ర ద్విత్వ మకార ప్రాస ముండుటయే నన్నయగారికి సమ్మతమని నిశ్చయింప వచ్చును.

పై లయ గ్రాహివంటిదే 'అమ్మునీశు నివాసశక్తి....' (అరణ్య, 3—113) అను మత్తకోకిల పద్యముగూడ. ఇందు

'అమ్మ్మని' యనునది 'అంముని' అని వ్రాయుటకు వీలులేదు. 'ఇదమదసే' త్యాది చింతామణి సూత్రముచే 'అమ్మ్మని' యను ద్విత్వ మకార సహిత రూపమే సాధింపబడుచున్నది. శాసనము లందెచ్చటను ఇట్టి (త్రిక) సంధిలో బిందు పూర్వక మకారము లేదు. ఉదా : 'గంటండిమ్మహిని' (శా. ప. మం. ప్ర. భా. పు. 21 శా. కా. శ. ప. 1062) ఈ పద్యమందలి మిగిలిన మూడు పాదములందు 'మేఘమ్మ్మ' 'ప్రమో, దమ్మ్మ'— 'చే,సెమ్మహా' (చేసెన్ + మహా) యని—యున్నది. వీని ఈ స్వరస్వరూపమును గూర్చి లయగ్రాహి సందర్భముననే చెప్పబడినది.

అనంతుడు మొదలగు కొందరు బిందు పూర్వక మకార స్థితిని స్థిరీకరించుచున్నట్లుగా వ్రాసినట్లు కనిపించు పద్యముల విషయ మప్రస్తుతము. అది మరొక వ్యాసముగా వ్రాయదగినది.

సృజనాత్మక రచన

లక్షరూపాయిల బహుమతి

భారతవర్షంలో నేడు, దేశ భాషలలో ప్రత్యేక ప్రత్యేకంగా ప్రశస్తమైన సాహితీ రచనలకు బహుమతులిచ్చే ప్రాంతీయ ప్రణాళికలు లేకపోలేదు. కాని యీ భిన్న భిన్న భాషా రచన లన్నింటిని పరిశీలించి, వానిలో నున్నట్టి మహోత్తమ రచనకు బహుమతి నిచ్చే పథకం లేదు. అట్టి బహుమతి నిచ్చే సంస్థను నెలకొల్పుట భారతజాతి కత్యంతావశ్యకమై యున్నది. ఆ బహూకరణ—మన జాతి గౌరవమునకు తగినట్లుగాను, రచయితకు, పుష్కలముగా ధనము లభించునట్లుగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగాను ఉండవలెను.

1. సంస్థ – భారతీయ జ్ఞానపీఠము

ఇట్టి ఉద్దేశంతో, క్రీ. శ. 1944 లో భారతీయ జ్ఞానపీఠమనే సాంస్కృతిక పరిశోధన సంస్థను శాంతిప్రసాద్ జైన్ అనే ఆయన స్థాపించేరు. ప్రాచీనమైన సంస్కృత భాషా గ్రంథాలనే కాక, ప్రాకృతము, పాళీ, తమిళము మొదలగు దేశభాషా గ్రంథాలను వెలుగులోనికి తీసుకొని రావడమే కాక, నవీన దేశభాషా రచనలలో ఉత్తమమైన వానిని ప్రోత్సహించడము—ఈ సంస్థ నిర్ణయించుకున్న ప్రణాళికలలో ముఖ్యమైనది. ఈ నిర్ణయానుసారంగా, ఏటేట దేశభాష లన్నింటిలో లోకోత్తరంగా ఉండే రచనకు ఒక లక్ష రూపాయిల బహుమతి ఇవ్వడానికి పూనుకొన్నది.

2. ప్రణాళికా పరికరాలు

స్థూలంగా, ఇట్టి పని నిర్వహించడానికి ముఖ్యంగా గ్రంథ నిర్ణయం చేసి, ఆ గ్రంథం విలువ కట్టి, దానిలో ఉండే విశిష్టతను పరిశీలించడానికి, ఒక విధమైన సాధన సామగ్రి ఉండవలెను—అవి ప్రత్యేక వర్గాలుగల సంఘాలుగా ఉంటవి. మౌలికమైన విషయాలను సేకరించడము—ప్రతి భాషలోను ఉత్తమ రచనను నిర్ణయించడానికి, ఆ భాషలో ఒక సలహా సంఘం నియమించడము—ఈ సలహాసంఘ నిర్ణయాలను తిరిగి చాలనీ న్యాయంగా పరిశీలించడానికి, ప్రతి్యేక భాషావర్గ సంఘాన్ని నియమించడము—దానిపైని తుది నిర్ణాయక సంఘము—ఉండడము జరుగుతుంది. ఈ సంఘంలో అతి గౌరవనీయులు, నిష్పాక్షికంగా, సాహిత్య రచనలను విలువకట్టగలిగిన విశేషజ్ఞులు పన్నెండుమంది ఉంటారు.

3. అర్హత

ఈ బహుమతికి ప్రస్తుతము భారతజాతికి సంబంధించిన ప్రతి రచయితకు అర్హత గలదు. అతని రచనలు—ఒక పుస్తకంగాని, అనేక గ్రంథాలుగాని, భారతీయ రాజ్యాంగ చట్టము 8 వ షెడ్యూలు ప్రకారం ప్రచారంలో ఉన్న భారతీయ భాషలో ఉండాలి. అది ఒక నిర్ణీతమైన పద్ధతిని పరిశీలితమై తక్కిన సమకాలిక భారతీయభాషా రచన లన్నింటి కన్నా శ్రేష్ఠముగా ఉండాలి. ఒక రచయిత యిదివరలో తాను చేసిన సాహిత్య కృషి కూడా ఇట్టి నిర్ణయాలకు తోడ్పడవచ్చును. ఇది సాధారణంగా, ఏ రెండు భాషలలోనూ ఒకే విధమైన రచనలు పోటీకి వచ్చినప్పుడు నిర్ణయానికి సహకారి అవుతుంది.

సృజనాత్మక రచన అనగానే, అది రచనకే కాక ఆ రచనా స్వరూపానికి, సాహిత్య ప్రక్రియకు వర్తిస్తుంది.

4. ప్రచురణ కాలం

ప్రస్తుతము మొదటి బహూకరణకు సలహా సంఘాల ఈ 1963 సంవత్సరానికి కనీసము 5 ఏండ్లు ముందుగా ప్రకటితమైన గ్రంథాలను మాత్రమే పరిగణిస్తుంది. కాని ఆ పుస్తకాలు 1920 సంవత్సరానికి ముందు ప్రకటింపబడరాదు. ఈ తరువాత వచ్చే ద్వితీయ తృతీయ బహుమతులను ఒక్కొక్క యేడు క్రమక్రమంగా తగ్గించడం జరుగుతుంది. దీనికొక ఉదాహరణ—ఈ మొదటి బహుమతి 1963 లో యిస్తే, అప్పుడా గ్రంథాలు 1920—1958 మధ్య ప్రకటితమై ఉండాలి. రెండవ బహుమతి యిచ్చినప్పుడు 1921—1959 మధ్య ప్రకటితమైన గ్రంథా

లనే పరిగణిస్తారు. ఆవిధంగానే మూడవ బహుమతికి 1922—1960 ఈవిధంగా ఉంటుంది.

5. తీర్పునకు మూలసాధనాలు

సాహిత్య అకాడమీ గుర్తించిన సంస్థలు, విశ్వవిద్యాలయాలలో భాషా శాఖలు, కొంతమంది ప్రసిద్ధ విమర్శకులు—ఇంకా మరికొన్ని సంస్థలు—వీటిని ఈ పీఠం తమ తమ భాషలలో ప్రకటితమై, లోకోత్తరంగా ఉన్న గ్రంథాలని పేర్కొమని కోరుతుంది. కాని అంతమాత్రంచేత పైని పేర్కొన్నవారే అని కాదు. ఇతరులు కూడా సలహా సంఘంవారికి తమ తమ అభిప్రాయాలు తమ తమ భాషలోని గ్రంథాలను గూర్చి తెలుపవచ్చును.

6. సలహా సంఘాలు

ప్రతి భాషకు—ముగ్గురు సలహాదారులున్న సంఘముండును. వీరు ప్రసిద్ధ విమర్శకులు, మహా రచయితలుగా నుందురు. వీరికి సమకాలికముగా అభివృద్ధి చెందుచున్న రచనలను గూర్చిన పరిజ్ఞానమే కాక—సాముదాయికంగా, వారివారి సాహిత్యాలలో వెలువడిన రచనల పరిజ్ఞానము కూడ తప్పక ఉండవలెను.

ప్రతి సంఘము తమకు వచ్చిన సిఫారసులను క్రోడీకరించి, పరీక్షించి, విలువకట్టి వానిలో ఒక పుస్తకమునకు మాత్రము ఇది అన్నింటికన్న గొప్పది అను నిర్ణయపు సిఫారసుతో పీఠము నిర్ణయించిన ప్రణాళిక ప్రకారము పై సంఘంవారికి పంపాలి. ఈ నిర్ణయమునకు ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించాలి. లేకపోతే ఏ యిద్దరైనా ఒప్పుకోవాలి. గ్రంథమును గూర్చి సమగ్రమైన సమీక్ష చేయుటయే గాక గ్రంథకర్త యొక్క యితర రచనలను గూర్చి అతని సాహిత్య స్థానమును గూర్చి సంపూర్ణ నివేదిక పంపవలెను. ఇట్లు వారు నిర్ణయించిన ఒక పుస్తకానికే గాక, ఆ స్థాయికి రాతగ్గ పుస్తకాలు అయిదింటికి హెచ్చు కాకుండా, మూడింటికి తక్కువ కాకుండా పై రీతిగానే నివేదికలు పంపాలి. ప్రతి సంఘము తమకు వచ్చిన గ్రంథముల స్వాభావికతను గూర్చి ఇతర విశేషాలను గూర్చి కూడా విపులంగా తెలుపాలి. వీని అన్నింటిలోను వారు బహుమతికి నిర్ణయించిన గ్రంథం—ఏవిధంగా విశిష్టమైనదో ఆ కారణాలు సక్రమంగా నిరూపించాలి. ప్రతి సలహా సంఘము ఒక సమావేశకర్త (కన్వీనరును) ఎన్నుకుంటుంది. అతడు, భాషావర్గ సంఘము ముందట తుది నిర్ణాయక సంఘంవద్ద ఈ సలహా సంఘానికి ప్రతినిధిగా వ్యవహరిస్తాడు.

7. నిర్ణాయక సంఘం

ఈ నిర్ణాయక సంఘంలో 12 మంది సభ్యులుంటారు. వారందఱూ అఖిల భారత స్థాయిలో ఉండేవారు. స్వతంత్రంగా నిష్పాక్షికంగా సాహిత్య రచనలకు విలువ కట్టి తీర్మానం చేసేవారుగా ఉంటారు. భారతీయ జ్ఞానపీఠం తరఫున మరి ముగ్గురు సభ్యులు, ఒక అనధికార సభ్యుడు ఈ సంఘంలో ఉంటారు.

సలహా సంఘంవారు పంపిన సిఫారసులను, నిర్ణయాలను వీరు నిశితంగా పరిశీలిస్తారు. ఇంతేకాక, ఆయా సలహా సంఘాలవారు తమ తమ సిఫారసుల గురించి వీరి వద్దకు ప్రతినిధులను పంపవచ్చును. ఆ ప్రతినిధులు సలహా సంఘ నిర్ణయాలను గురించి వాఙ్మూలాలు యిస్తారు. నిర్ణాయక సంఘ సభ్యులు వానిని విని తీర్మానం చేస్తారు.

ఈ నిర్ణాయక సంఘానికి హిందూదేశంలోనేకాక ఖండాంతరాల్లో ఉన్నవారి సలహా కూడా పొందడానికి అధికారం ఉన్నది.

8. భాషా - వర్గ సంఘాలు

ఈ నిర్ణాయక సంఘం యీ క్రింది విధంగా భాషా వర్గ సంఘాలనే ఉపసంఘాలను ఏర్పాటు చేయవచ్చును. ఈ ఉపసంఘాలు కొంతమంది ప్రసిద్ధ పండితులను తమలో చేర్చుకోవచ్చును. వీరి సలహాలవల్ల ఆయా సలహా సంఘాలు పంపిన పుస్తకాల నన్నింటిని పునః పరిశీలన చేసి ఏ నాలుగైదు పుస్తకాలో తుది నిర్ణయానికి యీ ఉప సంఘం పంపుతుంది.

1. మరాటీ—గుజరాతీ.
2. తమిళము—మళయాళము.

---

3. తెలుగు—కన్నడము.
4. బెంగాలీ—అస్సామీ—ఒరియా.
5. కాశ్మీరీ—పంజాబీ—ఉరుదు.
6. హిందీ—సంస్కృతము.

ఆయా సన్నివేశాలను, అవసరాలనుబట్టి యీ భాషావర్గ ఉపసంఘాలుకొన్ని హెచ్చును వచ్చును, కొన్ని తగ్గిపో వచ్చును.

9. భాషావర్గ సంఘాలు - నిర్మాణ కార్యకలాపాలు

ప్రతి సలహాసంఘ సమావేశకర్త యీ భాషావర్గ సంఘానికి భాషలో ప్రసిద్ధ విమర్శకుని నొకనిని ప్రతినిధిగా పంపాలి. ఆ సమావేశకర్త—యీ ప్రతినిధి ప్రతి భాషావర్గ సంఘంలోను ఉంటారు. వారు, నిర్ణాయక సంఘంలో సభ్యుడుగా నున్న ఒక, అధ్యక్షుడు క్రింద పనిచేస్తారు. వారు తమ నిర్ణయాన్ని నిర్ణాయకసంఘంవారి కందించాలి. ఒకవేళ యీ సభ్యులు ఒక తీర్మానానికి రాలేకపోతే, వారివారి అభిప్రాయాలను తన అభిప్రాయంతో కూడా జోడించి, నిర్ణాయక సంఘంవారి తుది నిర్ణయానికి పంపుతాడు.

10. తీర్పునకు సామాన్య పథకం

భారతీయ జ్ఞానపీఠం తుది తీర్మానం విషయంలో కొంత సామరస్యం కల్పించడానికి ప్రయత్నం చేస్తుంది. బహుమతి వచ్చిన గ్రంథాలలో, ఉత్తమమైనవని సలహా సంఘాలు నిర్ణయించిన నాలుగైదు గ్రంథాలను హిందీ—ఇంగ్లీషు భాషలలో, అనువాదాలు చేయించి ప్రకటించడానికి ఈ పీఠం ధన సహాయం చేస్తుంది. అవసరం అయితే ఇంకా మరికొంతమంది పరిణితులను ఈ పీఠం నియమిస్తుంది.

11. బహుమతి ప్రదానము

ఏ భాషకు ఏ సంవత్సరంలో బహుమతి వచ్చినదో ఆ భాష తిరిగి రెండు సంవత్సరాల వరకు పోటీకి రాకూడదు.

12. తుది నిర్ణయ ప్రకటన

వారు వేసుకొన్న కార్యక్రమాన్ని అనుసరించి సలహా సంఘమువారు, భాషావర్గమువారు, ఉపసంఘమువారు, తుది నిర్ణాయక సంఘంవారు చేసిన సిఫారసు ననుసరించి బహుమతి ప్రకటన చేస్తారు.

13. మరణానంతర ప్రదానము

సలహా సంఘము సిఫారసు చేసిన గ్రంథమును రచించిన యతడు, చనిపోయిన యెడల—తుది నిర్ణయం, ఆ గ్రంథానికి అయిన యెడల, ఆ చనిపోయిన యాతనికి బహుమతి ప్రదానం కావింపబడుతుంది. అట్టి పరిస్థితుల్లో ఆ బహుమతి కోర్టు మూలంగా నిర్ణీతమైన గ్రంథకర్త సంబంధీకులకు మాత్రమే చెందుతుంది. ఇందులో ఏమైనా తగవు ఉంటే, అది నిర్ణాయక సంఘంవారే తీర్మానం చేస్తారు.

14. అభిప్రాయ భేదం

ఒకే గ్రంథం గూర్చి తుది నిర్ణయంలో అభిప్రాయ భేదము వస్తే అప్పుడా బహుమతి విభాగాలు చేస్తారు.

15. బహుమతి గతించుట

నిర్ణాయకసంఘం వారా సంవత్సరమే భాషా పుస్తకము ఈ బహుమతికి అర్హముగా లేదు అని నిర్ణయిస్తే అది గతించిపోతుంది.

16. సలహాసంఘాల పునర్నిర్మాణము – నిర్ణాయక సంఘము

సలహాసంఘాలు ప్రతి మూడోయేట క్రొత్తగా ఎన్నుకోబడతాయి. నామినేటు సభ్యులలో మూడవ వంతు క్రమ పర్యాయంగా విరమిస్తారు. వారిని తిరిగి బ్యాలెటు మూలంగా జ్ఞానపీఠం చేర్చుకుంటుంది.

17. బహుమతి స్వీకరణ ఒక్కమారే

ఒక గ్రంథకర్తకు ఒక పర్యాయం బహుమతి లభిస్తే తిరిగి రెండవ పర్యాయము బహుమతి కొంతమాత్ర మతనికి అర్హతలేదు.

చిరునామా

ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా :—కార్యదర్శి. భారతీయ జ్ఞానపీఠం, సాహుజైన్ నిలయం, 9, అలీపూర్ పార్కు ప్లేస్, కలకత్తా—27.

క్షేత్రయ్య

★

శ్రీ వాత్సవ

[శృంగారపదముల రచనాజనకుడు శ్రీ క్షేత్రయ్య త్రిశతి జన్మదినోత్సవాలు ఆగస్టు 11 నుంచి 17 వరకు జరుగుచున్నవి. ఆ సందర్భంలో ఈవ్యాసము ప్రచురిస్తున్నాము—సం]

మూడువందల యేండ్లనాటి మాట. పద కవితలు, ముది కాంతలు ముతుకబాఱలేదు. సంగీతము, సాహిత్యము, నాట్యాభినయము ముప్పేటలుగా పెనవైచుకొని రసికజనుల నానందపఱచుటయే గాక, మోక్షమార్గ నిర్దేశకములుగా రాణించిన సాహిత్య స్వరూపము తెనుగు పలుకులో తేనె లొలికింపజేసిన మంచి దినములు. ఆ కాలములో జన్మించిన మహనీయ రసిక శిఖామణి—వేలకువేలు పదములు తెనుగులో పాడి, యాడి, వాని భావ పారవశ్యముతో తాదాత్మ్యము పొందినాడు. ఆతడే క్షేత్రయ్య. ఆతనికి ముందు తెనుగులో పదములు లేవని కాదు. ఆంధ్రపద కవితా పితామహుడు అన్నమాచార్యుడు వేలకువేలు శృంగార పదములు రచించి గానముచేసి జన్మ తరింపజేసికొన్నాడు. (1430—1503) కాని ఆతని పదములు రాగిరేకులలో భద్రపఱచి, ఏడుకొండలవాని ఆలయములోనే గుప్తమై పోయినవి కాని ఆనాడు వ్యాప్తిలోనికి వచ్చినట్లు లేదు. ఆతని తరువాత మఱి నూరు సంవత్సరములకు వెలసిన క్షేత్రయ్య పదము లట్లుగాక, నాడే కాక నేడు కూడ దక్షిణాపథము నంతటను వ్యాపించి, కర్ణాటక సంగీతము, భరత నాట్య శాస్త్రము తెలిసినవా రందరిచేతను మన్నన లందుకొను చున్నవి. క్షేత్రయ్య పదములు గాయకుని రాగ జ్ఞానమునకు గీటురాళ్లు. నర్తకి అభినయ శాస్త్ర పరిజ్ఞానమునకు పరీక్షాపత్రములు.

భరత నాట్యశాస్త్రములో కూలంకష ప్రావీణ్యమును సంపాదించ గోరినచో మూడు ముఖ్య యోగ్యతలు కలిగి యుండవలెనని ప్రసిద్ధ నర్తకి శ్రీమతి బాలసరస్వతి ఒకానొక సందర్భములో పర్యటనము చేసినప్పుడు పత్రికా విలేఖరులతో ప్రసంగించుచు చెప్పినది. ఆ మూడు లక్షణములును, తెనుగు భాషలో చక్కని ప్రవేశము, సంగీతములో స్వయముగా గానముచేసి రాగ తాళ గతులతో ప్రసారము చేయగల్గిన ప్రజ్ఞ, సాహిత్య శాస్త్రము నెఱింగి, ఆ ప్రకారము రసభావ యుతముగా నాయికా నాయకుల అవస్థా భేదముల నాంతర్యము నరసి హస్త ముద్ర భంగిమాది లక్షణములతో అభినయించి ప్రదర్శించు నైపుణ్యము. ఈ మూడు లక్షణములును పొందిన నర్తకి అభినయములో అందెవేసిన చేయి కాగలదని ఈ ప్రసిద్ధ నటీమణి తన యనుభవమువలన వెల్లడించినది. ఈ మూడు లక్షణములను ముచ్చటగా అమరునట్లు వ్రాసిన వాగ్గేయకారుడు వేలకొలది పదములు రచించిన క్షేత్రయ్య. ఆతని పదములవలన తెనుగు భాష పరిపుష్టమైనది. కర్ణాటక సంగీతము రాగ రంజితమైనది. అభినయ శాస్త్రము రసానంద కందమైనది.

క్షేత్రయ్య జన్మించినది, కృష్ణాజిల్లా మువ్వ గ్రామము. పవిత్ర కృష్ణానదీ తీరమునకు అల్లంత దూరములో సముద్రము కూడ తన తరంగ గానముతో ఆ కాలములో వీనుల విందు చేసెడిది. ఇటు హంసలదీవి, అటు అవనిగడ్డ, ఘంటశాల, పురాతన క్షేత్రములు. కొంచెము దూరముగా కూచిపూడి, ఇంక కొంత దూరములో మువ్వ. ఆ కాలములో ఎంత సొగసుగా ఎంత చొక్కముగా ఈ దీవిసీమ ఉన్నదో కాని, ఆనాడు ఏ చిన్న గ్రామములో చూచినను ఒక భక్తుడు, ఏ చిన్న క్షేత్రములో చూచినను ఒక క్షేత్రయ్య, ఏ చిన్న వాడలో గాంచినను ఒక సిద్ధేంద్రయోగి, ఏ చిన్న యేటి గట్టున పొడగాంచినను ఒక నారాయణతీర్థుడు. ఆ మహా భక్తులు రాగములు పాడినారు. తరంగములు కీర్తించినారు. దరువులు వేసి పరవశముతో నృత్యము చేసినారు. యక్షగానములు రచించి యక్షిణి నృత్యములు చేసినారు. వీధి నాటకము వేసి భాగవతులుగా వేషములు కట్టినారు. భామ కలాపము చేసి జట పూజలు చేసినారు. తాము తఱించి యీ భవ సాగరమును తఱించు నుపాయము తమ కాలపు సామాజికులకు నేర్పినారు. రాగములోని రక్తి, భావములోని భక్తి రస వ్యంజనములోని శక్తి తాము చవిచూచి ఇతరులకు వీనుల విందుగా నందజేసినారు.

ఆ కాలములో 'మువ్వ' గ్రామములో ఒక చిన్న కొలను. కొలని గట్టున కోవెల. కోవెలలో గోపాలకృష్ణ విగ్రహము. భువన మోహన లావణ్యమూర్తి. ఆ మూర్తి వెలసినచోట ఒక బాలుడు జన్మించినాడు. ఆ పిల్లవానికి తల్లిదండ్రులు వరదయ్య అని పేరు పెట్టుకొన్నారు. ఆతడు చిన్నతనము నుండియును సంగీత సాహిత్యములయందే మనస్సు లగ్నము చేసినాడు. వైదిక విద్యయందు సాధన కుదరలేదు. ఆ సంగీత

మును సాహిత్యమును నేర్చుకొనుటకు మంచి పండితులవద్ద శుశ్రూష చేసినాడు. ప్రక్కనే కూచిపూడి గ్రామము. అభినయ శాస్త్రములో ఆరితేరిన మహనీయులు, భాగవత శిఖామణు లాయూర నున్నారు. వారికి సంగీత, సాహిత్య, భరత శాస్త్రములు కొట్టిన పిండి. భరతుడు తెలిపిన నాట్య శాస్త్రములోని విషయములకు అభినవగుప్త పాదులు తెలిపిన వివరణముతో కూడిన వ్యాఖ్యానములు వారి కంఠస్థము. ఇదిగాక నందికేశ్వరుని అభినయ దర్పణము వారికి నాట్య వేదము. భానుదత్తుని రసమంజరి వారికి అభినయ వ్యంజకము. ఆ పద్ధతి శాస్త్రములతో రూపుదాల్చిన సంప్రదాయము కూచిపూడి నాట్య సంప్రదాయము. వారివద్ద చిన్ని వరదయ్య తన తొలి పాఠములు నేర్చెను. అంతటితో తృప్తి నొందక సంగీత సాహిత్య శాస్త్రములలో ఇంకను సాధన చేయుటకు ఉత్సహించెను. జ్ఞ లెవ్వరు ? ఆతనికి తగిన యొజ్జ్వకాడు మఱియొక సమీప గ్రామములోనే లభ్యమాయెను. మువ్వ నుండి ఆ యూరు చేరువలోనే యున్నది. అచ్చట, వరదయ్య అత్యంత శ్రద్ధాసక్తులతో ఆత్మవిజ్ఞానము సమకూర్చుకొన్నాడు. ఆ సమయములో ఆలంబనమైన అనుభవము ఆతనికి అందుబాటులోనికి వచ్చినది. ఆ యనుభవము వరదయ్య సహాధ్యాయిని అలమేలు మంగతాయారు కలిగించినది. ఆ బాలిక కూడ సంగీతము, సాహిత్యము, అభినయము అభ్యసించినది. కూచిపూడిలో ఆమెకు విద్య గఱపరు. ఆ యాచార్యుల నియమానుసారము ఆడుపిల్లలకు భరతనాట్య విద్య గఱపుట నిషిద్ధము. అందుచేత ఆమె ఆచార్యులవారి యింట నుండి మఱియొకచోట సంగీత సాహిత్యముల నేర్చుకొన్నది. ఆ వీటనే వరదుడు కూడ విద్య నేర్చుకొనుచున్నాడు. ఆ యుభయులకు మధ్య సాహచర్యము, సహానుభూతి కలిగినవి. అదియే ప్రేమగా పరిణమించినది. ఆమె నివసించు గ్రామము చెంతనే యున్నది. వరదయ్య అచ్చటికి వచ్చుచు పోవుచు నుండువాడో యేమో ! వా రిద్దఱికి అన్యోన్య మైత్రి అనురాగముగా పరిణమించినది. తల్లిదండ్రులయాన, ఆ యనురాగము దాంపత్య ప్రేమగా రూపొందుటకు వీలులేదు. వరదయ్యలో యౌవ్వన రాగాంకురములు పులకలెత్తు చున్నవి. ఆతని మనస్సు లోగొన్నది ప్రక్కయూరు మానినియా ? లేక 'మువ్వ' లోని గోపాలుడా ? ఆ 'మువ్వ' గోపాలుని మోహన విగ్రహము నెంత జూచినను తనివిదీఱదు. ఎంత మక్కువ లేకపోతే ఆ స్వామిపైన విరహమూని తన తొలి పాటలో పరితపించి పోయినాడో ! వరదయ్య—మువ్వ గోపాలునిపైన తమకమున పాడిన మొదటి పాటలో ఎట్టి అంత్య యతి ప్రాసలు పెట్టుకొన్నాడో ? తన తొలి కవితలో ఎన్ని సొగలు ఒలుకరించినాడో !

''శ్రీపతి సుతుబారికి నే నోపలేక నిను వేడితే
కోపాలా, మువ్వ గోపాలా ?
చూపుల నమ్ముల దేరి చూడని నాతో లేని క
లాపాలా, మువ్వ గోపాలా ?
నా పొందెల్ల దాని కబ్బియే పొందు లేక యుసురను చే
వాపాలా, మువ్వ గోపాలా ?''

మువ్వ గోపాలుని గూర్చి ఎన్నివందలో, వేలో పాటలు పాడినాడు. తనకు నచ్చినవారిచేత పాడించుకున్నాడు. ఆడించుకొన్నాడు. అభినయించి అర్థభావ గాంభీర్యము లరసికొన్నాడు. ఆ పదములలో నాయికలు, స్వీయలున్నారు, పరకీయలున్నారు. విరహోత్కంఠితలు, ప్రోషిత భర్తృకలు, జ్యోత్స్నాభిసారికలు వాసవ సజ్జికలు, ఎన్ని వన్నెలవారో !

క్షేత్రయ్య భక్తి పారవశ్యముతో పదసంకీర్తనము చేయుచునే యున్నాడు. ప్రత్యక్ష దైవము 'మువ్వ' గోపాలుని బాసిపోలేకున్నాడు. ఎదుట తన ప్రణయరసాధి దేవత మఱియొక కులకాంత ఉన్నది. ఆమెను వీడిపోలేడు. అట్లని పెండ్లి చేసికొని తనదానిగా ఏలుకోలేడు. ఈ జీవన సమస్యలోపడి, వరదయ్య 'మువ్వ' గ్రామమువదలి వెడలిపోయినాడు. ఆతడు దక్షిణాదికిపోయి, కాంచీపురములో విడిది చేసినాడు. 'మువ్వ' గోపాలుని విడిచివైచిన తరువాత ఆతనికి కంచి వరదుడు కన్నుల వెలకొన్న దైవమయినాడు. అయినను ఆతనికి జ్ఞాపకాలు పోలేదు. ఆమెకు మాటయిచ్చి వచ్చినాడు. తనతో కంచి తీసుకుని వత్తునని బాసచేసినాడు. తనకేగతి లేదు, మఱి కర్నివెచ్చి యేమిచేయగలడు. రేయింబవళ్లు ఆ కంచి వరదుని కొలువులోనే ఆతని మనుగడ. అక్కడే పాట ! అక్కడే యాట. ఒక రాత్రి ఏకాంతముగా కంచి గరుడసేవలో కన్నులు మత్తెక్కి ఆట్లే ఆలయ ప్రాంగణములో వరదయ్య విశ్రమించినాడు. ఆ నిద్రలో ఒడలెఱుగని మైకముతో నుండిపోయినాడు. తెల్లవారినది. మోహనముగా చల్లనిగాలి వీచినది. ఎట్టయెదుట ఒక మగువ కనిపించినది. ఆమె తనకేళికా మందిరము వెడలి వచ్చినట్లయినది. వరదయ్య కన్నులు తెఱచినాడు. నమ్మలేకపోయినాడు. కన్నులు నులుముకొని తేఱిపాఱజూచినాడు. ఆమె, ఆలీలా మానుష విగ్రహమూర్తి— వరదరాజు కేళికా మందిరము నుండి వెడలి వచ్చినది. వరదయ్య— తన పేరింటి వానిని తానుగా చూచుకొన్నాడు.

మగువ తనకేళికా మందిరము వెడలెన్
వగకాడా మా కంచి వరద తెల్లవారెననుచు
విడజారు గొజ్జంగి— విరిదండ జడతోను
కడుచిక్కు బడిపెనగు— కంట సరితోను
నిడుద కన్నులదేరు— నిదుర మబ్బులోను
తొడరి పదయుగమున— దడబడెడు నడతోను

ఆ కోమలాంగి యెవ్వతెయో రూపుదాల్చి మన యెదుట తడబడెడు నడతోడ నడచి వచ్చుచున్నట్లే యున్నది.

కొంతతడవు కాంచీపురములో నుండి వరదయ్య ఎన్నోచోట్ల క్షేత్రాటనము చేసినాడు. దక్షిణాదిని ఆతడు చూడని గుడులు లేవు. ఆతడు సేవించని దైవములేదు. ఆతడు పరవశుడై ప్రార్థించి కీర్తించని పరదైవతము కనిపించదు.

శ్రీశైలము, శ్రీరంగము, కోవళ్ళూరు, తిరువళ్లూరు, తిరుపతి, మధుర, తంజావూరు ఈ పుణ్యక్షేత్రముల

నన్నింటిని వరదయ్య దర్శించినాడు. ఇన్ని క్షేత్రముల దర్శించుటచేతనే యేమో వరదయ్య క్షేత్రయ్యబిరుదు దాల్చినాడు. కంచిలో నుండి వచ్చివేసిన తరువాత తీర్థములను సేవించి వరదయ్య మధురా నగరములోని తిరుమలనాయకుని కొలువులోనికి (1623—59) చేరుకొన్నాడు. ఆయన ప్రోత్సాహమువలన రెండువేల పదములను రచియించినట్లు క్షేత్రయ్య చెప్పుకొన్నాడు. అటనుండి తంజావూరులోని రఘునాథ నాయకుని ఆస్థానమును క్షేత్రయ్య చేరుకొన్నాడు. ఆయన గొప్ప రసికుడు, కవి, గాయకుడు, వాగ్గేయకారుడు. ఆతని కొలువులో చాలపాటలు వ్రాసిన తరువాత, క్షేత్రయ్య మఱికొన్ని దక్షిణాది క్షేత్రములు దర్శించి యుండును. రఘునాథ రాయల అనంతరము విజయ రాఘవ నాయకుడు తంజావూరు సంస్థానమునకు అధిపతి అయిన తరువాత కలకాలము ఆతని యాస్థానములో నుండి క్షేత్రయ్య వేయి పదములు రచించినట్లు చెప్పుకొన్నాడు. విజయరాఘవుడు, విద్యలభోజుడు, ఆతని కొలువులో రంగాజమ్మ, కృష్ణాజమ్మ చంద్రరేఖయను విదుషీమణులుండెడివారట. వారు సంగీత సాహిత్య నాట్య విద్యలలో నిష్ణాతలు.

ఒకానొక వేకువవేళ క్షేత్రయ్య ఆరాధన చేయుటకయి అంతఃపుర మార్గమున వచ్చుచున్నాడు. తిరిగి ఆ నాటి దృశ్యము జ్ఞాపకము వచ్చినది. కంచి వరదుని కొలువులో వెలకొన్న కేళికా మందిరమునుండి వెలువడిన 'మగువ పొలుపు తెలుపు నొక్క మారుతము.' తిరిగి అదే యనుభవము. అదే అందము. నాటి పల్లవికి చరణములు దొరికినవి. అదే మోహన రాగములో క్షేత్రయ్య ఆ నాడు ప్రారంభించిన పాట పూర్తి చేసినాడు.

"సొగసి సొగయుని వలపు— సోలపు జూపులతోను
వగవగల ఘనసార— వాసనలతోను
జిగిమించు కెమ్మోవి— చిగురు కెంపులతోను
నగము కుచముల విదియ— చందురులతోను
మగువ తనకేళికా మందిరము వెడలెన్
తరితీపు సమసురతి— బడలికతోను
జరుత పావడ బెరగు— జార్పైవితోను
ఇరుగడలకై దండలిచ్చు తరుణులతోను
పరమాత్మ మువ్వగోపాల తెల్లవారె ననుచు
మగువ తన కేళికామందిరము వెడలెన్
వగకాడా, మా కంచి వరద తెల్లవారె ననుచు"

ఆ పాటలలో నాయకుడు కంచివరదరాజో, విజయ రాఘవ నాయకుడో, మువ్వ వరదయ్యయో— ఎవరైనను పరమాత్మ మువ్వ గోపాలుడే. అట్టి పారమ్యమును వీక్షించి, సర్వమును మువ్వ గోపాల పరముగా ఆ ముద్రతోనే తన పదముల నన్నింటిని కీలించుకొన్నాడు.

తంజావూరు కొలువు వదలి, క్షేత్రయ్య ఉత్తరాభిముఖుడై తిరుపతి, కడప, యదుగిరి మున్నగు పుణ్య క్షేత్రములను దర్శించి చివరకు గోలకొండ చేరుకొన్నాడు. అక్కడ పరిపాలన చేయుచున్న గోల్కొండ నవాబు అబ్దుల్లా కుతుబ్ షాహ (1622—72). ఆయన ఆస్థానములో తులసి మూర్తి యను సంగీత విద్వాంసుడున్నాడు. ఆతడు కూడ వాగ్గేయకారుడే. వీరిఱువురకును పదముల రచనలో పోటీ పడినది. ఎవరు స్వల్పకాలములో ఎక్కువ పదములు రచింపగలరు ? నలుబది దినములలో 1500 పదములను క్రొత్తగా రచించి క్షేత్రయ్య విజయ పతాకముతో వెలువడినాడు. గోల్కొండ నవాబు క్షేత్రయ్య ననేక విధములుగా సన్మానించినాడు. ఈ పదములను కూడిన యెడల, క్షేత్రయ్య తెలిసిన ప్రకారము, మొత్తము— 4500 సంఖ్య యగుచున్నది. మఱియొక అయిదు వందల పదములైనను ఆతడు వేఱుగా ఏ కొలువులోను లేనపుడు రచించి యుండును. మొత్తము క్షేత్రయ్య రచించిన పదములు అయిదువేల పైమాట. అయినను నేడు లభించినవి మూడు వందలు మాత్రమే.

కాంభోజి - త్రిపుట

"వేడుకతో నడుచుకొన్న— విటరాయడే
ఏడుమూడు తరాల నుండి—యెందును గాని యెనవె
కూడుకొని మువ్వ గోపాలుడు— కృపగల్గి నా విభుడు
మధుర తిరుమలేంద్రుడు—మంచి బహుమాన మొసగి
యెదుర గూర్చుండు మని— యెన్నిన యిమ్మనేనే
ఇదిగో రెండువేల పదము— లిపుడెంచు కొమ్మనిన
చదురు మీద నేనున్న సామికి—న తోస మింతింత గాదె
అలివీర తంజావురి నేలకొన్న విజయరాఘవుని
వెలయు మనుజాల వెంబడి— వేగమె పొడగాంచి
చలువ చప్పరమున నుండగ— చక్కగ వేయి పదముల
పలుకరించుకోగానె బహుమాన మిచ్చె నావేళ
బలవంతుడై గోలకొండ— పాదుషా బహుమానమిచ్చి
తులసిమూర్తితో వాదుదలచెనా వేళ
వెలయు మువ్వగోపాలుడు — వెయ్యిన్నేనూరు పదములు
నలువది దినములలోన— నన్నుగలసి వినిపించెనే

ఈ పదములలో అధికభాగము తంజావూర్ సరస్వతీ మహలులోను, మద్రాస్ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోను, మద్రాసులోని అడయార్ లైబ్రరీలోనూ, తిరుపతిలోను, ప్రాచ్య విద్యాసంస్థలోను, కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్ భాండాగారములోను ఉన్నవి. కొన్ని తాటాకు గ్రంథములలోను, కొన్ని ఆ నాటి భూర్జర పత్రములలోను, మఱి కొన్ని తెల్ల కాగితములలోను లిఖితమ్ములై యున్నవి.

వీని యాధారముగా 1867లో క్షేత్రయ్య పదములను బరూర్ త్యాగరాజులచెట్టి గారి ముద్రణాలయములో అచ్చువేసినారు. ఈ గుజలీ ప్రతులు రెండుమూడున్నవి. 1896లో తిరిగి ఈ పదములనే రాగతాళములతోపాటు, నాయికావస్థలను సూచించుచు చిన్న వివరణముతో ఒక ఆచార్యులవారు ప్రకటించినారు. దానినే మాతృకగా గొని

విస్సా అప్పారావుగారు విశాఖపట్టణమున్నుండి ఒక ప్రతి ముద్రించినారు. దాని తరువాత శ్రీ పిఠాపురము మహారాజావారు ఒక బృహత్ గ్రంథమును ప్రకటించినారు. ఈ రెండు గ్రంథములకును మూలాధారము అకారాదిగా ప్రచురించిన ఆచార్యుల వారి వివరణలతో కూడినదే యని స్పష్టమగు చున్నను, విస్సా అప్పారావుగారు ప్రచురించిన గ్రంథమునందుగాని, శ్రీ పిఠాపురము మహారాజావారి పక్షమున గిడుగు సీతాపతిగారు ప్రకటించిన గ్రంథమునందుకాని ఈ మూల ప్రచురణ ప్రసక్తి లేకపోవుట గమనింపవలసి యున్నది. ఈ పదములను పాడుకొను పద్ధతి ఒక్కొకచోట ఒక విధముగా నున్నది. తంజావూరు భరతనాట్య పద్ధతి ననుసరించి ఈ పదముల గానము చేయుపద్ధతి చాల చౌకకాలములో సాగును. అభినయమునకు అనుగుణముగా, రెట్టించి పలుకునపుడు రాగ స్వరూపము చక్కగా తెలియుటకు ఆ చౌకకాలములో పాడు పద్ధతియే చక్కనిది. దానినే, వీణధనమ్మాళ్ వంశమువారు పాడుచున్నారు. జయమ్మ, బాలసరస్వతి అభినయరూపముగాను, బృంద, ముక్త గానము రూపముగాను ఈ పదములకు ప్రచారము తెచ్చినారు. ఈ పద్ధతిగా పాడుటయే నేటికిని దక్షిణాదిలో పరిపాటి. తెనుగు దేశములో— కూచిపూడి సంప్రదాయము ప్రకారము క్షేత్రయ్య పదముల నభినయించు తెఱగు ఉన్నది. "ఇన్నాళ్లవలె కాదమ్మా ?" "ఎవ్వడే, భామ ?" వంటి పదములు మధ్యమ కాలములో పాడి అభినయించుట కూచిపూడి సంప్రదాయము. హస్తాభినయము, భావాభినయమేగాక, గతులతోను, జతులతోను అడుగులు పట్టి అభినయించుటకు వీలుగా కూచిపూడి వారు మధ్యమ కాల పద్ధతిని పాడుటకు అవలంబించి యుందురు.

ఇంక తెలుగు దేశములో దేవదాసీ జనము దేవాలయములలో అభినయము చేయునపుడు పదములను పరమ పవిత్రముగా, పాండిత్య ప్రకర్షముగా ప్రదర్శించువారు. ఈ విధమైన నాట్య సంప్రదాయమునే కర్ణాటక సంప్రదాయమనువారు. ఇది తంజావూరు భరతనాట్య సంప్రదాయమునకు భిన్నమైనది. 'భరతము' పట్టుట, 'భరత శాస్త్ర పద్ధతి' ఇట్టి నుడులవలన, భరతనాట్య విధానము తెలుగువారానాడు కొంచెము మోటుగా భావించువారని మనము గ్రహించవచ్చును. దానికి భిన్నముగా 'కర్ణాటకము' నవనాగరికముగా నాజూకుగా కన్పట్టు చుండెడిది. ఆ నాటి నర్తకీ మణులు నాట్యము చేయుటలో సభతీర్చినపుడే పదములు పాడి అభినయించి కర్ణాటక సంప్రదాయములో ప్రదర్శించువారట. పోయినవారు పోగా మారుమూల గ్రామాలలో మిగిలిన దేవదాసీ నర్తకీమణులీ మాట చెప్పుదురు. ఈ సంప్రదాయము ప్రకారము పదముల నభినయించు పద్ధతి అక్కడక్కడ కొందఱికి మాత్రము తెలియును. ఈ పాటకూడ చిత్రముగాను, మనోజ్ఞముగాను, భావరస ప్రధానముగాను ద్యోతకమగును. పదము— నాట్య ప్రదర్శనములో నర్తకి ప్రజ్ఞా విశేషములను చూపగల్గునట్టి ప్రత్యేక కల్పన. దాని ప్రాధాన్యమును ఆనాటి సహృదయులే కాక నేటి రసికులు సైతము గుర్తించి, భరత నాట్య ప్రదర్శనములో పదాభినయమునకు ప్రముఖ స్థానమిచ్చుచున్నారు. ఈ పదములలో క్షేత్రయ్య రచనలు ప్రదర్శించుట, వానిలో మెలకువలు తెలిసిననే తప్ప అలతి వారికి సాధ్యముకాదు.

శంకరాభరణము రాగములో ఒక పదము చూడుడు:

ఎవ్వడే ఎవ్వడే వో భామ విడెవ్వడే ?
ఎవ్వడే నేను పవ్వళించిన వేళ
పువ్వుల భాణమేసి రవ్వచేసిపోయె !

పదము సొగసంతను పల్లవిలోనే కుదించుట క్షేత్రయ్య నేర్పు. సంగీతమునకు నృత్యమునకు అనువుగా ఎన్నిసార్లు రెట్టించి పాడిన అన్ని క్రొత్త కల్పనలతో అభినయించవచ్చును. రాగములోని గమకములను అన్ని క్రొత్త సంగతులతో పలికించవచ్చును. తొందఱలేదు. సావకాశముగా నర్తకి తాను భావధారననుభవించి చెప్పును. "ఎవ్వడె ?" అన్నపుడు ఎన్ని విధములుగానో హస్తములు చూపును:

"లీలతో పదియారువేల గోపస్త్రీల
నేలిన మువ్వ గోపాలుడనిపోయె"

అని మకుటములో వచ్చు నాయకుని పలువిధముల వర్ణించును. ఆతని దక్షిణ నాయకత్వము, బాలకృష్ణుని చిలిపితనమును, వెన్నతిన్న పిన్నతనమును' 'అల్లి వ్రేతల గూడిన గుణమును' ఎన్నిటినో ప్రదర్శించును. ఆతని వన్నెచిన్నెలను పల్లవిలోనే స్ఫురింప జేయును.

అట్లే 'సావేరి' రాగములోని 'బాగాయెనే', హుసేనిలోని 'అలిగితే', ముఖారిలోని "ఏమనేవోతీరా ?" మొదలయిన పదములలోనే 'పల్లవి'లోనే హృదయములను పల్లవింప జేయును. ఇంక దిగుకొలదిలోతు. తెలిసిన నటీ మణులు మధించి తెలివిగా అభినయించుకొలది తేనె సోనల గురియించును. 'అలిగితే భాగ్యమాయె, వాడలిగితే భాగ్యమా యెనుటేమి ?' ఎన్ని విధాలుగానో ఒలుక బోయవచ్చును. ఇంక రాగభావములలో క్షేత్రయ్య పదములు కర్ణాటక సంగీతమునకు మణిపూస వంటివి.

"కర్ణాటక గానముల పలుకు పులకండము లొలుక క్షేత్రయ్య మువ్వగోపాల పదములలోని శృంగార రసము దిగంతములకు ప్రాకిపోయి చుక్కలకు కలువు సందేశము పంపినది. తెలుగువారి జయదేవుడు క్షేత్రయ్య. గీత గోవింద మాధుర్యము చవిచూపులు మువ్వగోపాల పదములు."[1]

రాగ రసస్వరూపా ప్రదర్శనలో జయదేవుని కంటె క్షేత్రయ్య ఒక అడుగు ముందే వేసినాడనవచ్చును. కర్ణాటక శాస్త్రీయ సంగీతము రాగములో ప్రతి స్వరూపమునకు వాది సంవాది స్వరముల కలయిక తోడ్పడును. అదియే గమకము. తేట తెల్లముగా రాగమును ఆవిష్కరింపజేసి స్ఫుట

---

1. ద్వారము వేంకటస్వామి నాయుడు 1938 మార్చి నెల భారతిలో.

ముగా జీవి స్వరములు పలుకునట్లు, పదములోనే, సంగతుల లోనే క్షేత్రయ్య బిగించినాడు. అదియే అతని విశిష్ట లక్ష్యము. అతనికి మధ్యకాలము, త్రికాలము మనస్కరించక, ఆ సంగతులను పూర్తిగా వదలిపెట్టి వేసినాడు. ద్రుత గమనముతో వెడలు వారికి క్షేత్రయ్య పదములుద్దేశించి యుండలేదు. సావకాశముగా తీతీకగా కూర్చుండి విని కని ఆనందించ గలుగు రసికాగ్రగణ్యులకే క్షేత్రయ్య పదములు రచించెను. అందులకే రఘునాథుడు, విజయరాఘవుడు, కుతుబ్‌షా వంటి రసికవతంసు లాతని పదములు విని, అభినయ ప్రదర్శనము కన్నులార గని ధన్యులైనారు. క్షేత్రయ్య తన పదములకు చిత్తము వచ్చిన రాగములు వినియోగించలేదు. భావమునకు రసమునకు అనుగుణమైన, అలంకార ప్రాయమైన రక్తి రాగములే ఎన్నుకొన్నాడు. ఆ కారణము చేతనే తానెన్నుకొన్న రాగములలో సొగసులన్నియును మేలుకొలుపుటకు వీలు చిక్కించుకొన్నాడు. క్షేత్రయ్య— పదములలో కాంభోజి రాగమును వాడిన తీరుచూచి, ఆతడు కాంభోజిరాగమును పూర్తిగా వాడి వడపోసినాడని శ్యామశాస్త్రి చెప్పినాడట. దీనినిబట్టి మఱియొక వాగ్గేయకారుని ప్రశంసల నందిన క్షేత్రయ్య కాంభోజి రాగ ప్రావీణ్యమును మనము గ్రహింపవచ్చును. ఘంటా, సైంధవి, ఉసేని, ముఖారి, సావేరి, ఆహిరివంటి రాగములను క్షేత్రయ్య ఇచ్చవచ్చిన రీతులలో వాడి వానిలో అందముల నన్నిటినీ రసికులకు అందజేసినాడు. క్షేత్రయ్య వాడిన అపూర్వ రాగములలో కర్ణాటక కాపీ యొకటి. ఈ రాగము త్యాగరాజా కాలము వఱకు వాడుకలో నుండెడిది. రానురాను ఇది కాలగర్భములో కలిసిపోయి, దీని స్థానే హిందూస్థానీకాపీ రాగము అమలులోనికి వచ్చినది. క్షేత్రయ్య ప్రయోగము చేసిన ఆనందభైరవి భాషాంగ రాగముగా మూడు అన్యస్వరములతో వినిపించును. ఇది త్రి—అన్యస్వరభాషాంగరాగము ఇది పూర్వకాలపు వీథి నాటకములు, యక్షగానములు, తోలు బొమ్మలాటలు ఇట్టి ప్రదర్శనములలో వాడిన ఆనంద భైరవిరాగమును తలపించును.

2 క్షేత్రయ్య విప్రలంభ శృంగారమునకు అనువైన అవస్థలలో నాయకీ నాయకులను వర్ణించు నపుడు రక రకముల గమకములను పదములలో సంగీతములలో ప్రయోగించును. వానిలో ఉల్లసిత, కంపిత, లీన స్వరముల గమకములు ప్రత్యేక సౌందర్యముతో ప్రకాశించును. ఇది ఒక మాత్రము గాయకులకు పలికించుట చేతకాదు. అందులకే ఆ కాలములో సంగీత విద్వాంసులు పాటకచ్చేరి ముగించిన తరువాత పదముల గానముచేసి వానిలోని బిగువైన ప్రకంపనలు పలిపికించుట తమ ప్రత్యేక ప్రజ్ఞగా భావించు కొనువారు. క్షేత్రయ్య పదములు కొన్నియైనను నేర్చుకొనని సంగీత విద్వాంసు లుండువారుకారు. క్షేత్రయ్య పదముల రచనకు జనకు డనవచ్చును. ఆతని ముందు పదకర్తలు లేరనికాదు. నాయికా— నాయక భావములో సంగీత స్థాయిలో ఉన్నత స్థితి చేకూర్చిన వాడు క్షేత్రయ్య.

ఇంక సాహిత్య స్థాయిలో భానుదత్తుని 'రస మంజరి'లో చెప్పిన నాయికా— నాయక భావములకు రూపములు కల్పించిన వీ క్షేత్రయ్య పదములు. వీనిలోని కాంతా సమ్మితత్త్వము ఎంత కమనీయమైనదో, ఇందలి ధ్వని అంత రసస్ఫోరకమైనది.

ఏమి సేయుదు మోహమెటువలె దీరును ?
భామామణి యెవ్వరుతోడి తెచ్చేరు ?
వెలయనీదు ముఖార విందంబు విరియించి
యలరు వాసనలు వ్రాయగ నేరనైతి
"కళలొల్కు నీ మోవి— గదసి వ్రాసితిగాని
నెలత తేనియలుంచ నేనేరనైతి
కలికి సొగసైన వీకనుల వ్రాసితిగాని
బెళుకు జూపులు వ్రాయు విధ మెరుగనైతి
గళము రేఖలు దెలియగాను వ్రాసితిగాని
చెలగు కోకిలవంటి పలుకు వ్రాయగనైతి
తరుణిరో ! నాగ బంధము రీతి గలియుటలు
గరిమ వ్రాసితిగాని పరవశముచేత
పరగ మా మువ్వ గోపాల రారాయని
తిరుగ రతులకు బిలుచు తెలివి వ్రాయగనైతి !"

అవును చిత్తములోని రీతులు చిత్రకారుడేమి వ్రాయగలడు? చిత్తజానాన మీఱిన శృంగార పదకవి చెప్పగలడు. ఆతని పదములలో అందము లన్ని యెడలను పుణికి పుచ్చుకొన్నది. వానిలో స్వీయ నాయికలతో శృంగారము కూడ శ్రేయస్కరముగా చెప్పిన రీతులున్నవి. పరకీయతో అనుభవించిన పలువిధముల యందములు కూడ నున్నవి. ఇవి యన్నియును ఈ కాలమున శృంగార భూయిష్ఠములయిన అశ్లీలములని పలుకు వారున్నారు. అట్టివారు 'నాటి దేశకాల పరిస్థితులను మఱచిపోవు చున్నారు. ఆనాడు, శృంగారము, కామోద్రేకముతో కూడిన దాంపత్య రహస్యములు నిషిద్ధములుకావు. కామవాంఛ తప్పుకాదు. అందుచేతనే ఆ రతి విలాస క్రీడలను, కాముకేళీ విలాసములను వర్ణించు గ్రంథములు వచ్చినవి. పదములు వచ్చినవి. కీర్తనలు వచ్చినవి. క్షేత్రయ్యకు ఇంచుమించు సమకాలికులైన విద్యాపతి,

---

2. Kshetrayya is the father of the Padam Composition. Padams in the Nayika-Nayaka theme have been composed before him but it was he who first imported high musical quality into Padam. The result was that Sangita Vidwans took delight in learning them and performing them in concerts. A few of Kshetrayya's Padams invariably formed part of the repertoire of every top ranking performer in South India. Note. P. Samba Murthy in Kshertayya Swaralu.

చండీదాసు వంటి కవులిట్టి శృంగార పదములే పాడుకొన్నారు. అంగవంగ కళింగ భాషలలోను మైథిలీ భాషలలోను వైష్ణవ పదావళి క్షేత్రయ్య పదముల వంటివే. వానిలో కూడ దైహికమైన సుఖ వాంఛలను చూచువారు గేలిసేయుదురు. కాని వైష్ణవ పరతత్త్వమైన శుద్ధాద్వైతమును తెలిసినవారు ప్రకృతి పురుష సంబంధమైన ఈ స్త్రీ పుంసంయోగములో తప్పులెన్నరు. రాధాకృష్ణ రూపమైన ఈ శృంగార లీలలలో తప్పు చూపలేరు.

నిజమునకు మన నాట్యశాస్త్రకర్తయైన భరతుడీ మాటయే ఒక శ్లోకములో చెప్పెను.

> ధర్మ కామోర్థ కామశ్చ మోక్ష కామస్త థైవచ
> స్త్రీ పుం సంయోగస్తు యః కామః సకామః పరి
> కీర్తితః

మోక్ష కామమే యున్నత భక్తి శృంగారము. కావున చైతన్యుడు బృందావనమునకు పోయినపుడు ఒక్క కృష్ణుని మాత్రము పురుషునిగా పొడగన్నాడు.

ఆ శ్రీకృష్ణ పరమాత్మయందు అందఱును స్త్రీలే. ఆతడొక్కడే పురుషుడు, తక్కుంగల వారందఱును గోపికలే. ఈ భావమే క్షేత్రయ్య చేత ఇన్ని పదములు పాడించినది. ఈ పదములలో విశిష్టమైన శృంగారమును, సాహిత్యరీత్యా అనేక లక్ష్య లక్షణములకు సరిపడినట్లు గానము చేయించినది. అభినయము పట్టించినది. ఆత్మ సాక్షాత్కారము పొందజేసినది. ఇంత విషయలోలుపత ప్రదర్శించినను నిర్లిప్తుడుగా నిస్సంగునిగా నిలుచునట్లు చేయగల్గినది స్వరరాగ సుధారస భక్తితో ఆతడు సాధించిన సారూప సాధనమే.

ఆతని ఆంతర్యము గ్రహింపలేక క్షేత్రయ్య విటరాయుడని కొందఱందురు. నిజమునకు శృంగారమును వర్ణించినను వీతరాగులయినవారు రెండు తెఱగులుగా నుందురు. వారిలో ఒక రకమువారు సర్వసంగ పరిత్యాగముచేసి సన్యాసులయిన విరాగులు. మఱొకరకమువారు రాగములోని అనురాగము క్రోలుటకు స్త్రీ పురుష సంపర్కము మార్గము కాదను వారు. వీరు మిగుల సుకుమారులు. సున్నితమైన వీరి మనోభావములకు మఱింత సున్నితమైన సూక్ష్మసాధన లెన్నుకొందురు. వారిసాధనలో లలిత కళలు వలకరించును. దీనినే పాశ్చాత్యులు **Platonic love** ప్లేటానిక్ ప్రేమ అని అన్నారు. సంపర్కము లేకుండ భావసమ్మేళనముతోను రాగతాదాత్మ్యముతోను పరితృప్తి పొందువాడు. క్షేత్రయ్య ఈ రెండవ తరగతికి చెందునని కట్టమంచి రామలింగారెడ్డిగారభిప్రాయ పడినారు.3

క్షేత్రయ్య నిజముగా విటరాయుడుకాడు. ఆతడు వరదయ్యగా మువ్వ గోపాలుని సేవించినపుడు, గోపాల భక్తుడు. ఒక గ్రామవనితను ప్రేమించినను ఆ ప్రేమ సఫలీకృతము గాక, దానిని భగవత్ పరముగా ఉద్యుక్త పఱచి తన భావములను ఉన్నతము చేసికొన్న ఉత్తమ పురుషుడు. దక్షిణాపథములోని అనేక క్షేత్రములు సేవించి క్షేత్రయ్యగా మాఱిపోయినాడు.

భక్తికి నారదుడు పలికిన స్వరూపము:

> సాకస్మై మచి ప్రేమ రూపా !

అట్టి భక్తి సాక్షాత్కారముతో పరమాద్వైతమూర్తిని మువ్వ గోపాలునిలో గాంచి ముక్తిగన్న భక్తశిఖామణి క్షేత్రయ్య. అందులకే ఆతడు క్షేత్రజ్ఞుడుగా ప్రసిద్ధి పొందినాడు.

> "పూని మువ్వ గోపాలుడు— పైని చేయివేసితేనా
> మేనపులక లుప్పతిల్లునే— నా తమిరేచ
> వానికే బిరుదు చెల్లునే— వాని గూడిన
> మానస మెంత రంజిల్లునే— యెవరైనగాని
> అక్కరో ! యోర్వని వారు సరసుడు గాడని
> ఆడుకొంటే ఆడుకొనేరు
> మ్రొక్కదగిన వాని, ముద్దు మాటలవాని
> మువ్వ గోపాలసామిని యెవరైన గాని
> అట్టి భువన మోహన సుందరుని వలచినాడు."

ఆతడు క్షేత్రజ్ఞుడు. అదియే క్షేత్రము !

ఈ సంబంధమునే శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీతలో క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగములో తెలిపియున్నాడు.

> యావత్సం జాయతే కించిత్ సత్త్వం స్థావర జంగమమ్
> క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగాత్ తద్విద్ధి భరతర్షభః
> సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్
> వినశ్యత్ స్వవినశ్యంతం యఃపశ్యతి సపశ్యతి.
> ప్రకృత్యైవచ కర్మాణి క్రియమాణాని సర్వశః
> యః పశ్యతి తథాత్మాన మకర్తారం స పశ్యతి.

ఇట్టి స్థితప్రజ్ఞుడు, వీతరాగుడు, విశుద్ధాద్వైత భావయోగి, క్షేత్రతజ్ఞుడు. అందుచేకే ఆతనికి శృంగారలీలా విలాసము కామోన భోగ రతులు విషయలౌల్యములు—ఎంతమాత్రము నంటవు. తెనుగు సాహిత్య క్షేత్రములో నిరుపమాన శృంగార పదలతికల పుష్పింపజేసిన క్షేత్రజ్ఞయ్య నిజముగా క్షేత్రజ్ఞుడే!

3; Are you sure that Kshetrayya was in his youth a Vitaraya? There are two types of people with a dislike of sex. The one is the ascetic type which finds in it something sinful, and therefore to be avoided. The other is the extra sensitive aesthete, who does not find it sufficiently exquisite and free from nastiness and ugliness that revolt sense and sensibility......To which class does Kshetrayya belongs? He revels in sensual imagination. I had to suspect he was not sensual conduct.

Dr. C. R. Reddy's letter to prof Appa Rao.

చైనా - రష్యా వివాదాలు

★

'పరిశీలక్'

"Nations behave like Nations. This sounds obvious or trite but it is the essence of International politics"—Louis Fisher

చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వ స్థాపన జరిగిన రెండున్నర నెలలకు (1949 డిశంబరు 16 న) చైనా కమ్యూనిస్టు నాయకుడు మావ్—సే—టుంగ్ మాస్కో వచ్చాడు. ప్రపంచం మొత్తంమీద అత్యధిక జనాభా కలిగిన దేశంలో, అంతర్యుద్ధం, ద్వారా విజయాన్ని సంపాదించిన చైనా నవ పరిపాలకుడు మార్క్సిస్టు—లెనినిస్టు మత పీఠంలో అగ్రజుని వంటివాడు. రష్యాలో అక్టోబరు విప్లవ వీరుడు అయిన మార్షల్ స్టాలిన్‌ను కలుసుకొనడానికి వచ్చినందున, ఇది చరిత్రాత్మకమైన సన్నివేశం. మావో మాస్కోలో ఉండగా స్టాలిన్‌తో సుదీర్ఘ సమాలోచనలు కొనసాగించాడు. సోవియెట్ యూనియన్‌లో పర్యటించాడు. 1950 మార్చి ఆరంభం వరకు రష్యాలోనే ఉన్నాడు. సోవియెట్ భూమిమీద ఉండి కూడా విజయగర్వం చూపాడు. తాను కూడా ఒక ప్రముఖ వ్యక్తి నన్న ధోరణి కనబరచాడు. విప్లవాన్ని నడపని మామూలు విదేశ కమ్యూనిస్టుపార్టీ నాయకునివలె వ్యవహరించవలసిన అవసరం ఆయనకు లేకపోయింది. క్రెమ్లిన్ నాయకుడు పెద్ద, తాను చిన్న, ఆయన గురువు—తాను శిష్యుడు అన్న ప్రవర్తన అనవసరమైంది. అప్పటికి మావో ప్రభుత్వం ఏర్పడి పన్నెండు వారాల లోపు. రష్యాలో బోల్షివిక్కులు అధికారాన్ని చేపట్టి ముప్ఫయ్ రెండు సంవత్సరాలు. నవచైనా ఆదినుంచి మాస్కో సలహాల కోసం, ఆదేశాల కోసం ఎదురుచూచింది. ఆర్థిక సహాయాన్ని అర్థించింది. సైనికమైన రక్షణను కోరింది. అయితే చైనాలో తాను అవలంభించవలసిన విధానాలకు సంబంధించిన ప్రధాన నిర్ణయాలకు రావడంలో మావో మాస్కో సిఫారసులను అనుసరించి ఉండవచ్చు. అనుసరించి ఉండకపోవచ్చు. అది గతకాలం సంగతి. కాని సోవియెట్ వైదేశికనీతి ఎలా ఉండాలి లేదా సమకాలీన ప్రపంచంలో మార్క్సిస్టు—లెనినిస్టు సిద్ధాంత ప్రవచనం ఎలా మారాలి అనేది స్టాలిన్‌కు చెప్పగలిగిన స్థితి, సమయం అప్పటికి మావోకు రాలేదు.

మావ్—సే—టుంగ్ మాస్కోకు వచ్చి స్టాలిన్‌ను చూచి వెళ్లినయేడు సంవత్సరాలకు ఆ స్థితి ఆ సమయం కమ్యూనిస్టు చైనాకు వచ్చింది. అప్పుడు కూడా ఒక చైనా కమ్యూనిస్టు నాయకుడు మాస్కోకు వచ్చాడు. అయితే ఆయన మావ్—సే—టుంగ్ కాదు. ప్రధానమంత్రి చౌ—ఎన్—లై. పెకింగ్‌లో మావో ఆదేశాలు తీసుకుని మాస్కోకు వచ్చాడు. 1956లో పోలెండులోను, హంగరీలోను సంభవించిన తిరుగుబాట్లవల్ల తూర్పు యూరపులో సోవియట్ రష్యా పునాదులు కదిలిపోయి, ప్రపంచం మొత్తంమీద కమ్యూనిస్టు వర్గాలలో సంభ్రమాశ్చర్యాలు వ్యాపించిన సమయంలో రష్యా— పోలెండుల మధ్య రాజీ చేయడానికి చౌ— ఎన్—లై వచ్చాడు. అప్పటికి హంగరీలో కమ్యూనిస్టు పాలన పతనమైంది. సోవియట్ శతఘ్నుల బలంతో పునః ప్రతిష్ఠ మాత్రమే జరిగింది. పోలెండులో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఇంకా నిలిచి ఉంది. కాని శ్రీ కృశ్చేవ్ కాదన్న నాయకుడు, శ్రీ గోముల్కా మాస్కో ఆదేశాలను కాదని అక్కడ ప్రభుత్వాన్ని చేబట్టాడు. పోలిష్‌జాతీయవాద శక్తులు ఆయనకు అండగా నిలిచాయి. వానిని అణచివేయడానికి సోవియట్ సైనిక శక్తిని వినియోగించడం అభ్యమనుకొనే సమయమది. ఆ సమయంలో శ్రీ చౌ— ఎన్— లై మాస్కో— వార్సాలకు వెళ్లి సోవియట్— పోలిష్ నాయకుల మధ్య సామరస్య సాధనలో ప్రముఖ పాత్రను నిర్వహించాడు. సోవియట్ ప్రపంచములో, యూరపు రాజకీయ వ్యవహారాలలో చైనా వారు జోక్యం కలిగించుకున్న ప్రథమ చారిత్రక సంఘటన ఇది. స్టాలిన్ సజీవుడే అయితే, వూహించడానికి వీలులేని సన్నివేశమిది.

అలా అంతర్జాతీయ కమ్యూనిజంలో వచ్చిన క్లిష్ట పరిస్థితిలో చైనా జోక్యం కంటె కూడా గమనార్హమైన అంశం— ఈ మధ్య సంభవించిన తిరుగుబాట్ల మూల కారణాల సిద్ధాంత పరిశీలన, కొత్త పరిస్థితులకు అనువుగా కమ్యూనిస్టు సిద్ధాంతాచరణకు సంబంధించిన సూక్తులు, అధికార ప్రకటనలు కమ్యూనిస్టు గురు పీఠమైన మాస్కో నుంచి కాక పెకింగ్ నుంచి రావడం. క్రెమ్లిన్‌లో పరిస్థితులు గందరగోళంగా ఉంటే, చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన సిద్ధాంత ప్రకటనలలో కొంత సమగ్రత, నవ్యత ఆ నాడు కానవచ్చింది. దీనితో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సోవియట్ రష్యా కంటె, కమ్యూనిస్టు చైనా ప్రతిష్ట పలుకుబడి హెచ్చింది. చైనాలో కొత్తగా ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వం బలపడడంతో పాటు, చైనా కమ్యూనిస్టు నాయకులకు

సిద్ధాంత సంబంధమైన ఆత్మవిశ్వాసం హెచ్చింప జేసింది. అంతర్జాతీయ హోదాను అందుకొనవచ్చుననే అవకాశాన్ని చూపింది. ఇందుకు మరొక కారణం కూడా తోడ్పడింది. రష్యాలో స్టాలిన్ మరణానంతరం అధికారం హస్తగతం చేసు కొనడానికి పార్టీ నాయకులమధ్య వివాదాలు, పోటీలు వచ్చాయి. ఇందువలన సోవియట్ విధానాలలో స్థిరత్వం లేకుండా పోయింది. గందరగోళం పెరిగింది. అందువల్ల అంతర్జా తీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సోవియట్ రష్యా నాయకత్వం ఆధిపత్యం బలహీన పడింది. కమ్యూనిస్టు చైనాలో ఇలాంటి ప్రతి బంధకాలు మావ్—సే— టుంగ్‌కు లేవు. ఆయన నాయ కత్వం తిరుగులేకుండా సాగింది. అందువల్లనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో గురుపీఠం ఆయన దనిపించింది.

తూర్పు యూరపు కమ్యూనిస్టు దేశాలలో తిరుగు బాట్ల సందర్భంలో రాజీ చేయడానికి చైనా ప్రధాని చౌ—ఎన్— లై మాస్కో— వార్సాలకు వచ్చి వెళ్లిన ఏడు సంవత్స రాలకు మాస్కోలో రష్యా— చైనా కమ్యూనిస్టు పార్టీల ప్రతి నిధుల మధ్య రాజీ సమాలోచనలు జరిగాయి. ఉభయ దేశాల మధ్య సిద్ధాంత సంబంధమైన వివాదాలులోకానికి వెల్లడి అయినాయి. పత్రికలలో వ్యాసాలు ద్వారాను, పార్టీల లేఖలు ద్వారాను ఉభయ దేశాలు పరస్పరం నిందించుకొనడం ఆరం భించాయి. చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన 14 సంవత్సరాలలో చైనా— రష్యాల మధ్య వచ్చిన వివాదం చరిత్రా త్మకమైనదిగాను, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయ కత్వానికి సంబంధించినదిగాను ఉంది. కనుకనే నాయకత్వాల దృష్ట్యా ఈ రెండు దేశాల వివాదం పరిశీలనార్హం అవు తున్నది.

రష్యాలో స్టాలిన్ నెలకొల్పిన ప్రభుత్వ వ్యవస్థ మూడు స్తంభాలమీద— పార్టీ, పోలీసు, సైన్యం— నిలిచి ఉంది. పార్టీ అధినేతగా స్టాలిన్ పాలించాడు. పోలీసు బలం అండ ఉన్నం దున పార్టీ పాలన నిరాఘాటంగా సాగింది. సైన్యాన్ని మాత్రం రాజకీయాలకు దూరంగా ఉంచి అది పార్టీమీద, పోలీసులమీద ఆధారపడేటట్టు చేశాడు. స్టాలిన్ మరణంవల్ల పార్టీ అధినేత పోవడంలో పోలీసు నాయకుడు బెరియాది పైచేయి అయింది.. సోవియెట్ పౌరుల ప్రాణాలే కాక, పార్టీ నాయకుల ప్రాణా లన్నీ ఈ రహస్య పోలీసు దళాధికారి చేతులలో ఉన్నాయి. ఆ సంగతి రష్యా కమ్యూనిస్టు నాయకు లందరికీ తెలుసు. ఆ కారణానే స్టాలిన్ మరణానంతరం "సమిష్టి నాయకత్వం" అనే నినాదంతో పరిపాలన సాగించారు. స్టాలిన్ అడుగుజాడ లలో పోలీసు అధికారి బెరియా నియంతృత్వం ఏర్పడకుండా ముందుగా నివారించారు. పార్టీ కార్యదర్శి శ్రీ మాలెంకోవ్‌ను అధికారంలో ఉంచి, పార్టీది పైచేయి అనిపించారు. అయితే సంవత్సరం తిరగకముందే బెరియాను పతనం చేశారు. కాల్చి వేయించారు. స్టాలిన్ మరణం కంటె బెరియా మరణం రష్యా కమ్యూనిస్టు చరిత్రగతిని మార్చింది. స్టాలిన్ వలె నియంతగా వ్యవహరించగల బెరియా అనే వ్యక్తి లేడు. తిరిగి స్టాలిన్, బెరియాల వంటి వ్యక్తులు తలెత్తడం ఇప్పట్లో సాధ్యంకాదు. అలా నియంతృత్వం బాధ అనేది రష్యాకు ఒక విధంగా తప్పింది. పోతే రహస్య పోలీసు దళం అనేది ఒక ఆయుధంగా మొక్కపోయింది. సోవియట్ ప్రజలను అష్ట దిగ్బంధనం చేయగల పైశాచిక శక్తి నశించింది. తిరిగి అలాంటి శక్తి తలెత్తకుండా తగిన కట్టుదిట్టాలను పార్టీ కార్యదర్శిగా ఉన్న శ్రీ కృశ్చేవ్ చేశాడు.

అయితే పోలీసు శక్తిని అణచడానికి చేసిన ప్రయ త్నంలో సైనిక శక్తి ప్రాధాన్యం హెచ్చింది. స్టాలిన్ కాలంలో రాజకీయాలకు దూరంగా వుంచబడిన సైనికశక్తి మూడు సందర్భాలలో స్టాలిన్ మరణం, బెరియా అరెస్టు, కృశ్చేవ్—మాలెంకోవ్ వివాదం—లో ప్రముఖ పాత్రవహించింది : ప్రముఖ నాయకులందరి ఏకీభావం మీదనే రష్యా సైన్యాధికారులు రాజకీయరంగంలో అడుగు పెట్టారు. స్టాలిన్ మరణానంతరం జరిగిన చర్చలలో ప్రభుత్వం— పార్టీ అనేవి విడివిడి వుండాలన్న నిర్ణయానికి వచ్చి మాలెంకోవ్‌కు ప్రభుత్వాన్ని కృశ్చేవ్‌కు పార్టీని అప్పగింత పెట్టడంలో సైన్యాధికారుల సమ్మతికూడా వుంది : సోవియట్ ప్రజలను— ప్రభుత్వాన్ని—పార్టీని మరొక నిరంకుశత్వంలో నుంచి కాపాడాలంటే బెరియాను హతం చేయడం అవసరమన్న నిర్ణయానికి రావడంలోను, అతన్ని అరెస్టుచేసి, కాల్చివేయడంలోను రష్యా సైన్యాధికారుల అంగీకారం కూడా వుంది. చివరకు మాలెంకోవ్‌ను కాదని కృశ్చేవ్‌ను రష్యా పాలకుడుగా తీసుకురావడంలో కూడా సోవి యెట్ సైన్యాధికారుల చేయి వుంది. ఈ విధంగా సోవియట్ కమ్యూనిస్టు ప్రభుత్వ చరిత్రలో పార్టీకాక, సైన్యాధి. కారుల ద్వారా పాలకులు నిర్ణయం కావడమనేది అపూర్వము. అయితే పార్టీలోవలెనే రష్యా సైన్యాధికారులలో కూడా చీలికలు వున్నాయి. ఆ చీలికలను ఆధారంగా తీసుకొనే చివరకు పార్టీ నాయకుడైన కృశ్చేవ్ ఆయా సమయాలను బట్టి మార్షల్ బుల్గానిన్, మార్షల్ ఒరోషిలోవ్ వంటి వారిని రాజకీయ పదవులలో వుంచడం, తీసివేయడం సాగించాడు. ఈ విధంగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వ్యవస్థలో వచ్చిన మార్పులు అంతర్జాతీయంగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ పలుకుబడిని తగ్గించాయి. చైనాలో మావోకు ఇలాంటి చిక్కులు లేవు కనుక అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఆయనవైపు చూసింది.

సోవియట్ రష్యా నాయకత్వ నిర్ణయంలో కేవలం రెడ్ ఆర్మీ అధికారులు మాత్రమేకాక, బయటి దేశాల కమ్యూ నిస్టు నాయకుల జోక్యం కూడా కొంతవరకు పనిచేసింది. మాలెంకోవ్‌ను పదవీ భ్రష్టుణ్ణి చేయడానికి మూడు నెలల ముందుగా శ్రీ కృశ్చేవ్, బుల్గానిన్—మికొయాన్‌లతో కలిసి పెకింగ్ వెళ్లాడు. అప్పుడు మావోతో కలిసి వారెలాంటి నిర్ణయాలకు వచ్చింది ఆ తర్వాత కాని కొద్దికొద్దిగా బయ టకు పొక్కలేదు. ఈ సమాలోచనాలలో మాలెంకోవ్—మొలొటోవ్‌లు లేరు. కృశ్చేవ్— బుల్గానిన్— మికొయాన్‌లు వున్నారు. దీనినిబట్టి రష్యాలో కొత్త నాయకులుగా రాదలు స్తున్నవారు మావో ఆపరాకు వచ్చారని సులభంగా ఊహిం

చుకో వచ్చు. కమ్యూనిస్టు ప్రపంచంలో అంతవరకు ఊహించరాని సంఘటన ఇది. అయినా అది జరిగింది. పెకింగ్ ఆమోద ముద్రను కోరిన మాస్కో అందుకు తగిన మూల్యాన్ని చెల్లించింది. మంచూరియాలో రష్యాకు చెందిన చివరి స్థావరాలు వదులుకున్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీలో రష్యా వర్గీయుడుగా వున్న కావో— క ంగ్‌ను అతని కర్మానికి వదిలారు. నాటి నుంచి నేటివరకు చైనా కమ్యూనిస్టు పార్టీలో రష్యా వర్గం అనేది లేకుండా పోయింది. చైనాలో నాయకత్వం తిరుగు లేకుండా బలపడింది. రష్యా కమ్యూనిస్టులలో నాయకత్వాన్ని గురించి లెనిన్ తర్వాత కాలంలోను, స్టాలిన్ మరణానంతరం వచ్చిన పోటాపోటీలు వంటివి చైనాలో కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది. కేవలం నాయకత్వ బలం అనేదిదానివల్లనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం మావోకు దక్కగల దనిపించింది. అయితే మావో అనంతరం చైనా స్థితి ఏమిటన్న ప్రశ్నకు సమాధానాలను ఊహించవలసిందే కాని, ఇదమిత్థమని చెప్పుకొనడానికి తగిన ఆధారాలు అందుబాటులో లేవు.

మొత్తంమీద చెప్పుకోవాలంటే, స్టాలిన్ మరణానంతరం సోవియట్ రష్యా అంతర్గతమైన కారణాలవల్ల కూడా బలహీనపడింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం సంగతి అలా వుంచి, దేశంలోనే పార్టీ నాయకత్వం ఎవరు— ఎలా నిర్వహించాలనేది వివాదంశమైంది. ఈ వివాదం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీన పరచింది. ఇలా జరగడం చరిత్రలో ఇది రెండవదఫా, మొదటిదఫా లెనిన్ మరణానంతరం స్టాలిన్— ట్రాటస్కీల మధ్య వివాదం వచ్చింది. రెండవ దఫా మాలెంకోవ్— కృశ్చేవ్‌ల మధ్య ఏర్పడింది.

కమ్యూనిస్టు చైనా దృష్టినుంచి చూస్తే, రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం సుస్థిరంగా వుండడం, పెకింగ్ ప్రభుత్వాన్ని బలపరుస్తూ స్టాలిన్ అనుసరించిన విధానాలు మాస్కో కొనసాగుతూ వుండడ మనేది చైనా కమ్యూనిస్టు నాయకుల ప్రధాన లక్ష్యంగా వుంది. అంటే చైనా అభివృద్ధికి అవసరమైన భారీ యంత్రాలు వగైరాలు రష్యా నుంచి పొందడం అనేది వారిలక్ష్యం. కాని అప్పటి రష్యా ప్రధాని మాలెంకోవ్ సోవియట్ ప్రజలకు అవసరమైన నిత్య జీవితావసర వస్తువుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలని వాదించగా, భారీ యంత్ర సామగ్రుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలని శ్రీ కృశ్చేవ్ ప్రతిపాదించాడు. ఇందుకు సంబంధించిన సిద్ధాంత వివాదంలో చైనా కమ్యూనిస్టులకు మాలెంకోవ్ మీద కంటే కృశ్చేవ్‌మీద మోజు పెరిగింది : ఇది చైనా ప్రయోజనాల దృష్ట్యాకలిగిన మోజు.

చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం నెలకొన్న తర్వాత మొదటి మూడున్నర సంవత్సరాలు (1953 వరకు) అంటే స్టాలిన్ మరణకాలం వరకు చైనా— రష్యా సంబంధాలు చాలా సన్నిహితంగా వున్నాయి. మావ్—సే—టుంగ్ మాస్కోను సందర్శించిన ఫలితంగా రెండు కమ్యూనిస్టు దేశాలమధ్య సైనిక సంధి జరిగింది. కొరియా యుద్ధకాలంలో ఈ సంధి షరతులకు పరీక్ష వచ్చింది. ఈ పరీక్షా ఫలితమే చైనా— రష్యాలమధ్య వివాదానికి బీజంవేసింది.

కొరియా యుద్ధమనేది కమ్యూనిస్టు చైనా ఆ నాడు "సామ్రాజ్య వాదులతో" తెచ్చిపెట్టుకున్న పెద్ద సంఘర్షణ. అయితే కొరియా యుద్ధాన్ని ప్రత్యక్ష జోక్యంతో కాక, చైనా చాటున వుండి మద్దతు ఇస్తూ నడపాలని రష్యా కోరింది. కాని ఆ సలహాను చైనా తిరస్కరించింది. అయినప్పటికి చైనాకు కావలసిన రకరకాల సహాయాన్ని రష్యా అందజేసింది. దానితో సామ్రాజ్య వాదంపై కొనసాగించే యుద్ధంలో అవసరమైన సహాయాన్ని రష్యా చేయగలదన్న నమ్మకం చైనాకు కలిగింది. దీనితోపాటు ఒకరకమైన అహంభావం, ఆత్మవిశ్వాసం కూడా చైనాలో బలపడింది. కొరియా యుద్ధం అనేది ఐక్యరాజ్య సమితిలోని మూడు అగ్రరాజ్యాలతో సహా మొత్తం 16 రాజ్యాలు సమితి ఆధ్వర్యాన మూడున్నర సంవత్సరాలు పోరాడాయి. చైనా భూభాగం మీద ఒక్క బాంబు పడలేదు. కాని చైనా సైన్యాలు మరొక దేశపు భూభాగంలోకి వెళ్లి పోరాడి జయం పొందాయి. ఒక దేశపు కమ్యూనిస్టు సైన్యాలు మరొక దేశానికి వచ్చి పోరాడడ మనేది, అందులోను చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తొలి దశాబ్దంలోనే జరగడమనేది కమ్యూనిస్టు చైనా ప్రభుత్వం కీర్తి ప్రతిష్టలను పెంచాయి. (రష్యా చరిత్రలో ఇలాంటి పరిణామానికి దాదాపు మూడు

దశాబ్దాలు పట్టేంది.) రష్యా సలహాలను పెడచెవిని బెట్టి, స్వయం నిర్ణయంతో వ్యవహరించిన కారణాన కమ్యూనిస్టు చైనాకు కొరియా యుద్ధంలో కలిగిన విజయం దాని యోచనా ధోరణిని మార్చింది. యూరపులో రష్యావలె, ఆసియాలో తాను అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం స్వీకరించవచ్చుననే ఆశను పెంచింది. కమ్యూనిజంలో జాతీయ వాద సంబంధమైన ధోరణికి గట్టి పునాదులు వేసింది.

కొత్తగా అధికారాన్ని చేబట్టిన చైనా కమ్యూనిస్టు నాయకులలో జాతీయ స్వాతంత్ర్య వాంఛ మెండు. సోవియట్ రష్యాతో సహా అన్ని అగ్రరాజ్యాల కిందవున్న చైనా భూభాగాలు తక్షణమే తమ కిందకు తెచ్చుకోవాలన్న పట్టుదల వారిలో వుంది. అది గ్రహించినందువల్లనే కృశ్చేవ్ చైనాలో సోవియట్ రష్యాకుగల పెక్కు హక్కులను వదులుకొని, ఆదిలో వారి అభిమానాన్ని సంపాదించాడు. ఇలా జాతీయ వాంఛను మాస్కో గుర్తించడమనేది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కొత్త పరిణామాలను తెచ్చింది. యూరపులోని తూర్పు కమ్యూనిస్టు దేశాలకు కూడా ఇలాంటి వాంఛ వున్నాయి. జాతీయ దృష్టితో స్వతంత్రంగా వ్యవహరించదలచుకున్నాయి. మాస్కోకు తమకు మధ్య సమాన ప్రతిపత్తి, సార్వభౌమాత్మక స్థితి— Status, full sovereignty కావాలని కోరుతున్నాయి. వీని ధోరణిని కూడా కృశ్చేవ్ గమనించాడు. వీనికి స్టాలిన్ నిర్మించిన ఉక్కు చట్రాన్ని వదులు చేశాడు. తూర్పు యూరపు కమ్యూనిస్టు నాయకులు కాస్త స్వేచ్ఛా వాయువు పీల్చుకొనేటట్టు చేశాడు. దీనివల్ల రెండు ఫలితాలు సంభవించాయి. ఒకటి—ఈ దేశాల కమ్యూనిస్టు నాయకులందరూ రష్యాలో కృశ్చేవ్ నాయకత్వాన్ని బలపరచడం, తద్వారా యూరపులో కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం సోవియట్ రష్యా చెప్పుచేతలలో ఉండడం. రెండవ ఫలితం—కమ్యూనిస్టు చైనా ప్రాబల్యం, లేదా మావ్— సే—టుంగ్ విధానాలవల్లనే జాతీయవాంఛలపట్ల రష్యా నాయకత్వ ధోరణిలో మార్పు వచ్చిందని తూర్పు యూరపు కమ్యూనిస్టు గుర్తించడం. ఆ విధంగా మావ్—సే—టుంగ్ నాయకత్వానికి అక్కడ పరిగణన వుండడం. అది కమ్యూనిస్టు చైనా గుర్తించి యూరపులో కమ్యూనిస్టుల మధ్య వచ్చే చీలికలలో జోక్యం కలిగించుకొని రష్యాకు— తూర్పు యూరపు కమ్యూనిస్టులకు మధ్య "సారథి"గా ప్రసిద్ధి పొందడం, తద్వారా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రష్యాతో సమాన ఉజ్జీగా పెంపొంది, చివరకు పోటీకి పడడం. ఇలా సంభవించిన ఈ రెండు ఫలితాలలోనే భవిష్యత్ పరిణామ బీజాలు కూడా పడ్డాయి. అది యుగోస్లావియాలో టిటో నాయకత్వం, అందుకు సంబంధించిన వివాదంవల్ల బహిర్గతమయ్యాయి.

స్టాలిన్ కాలంలోనే రష్యా— యుగోస్లావియాల మధ్య తగాదాలు వచ్చాయి. పార్టీల కంట్రోలు, తూర్పు యూరపు కమ్యూనిస్టు రాజ్యాల సమీకరణ, సోషలిజం స్థాపనకు అచరించ వలసిన పద్ధతులు, జాతీయ వాంఛలు పశ్చిమ దేశాల సహాయ స్వీకారంవంటి సమస్యలను గురించి అభిప్రాయ భేదాలు కలిగాయి. యుగోస్లావియా నాయకుడు మార్షల్ టిటో యూరపులో నిర్వహించిన ప్రత్యేక పాత్రను, ఆసియాలో తాను కూడా నిర్వహించాలన్న కోర్కె మావ్‌కివున్నప్పటికి, యుగోస్లావియా— రష్యాల మధ్య సాగిన వివాదంలో మావో రష్యాను బలపరుస్తూ వచ్చాడు. అయితే కృశ్చేవ్ ఎప్పుడైతే బెల్‌గ్రేడుకు వెళ్లి బెరియా కుతంత్రంవల్ల రష్యా—యుగోస్లావియాల మధ్య తగాదా ఏర్పడిందని చెప్పి, రాజీ పడిపోయాడో, అప్పుడు మావ్ ఏమీ మాట్లాడలేదు. మాస్కో విధానంలో వచ్చిన మార్పును మౌనంగా అంగీకరించాడు. ఇది స్టాలిన్ మరణానంతరం, కృశ్చేవ్ నాయకత్వం స్థిరపడే నాటి వరకు వున్న మధ్యకాలంలో మావో— అనుసరించిన విధానం.

కేవలం అంతర్జాతీయ వ్యవహారాలలోనే కాక, దేశీయ విధానాలలో కూడా సోవియట్ మార్గాన్నే ఈ కాలంలో మావ్ అనుసరించాడు. కమ్యూనిస్టు ప్రవర్తనకు గీటురాయి సోవియట్ రష్యా అనే సూత్రాన్ని చైనా ఇంకా అనుసరిస్తూ వచ్చింది. రష్యాలోనలెనే చైనాలో కూడా సాహిత్యంలో, విజ్ఞాన శాస్త్రంలో భావప్రకటనలో "Thaw" వచ్చిన కాలమది. 1955 వరకు చైనాలో జరిగిన విప్లవ నిరోధకుల ఏరివేత, మేధాశుద్ధి (Brain washing) ఉద్యమం, విదేశ ఏజంట్ల పరిమార్పు వంటివి పూర్తి అయ్యాయి. విప్లవ వ్యతిరేక భావాలు లేనివారిని ప్రభుత్వం రక్షిస్తుందనే అభయహస్తం ద్వారా 1956 ఆరంభంనుంచి లిబరల్ విధానాలను చైనా అనుసరించింది. చివరకు 1956లో "శత పుష్పాల వికసన" విధానాన్ని మావ్ ప్రకటించి భావ స్వాతంత్ర్యానికి అవకాశమిచ్చాడు. కమ్యూనిస్టు రాజ్యంలో ఇలాంటి స్వాతంత్ర్యం పౌరులకు లభించడం అదే ప్రథమం. అలాంటి సదవకాశం నాటికీ నేటికీ రష్యా పౌరులకు లభించలేదు. దారుణ దమననీతికి ప్రసిద్ధి చెందిన కమ్యూనిస్టు రాజ్యాలలో సరళ విధానాలను అనుసరించడ మనేది కమ్యూనిస్టు చైనాలోనే ముందుగా ఆరంభమైంది. అది ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆకర్షించింది. చైనా స్వతంత్ర ధోరణి తూర్పు యూరపుకు మార్గదర్శికమైంది.

కాని స్టాలిన్ హయాంలో పెంపొందిన వ్యక్తి ఆరాధన తత్వాన్ని, ఆయన చేసిన కొన్ని తప్పులను నిశితంగా శ్రీ కృశ్చేవ్ విమర్శించిన రోజు అంతర్జాతీయ కమ్యూనిజానికి చాలా చెడ్డ రోజు. కృశ్చేవ్ ఇలా ఎందుకు చేశాడనేది ఊహించవలసిందే కాని స్పష్టంగా చెప్పడానికి వీలుపడదు. ఇతర కమ్యూనిస్టు పార్టీలకు ముందుగానే తానిలా చేస్తున్నాడనే వర్తమానం పంపాడో లేదో తెలియదు. కాని కీర్తిశేషుడు స్టాలిన్‌ను రాక్షసుడుగా చిత్రిస్తూ కృశ్చేవ్ ప్రసంగించడానికి పదిరోజులు ముందు (1956 ఫిబ్రవరిలో) 20వ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ మహాసభకు సౌహార్ద ప్రతినిధిగా వచ్చిన చైనా సైనిక నాయకుడు —ఛూ—టే, మావ్ నుంచి తెచ్చిన ఒక సందే

చైనా - రష్యా వివాదాలు

శాన్ని మహాసభలో చదువుతూ "లెనిన్ స్థాపించిన స్టాలిన్ పెంచిన సోవియట్ కమ్యూనిస్టు పార్టీ అభేద్యం" అంటూ ఉదాహరించాడు. ఇలాంటి సందర్భంలో ఇలాంటి ప్రయోగం యోచనలేకుండా జరగలేదు. "లెనిన్, స్టాలిన్‌ల పార్టీ" అనే పాత అభిమానానికి మావ్ ఇంకా బద్ధుడనేది ఇది సూచిస్తున్నది. స్టాలిన్‌ను ఖండిస్తున్నానని కృశ్చేవ్ ముందుగా సూచించక పోతే మావో చేసిన ఈ ప్రకటన విజ్ఞత లేనిది అవుతుంది. ఒకవేళ సూచన వచ్చినా, ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకొనలేదంటే అది ఆయన స్వతంత్ర ధోరణిని వ్యక్తం చేస్తున్నది. ఏమైనప్పటికి ఈ నాటి నుంచే రష్యా— చైనా నాయకులు చీలిపోయారు. ఎవ్వరి మార్గం వారు అనుసరించడం ఆరంభించారు.

కేవలం చారిత్రక దృష్టితో చూస్తే స్టాలిన్‌కి వ్యతిరేకంగా కృశ్చేవ్ చేసిన ప్రకటన పెద్దతప్పు అనే చెప్పాలి. స్టాలిన్ దుర్మార్గాలను అనుభవించిన సోవియట్ ప్రజలకు— పెద్దలకు అది సంతృప్తిని కలిగించవచ్చు. ఇక ముందు ఇలాంటి దారుణాలు కొనసాగవని వారు కోరుతున్న హామీ ఇందువల్ల రష్యా ప్రజలకు లభించవచ్చు. కాని అంతర్జాతీయ కమ్యూనిజం పేరుతో రష్యాను గురించి, స్టాలిన్‌ను గురించి ప్రపంచ వ్యాపితమైన చరిత్ర, అభిమానం, భక్తి వుంది. దానిని గురించి నాలుగు దశాబ్దాలుగా రకరకాలనిశిత విమర్శలు, వాదోపవాదాలు వున్నాయి. కృశ్చేవ్ ప్రకటనతో ఆ విమర్శలన్నీ నిజమని ధృవపడింది. సోవియట్ ప్రభుత్వాన్ని గురించి, స్టాలిన్‌ను గురించి ప్రపంచ ప్రజలలో కొందరికి గల పూజ్యభావం ఎగిరి పోయింది. కమ్యూనిజం మూర్తీభవించిన అవతార పురుషుడని స్టాలిన్‌ను గురించి కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు అభిమానులు కనిన కలలు కరిగి పోయాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అంతర్జాతీయ కమ్యూనిజం నడుము విరిగిపోయింది.

ఇతర కమ్యూనిస్టు దేశాలలో కంటె చైనాలో ఇది బాధాకరమైన పరిణామం. సోవియట్ యూనియన్‌ను గురించి స్టాలిన్ నాయకత్వాన్ని గురించి చైనా ప్రజల మనోవీథులలో గాలిమేడలు కట్టడానికి కమ్యూనిస్టు ప్రభుత్వం చాలా కృషి చేసింది. సోవియట్ నమూనాలో చైనా కమ్యూనిస్టు ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడింది. అప్పటికి ఏడేళ్ల క్రిందటనే చైనా ప్రభుత్వం కమ్యూనిస్టుల చేతికి వచ్చింది. ఇలాంటి అపరిపక్వ దశలో వ్యక్తి ఆరాధన తత్వాన్ని, పార్టీ నాయకుడుగా స్టాలిన్ కొనసాగించిన దురంతాలను ఖండించడం అంటే ప్రత్యక్షంగా రష్యాను, స్టాలిన్‌ను నిందించడం. పరోక్షంగా మావ్‌ను, ఆయన ప్రభుత్వాన్ని శంకించడం కాగలదు. స్టాలిన్‌నువలె మావోను కీర్తించడానికి వీలులేదని చెప్పడమవుతుంది. (భారత కమ్యూనిస్టుల "ప్రజాయుద్ధ" నినాద కాలంనాటి అనుభవాన్ని ఈ సందర్భంలో గుర్తుకు తెచ్చుకోవచ్చు) వీటన్నింటిని ఫలితంగా సోవియట్ పార్టీ నాయకత్వం మీదను, విజ్ఞతమీదను ఆధారపడి వ్యవహరించడం మంచిది కాదన్న భావం చైనా కమ్యూనిస్టులలో ధృవపడింది.

ఆ తర్వాత తూర్పు యూరపులో రాజకీయంగా వచ్చిన తికమకలు, పోలెండు హంగరీలలో తిరుగుబాట్లు వీరిభావాన్ని ధృవపరచాయి. కొత్త పరిస్థితులకు అనువుగాను, యూరపులో పతనావస్థలో వున్న కమ్యూనిస్టు రాజ్య వ్యవస్థ పునః ప్రతిష్టకుగాను, మాస్కోకు స్వతంత్రమైన విధానాలను రూపొందించి అమలు జరపాలనే నిర్ణయానికి చైనా కమ్యూనిస్టులు వచ్చారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తమ నాయకత్వానికి అనువగు ప్రాతిపదికలు వేసుకొన్నారు.

ఇలాంటి అవకాశం కమ్యూనిస్టు చైనాకు చారిత్రకమైన కారణాలవల్ల లభించినా, ఇందులోనే మావో స్వప్రయోజనాలు కూడా కొన్ని వున్నాయి. తూర్పు యూరపు కమ్యూనిస్టు రాజ్యాలలోని తిరుగుబాట్లు ఫలితం చైనాలో కూడా వుండగలదని మావ్ భయపడ్డాడు. తన ప్రభుత్వానికి కూడా ప్రమాదం రాగలదన్న ఆందోళనను, కమ్యూనిస్టు వ్యతిరేక భావాలుగల చైనీయుల విజృంభణకు అవకాశ మివ్వగలదన్న అనుమానాలను వ్యక్తం చేశాడు. అన్నింటికంటె మరొక విషయం మావ్‌ను మరింతగా బాధించింది. అది సోవియట్ ప్రభుత్వ అశక్తత : కేవలం స్థానిక సైనిక సమస్య మాత్రమే కాక, అంతర్జాతీయంగా మార్క్సిజానికి, లెనినిజానికి సవాలు వచ్చిన సందర్భంలో స్పష్టమైన నాయకత్వాన్ని, భావ వివరణ ద్వారా సోవియట్ పార్టీ ఇవ్వలేకపోయింది. కాగా తన సైనిక బలం ద్వారా తూర్పు ఐరోపా వెల్లువను అరికట్టింది. హంగరీలో సోవియట్ టాంకులను ప్రయోగించింది. అయితే ఒక వైపున సోవియట్ శతఘ్నుల కాల్పులు జరుగుతూ వుంటే, మరొకవైపును పెకింగ్ నుంచి చైనా భావాల బాంబుల వర్షం కూడా ఆరంభమైంది. మార్క్సిజానికి. లెనినిజానికి కొత్త వ్యాఖ్యానాలు చేయగల అవకాశం ఈ విధంగా చైనాకు లభించింది. రష్యాలో బలహీనత, చైనాకు బలంగా పరిణమించింది.

హంగరీలో సోవియట్ జోక్యాన్ని మార్షల్ టిటో ఖండించాడు. హంగరీలో కాడార్ ప్రభుతత్వాన్ని గుర్తించడానికి పోలెండు నిరాకరించింది. ఈ విధంగా తూర్పు యూరపు కమ్యూనిస్టు ప్రపంచంలో బీటలు కనిపించాయి. దీనికి మూలకారణం సోవియట్ నాయకత్వంలో చీలికలు. స్టాలిన్ బిగించిన ఉక్కు చట్రాన్ని కృశ్చేవ్ సడలించడం అని రష్యాలోని స్టాలిన్ అనుయాయులు కృశ్చేవ్‌ను నిందించారు. తన విమర్శకులకు సమాధాన మివ్వగల వ్యక్తిగతమైన శక్తి అప్పటికి ఇంకా కృశ్చేవ్‌కు లభించలేదు. ఒకవేళ ఆ శక్తి ఆయనకు వున్నా, దానికొక భావధోరణి రూపమిచ్చి పార్టీ విధాన ప్రకటనగా ఇవ్వగల అవకాశం ఆయనకు దొరకలేదు. ఆ అవకాశం చైనాకు ఆయన చేతులారా ఇచ్చాడు. పార్టీ తగాదాలు, అంతర్గతమైన బలహీనతలు లేకుండా వున్న ఏకైక కమ్యూనిస్టు నాయకుని (మావ్‌ని) కలిగివుండడం ఆ నాడు చైనా అదృష్టం. అప్పుడు చైనా కమ్యూనిస్టుపార్టీ అధికార ప్రకటన ఒకటి వచ్చింది. తూర్పు యూరపు సంఘటనల పరిశీలనకు తగిన సూత్రాలకు నిర్వచనం జరిగింది. మార్క్సిస్టు— లెనినిస్టు సిద్ధాంతాలను జాతీయ పరిస్థితు

లకు అనువుగా అన్వయించాలన్న స్పష్టీకరణ వచ్చింది. ఇది కమ్యూనిస్టు ఉపగ్రహ రాజ్యాల ఆశలకు జీవం పోసింది. ఆయా దేశాల పార్టీలకు అంతర్గత వ్యవహారాలలో స్వాతంత్ర్యం వున్న "సోషలిజం సాధనకు విభిన్న మార్గాలు"— "రివిజనిజం నిరాకరణ" అన్న సూత్రాలు ఆధారంగా కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ సమైక్యత వుండి తీరాలని కూడా ఈ ప్రకటనలో వుంది : ఈ ప్రకటన రష్యాలో విపరీతంగా ప్రచారం జరిగింది. కమ్యూనిస్టు ప్రచారానికి ఇదొక కొత్త మార్గాన్ని చూపింది. ఈ ప్రకటనలోని సిద్ధాంతాల ఆచరణకు గాను చైనా ప్రధాని చౌ— ఎన్— లై తూర్పు యూరపు "రాజకీయ దూతగా" కాలు పెట్టాడు. అయితే ఇందులో ఆయనకు కలిగిన అనుభవంలోనే భవిష్యత్తులో చీలికలకు పునాది పడింది. జాతీయవాదం మూర్తీభవించిన పోలెండు ద్వారా ఇది బయట పడింది.

తూర్పు యూరపులో దౌత్యం నెరపడానికి వచ్చిన చౌ— ఎన్— లై ముందుగా మాస్కోకు వచ్చాడు. హంగరీలో వలె పోలెండులో గోముల్కా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైనిక బలప్రయోగం చేయరాదని వాదించాడు. ఆ తర్వాత వార్సాకు వెళ్లి హంగరీలో సోవియట్ జోక్యాన్ని గోముల్కా సమర్థించాలని, కమ్యూనిస్టు శిబిరానికి సోవియట్ నాయకత్వాన్ని అంగీకరించాలని సలహా చెప్పాడు. ఇది పోలెండు కమ్యూనిస్టులకు ఆశ్చర్యం కలిగించింది. రష్యా ఆధిక్యతను కాదనడంలో చైనా తమతో వుంటుందని పోలెండు నాయకులు భావిస్తూ వచ్చారు. కాని రష్యా అంతగా పలుకుబడిని కోల్పోయిన తర్వాత కూడా దాని అంతర్జాతీయ నాయకత్వాన్ని అంగీకరించాలని చైనా సలహా చెప్పడం వారికి ఆశ్చర్యం కలిగించింది. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు రాజ్యాలన్నీ ఒక్కటిగా వుండడం అవసరమని, రష్యాకు సైనికంగాను, ఆర్థికంగాను వున్న శక్తి సామర్థ్యంవల్ల కమ్యూనిస్టు రాజ్య కూటంలో దాని నాయకత్వం తప్పనిసరి అని, దీనిని అంగీకరించినంత మాత్రాన సభ్య దేశాల సర్వసత్తాకకు భంగం వుండదని ఆ నాడు చౌ— ఎన్— లై పోలెండు నాయకులతో వాదించాడు. (ఈ వాదనను 1963లో చైనా కాదంటున్నది.)

ఆ నాడు చైనా ఇలా వాదించడానికి కారణం వుంది. రష్యాపట్ల గల వ్యతిరేకతతో పోలెండు కమ్యూనిస్టు శిబిరం నుంచి చీలిపోయి, యుగొస్లావియాలో టిటోవలె తటస్థ వైఖరిని అవలంభిస్తుందనే అనుమానం చైనాకు కలిగింది. మావ్ అభిప్రాయం ప్రకారం సామ్రాజ్య వాదానికి వ్యతిరేక పోరాటం అంటే "అంతర్జాతీయ రంగంలో వర్గకలహం" అని అర్థం. అలాంటి పోరాటంలో "తటస్థ్యం" అనేది నిరర్థకం. శత్రువుకు సహాయకారి. (శ్రీ నెహ్రూ విబంధ విధానాన్ని చైనా వ్యతిరేకించడానికి కూడా కారణం ఇదే) సోషలిజం సాధనకు విభిన్న మార్గాలను అనుసరించడమూ అంటే అర్థం సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో "తటస్థం"గా వుండే హక్కు కమ్యూనిస్టు రాజ్యాలకు కలదని కాదు : (అందువల్లనే యుగొస్లావియాలో మార్షల్ టీటోను ఆయన విధానాలను "రివిజనిజం" కింద జమకట్టి చైనా ఖండిస్తున్నది.) తూర్పు యూరపు కమ్యూనిస్టు నాయకులకు ఈ సిద్ధాంతాలను ఒక వైపున చౌ— ఎన్— లై చెబుతూ వుండగానే మరొక చైనా పార్టీ ప్రతినిధియుగొస్లావియాకు వెళ్లి మార్షల్ టీటోను ఈ మార్గానికి అంగీకరింప జేయాలని ప్రయత్నించి విఫలమైనాడు. 1955 నుంచి ఏదో ఒక విధంగా మార్షల్ టీటోను తమవైపుకు రాబట్టాలని కృశ్చేవ్ ఎంతగానో ప్రయత్నించాడు. కాని ఫలితం లేకపోయింది. అందువల్ల యుగొస్లావియాను, టీటో విధానాలను తేలికగా విమర్శిస్తూ అప్పుడప్పుడు కృశ్చేవ్ ప్రసంగిస్తూ వచ్చాడు. హంగరీలో సోవియట్ జోక్యాన్ని టీటో ఖండించడంలో టీటో కృశ్చేవ్ లకు తిరిగి బెడిసింది. ఆ సమయంలోనే చైనా చేసిన ప్రయత్నాలు కూడా ఫలించకపోవడంతో చైనాకూడా టీటోమీద విమర్శలు ఆరంభించింది. అవి రష్యానుంచి వచ్చేవానికంటె కటువుగా వుంటూ వచ్చాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చైనా నిర్వహించదలచిన పాత్రను ముందుగా కా: న్నవాడు టీటో. :నుకనే చైనా విమర్శలు నిశితంగా సాగాయి. ఇవి ఇంకా నిశితంగా వుండేటట్టు కృశ్చేవ్ ప్రోత్సహించాడన్న ప్రతీతికూడా వుంది. స్టాలిన్ మరణానంతరం, టీటోతో రాజీపడాలని కృశ్చేవ్ వాదించాడు. ప్రయత్నించాడు. విఫలమయ్యాడు. అలాంటప్పుడు తాను టీటోపై చేసే విమర్శలకు విలువ వుండదు. అందువల్ల అందుబాటులో వున్న చైనాను అందుకు వినియోగించుకున్నాడు. తూర్పు యూరపులో జాతీయవాద ప్రాతిపదికపై చైనా వ్యతిరేక వాతావరణానికి బీజం వేశాడు. యుగొస్లావియా, పోలెండుల ద్వారా దానిని పెంచాడు. జాతీయ వాద శక్తులతోనే చైనా కమ్యూనిస్టులను పరోక్షంగా దెబ్బ తీశాడు. చివరకు టీటో— గోముల్కాలు కృశ్చేవ్ వైపున నిలిచారు : తూర్పు యూరపులో చైనాకు తాత్కాలికంగా పెరిగిన ప్రతిష్ఠ తగ్గిపోయింది. ఒక్క అల్బేనియా మాత్రం చైనాకు అండగా నిలిచింది. ఇలా యూరపులో కమ్యూనిస్టు ఉద్యమం మీద రష్యా ఆధిపత్యం తిరిగి స్థిరపడింది. కృశ్చేవ్ నాయకత్వం బలపడింది.

తూర్పు యూరపులోనే కాక, మధ్య ఆసియా వ్యవహారాలలో కూడా చైనా జోక్యం కలిగించుకుంది. అక్కడ పొందిన అనుభవం ఆసియాలో కొత్త పరిణామాలకు దారితీసింది. ఇరాక్‌లో సంభవించిన విప్లవం ఫలితంగా తిరిగి తృతీయ ప్రపంచ యుద్ధం సంభవమనే వాతావరణం (1958 జులైలో) ఏర్పడింది. రష్యాకు పొరుగున ట్రాన్స్ కకేషియా హద్దుగా ఉన్నది ఇరాక్. కనుక ఆ దేశంలోని పరిణామాల పట్ల రష్యాకు శ్రద్ధ ఉండడం, జోక్యం కలిగించుకొనడం సహజం. కమ్యూనిజం విస్తరణను నిరోధించాలన్న లక్ష్యంతో వ్యవహరించే అమెరికా కూడా రంగంలోకి దిగడంలో అర్థం ఉంది. ఏదో ఒక విధంగా అగ్రరాజ్య అధినేతల సమావేశం జరిపించాలన్న పట్టుదల ఆనాడు రష్యాకు ఉంది. అందుకు నిరాకరిస్తున్నది

అమెరికా. కనుక ఇరాక్ విప్లవాన్ని, తదనంతర పరిణామాలను కావాలని రెచ్చగొట్టి, అంతర్జాతీయ ఉద్రిక్తతను పెంచింది రష్యా. అందుకొక వ్యూహాన్ని అది పన్నింది. కాని చైనా కూడా ఆ వ్యూహంలో అనవసరంగా జోక్యం కలిగించుకొన్నది. చైనాలో పామీర్ పర్వత శ్రేణులకు దూరంగా ఉంది ఇరాక్. అలాంటి ఇరాక్‌లో అరబ్‌లతో కలిసి పోరాడడానికి తన వలంటీర్లను పంపగలనని హెచ్చరించింది చైనా. రష్యాను మించిన, రష్యా కోరినదాని కంటె హెచ్చుగా అమెరికా—బ్రిటన్‌లను రెచ్చగొట్టింది. అమెరికాను కేవలం గడ్డిబొమ్మ (కాగితం పులి)గా చిత్రించింది. ధైర్యంగా ఎదుర్కొంటే అమెరికా పలాయనం చిత్తగిస్తుందని వాదించింది. కాని "భద్రతాసంఘం పరిధిలో" అగ్రరాజ్య అధినేతల సభకు అంగీకరిస్తూ పశ్చిమ రాజ్యాలు చేసిన ప్రతిపాదనను కృశ్చేవ్ అంగీకరించదలచడంతో మధ్య ఆసియాలో ఏర్పడిన అంతర్జాతీయ ఉద్రిక్తత తగ్గింది. కాని, చైనా—రష్యాల మధ్య ద్వేషాలు పెరిగాయి.

"భద్రతాసంఘం పరిధి" లో అగ్రరాజ్య అధినేతల సభ జరగడం చైనాకు ఇష్టంలేదు. కృశ్చేవ్ ఈ ప్రతిపాదనల అంగీకరించడాన్ని అది నిరసించింది. అందువల్ల కృశ్చేవ్ హఠాత్తుగా పెకింగ్‌కు వెళ్లాడు. ఆ తర్వాత అగ్రరాజ్య అధినేతల సభ జరగాలన్న ప్రతిపాదననే విస్మరించాడు. కాని ఈ పరిణామాల అంతరార్థాన్ని చైనా విస్మరించలేదు. "భద్రతా సంఘం పరిధి" లో అంటే భద్రతా సంఘంలో శాశ్వత సభ్యత్వం కలిగిన జాతీయ చైనా ఉంటుంది. ఆ స్థానం కమ్యూనిస్టు చైనాకు దక్కే అవకాశం లేదు. దానిని కమ్యూనిస్టు చైనాకు దక్కించగల శక్తి రష్యాకు లేదు. ఇది చైనాకు పరిచితమైన సంగతి కూడా. కాని అపరిచితమైన మరొక సంగతి కూడా ఈ సందర్భంలో మావోకు తెలిసి వచ్చింది. అది భారతదేశానికి సంబంధించినది. భారతదేశంతో సహా అయిదు అగ్రరాజ్యాల సమావేశం జరగాలని కృశ్చేవ్ ఆదిలో చేసిన ప్రతిపాదన కూడా మావ్‌కు అంగీకారం కాలేదు. అయిదు అగ్రరాజ్యాలలోను ఆసియా ప్రతినిధిగా కమ్యూనిస్టు చైనా స్థానాన్ని భారతదేశానికి ఇవ్వడానికి మావ్ అంగీకరించలేదు. కొరియా యుద్ధంలో భారతదేశం అంతగా సహాయం చేసినా, కమ్యూనిస్టు చైనాను దురాక్రమణదారుగా ప్రకటించడంలో ఐక్యరాజ్యసమితి ప్రయత్నాలను శ్రీ నెహ్రూ ప్రతిఘటించినా, భద్రతాసంఘంలో జాతీయ చైనా స్థానాన్ని కమ్యూనిస్టు చైనాకు ఇవ్వాలని పనిగట్టుకొని ప్రచారం చేసినా, మధ్య ఆసియా వ్యవహారాలలో పశ్చిమ రాజ్యాల జోక్యాన్ని ఖండిస్తూ సోవియేట్ వాదనను పరోక్షంగా బలపరచినా భారతదేశాన్ని అగ్రరాజ్యంగాను దాని నాయకుడు శ్రీ నెహ్రూను అగ్రరాజ్య అధినేతగాను అంగీకరించడానికి 1958 లోనే కమ్యూనిస్టు చైనా నిరాకరించింది. తనకు ప్రత్యర్థిగా ఆసియాలో భారతదేశాన్ని రష్యా పెంచుతున్నదని శంకించడం ప్రారంభించింది. అప్పటినుంచే చైనా—భారత్ సరిహద్దులలో సైనిక సంచలనం ఆరంభమైంది. మధ్య ఆసియాలో తాను కూడా కీలకపాత్ర నిర్వహించడానికి అనువుగా పామీరు సరిహద్దులను పెంచడానికి వ్యూహాలు పన్నింది. 1963 నాటికి పాకిస్తాన్‌తో స్నేహం ద్వారా ఇరాక్ పరిహద్దులను కమ్యూనిస్టు చైనా అందుకున్నది. యూరపులో యుగోస్లావియా వలెనే ఆసియాలో భారతదేశాన్ని కూడా శత్రుశ్రేణిలో జమ కట్టి వ్యవహరించింది.

ఇంతకీ కమ్యూనిస్టు చైనా ఇలాంటి విధానాలను అనుసరించడానికి కారణం ఏమిటి ? తూర్పు యూరపు కమ్యూనిస్టు దేశాలలో విప్లవాల అనంతరం కృశ్చేవ్ నాయకత్వం రష్యాలో స్థిరపడింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రష్యా ఆధిపత్యం కొంతవరకు పుంజుకున్నది. "స్పూట్నిక్" ప్రయోగానంతరం అణ్వస్త్ర ఆయుధాల బలం కూడా రష్యాకు సంక్రమించింది. కనుక, సైనికంగాను, ఆర్థికంగాను రష్యాకు గల బలసంపత్తితో సామ్రాజ్యవాద ప్రతినిధిగా ఉన్న అమెరికాను హతమార్చాలని కమ్యూనిస్టు చైనా కోరుతున్నది. మధ్య ఆసియాలో ఉద్రిక్తత పెరిగినప్పుడు మావ్ కోరినది ఇదే. కొరియాలో యుద్ధం వచ్చినప్పుడు ఆశించినదీ ఇదే. కాని సోవియెట్ రష్యా అందుకు సిద్ధపడలేదు. యుద్ధం ఫలితాలు ఎలాంటివి కాగలవో స్వయంగా అనుభవించిన రష్యా, శాంతిని, సహజీవనాన్ని వాంఛిస్తున్నది. విప్లవాల ద్వారాను, శాంతియుతమైన మార్గాలలో కూడా సోషలిజాన్ని సాధించవచ్చునని విశ్వసిస్తున్నది. ఇందుకు అటు రష్యా ఉనికి, ఇటు కమ్యూనిస్టు చైనా ఉనికి కొంతవరకు కారణమని చెప్పుకోవచ్చు.

భౌగోళికంగా చూస్తే రష్యాలో 1917 లో బోల్షివిక్ విప్లవానంతరం నుంచి ద్వితీయ ప్రపంచ యుద్ధం ఆరంభమయ్యే వరకు యూరపులోని పొరుగు రాజ్యాల చక్రబంధం, లేదా అగ్రరాజ్యాల బెదిరింపు అనేది సోవియెట్ యూనియన్‌కు ఉండేది. అందుకు సంబంధించిన ఉద్రిక్త పరిస్థితులవల్ల స్టాలిన్ విధానాలు, స్టాలిన్ నిరంకుశత్వం నిరాఘాటంగా చెల్లాయి. ఏకైకపార్టీ పాలన, పోలీసు నిరంకుశత్వం, ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధి, నిత్యజీవితావసర వస్తువుల కంటె ఆయుధోత్పత్తికి అనువుగా భారీ పరిశ్రమల అభివృద్ధి కమ్యూనిజం పేరుతో ప్రజలను మూసపోయడం,

ఎదురుతిరిగిన వారిని హతమార్చడం, పార్టీలో వడపోతలు జరిగాయి. ఇవన్నీ చేరితే "స్టాలినిజం" అవుతుంది. దీనికే మరొక పేరు డాగ్మాటిజం. (పార్టీ సిద్ధాంతం అనే మూఢ నమ్మకంతో ప్రవర్తన) ఇలా కాదు, కాలానుగుణంగా మారుతూ వ్యవహరించాలనడం "రివిజనిజం". స్టాలినిజం ఫలితంగా సోవియెట్ రష్యాలో స్టాలిన్ వూహించిన సోషలిజం స్థాపన జరిగింది. ద్వితీయ ప్రపంచ యుద్ధంలో రష్యా విజయం పొందింది. రష్యా చుట్టూ ఉన్న బాల్కన్, బాల్టిక్ రాజ్యాలన్నీ రష్యా ఆధిపత్యంలోకి వచ్చాయి. సోవియెట్ కమ్యూనిస్టు సామ్రాజ్యం విస్తరించింది. యూరపులో జర్మనీ సమస్య, మధ్య ఆసియాలో టర్కీ, ఇరాక్ సరిహద్దుల వద్ద కలవరం మినహా సోవియెట్ రష్యాకు సరిహద్దుల సమస్య అనేది లేదు. కనుకనే అంతర్జాతీయ విధానాలలో సోవియెట్ రష్యా యోచనలు వైఖరి ఒక రకంగా ఉన్నాయి.

కమ్యూనిస్టు చైనా ఉనికి రష్యాకు విరుద్ధంగా ఉంది. ఫార్మోజాలో జాతీయ చైనా ప్రభుత్వం ఉంది. దానినే చైనా మొత్తానికి ప్రతినిధిగా ప్రపంచ రాజ్యాలు గుర్తిస్తున్నాయి. క్వెమోయ్, మట్సువోకా దీవులను ఆక్రమించుకొనడానికి వీలు లేకుండా అమెరికా అడ్డు ఉంది. కొరియా యుద్ధంలో అమెరికా ముందుకు వచ్చి చైనాకు వ్యతిరేకంగా నిలిచింది. సరిహద్దున ఉన్న ఇండో—చైనా దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పడకుండా ఫ్రెంచి సామ్రాజ్యవాదానికి అమెరికా సహాయపడింది. పాకిస్తాన్ ద్వారా సింకియాంగ్—టిబెట్ సరిహద్దులలో అమెరికా గస్తీ స్థావరాలు ఏర్పడ్డాయి. (చివరకు భారత సరిహద్దుల రక్షణకు కూడా అమెరికా సిద్ధమైంది.) కనుక కమ్యూనిస్టు చైనా చుట్టూ ఎటూ విస్తరించాలన్నా అమెరికా అడ్డుగా ఉంది. ఆ కారణంచేత కమ్యూనిస్టు చైనాకు తొలి శత్రువు అమెరికా. అలాంటి శత్రువుతో శాంతి—సహజీవనం అసంభవం. కనుక సామ్రాజ్యవాదాన్ని అంతం చేయడంలో యుద్ధం తప్పనిసరి అనే ఆలోచనాధోరణి కమ్యూనిస్టు చైనాలో పెంపొందింది. అయితే సోవియెట్ రష్యా ధోరణి ఇలా లేదనేది కూడా కమ్యూనిస్టు చైనా 1958 లోలోనే గ్రహించింది. మధ్య ఆసియా ప్రతిష్టంభన సందర్భంలో ఇది స్పష్టమైంది. కనుకనే 1957లో ఆరంభించిన "శత పుష్ప వికసన" ఉద్యమానికి మావ్ స్వస్తి చెప్పాడు. ద్వితీయ ప్రపంచ యుద్ధానికి పూర్వం రష్యాలో వలె కటువైన విధానాలకు దిగాడు. పార్టీ నియంతృత్వం పెంచాడు. స్టాలిన్ వలెనే వ్యతిరేకుల వడపోత సాగించాడు. ప్రణాళికల ద్వారా అయిదేళ్లలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాల నిర్మాణాన్ని, పదేళ్లలో పరిశ్రమలను ప్రభుత్వ పరంగా నిర్వహించడాన్ని పూర్తిచేయాలని ఆదేశించాడు. "వర్గ కలహాన్ని" గ్రామాలలోను, పట్టణాలలోను ప్రవేశపెట్టాడు. పార్టీ నిరంకుశత్వం, భయంకర చర్యలద్వారా దీని నిజ స్వరూపం ప్రజలకు చూపాడు. అంటే రష్యాలో స్టాలిన్ అనుసరించిన పద్ధతులనే చైనాలో మావ్ అనుకరించాడు. అందువల్లనే చైనాలో స్టాలిన్ భక్తి పెరిగింది. స్టాలిన్‌ను ఖండించినందుకు రష్యామీద, కృశ్చేవ్ మీద ద్వేషం హెచ్చింది.

అప్పటి అంతర్జాతీయ పరిస్థితులలో సోవియెట్ సలహాలను వినడమో లేక స్టాలిన్ పద్ధతులను అనుసరించడమో మినహా కమ్యూనిస్టు చైనాకు మరొక మార్గం లేదు. సోవియెట్ సలహాలను పాటించినప్పుడు దేశం మొత్తంమీద పార్టీ విధానాలు మారాలి. స్టాలిన్ పద్ధతులు విరమించాలి. అలా చేసినప్పుడు ఏ రంగంలోను స్వతంత్రించి వ్యవహరించగల అవకాశం కనీసం పదేళ్ల వరకు లభించదు. ఆ తర్వాత పరిణామాలు ఎలా ఉండగలవో ఎవరికీ తెలియదు. అందువల్లనే రష్యా సలహాలను చైనా పెడచెవిని పెట్టింది. స్వతంత్రంగా శక్తి సామర్థ్యాలను పెంచుకొని, స్వశ్రేయస్సుకు అనువుగా వ్యవహరించ దలచింది. అందువల్లనే రష్యన్ నిపుణులు చైనా నుంచి వెళ్లిపోయారు. రష్యా ఆర్థిక సహాయాన్ని కూడా చైనా నిరాకరించింది. స్వతంత్ర కమ్యూనిస్టు శక్తిగా రూపొంది, ఆసియా మొత్తానికి ఆదర్శం కాదలచింది. ఈ విషయంలో రష్యా—చైనాల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న సమయంలోనే కృశ్చేవ్—బుల్గానిన్‌లు భారతదేశంలోను, బర్మాలోను పర్యటనకు వచ్చారు. ఆసియాలో జాతీయ విప్లవోద్యమాలను తాము బలపరచగలమని హామీ ఇచ్చారు. చైనాకు చెందవలసిన ఆర్థిక సహాయాన్ని ఆసియాకు మళ్లించారు. కమ్యూనిస్టు చైనా కంటె ఆదర్శవంతంగా అభివృద్ధి చెందడానికి ఇతర మార్గాలు కలవన్న వాదాన్ని ఆచరణలో ప్రోత్సహించారు. ఇందువల్ల కూడా భారతదేశం చైనా కమ్యూనిస్టులకు శత్రువు అయింది. చైనా—రష్యా వివాదంలో ఒక పావుగా మారింది.

కేవలం ఉనికి దృష్ట్యా చూచినా, ఫార్మోజా, క్వెమోయ్, మకావో దీవులు, హాంకాంగ్ దీవి సామ్రాజ్యవాదుల అదుపు ఆజ్ఞలలో ఉండడం కమ్యూనిస్టు చైనాకు అవమానంగా ఉంది. అవి దాని పక్కలో బల్లెములుగా ఉన్నాయి. కొరియాలో పొందిన విజయం, ఇండో—చైనాలో ఫ్రాంసు, అమెరికా బలాల రెండింటినీ కలిపి ఓడించడంవల్ల "బల ప్రయోగం" ద్వారా సామ్రాజ్యవాదంమీద విజయం సాధించవచ్చుననే నమ్మకం కమ్యూనిస్టు చైనాకు కలిగింది. ఆ నమ్మకంతోనే కనీసం క్వెమోయ్, మకావో దీవుల నైనా బలప్రయోగంతో స్వాధీనపరచుకోవాలని కమ్యూనిస్టు చైనా ఆశించింది. అయితే అందుకు అమెరికా అడ్డుగా ఉంది. చైనా బల ప్రయోగం చేస్తే, అమెరికా ఎదురు బలప్రయోగం చేస్తే ప్రపంచ యుద్ధమే సంభవం కావచ్చు. అణ్వస్త్ర యుద్ధానికి దారితీయవచ్చు. అందువల్ల ఇలాంటి దుడుకు పనులకు దిగవలదని రష్యా సలహా యిచ్చింది. హాంగ్‌కాంగ్‌లో బ్రిటిష్‌వారి పట్ల (వర్తక వాణిజ్యాల కోసం) పెంచుకున్న సహనాన్ని అంతర్జాతీయ శాంతికోసం అమెరికాను గురించి కూడా పెంచుకొనమని సలహా యిచ్చింది. ఈ సలహాలను చైనా కమ్యూనిస్టులు పాటించలేదు. ఆ దీవులమీద బాంబులు కురిపిస్తూ వచ్చారు. అమెరికాకు క్షోభం కలిగించుకుంటే జాగ్రత్త అనే

చైనా - రష్యా వివాదాలు

హెచ్చరికలు మాస్కో నుంచి వచ్చాయి. కాని అవసరమైన ఆయుధ సహాయం చైనాకు అందలేదు. ఇలా ఆయుధ సహాయ సమస్య అనేది కూడా చివరకు రష్యా—చైనాల వివాదంలో ఒక ప్రధానాంశమై పోయింది.

అణ్వస్త్రాలు అనేవి సోవియెట్ రష్యాకు ఉన్నాయి. హిరోషిమాలో తొలి అణుబాంబు ప్రయోగం తర్వాత రష్యా "స్ఫూట్నిక్" ప్రయోగం వరకు ఆయుధ బల సంపత్తి అనేది అమెరికాకు హెచ్చుగా ఉండేది. ఆ కాలంలోనే కమ్యూనిజం విస్తరణ నిరోధ విధానాలకు అమెరికా నాయకత్వం వహించింది. కాని రష్యా కూడా అణ్వస్త్ర నిర్మాణ రహస్యాన్నే కాక రాకెట్లు, ఖండాంతర వేధులను కూడా కనుగొన్నందున ఆయుధబల సంపత్తిలో రష్యాది పైచేయి అయింది. అలా లభించిన అవకాశంతో అమెరికా మార్గంలోనే రష్యా కూడా వ్యవహరించి సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించాలని చైనా నాయకుడు మావో కోరాడు. అమెరికా వద్ద కూడా అణ్వస్త్రాలు ఉన్నందున, పరస్పర విధ్వంసనకు, మానవాళి నిర్మూలనకు ఆవిధానం దారి తీస్తుందని కృశ్చేవ్ ఎదురు సమాధానమిచ్చాడు. "సహజీవన" విధానాన్ని అనుసరించాలని కోరాడు. అంతేకాదు. చైనా నాయకుల "యుద్ధోన్మాద ధోరణి" తెలిసినవాడు కనుక అణ్వస్త్రాల నిర్మాణ పద్ధతులు, రాకెట్ ఫ్యాక్టరీలు కమ్యూనిస్టు చైనాకు అందుబాటు చేయలేదు. చివరకు అణ్వస్త్రాలను, రాకెట్లను కూడా చైనాకు ఇవ్వలేదు. వీనిని చైనా కమ్యూనిస్టులకు అందజేస్తే, వారెక్కడ అణ్వస్త్ర యుద్ధాన్ని రెచ్చగొట్టగలరో అన్న అనుమానాన్ని పెంచుకొన్నాడు. కాని అమెరికా సమీపంలోని క్యూబాలో రాకెట్ స్థావరాలను ఏర్పరచి అమెరికాను బెదిరించాడు. తనతో అమెరికా రాజీకి వచ్చేటట్లు చేయడానికి వానిని ఒక వ్యూహంగా ప్రయోగించాడు. అలాగే మధ్య ఆసియాలో ఈజిప్టుకు కూడా రాకెట్ల నిర్మాణ పద్ధతులు నేర్పి, అక్కడ సామ్రాజ్యవాదుల ఆట కట్టించడానికి పూనుకున్నాడు. సోదర కమ్యూనిస్టు అయిన తనను కాదని క్యూబా, ఈజిప్టులకు కొత్త ఆయుధాలను ఇవ్వడం, చైనాకు కష్టం కలిగించింది. అణ్వస్త్ర బలాన్నే కాక, సోదర దేశాలను కూడా తన వ్యూహాలకు బలి పెట్టడానికి సోవియెట్ రష్యా వెనుకాడదనే గుర్తింపు మావ్‌కు కలిగించింది. అందువల్లనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని చీల్చి, ఒక భాగానికి తాను నాయకత్వం వహించాలన్న తుది నిర్ణయానికి మావ్ వచ్చాడు. దాని ఫలితమే రష్యా—చైనాల బహిరంగ సిద్ధాంత పోరాటం. అంతర్జాతీయ కమ్యూనిస్టు శిబిరంలో ప్రచ్ఛన్న యుద్ధం (**Cold war**).

దీని పరిణామ మేమి కాగలదన్న ప్రశ్నకు సమాధానంగా ప్రఖ్యాత రచయిత ల్యూయీ ఫిషర్ వ్రాసిన దానిని ఉదహరిస్తే సరిపోతుంది :—

"ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు, భావ ధోరణులు ఎలా ఉన్నప్పటికి ప్రతి జాతి దాని లక్షణాలకు అనువుగా వ్యవహరిస్తుంది. ప్రజాస్వామిక రాజ్యాలు, ప్రజాస్వామిక రాజ్యాలతోనే యుద్ధాలు జరుపుకున్నాయి. క్రైస్తవ రాజ్యాల క్రైస్తవ రాజ్యాలతో దెబ్బలాడాయి. ముస్లిం జాతులు సోదరు ముస్లిం జాతులనే శత్రువులుగా పరిగణించుకున్నాయి. నిరంకుశ రాజ్యాలు నిరంకుశ రాజ్యాలతో (నాజీ జర్మనీ— కమ్యూనిస్టు రష్యా) యుద్ధం చేసుకున్నాయి. ప్రజా స్వామిక దేశాలు కమ్యూనిస్టు నియంతృత్వాలను (ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో రష్యాకు యుగొస్లావియాకు అమెరికా సహాయం) బలపరచాయి. ఉభయులు కమ్యూనిస్టులే అయినా ఇంపీరియల్ రష్యా, జాతీయ యుగొస్లావియాతో తీవ్రంగా వివాదపడింది. ఈ చారిత్రక దృష్టితోనే సోవియట్ ప్రభుత్వం, కమ్యూనిస్టు చైనాల సంబంధాలను పరిశీలించాలి. మాటవరసకైనా చైనా రష్యాకు ఒక సమస్య కావడం తథ్యం. చైనా ఆర్థిక, సైనిక పాటవం పెంచుకున్న తర్వాత, ప్రపంచానికి కలిగే సమస్యలు, చిక్కులతో పోల్చితే 1917 లో బోల్షివిక్ విప్లవానంతరం రష్యావల్ల ప్రపంచానికి ఏర్పడిన సమస్యలు, చిక్కులు అల్పమైనవి కాగలవు. అప్పుడు చరిత్రకారులు, ఇరవయ్యో శతాబ్దం ఉత్తరార్థం మహత్తర లక్షణం కమ్యూనిస్టు చైనా అవతరణ అని వ్రాయగలరు."

ఉ. భావను రాణ్మహేంద్రమునఁ బాదము పెట్టితి, నాడిటంగపుల్
వావిల వాసుదేవ గురువర్యుఁ డొకండు, వివేక వర్థనీ
ధీవర పత్రికాధిపతి దేశిక వీరపలింగ మొక్కఁడున్,
కావుననే కవిత్రయముగా గణియించిరి మమ్మిటీవలన్.

—వసురాయకవి

గ్రంథములు - గ్రంథకర్తలు :

శ్రీ భగవద్గీతా శాంకరభాష్య తత్త్వబోధిని

★

శ్రీ నోరి నరసింహశాస్త్రి

(రచయిత : తర్కరత్న, న్యాయ వేదాంత విద్యాపారీణ, దర్శనాలంకార శ్రీ బులుసు అప్పన్నశాస్త్రిగారు. డెమ్మీ ⅛ సైజు. పూర్తి కాలికో బైండింగు, సెక్షను కుట్టు.)

ప్రథమ కుసుమమ్ 1—3. పు. 432+40 మూల్యమ్ రు. 6—00.

ద్వితీయ కుసుమమ్ అ. 4—6. పు. 372+20. మూల్యమ్ రు. 6—00.

తృతీయ కుసుమమ్ అ. 7-12. పు. 373-780+86. మూల్యమ్ రు. 6—00.

పై మూడు సంపుటములలో శ్రీ భగవద్గీతలో మొదటి పండ్రెండు అధ్యాయములు మాత్రమే అయినవి. వీనిలో ప్రథమ కుసుమము ద్వితీయ ముద్రణము. తక్కినవి ప్రథమ ముద్రణములు.

1894 సం. మున భగవద్గీతా భాష్యార్థచంద్రిక యను పేర శ్రీ నోరి గురులింగశాస్త్రిగారు ప్రచురింప నారంభించిన గ్రంథము తర్వాత గీతలపై నాంధ్రములో ప్రచురింపబడిన గ్రంథము లన్నిటిలో ప్రస్తుత గ్రంథము బృహత్తమమైన దనుటలో నెట్టి సందేహమును లేదు. దీని వ్యాఖ్యాతలు ప్రస్తుత మాంధ్రదేశ మందలి విద్వాంసులలో నగ్రేసరులని ప్రసిద్ధి పొందిన బ్రహ్మశ్రీ బులుసు అప్పన్న శాస్త్రిగారు. దీనికో మూలము, శ్రీ శంకర భగవత్పాదుల భాష్యముకాక, మరి 11 విశేష విషయములే కాక, మధ్య మధ్య స్వాభిప్రాయమను 12 వ విశేషమును కలదు. గీతలకు పద విభాగము, ప్రతిపదార్థము, విపులముగా ఆనందగిరి తత్త్వ బోధినితోపాటు శ్రీ మధుసూధన సరస్వతులు, శ్రీ శంకరా నందులు, ధనపతి సూరి, పండితసూర్య, సదానంద, నీలకంఠ శ్రీధరస్వామి—ఇత్యాదుల కొన్ని కొన్ని వ్యాఖ్యాన విషయములు వ్యాఖ్యాతలు తమ తత్త్వబోధినిలో చేర్చిరి. అక్కడక్కడ శ్రీ బాలగంగాధర తిలకు గీతా రహస్య విషయములును వివ ర్శింప బడినవి.

వీనిలో ప్రథమ కుసుమమునకు శ్రీ కాంచీ కామకోటి పీఠాధిష్ఠితులగు శ్రీశ్రీశ్రీ శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ సంయమీంద్రులయు, తృతీయ కుసుమమునకు శ్రీ శృంగేరి శారదా పీఠాధిపతులు శ్రీ మదభినవ విద్యాతీర్థ మహాస్వాముల వారియు నారాయణ స్మరణ పూర్వకాశీస్సులు కలవు. ఆంధ్ర దేశములోని ఆస్తిక శిఖామణు లెంద రెందరో వదాన్య శేఖరు లును, మహారాజ పోషకులును, రాజ పోషకులును, పోషకులు లును నై వ్యాఖ్యాతల యాశీర్వాదములకు పాత్రులైరి. మొదటి రెండు సంపుటములును శ్రీ కామేశ్వరికి శ్రీ చంద్ర మౌళీశ్వరునకును, 3 వది శ్రీ శారదాంబా చంద్రమౌళీ శ్వరులకును అంకితమైనవి.

వ్యాఖ్యాతల పుత్రులు న్యాయశాస్త్ర కోవిదుల స్వీయ శ్రీ శారదా ముద్రణాలయములో గ్రంథము ముద్రితమైనది.

ఈ వ్యాఖ్యాతలు శ్రీ శంకర మతానుయాయులు. ఇట్టి ఉద్గ్రంథము సర్వ విధముల నిర్దుష్టముగను, జిజ్ఞాసు వులకు నిస్సంశయముగా విశేషములతో సహా గీతార్థము, శ్రీ శంకర భగవత్పాదుల భాష్యమున కనుకూలముగా, ఉండవలె నని పాఠకు లాశించి పఠించుట సహజము. శతాధికముగా నేడు పుట్టుచున్న ఇతర వ్యాఖ్యాన గ్రంథములవలె గాక, ఈ గ్రంథ మును నిశితముగా పరీక్షించి గుణ దోషములు ప్రకటించుట సమీక్షకుల ధర్మమను భావముతో నుపక్రమించు చున్నాము.

నిరుష్ట మనుటలో ముద్రణ స్ఖాలిత్యములు ముందు వచ్చును. గత శతాబ్దములోను, ఈ శతాబ్ద మారంభములోను ఆంధ్ర గ్రంథముల ముద్రణములో తప్పులు పడినచో పాప మంటుకొను నను భీతి పండితులకును, ప్రచురణ కర్తలకును ఉండెడిది. ఆ పాపభీతి కల యుగ మిప్పు డంతరించినది. ప్రపంచ మంతటిలో ఈ మార్పు వచ్చినట్లున్నది. పూర్వము ఆ రణాలకు లభించుచుండిన నెల్సన్సు క్లాసిక్సుతో కూడ అచ్చు తప్పు లుండెడివి కావు. నేటి గొప్ప ఆంగ్ల ప్రచురణలలో కూడ అచ్చు తప్పులు పొడచూపుచున్నవి. అందుచే కొంత సహ

నము తప్పదు. కాని యీ గ్రంథములో ప్రతి పుటలోను అడుగడుగున కనిపించు తప్పులు మాత్రము క్షంతవ్యములు కావు. పాపభీతి లేకున్నను లోకభీతియైన నుండవలె గదా !

ఇక కేవల సంస్కృత పండితులు ఆంధ్రము వ్రాయుటలో సర్వ సాధారణముగా చేయు భాషాదోషము లిందున గలవు. ఉదా. తృ. సం. పు. 375. "ఈ యోగి యన్నచో యితర మగు .... నన్ను యెటులు తెలిసికొనెదవో నాచే జెప్పబడు యీ రీతిని వినుము." కాని ఈ వ్యావహారిక భాషా యుగములో నట్టి యల్ప దోషములను విమర్శకులు చిరునవ్వుతో నుపేక్షింప వచ్చును. కాని గ్రంథమం దంతటను కాలార్థ సాంకర్యము కలిగించు దోషము లుండుట మాత్రము అట్లు తేలికగా త్రోసివేయ దగినది కాదు. అట్టివి ప్రథమ శ్లోకార్థము నుండియే ప్రారంభించి తుది వరకు కనబడు చున్నవి.

అ. 1 శ్లో. 1. పేజి 11—'కిం=దేనిని, అకుర్వత=చేయుచుండిరి. 'పే. 13—పాండవులగు ధర్మరాజాదులు నేమి చేయుచుండిరి' ఏమి చేసిరి అనుటకు ఈ యవస్థ.

తృ. కు. పే. 375 .... 'ఆ బ్రహ్మ స్వరూపాదికమును నిరూపించు నిమిత్తమీ సప్తమాధ్యాయ మారంభింపబడు చుండెను'—ఆరంభింపబడుచున్నది, లేక ఆరంభింప బడినది అనుటకు బదులు.

పే. 706 అ. 11 శ్లో. 27 'విశంతి=ప్రవేశించు చుండిరి.'

పే. 778 (చివరి పుట) 'అధ్యాయము నుపసంహరించుచుండెను.''

పై వాని వంటివి లెక్కకు వందలు తెలుసు. అవి కూడ నల్పదోషము లనియే భావింపవచ్చునేమో !

కాని అ. 1. శ్లో. 10 కి ఇచ్చిన రెండు ప్రతిపదార్థములలో మొదటిది అట్టి దనలేము. ఆ శ్లోక మిది :

అపర్యాప్తం త దస్మాకం బలం భీష్మాభి రక్షితమ్
పర్యాప్తం త్విదమే తేషాం బలం భీమాభి రక్షితమ్.

దానికి వ్యాఖ్యాత లిచ్చిన మొదటి ప్రతిపదార్థ మిది:

"అస్మాకం=మన సంబంధమైన, తత్=పదునొకం డక్షౌహిణులగు, బలం=సైన్యము, భీష్మాభిరక్షితం— : భీష్మ=భీష్మునిచేత, అభిరక్షితం=రక్షింపబడినదై, పర్యాప్తం=శత్రువులను జయించుటయందు సమర్థమై యున్నది. ఏ తేషాం=ఈ ధర్మరాజులయొక్క, ఇదం=ఈ యేడు అక్షౌహిణుల సైన్యము, భీమాభిరక్షితం=భీమునిచే రక్షింపబడినదై, అపర్యాప్తం=మనలను జయించుటకు సమర్థము కాదు."

ఈ ప్రతిపదార్థములో శ్లోకారంభమందున్న 'అపర్యాప్తం' అను శబ్దమును చివర నున్న "ఇదమే తేషాం బలం భీమాభి రక్షితమ్' అను దానితో ఎట్లు అన్వయింప జేసిరో బహు విచిత్రముగా నున్నది. ఈవిధముగా నన్వయింప బూనుకొన్నచో ప్రతి పదార్థము మాటల గారడీగా పరిణమించును.

పర్యాప్త శబ్దమునకు సమర్థము, పరిమితము అను రెండు విరుద్ధార్థము లున్నవి. అట్లే అపర్యాప్త శబ్దమునకు అసమర్థము, అపరిమితము నను రెండర్థములును చెప్ప వచ్చును. ఈ దూర దురన్వయము చేయకుండగనే ఆ శ్లోకమునకు వ్యాఖ్యాత లుద్దేశించిన యర్థము చెప్పవచ్చునే. దుర్యోధనుడు తన బలము అజేయ మనియు పాండవ బలము బలహీన మనియు చెప్పెనని వారి తాత్పర్యము. ఆ భావము చెప్పుటకు రెండు ప్రతి పదార్థము లెందుకు ?

అదిగాక ఈ శ్లోకములో వ్యాఖ్యాత లిచ్చిన భావము కాక దానికి విపరీతమైన భావమే ఉన్నట్లు తోచును. దుర్యోధను డీ సంభాషణ ముపక్రమించుటలోనే 'పశ్యైతాం పాండుపుత్రాణా మాచార్య, మహతీంచమూమ్' అన్నాడు. పాండవుల సేనను 'మహతీం' అన్నాడు కాని, స్వల్పమైన దనలేదు. ఆతర్వాత పాండవ సేనలో శూరులను మూడు శ్లోకములలో పేర్కొనుచు వారు భీమార్జున సమాః అన్నాడు. చివరకీ శ్లోకములో తమ సేన భీష్మాభిరక్షితమని సేనాపతిని పేర్కొని, అవలి సేనాధిపతి యగు ధృష్టద్యుమ్నుని గాని, పాశుపతాస్త్ర సంపన్నుడై వీరాగ్రేసరుడగు నర్జునునిగాని పేర్కొనక, తన కెల్లప్పుడు భయకారకుడై యున్న భీముని 'భీమాభిరక్షితమ్' అని పేర్కొన్నాడు. భీముని జూచినంతనే దుర్యోధనునికి గుండెలో డక్కు కలుగును. వ్యాఖ్యాత లన్నట్లుగా అట్టి వానిని దుర్బలుడని ఉద్దేశించెనను యుక్తము కాదు. తర్వాత ఉపసంహార వాక్యములో గూడ, మీ రందరు భీష్మునే అంతట రక్షించు చుందురుగాక, అని బహుపరాకు చిత్తగించెను. అందుచేత తన సేన ఎంత పెద్దదైనను చాలకున్నదనియు, భీమార్జున సమానులగు వీరాగ్రేసరు లెందరోగల పాండవసేన చిన్నదైనను తనను జయింప సమర్థమైనదిగా కనబడుచున్నదనియు దుర్యోధనుని ఉద్దేశ మైనట్లు తోచును. శాంకరభాష్య తత్త్వబోధిని ఏమన్నను, పైన మేము వివరించిన విధముగా వ్యాఖ్యానించుటకు అధమ పక్షము అవకాశమైన నున్నది గదా ! ఈ గ్రంథములోనే ఇచ్చిన శ్రీధరీయములో గూడ మేము సూచించిన తాత్పర్యమే ఉన్నది. భాషార్థ చంద్రికాకారులు గూడ ఈ

వ్యాఖ్యానమువలెనే ఆనందగిరి తత్త్వబోధిని యర్థమిచ్చి, "మరి కొందరీ శ్లోకమునకు .... పాండవసేన సమర్థత కలది అని తాత్పర్యము చెప్పుచున్నారు. కావుననే దుర్యోధనుడు భయ మును బొంది యివ్విధముగాఁ జెప్పెనని యెఱుంగవలయును" అని తర్వాతి శ్లోక మందుకొనిరి.

కావున ప్రస్తుత వ్యాఖ్యాతలకు రెండవ యర్థము సమ్మతము కాకపోయినను, దానిని చెప్పి స్వాభిప్రాయము చెప్పి యుండుట వారి విధి. అట్లు కానిచో ఇంత విపులమైన గ్రంథ మెందులకు ? ఈ ఒక్క శ్లోకమునకే ఒకే తాత్పర్య మిచ్చు రెండు ప్రతిపదార్థము లెందుకు ?

ప్రస్తుత గ్రంథములో నిట్లే ఇతర స్థలములందును, గ్రంథ విస్తృతి యనవసరముగా చేయబడి, అవసరమైన విధముగా చేయబడలేదు. ఉదాహరణ ప్రాయముగా పై దానిని కొంత విపులముగా తెల్పితిమి.

పై శ్లోకమునందు వలెనే సుఖమైన యన్వయము ఉండగా, దానిని వదలి క్లిష్టాన్వయములు అనవసరముగా చేసి నవి మరికొన్ని ఉదహరించుచున్నాము.

అ. 1. శ్లో. 45 'అహోబత మహత్పాపం కర్తుం వ్యవసితావయమ్ యద్రాజ్య సుఖలోభేన హంతుం స్వజన ముద్యతాః' ఇందులోని యచ్ఛబ్దము అహోబత ఇత్యాదిగా నున్న పూర్వార్థముతో సుఖముగా నన్వయించు చుండగా, అట్లు చేయక యత్ అనునది లుప్త తృతీయాంత పదమని రాజ్య సుఖలోభేన అను దానికి విశేషణము చేసినారు. భాష్యార్థ చంద్రికా కారులు గూడ మేము సూచించిన యన్వయమునే చేసిరి.

అ. 2. శ్లో. 5 'హత్వార్థ కామాంస్తు గురూన్' అన్న చోట అర్థకామాంస్తు—శబ్దస్పర్శ రూపరసగంధాత్మకములగు నర్థములను, స్రక్చందన వనితాది భోగములను' అని యర్థము వ్రాసిరి. ఇక్కడ అర్థకాములు, అనగా అర్థాసక్తులు, దుర్యోధనుని ధనము తినువారు అని సూటిగా అర్థముండగా, అసంగతమైన క్లిష్టార్థము చెప్పి వ్యాఖ్యాతలు సాధించిన విశేష మేమి ?

మరియు నర్థము వ్రాయుటలో ననవసరముగా అధ్యాహారములు చేర్చి గ్రంథము విస్తరింప బడినది. అట్టి వానిని కొన్నిటి నుదాహరించుచున్నాము.

అ. 4 శ్లో. 13. "అవ్యయం=నాశరహితునిగను, అసంసారిణం = (ఈ పద మధ్యాహార్యము) సంసార రహితుని గను"—ఈ అధ్యాహారము నిష్ప్రయోజనము. ఇట్లు చేయ గడగినచో ఎన్నియైన విశేషణములను చేర్చుకొని పోవచ్చును.

అ. 6. శ్లో. 20 "తస్మిన్ కాలే సిద్ధిర్భవతి—(ఈ పద మధ్యాహార్యము) ఆ కాలమున సిద్ధి యగుచున్నది." పైన వ్యాఖ్యాతలు చేసిన యధ్యాహారము అనవసర మగుటే కాక, "యత్రోపరమత ఇత్యాద్యారభ్య యావద్భి ర్విశేషణై ర్విశిష్ట ఆత్మావస్థా విశేషో యోగ ఉక్తః—తం విద్యా ద్విజానీయా" అని 23 వ శ్లోకారంభముతో అన్వయము చేసిన శ్రీ శంకర భగవత్పాదుల భాష్యమునకే విరుద్ధము.

అ. 6. శ్లో. 1 'అనాశ్రితః కర్మఫలం ....' ఈ శ్లోక మున కర్థము వ్రాయుచు నిరగ్నిః అక్రియః యోగికి అన్వ యించినారు వ్యాఖ్యాతలు. ఇది సర్వదా భగవత్పాదులు 'నిరగ్నే రక్రియ స్యచ సంన్యాసిత్వం యోగిత్వం చేతిచేత్న' అని ప్రారం భించి 'న కేవలం నిరగ్నిరక్రియ ఏవ సంన్యాసే యోగీ చేతి మన్తవ్యః' అని సమాప్తి చేసిన భాష్య వచనములకు పూర్తిగా విరుద్ధముగా నున్నది.

గ్రంథము పెద్ద దగుటచే కాబోలు స్పష్టముగా పొర పాట్లుగా కనిపించు నంశములు ఎన్నో దొరలినవి. అ. 2. శ్లో. 11 వివరణములో బ్రాకెట్లలో చేర్చిన భాగములో (పే. 64) "అవిద్యా లేశమువలన జ్ఞానిచే ననుష్ఠింపబడు కర్మలు కర్మా భాసములు" అని వ్రాసిరి. జ్ఞానికి అవిద్యావేశ ముండుట యసంభవము ! అవిద్యాలేశ మున్నను అతడు జ్ఞాని కాడు.

ఇట్టి పొరపాట్లే కాదు. శ్రీ శంకర భగవత్పాదుల సిద్ధాంతములకే అత్యంత విరుద్ధములైన యంశములు గూడ నీ గ్రంథములో ప్రవేశము పొందియుండుట చూడ మాకు విభ్రాంతియే కలిగినది.

నత్వే వాహం జాతునాసం ఇత్యాదిగా గల అ. 2. శ్లో. 12. గీతమునకు శ్రీ శాస్త్రిగారు వ్రాసిన శాంకరభాష్య తత్త్వబోధినిలో నిట్లున్నది :

"నేను, నీవు, భీష్మ ద్రోణాదులు పూర్వమునందు గూడ నుండిన వారలమే. అనగా భావ కార్యమును గూర్చి యా కార్య ప్రాగభావము కారణము. ఎట్లన ? ఘటమును గూర్చి ఘట ప్రాగభావము గారణము. అనగా ఘటోత్పత్తికి పూర్వము నందు ఘటము లేనందున ఘటాభావ ముండును. అట్టి ఘటాభావము 'ప్రాక్' ఘటోత్పత్తికి పూర్వమునం దుండును. కాన నది ఘట ప్రాగభావ మనబడును. ఇదే తీరున భావ కార్యోత్పత్తికి పూర్వమునందు ఆయా కార్యముల ప్రాగభావ ముండును. అనగా పూర్వమునందు లేని భావకార్యమే పుట్టు నని యాశయము. అట్టి భావకార్యమును గూర్చి ఆయా భావ కార్య ప్రాగభావము కారణమని తాత్పర్యము" ఇత్యాది.

పై విధముగా కార్యోత్పత్తికి అభావము కారణమని శాంకరభాష్య తత్త్వబోధగా వ్యాఖ్యాతలు ప్రదర్శించినారు. ఇట్టి అభావ కారణ బోధనే, అసత్కార్యవాదమని పెద్దలు చెప్పుదురు. శ్రీ శంకర భగవత్పాదులు ఈ వాదమును తమ భాష్యములలో సర్వత్ర నిశితముగా ఖండించి యుండిరి. వారి తైత్తిరీయ భాష్యములో శిక్షోపోద్ఘాతమున "అన్యథాహి అభావాద్భావోత్పత్తి రితి సర్వ ప్రమాణ వ్యాకోపః" అని అభావము నుండి భావము పుట్టును అను నీ తార్కికవాదమును అప్రమాణికమని నిందించిరి. మరియు బ్రహ్మసూత్రములలో 'అసద్వ్యపదేశాన్నేతిచే ధర్మాంతరేణ వాక్య శేషా (అ. 2. పా. 1. సూ. 17)', 'ఉదాసీనానా మపి చైవం సిద్ధిః (అ. 2. పా. 2 సూ. 27)' అను సూత్రముల భాష్యములలో నిరాకరించి తుదకు "తస్మా దభ్యుపపన్నోఽయం అభావాత్ భావోత్పత్త్యభ్యుపగమః" అని కంఠరవేణ ఈ తార్కికుల యసత్కార్యవాదము అశాస్త్రీయము అని నిరూపించిరి. బ్ర. సూ. 2—2—17 భాష్యమున నీ తార్కిక మతమును 'న కైశ్చి దపి శిష్టైః కేన చిద ప్యంశేన పరిగృహీత ఇతి అత్యంత మేవ అనాదరణీయో వేదవాదిభిః' సంపూర్ణముగా నిరాకరించిరి. అభావము నుండి భావము పుట్టునను సిద్ధాంత ముండుట చేతనే ఈ తార్కికవాదము "అర్ధ వైనాశికవాద" మని శ్రీ భగవత్పాదులు దూషించిరి. శ్రీ శంకర భగవత్పాదులచే నిట్లు సర్వథా నిరాకృతమైన యీ యభావమునుండి భావము పుట్టునను వాదమును శ్రీ శాంకర భాష్యార్థ తత్త్వబోధగా నిరూపింపబూనుట సాహసమని మాత్రమే చెప్పగలము. శిష్టజన నిందితమగు గౌతమవిద్య యొక్క ప్రబల సంస్కార దోష దూషిత మగుటచేతనే వారి వ్యాఖ్యాన శేముషి యిట్లు ప్రసరించి యుండును. తమ యభిమాన శాస్త్రముగా తర్కము అధ్యయనము చేసినవారే తరుచుగా నేటి కాలమున వేదాంత శాస్త్రములో వ్రేలుపెట్టి వేదాంత ప్రవర్తకులును కాజూచుచున్నారు. గనుక ఇంత వివరింపవలసి వచ్చినది.

శ్రీ శంకర భగవత్పాదులు ప్రతిపక్షులయందు ఎంతో సహనము ప్రదర్శించు నభ్యాసము కలవారు. అట్లయినను తార్కికులను శృంగములు లేని బలీవర్దములని, ఎంత బాధపడినందున వర్ణించియుందురో మనము స్మృతికి తెచ్చుకొనవలెను.

ఇక నిట్టివి కాక వ్రాతలో నశ్రద్ధ వలన విపరీతార్థములు కలిగించు భాగము లుదాహరింతము.

ఉదా : పే. 21 " .... అను వచనముతో రాజర్షి యోగ్యమగు సన్న్యాసమే కర్మయోగమని భగవంతుడు నిరూపించి యున్నాడు." అని వ్రాసిరి. నిష్కామముగా కర్మల నాచరించు విప్రులు కర్మయోగులు కారని శ్రీ శాస్త్రిగారి భావమా ?

ఉదా : పే. 6. "ధర్మ ప్రభావము నెరింగిన పెద్దలు సర్వజ్ఞుండగునీశ్వరునిచే లోకానుగ్రహ బుద్ధితో సృజింపబడిన భగవతియగు వేదమాత నాశ్రయించి తదుపదేశమును దత్త్వజ్ఞులై యీ వర్ణ విభాగమును గావించె ననుట నిక్కము —ఇందులో 'కావించిరి" అనుటకు బదులు "కావించెను" అన్న చిన్న పొరపాటు కాదు మేము చూపునది. 'అస్య మహతో భూతస్య నిశ్వసితమ్' అను శ్రుతిని పేర్కొని శ్రీ శంకర భగవత్పాదులు వేదములకు సప్రయత్న భాగవత్కర్తృత్వము లేదనిరి. మరియు శ్రీ కృష్ణభగవానుడే 'చాతుర్వర్ణ్యం మయాసృష్టమ్' అని చెప్పుచుండగా, శ్రీ శాస్త్రిగారు వేదము ననుసరించి ఎవరో పెద్దలీ వర్ణ విభాగమును గావించిరన్నారు. వ్రాయబోవునది శ్రద్ధగా నాలోచించి యుండినచో శ్రీ శాస్త్రిగా రట్లు వ్రాసియుండరు.

శ్రీ శంకర భగవత్పాదులు తమ సిద్ధాంతములను ఉపనిషద్భాష్యములందును బ్రహ్మసూత్ర భాష్యమునందును విపులీకరించిరి. గీతాభాష్యము వ్రాయుటలో 'వివేకతోఽర్థ నిర్ధారణార్థం సంక్షేపితో వివరణం కరిష్యామి' అని ప్రతిజ్ఞచేసి సంక్షేపమార్గ మవలంబించిరి. పిమ్మట ఇతర మతస్థులు వారి మతమును ఖండింపగా, శాంకరమతానుయాయులు వారిని సమర్థించుచు వచ్చిరి. విద్వ దగ్రేసరులును శాంకర మతాభిమానులును అగు ప్రస్తుత వ్యాఖ్యాతలును అట్టి ప్రయత్నమే చేయుట వారి విధి. కాని ఒక్క గీతా రహస్యమును గూర్చి తప్ప, ఈ బృహద్గ్రంథములో నట్టి ప్రయత్నమేమియు చేయకుండుట కొరతగా పొడకట్టుచున్నది. గీతా రహస్యమును గూర్చి చేసిన ప్రయత్నమును అసమగ్రమే కాక అసంతృప్తికరముగా కూడ నున్నది.

శ్రీ తిలకు మహాశయులు బహువిధముల ప్రతిష్ఠావేశము కలవా రగుటచే, లోకమాన్యులైన వారి గీతా రహస్యము మహారాష్ట్ర భాషలో నున్నను, దానికి విశేష ప్రచారము వచ్చినది. అందులో దాని నాంధ్రీకరించినవారు విద్వద్వర్యులగు నోరి సుబ్రహ్మణ్య శాస్త్రులవా రగుటచే, దానికాంధ్రదేశములో మరింత గౌరవ మబ్బినది. శ్రీ తిలకు మహాశయుని వాదములోని దోషములు చూపు టవసరమే. పే. 234—235 లో నట్టిది కొంత చక్కగానే చేసిరి. కాని దోషములేని భాగము కూడ దోష మైనట్లు సమన్వయించి దూషించుట మాత్రము న్యాయముకాదు.

ఉపోద్ఘాతము (పే. 15—17) లో అర్జునుడు తనకు సన్న్యాసేచ్ఛ యున్నట్లు వాచ్యముగా గాని, వ్యంగ్యముగా గాని చెప్పలేదనియు, 'దాను భిక్షాటనమును చేయుదుననియే నియు జెప్పియుండ లేదు' అనియు, "శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహలోకే' అను వాక్యమున నయ్యది యూహింప వలనుపడదనియు, 'గురువులను వధించి వారి నెత్తురుకూడు భుజించుటకంటె భిక్షావృత్తితో జీవించుటైన మేలుగాదా యని తన గురువధాత్మక కర్మమునందలి జుగుప్స' ను దెల్పి యున్నా' డనియు చెప్పుచు, తిలకుగారి వ్రాతల వలన వారు 'దుర్బల హృదయు లనక తప్ప' దనియు, వారు సన్న్యాస బోధక వాక్యముల "తాత్పర్యమును గ్రహింపలేదనియు, అందులకు వారి పాశ్చాత్య విద్యా సంస్కారమే' 'కారణ' మనియు నేమేమో వ్రాసిరి.

శ్రీ శంకర భగవత్పాదులు గూడ తమ భాష్యోపోద్ఘాతమున అర్జునుని స్థితిని పేర్కొనుచు, "స్వత ఏవ క్షత్ర ధర్మే యుద్ధే ప్రవృత్తోఽపి తస్మాద్యుద్ధా దుపరరామ, <u>పరధర్మం చ భిక్షా జీవనా కం</u> కర్తుం ప్రవృతే" అని చెప్పిరి. శాస్త్రిగారు తెలిపిన జుగుప్సయే వైరాగ్యమునకు హేతువై తన్నిమిత్తమగు సన్న్యాసమునకు పరంపరగా కారణ మగును. దానిని మనస్సులో నుంచుకొనియే భగవత్పాదులు, ఏకచక్రపురములో చేసినట్టిది కాక, పరధర్మమగు భిక్షా జీవనాదికమును స్వీకరింప నర్జునుడు ప్రవర్తించెనని చెప్పిరి. దానినే తిలకు మహాశయులు విస్తరించి అర్జునుడు సన్న్యాసమునకు సిద్ధపడెనని వ్రాయుటలో దోష మంత కనబడదు.

తిలకు మహాశయుల వాదము శాంకర మతమునకు విరుద్ధ మైనంత వరకు శ్రీ శాస్త్రిగారు ఖండింపబూనుట మాకు అసమ్మతము కాదు. శ్రీ నోరి సుబ్రహ్మణ్య శాస్త్రుల వారు "అనువాదకుని విజ్ఞాపనము' లో ఎంతో సంయమముతో శ్రీ భగవత్పాదులును తిలకు మహాశయులును ముఖ్యముగా భేదించు విషయములు వివరించి, వానికి ఆపత్తులు సంక్షేపముగా చూపి, తుదకు "శ్రీ లోకమాన్యులు గీతలకు కర్మపరమగు భాష్యమును వ్రాసినారని చెప్పుటకు వీలులేదు. శ్రీ శంకర భగవత్పాదులు వ్రాసిన జ్ఞానపరమగు భాష్యము ననుసరించి <u>సిద్ధాంతభేదము లేకున్నను రుచి భేదము మాత్ర మున్న</u> దని చెప్పుచు నీ తారతమ్య విచారము నింతటితో విరమించెదను." అనిరి. ఈవిధముగా అనువాదకులు తిలకు మహాశయుల వాదమును ఎంత ముచ్చటగా ఖండించిరో విజ్ఞులు గమనింతురుగాక !

ఇంతవరకు వివరించిన దానినిబట్టి ఈ మహా గ్రంథములో గుణములే లేవని మా యాశయమని ఎంతమాత్రము తలంపరాదు. ఇంత గొప్ప విద్వాంసులు ఇందరు ముముక్షువుల గౌరవాభిమానములతో ఇంత బృహద్రూపముగా ప్రచురింపబడుచున్న స్థాయినిబట్టి చూచినచో, తగినంత తృప్తి కలిగింపలేదని మాత్రమే మా యాశయము.

ఇందులో శ్రీ మదానందగిరి టీక ననుసరించి వ్రాయబడిన శ్రీ భగవద్గీతా శాంకర భాష్య తత్త్వబోధిని ప్రధాన గ్రంథము. అది శాస్త్రిగా రెంతో శ్రమపడి వ్రాసిరి. ఆ తర్వాత శ్రీ మధుసూదన సరస్వతుల గూడార్థ దీపికలోనివియు శ్రీ శంకరానందకృత తాత్పర్య బోధినిలోనివియు ఎక్కువ భాగములు చేర్చిరి. ధనపతి సూరి భాష్యోత్కర్ష దీపిక తరుచుగా మధుసూధన సరస్వతులను ఖండించుచుండగా, ఆ భాగములు తెలిపి, శ్రీ మధుసూదన సరస్వతులను సమర్థించుచు శ్రీ శాస్త్రిగారు స్వాభిప్రాయము వ్రాయుచు వచ్చిరి. శ్రీ మధుసూధన సరస్వతుల భావమును గూడ శ్రీ శాస్త్రిగారు త్రోసివేసిన పట్లు లేకపోలేదు. మరియు భగవద్గీతకు అనేక వ్యాఖ్యాన గ్రంథముల నుండి విశేషముల నెన్నిటినో బహు ప్రయాసపడి సేకరించి ఒక్కచో నీ గ్రంథములో సమకూర్చి లోకోపకార మొనర్చిరి.

ఏమైనను శ్రీ శంకర భగవత్పాదులు 'వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతో వివరణం కరిష్యామి' అని ప్రతిజ్ఞ చేసి వ్రాసిన భాష్యమును ఉన్న దున్నట్లు, ముందు ఆంధ్రములో వ్రాసి, యా పిమ్మట దానికి ఆనందగిరి తత్త్వబోధినిని ఆంధ్రీకరించియుండినచో 'యుక్తతరముగా నుండెడి దని చెప్పక తప్పదు. శ్రీ శాస్త్రిగారు అవలంబించిన పద్ధతి వలన, వారికి శాంకరభాష్యమునందు కంటె వారి భాష్య వ్యాఖ్యాతలయందు ఎక్కువ ప్రాధాన్య మున్నదేమో యని విజ్ఞులగు పాఠకులకు తోచక తప్పదు.

గీతలపై అసంబద్ధమైన గ్రంథములు కుప్ప తిప్పలుగా వెలువడుచున్న ఈ కాలములో, శ్రీ శాస్త్రిగారు పరమార్థ దృష్టితో ఇంత గ్రంథము వ్రాసి దాని ప్రచారమునకు పూనుకొనుట ఎంతయు సమ్మోదావహము !

లేఖలు

బ్రౌన్ నిఘంటువు పునర్ముద్రణ

★

ఆర్యా,

తెలుగు— ఇంగ్లీషు బ్రౌను నిఘంటువు పునర్ముద్రణ గూర్చి మీ పత్రికద్వారా కొంతమంది విపులీకరణ కోరుతున్నందున ఈ కార్యక్రమానికి సంబంధించిన ఈ క్రింది విషయాలను ప్రజల ముందు ఉంచడము వాంఛనీయమని భావిస్తున్నాను :

అకాడమి అనుసరిస్తున్న పద్ధతి ప్రకారము బ్రౌన్ నిఘంటువు పునర్ముద్రణకుగాను ఈ క్రింది పండితులతో ఒక సంపాదకీయ సంఘం ఏర్పాటు చేయబడింది.

1. డాక్టరు రామరాజు, రీడరు, తెలుగుశాఖ—ఉస్మానియా విశ్వ విద్యాలయం— ప్రధాన సంపాదకులు.

2. శ్రీ యస్. వెంకటరావు యం. ఎ. తెలుగు శాఖ అధిపతి, మద్రాసు విశ్వవిద్యాలయం— సంపాదకులు.

3. శ్రీమతి నాయని కృష్ణకుమారి యం. ఏ. రీడరు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం— సంపాదకురాలు.

బ్రౌన్ నిఘంటువు, స్వయంగా ఆయనచే శతాబ్దము క్రింద సంకలనము చేయబడిన అమూల్యమైన సంపుటము. ఇతర నిఘంటువులకు భిన్నముగా దీని సంకలనమునకు 'వర్గ' పద్ధతి అనుసరించబడింది. ఇందులో ఇబ్బందులు ఉన్నందున సంపాదకవర్గము :

(1) అక్షర క్రమంలో పునర్ముద్రించాలని,

(2) అసలు ప్రతిలోని 163 పేజీల అనుబంధంలో ఇవ్వబడిన మాటలన్నింటిని నిఘంటువులో చేర్చాలని నిశ్చయించారు.

తదనుగుణముగా సంపాదకులు 'కార్డు— ఇండెక్సు' పనిని 8 నెలల్లో, 1962 జనవరి నాటికి పూర్తి చేశారు. అయితే, అప్పటికి అనుకోకుండా సంపాదకులలో భిన్నాభిప్రాయాలు తలఎత్తి పని సాఫీగా జరుగుటకు అవాంతరము ఏర్పడింది. ప్రధాన సంపాదకుని సూచన ననుసరించి ముద్రణపని బాల త్రిపురసుందరీ ప్రెస్‌కు వప్పగించబడింది.

నిఘంటువులో ముద్రణ పూర్తి అయిన 136 పేజీలు 1962 ఫిబ్రవరి 21న కార్యవర్గముందు ఉంచబడినవి. ప్రతి పేజీలో అనేక తప్పులు ఉండటము చూచి సభ్యులు ఆశ్చర్యపోయారు. సంపాదకీయ వర్గమును హెచ్చరించడము జరిగింది. 1962 ఫిబ్రవరి 22న సంపాదకుల ప్రత్యేక సభం సమావేశంలో నిఘంటువు దోషరహితంగా ఉండే నిమిత్తం నిర్దుష్టమైన పద్ధతి నిర్ణయించ బడింది. అయినా పరిస్థితి ఏమీ మెరుగుకాలేదు.

ఈ సమస్యకు సంబంధించిన సర్వ విషయాలను సమగ్రముగా పరిశీలించి కార్యవర్గము 1962 జూలై 16న జరిగిన సమావేశములో తప్పనిసరిగా పైన వివరించిన పరిస్థితులలో నిఘంటువు ముద్రణా కార్యక్రమమును నిలిపివేయాలని నిశ్చయించింది. అకాడమీ ఆరు సంవత్సరాల చరిత్రలో సంపాదక వర్గము సరిగా పనిచేయలేక పోయినందున మధ్యలో పని నిలిపివేసిన సందర్భము ఇది ఒక్కటే.

అయినా కార్యవర్గము 1963 జూన్ 24వ తేదీన జరిగిన సమావేశములో బ్రౌన్ నిఘంటువులు పునర్ముద్రించాలని నిశ్చయించింది. అనతికాలములోనే సంపుటము ప్రజలకు అందించే భాగ్యము ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి లభించ గలదని ఆశిస్తున్నాను.

దేవులపల్లి రామానుజరావు, కార్యదర్శి,
ఆం. ప్ర. సాహిత్య అకాడమి. హైదరాబాదు.

బ్రౌన్ నిఘంటువు

ఆర్యా,

జూలై 3వ తేదీని ఆంధ్రపత్రికలో పై విషయాన్ని గూర్చి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారొక వివరణ ప్రకటించియున్నారు. అది ఈ సందర్భంలో "ఆంధ్రపత్రికలో" బ్రౌను నిఘంటువు ముద్రణను గూర్చిన లేఖలకు, ఒక విధంగా ప్రత్యుత్తరం. అయితే పాఠకలోకానికి, అట్టి అభిప్రాయం కలగకుండా, వారే, ఈ నిఘంటువు "పునర్ముద్రణ సమస్య" అని ఒక 'సమస్యగా' పేర్కొన్నారు. అనగా, అకాడమీ వారికి ఈ గ్రంథ పునర్ముద్రణ "సమస్య" అయినదన్నమాట. ఇక తక్కిన సంగతు లెందుకు ?

ఆంధ్రపత్రికలో ఇంతవరకు "బ్రౌను నిఘంటు ముద్రణ ఏమైంది ?" అన్న ప్రశ్నయే ప్రధానంగా ఉట్టంకించబడింది. కార్యదర్శిగారా విషయానికి, సూటిగా జవాబు చెప్పడానికి బదులుగా, ఆ నిఘంటువు ముద్రణ ఆగిపోడానికి కారణం సంపాదకవర్గమే అని స్పష్టంగా వివరించేరు. కాని అసలు ప్రశ్నకు జవాబులేదు.

1. ఈ నిఘంటు ముద్రణ ఆగిపోవడం ప్రెస్సువారి మూలంగానా ?

2. ప్రెస్సువారికి పంపిన మేటరు సరిగాలేకనా ?

3. ప్రూఫులు సరిగా దిద్దకపోవడం వల్లనా ?

4. సంపాదక వర్గంలో ఎవరివల్ల ఈ పరిస్థితి యేర్పడింది, అనే విషయాలు వారు వ్యక్తపరచి ఉండవలసింది.

ఇంతేకాదు, వారీ కార్యక్రమానికి సంబంధించిన విషయ వివరణలో కూడా, కొన్ని వ్యత్యాసాలు, విరుద్ధాంశాలు ప్రకటించేరు. ఈ నిఘంటువు ముద్రణ ఆగిపోడానికి వారు నిరూపించిన సంపాదక వర్గంలో నేనుకూడా ఉన్నవాడను కాబట్టి, నా మీద లోకంలో ఏర్పడే అపోహ పోగొట్టుకోడానికి, ప్రస్తుతము ముద్రణకు నాకు ఏవీ సంబంధం లేదని నిరూపించడానికి ఈ ప్రకటన చేయుచున్నాను.

(1) కార్యదర్శిగారు ఈ నిఘంటువు సంపాదకులుగా ఈ క్రిందివారిని నియమించేమని వ్రాసినారు :

1. డాక్టరు రామరాజు— రీడరరు, ఉస్మానియా విశ్వవిద్యాలయము, ప్రధాన సంపాదకులు.

2. యన్. వెంకటరావు, మద్రాసు విశ్వవిద్యాలయము, తెలుగు శాఖాధిపతి. సంపాదకులు

3. శ్రీమతి నాయని కృష్ణకుమారి–రీడరు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయము, సంపాదకురాలు. ఈమె ప్రస్తుతము తెలుగు శాఖలో ఉపన్యాసకురాలుగా మాత్రమే ఉన్నదని తెలుస్తున్నది.

కాని మొదట జరిగిన నియామక మిదికాదు.

1. డాక్టరు రామరాజు—ప్రధాన సంపాదకులు.
2. శ్రీమతి నాయని కృష్ణకుమారి—సంపాదకురాలు.
3. డాక్టరు క్రొత్తపల్లి వీరభద్రరావు—సంపాదకులు.
4. యన్. వెంకటరావు—సంపాదకులు.

ఈ సంపాదకులకు శ్రౌను నిఘంటువులోని పుటలు కూడా ఈ విధంగా విభజింపబడి ఈయబడినవి.

1. శ్రీమతి నాయని కృష్ణకుమారి—1 నుండి 300 పుటలు.

2. డాక్టరు క్రొత్తపల్లి వీరభద్రరావు—300 నుండి 600,

3. యన్. వెంకటరావు—600 నుండి గ్రంథాంతము వరకు.

ఈ తరువాత వీరభద్రరావుగారు అమెరికా వెళ్ళిపోవడం చేత 300 పుట దగ్గరనుండి చివర వరకు నేనే సంపాదకుడుగా నియమితుడ నైనాను.

ఈ విధంగా గ్రంథ విభజనమేకాక, సంపాదకులు చేయవలసిన పనులుకూడా నియామకములై యున్నవి.

1—300 పుటలు శ్రీమతి నాయని కృష్ణకుమారి. ఈ నియమామకమైన పుటలలో

(1) అకారాది కార్డు ఇండెక్సును పర్యవేక్షణ చేయుట.
(2) ప్రూఫులను దిద్దుట.
(3) ఆ ప్రూఫులను ప్రధాన సంపాదకుని వద్దకు పంపుట.

(4) ఆ పుటలలోని గుణదోషము లన్నింటికి ఆ పుటల సంపాదకుడే బాధ్యత వహించుట.

ఇట్లే నాకును 300 పుటనుండి నియమితములైనవి.

2. ఇక ప్రధాన సంపాదకుడు—రామరాజుగారు ప్రూఫులన్నింటిని పరిశీలించుటయేగాక, ప్రెస్సుకు ఆర్డరు ఇచ్చుట వారి పనియై యున్నది. వారే ఈ ముద్రణ వ్యవహారాని కంతకు బాధ్యులు. సంపాదకులకు ప్రూఫులు సరిచూచి, వారికి అందజేయుటకన్న బాధ్యతలేదు. ప్రధాన సంపాదకుడు చేసిన నిబంధనల ననుసరించి, తక్కిన సంపాదకులు పనిచేయుదురు. ఈ నిర్ణయాలనిబట్టి నేడు ఈ నిఘంటువులో ముద్రితమైన 136 పుటలును, శ్రౌను నిఘంటువులోని మొదటి నుండి ఉన్న పుటలేగాని వేరుగావు. ఆ పుటలు 1—300 పుటల విభాగానికి సంపాదకురాలైన శ్రీమతి నాయని కృష్ణకుమారి భాగములోనివి కాబట్టి నాకెంతమాత్రము వానితో సంబంధములేదు.

కార్యదర్శిగారు 136 పుటలు ఏ సంపాదకుని భాగములోనివో చెప్పనేలేదు. శ్రౌను నిఘంటువు ప్రారంభం నుండి అనీ చెప్పలేదు.

''సంపాదకులు— కార్డు ఇండెక్సు పనిని 8 నెలల్లో 1962 జనవరి నాటికి పూర్తిచేశారు. అయితే అప్పటికి అనుకోకుండా సంపాదకులలో భిన్నాభిప్రాయాలు తలయెత్తి పని సాఫీగా జరుగుటకు అవాంతరము ఏర్పడినది. ప్రధాన సంపాదకుని సూచన ననుసరించి ముద్రణ పని బాలాత్రిపుర సుందరీ ప్రెస్‌కు అప్పగించబడింది'' అని కార్యదర్శిగారు వ్రాసేరు. కాని, ఇది ఎంతమాత్రమూ సరికాదు.

కార్డు ఇండెక్సు పని పూర్తియైన వెనుక, సంపాదక వర్గము ఎన్నడూ కలవలేదే ? ఎప్పుడూ సంప్రతించలేదే ? అలాంటప్పుడు భేదాభిప్రాయాల్లు ఎట్లు తల యెత్తేయి ? అవి వ్రాతమూలంగా వ్యక్తపరుపబడినవా ? ఇంతకు ఈ పనిలో అవాంతరము ఎప్పుడు ఎచ్చట కలిగిందీ, కార్డు ఇండెక్సు పూర్తి కావడానికి, గ్రంథం అచ్చుకివ్వడానికి ఎంతకాల వ్యవధి యైనదీ కార్యదర్శిగారు తెలుపలేదు. కాల వ్యవధి తెలుపనిదే భేదాభిప్రాయాలు తలఎత్తేయి అని ఎట్లు వారు చెప్పగలరు ? ఇక ముద్రణ బాధ్యత అంతా ప్రధాన సంపాదకునిదే అయినప్పుడు వారి సూచన ననుసరించి బాలాత్రిపుర సుందరీ ప్రెస్‌కు అప్పగించడ మేమిటి ? అకాడమీవారే అప్పగించినారా, లేక ప్రధాన సంపాదకులా ?

3. ''నిఘంటువులో ముద్రణ పూర్తి అయిన 136 పేజీలు 1962 ఫిబ్రవరి 21 వ తేదిని కార్యవర్గముందు ఉంచబడినది. ప్రతి పేజీలో అనేక తప్పులు ఉండడము చూచి సభ్యులు ఆశ్చర్యపోయారు. సంపాదకీయ వర్గమును హెచ్చరించడం జరిగింది'' అని కార్యదర్శి వ్రాసేరు. కాని సంపాదక వర్గములో ఉన్న నాకీ సంగతే ఎవ్వరూ తెలియపరచలేదే— నా వద్ద అట్టి హెచ్చరికల కాగితం అకాడమీ నుండి ఈ సందర్భమై ఒకటి కూడా రాలేదు.

పై దానివెనుక మరొక విషయం వ్రాసేరు. '1962 సంవత్సరం ఫిబ్రవరి 22 తేదిని సంపాదకుల ప్రత్యేక సంఘం సమావేశంలో నిఘంటువు దోష రహితంగా ఉండే నిమిత్తము

నిర్దుష్టమైన పద్ధతి నిర్ణయించబడింది. అయినా పరిస్థితి ఏమీ మెరుగు కాలేదు.'

కాని కార్యదర్శిగారి బ్రౌను నిఘంటు ముద్రణ విషయాలని గూర్చి చెప్పవలసిన ఒక ముఖ్యమైన సంగతి విడిచి పెట్టడం భావ్యంగాలేదు.

కార్యనిర్వాహక వర్గంవారెలా తీర్మానించినా, అకాడమీ వారు సంపాదక వర్గాన్ని సమావేశ పరచి, తిరిగి ఒక ఫారము 8 పుటలు ముద్రించేరు. కాబట్టి ముద్రించిన పుటలు 144 గాని, 136 కాదు. ఈ 8 పుటలలోను కూడా చాలా తప్పు లున్నాయి. ఆ వెనకనే ఈ నిఘంటు ముద్రణ ఆపివేసేరు. ఈ సంగతే కార్యదర్శిగారు విస్మరించేరు.

"1962 జూలై 16వ తేదీని జరిగిన కార్యవర్గ సమావేశంలో, పైని వివరించిన పరిస్థితులలో నిఘంటువు ముద్రణ కార్యక్రమమును నిలిపి వేయాలని నిశ్చయించింది" అని కార్యదర్శి వ్రాసేరు.

సాధికారంగా, కార్యదర్శిగారు కార్యకలాపాన్ని వివరించడానికి బదులుగా కార్యవర్గంవారు కూడా దీన్ని ఆపేయాలని నిశ్చయించేరు అని వ్రాసేరు. కాని మే మడిగే ప్రశ్న ఒకటే. కార్యవర్గంవారే నియమించిన సంపాదకీయ వర్గంలో, భేదాభిప్రాయా లేర్పడితే— వానిని చక్కబరచేవారు కార్యవర్గంవారే కదా ! ఇంతకు సంపాదకుల భేదాభిప్రాయాలకు గ్రంథ ముద్రణకు సంబంధ మేముంది ? ముద్రించిన భాగంలో తప్పులున్నప్పుడు, అవి కార్య నిర్వాహక వర్గం వారి ముందున్నప్పుడు వారు తక్షణమే, ఆ సంపాదకీయ వర్గాన్ని తీసివేసి క్రొత్త సంపాదక సంఘాన్ని నియమించి పని సాగించలేక పోయినారా ?

సాహిత్య అకాడమీ కార్యకలాపాల సంపూర్తికి సమస్తమైన అధికారాలు ఉన్న కార్యవర్గంవారు ఈ బ్రౌను నిఘంటువు పునర్ముద్రణ విషయంలో ఏ విధమైన చర్య తీసుకోనట్లు కార్యదర్శిగారి వివరణ స్పష్టంగా తెలుపుతున్నది.

సంపాదక వర్గంలో, ప్రస్తుతం ముద్రణ ఆగిపోవడానికి బాధ్యులెవరో తెలియపరచకుండా ఆ విషయంతో ఏ సంబంధమూలేని మూడవ సంపాదకుడనగు నన్ను కూడా ఆ వర్గములో చేర్చడానికి కారణ మేమిటో కార్యదర్శిగారిని పత్రికా మూలంగా తెలియపరచవలసినదని కోరుతున్నాను.

ఒక్క బ్రౌను నిఘంటు పునర్ముద్రణా సంపాదకులనే కాదు, ఏ కార్యక్రమానికి ఏర్పడిన సంపాదకులనైనా అనుశాసించే సామర్థ్యంగల కార్యవర్గంవారు ఈ నిఘంటు పునర్ముద్రణలో వాస్తవంగా జరిగిన సంగతులను, వినియోగించిన ద్రవ్యమును, సక్రమంగా పరిశీలించకుండానే ఆపివేయడంవల్ల లోకానికి ఈ ముద్రణ విషయమై అపోహ అల్లాగే నిల్చి ఉన్నది.

చివరకు మొన్నను జూన్ నెలలో తిరిగి దానిని పునర్ముద్రణ చేయడానికి నిశ్చయించారని అనతి కాలంలోనే ఈ సంపుటము ప్రజలకు అందించే భాగ్యము అకాడమీకి లభించగలదని కార్యదర్శిగారు తెలిపేరు. సంతోషమే. అయిన అనతికాలంలో దానినే రూపంతో అందిస్తారో ఆ విషయం వారు స్పష్టపరిస్తే బాగుండేది.

ప్రస్తుత బ్రౌను నిఘంటువు పునర్ముద్రణలో నాకు అణుమాత్రం సంబంధం లేదని తెలపడానికే ఈ లేఖ అని మరొకపర్యాయము అకాడమీ వారిని హెచ్చరిస్తున్నాను.

(మద్రాసు) —నిడదవోలు వెంకటరావు.

లక్షరూపాయిల బహుమతి

ఆర్యా,

భారతీయ జ్ఞానపీఠమువారు దేశభాషలలో సృజనాత్మకమగు ప్రశస్త రచనకు లక్ష రూపాయిలు బహుమతి నొసంగెదమని యొక ప్రణాళికను ప్రకటించిరి. ఇది మిక్కిలి హర్షింపదగిన విషయము.

పూర్వము సృజనాత్మక రచన అనగా సాహిత్యరూపమైన కావ్యము. తక్కిన శాస్త్రములు మొదలైనవి కేవలము సృజనాత్మక రచనలు కావు. రెండవది, పూర్వకవిలేక రచయితకు, తానున్న ప్రదేశముతో సంబంధము, సంస్కృతము తెలిసినచో కొద్దిమంది ఇరుగు పొరుగు రాష్ట్రాల వారితో పరిచయము ఇంతే—ఈనాటి రచయిత, ప్రాంతీయ రాష్ట్రీయ, జాతీయావధులను దాటినాడు. అంతర్జాతీయ స్థాయిలోనికి వచ్చినాడు.

ఈ పరిస్థితి గమనించినచో ప్రస్తుతము సృజనాత్మక రచన అనగా దాని నిర్వచనము చేయుట ప్రధాన కర్తవ్యమై యున్నది. సృజనాత్మక రచనలు—సాహిత్యమున—కావ్యము, నాటకము, నవల ముఖ్య ప్రక్రియలు. కాని, యీనాడు సాహిత్యమున కెంత ప్రాధాన్య మున్నదో సాంఘిక, రాజకీయ, సంస్కృతి వ్యవస్థల కంతకంటె ప్రాధాన్య మున్నది. అపైనిది వైజ్ఞానిక జగత్తు, అణు యుగము. ఈ యుగములో రచయిత క్షణక్షణము ఉత్పన్నములగుచున్న విషయములను వెంటనే ఆకళించుకొని రచన సాగింపగలడు. కాబట్టి సృజనాత్మక రచన ఏది యని భారతీయ జ్ఞానపీఠమువారు విస్పష్టముగా తెలుపవలెను.

ఈనాడైన నొక శాస్త్ర రచయిత వచనమున నొక నూతనమైన ఉత్తేజకరమైన—అంశములతో ఒక వైజ్ఞానిక సంబంధ రచన గావించును. అది సాహిత్యములోనికి శాస్త్ర రచనలోనికి వచ్చును. అప్పు డట్టి గ్రంథముల కేమి గతి ?

ఇట్టి లక్ష రూపాయిల బహుమతి—అంతర్జాతీయముగా యీవలకే, 'నోబిలు' బహుమతి—ఐరోపా ఖండములో నున్నది. దాని విలువ లక్ష రూపాయిలు పైని కొంచెము హెచ్చుగా నుండును. కాని, ఆ నోబిలు బహుమాన ప్రతిష్ఠాపకులు వైజ్ఞానికముగ క్రొత్త పరిశోధనలు—రసాయన శాస్త్రము, శాంతి స్థాపన కార్యము, సాహిత్యము ఈవిధముగా విషయ విభాగము గావించి బహుమతి నిచ్చెదరు.

ప్రస్తుత విజ్ఞాన పీఠమువారు కేవల సాహిత్యమునకే యీ బహుమతి నిర్ణీతము చేసినను అప్పుడును చాల చిక్కు

లేర్పడును. ఇంత పెద్ద మొత్తము బహుమతి యున్నప్పుడు ఆయా భాషలలో వారు, తమ తమ భాషలలో రచనములకీ బహుమతి లభించునట్లు చేయుటకు వా రభిలషించుటయే గాక అది తమ భాషకే వచ్చునట్లు పరిశ్రమ చేయుట తటస్థించును. ఇంతకును దేశ భాషలలో, పాశ్చాత్య దేశములలో వలె నిష్పాక్షికముగా విచారణచేసి తీర్పు చెప్పగలవా రెంతమంది గలరో, అదియును సందిగ్ధమే !

దీని కంతకు కారణ మింత పెద్ద మొత్తమే. ఏ భాషలోనైనా ఒక గ్రంథమును గురించి బహుమతి నిర్ణయము చేయుట దుస్సాధ్యమనియే యనిపించుచున్నది. ఈ సందర్భమున భారతీయ జ్ఞాన పీఠమువారికి నాసూచనలు.

(1) ఈ లక్ష రూపాయిల బహుమతిని నాలుగు భాగములుగా విభాగించుట.

(2) కావ్యము, నవల, నాటకము అను సాహిత్య ప్రక్రియలే కాక విజ్ఞాన దోహదము నొనరించి ప్రపంచమునకు నూతనాంశములను తెలుపు గ్రంథమునకు కూడ బహుమతి నొసంగుట.

(3) ఇట్టి విభాగము వలన నింకొక విశేష మున్నది. ఒకే భాషలో ఒకే రచనకు బహుమతి కాక తక్కిన భాషల వారికి కూడ బహుమతి కవకాశము లభించును.

—ఒకరు

శ్రీ కృష్ణశాస్త్రిగారి "వెఱ్ఱిపాట"

ఆర్యా,

గత "జూన్" భారతియందు, డా. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు శ్రీ కృష్ణశాస్త్రిగారి కవిత్వమును విమర్శించుచు, "వెఱ్ఱిపాట" ను గూర్చి, "ఇదే దైన ఖండకావ్యానికి భాషాంతరీకరణమో" యని వ్రాసిరి. దానికి సమాధానముగ జూలై భారతిలో 82 వ పుటలో శ్రీ సోమరాజుపల్లి చెంచయ్యగారు 1928 ప్రాంతమున వెఱ్ఱిపాటను గుఱించి నేను వ్రాసిన విమర్శక వ్యాసమును ప్రస్తావించుట యెంతయు సంతోషము. కాని, నా పేరు "కృష్ణశాస్త్రి" యని పొరపాటుగ నచ్చు పడుటచేతను, కొంచెము వివరించి తెలుపదలచియు, నీ లేఖను ప్రచురణార్థము పంపుచున్నాను.

ప్రమోదూత సం. న (నెల జ్ఞాపకములేదు) భారతిలో నేను ఇట్లు వ్రాసితిని. "కృష్ణశాస్త్రిగారి వెఱ్ఱిపాట నా కేమీ బాగుగ లేదు. విలియం బ్లేక్ అను ఆంగ్ల కవి వ్రాసిన "Songs of Innocence" అను పాటలలో మొదటిదాని కిది అనుకరణ మనుకొందును. ముగ్ధత్వమునకు ప్రసిద్ధములైన శిశువును, గొఱ్ఱెపిల్లను గూర్చి బ్లేక్ కవి వ్రాయగా, శిశువును చిన్ని బాలునిగను, గొఱ్ఱెపిల్లను మేకపిల్లగను, ముగ్ధ గేయమును వెఱ్ఱిపాటగను మార్చి వ్రాసిన తెనుగులో కపట భావ ప్రకటనము కనుపించును. Lamb అను ఆంగ్ల పదము మహాపీయుడగు క్రైస్తును జ్ఞప్తికి తెచ్చును. ఇట్టి విశేషము తెలుగు పాటలో లేదు."

ప్రియవాదులగు శ్రీ శివశంకరశాస్త్రిగారు "కృష్ణపక్ష" పీఠికలో "ఈ వెఱ్ఱి భావోన్మత్తులవలె రమించు వెఱ్ఱిగాని యన్యము కాదు" అని వ్రాసి అనర్ఘమగు పాటను ప్రశంసించిరి.

నా విమర్శనము సహేతుక మగుటచేతనేమో, రసజ్ఞులగు శ్రీ కృష్ణశాస్త్రిగారు పునర్ముద్రణములందు వెఱ్ఱి పాటను వదలివేసిరి.

స్వేచ్ఛాప్రియులగు నవీన మహాకవుల యావేశమున పరసాహిత్య ప్రభావ మెట్లు వక్రీభవించునో చూపుట కిటుల మఱల వ్రాయుచుంటినిగాని శ్రీ శివశంకరస్వామి, శ్రీ కృష్ణశాస్త్రి గారల సాహిత్యసేవయందు నాడును, నేడును నాకు మక్కువ ఎక్కువ.

డా. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు ఆధునిక సాహితీపరులను గురించిన తులనాత్మకములు రసవంతములు నగు విమర్శనా రచనలను సాగింతురుగాక. విమర్శనములను వ్యర్థములని లెక్కింపక, వివేకమున కవి కుమారులు ప్రయోజనములను బడయుదురు గాక.

(చీరాల) —కుటుంబశాస్త్రి

ఆర్యా,

మీ "భారతి" 'మే', 'జూన్' సంచికలను చూచితిని. 'మే' నెలలో "భద్రాజా రామన్న" రచన "బ్రౌన్ ప్రశస్తి" ప్రచురింప బడినది. "జూన్" నెల సంచికలో అందలి 'దండకమును తప్పు' పట్టిన ఎస్. రామకృష్ణయ్య లేఖ ప్రచురిత మైనది. వా రందులకు ప్రమాణముగా "సులక్షణసార" పాఠము నుదహరించిరి.

కాని, దండకములలో భేదము లున్నవని వా రెరుగరు కాబోలు. (చూ. తెలుగుభాషలో ఛందోరీతులు—131 పుట. దండక వృత్త భేదములు—తల్లక్షణ విశేషములు. రచన—రావూరి దొరస్వామిశర్మ.) కామబాణ దండకమునకు తగణములు + గగము ఉండవలయును. (చూ. తె. భా. ఛం. రీ—పు 449.)

దీని మూలమున "భద్రాజా రామన్న" రచన సరియనియు ఆతఁడు "జయదామ" మను సంస్కృత ఛందస్సంకలనము (చూ. తె. భా. ఛం. రీ—పుట. 445) ననుసరించెననియు తెలియుచున్నది. కావున "సీ. పీ. బ్రవున్ రాజ రాజా !" యను దానిని "సీ. పీ. బ్రవున్ రాజ చూడామణీ !" యని సవరించు నగత్యము లేదనియు మనవిచేయుచున్నాను.

(గిద్దలూరు) —కాటసాని శివారెడ్డి.

మహారాష్ట్రపతంజలి - శ్రీ వాసుదేవశాస్త్రి

★

శ్రీ ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు

"శ్రీ భాస్కరం జ్ఞానకరైః ప్రచండం,
శ్రీరామచంద్రం శశివత్సుసౌమ్యమ్,
శ్రీ వాసుదేవం ప్రతిశాస్త్రభిన్నం,
గురుత్రయం ప్రాంజలి రానతోఽస్మి'

—(మ. మ. కాశీనాథ వాసుదేవ అభ్యంకరకృతము)

సంస్కృత విద్యా వ్యాసంగమునకు, సంస్కృత శారదారాధనమునకును తమ తమ జీవితములను ధారపోసిన ప్రౌఢ వైదుషీభూషితులైన దిగ్దంతులవంటి మహా పండితు లెందరో భారతవర్షమునందును, యూరపు ఖండమునను క్రీ. శ. 19 వ శతాబ్దమున నవతరించి, అమరకీర్తి నందిరి. ప్రాతః స్మరణీయు లగు అటి మహామహులలో వాసుదేవశాస్త్రి అభ్యంకర పండిత చూడామణి యొకఁడు. బహుశాస్త్ర పాండిత్యమునకు పరమావధి యగు ఈయన వివిధశాస్త్ర వైదుష్య ద్యోతకములగు గ్రంథ రాజముల నెన్నిటినో రచించినను, ఆయన రచించిన మహాభాష్య—మహారాష్ట్ర భాషాంతరీకరణ మొక్కటియే ఆయనకు చిరస్థాయి యగు యశస్సు నొసఁగఁ గలదు.

పూనా నగరమునకు ఖ్యాతి తెచ్చిన యీ క్రింది 5 గురు మహా మహోపాధ్యాయులలో వాసుదేవశాస్త్రి ద్వితీయుఁ డయినను బహుముఖ పాండిత్యమున ప్రప్రథముఁడే.

1. మహా మహోపాధ్యాయ—రామదీక్షిత ఆప్తే (బిరుదము : 1894 ప్రాంతమున)
2. మ. మ. భీమాచార్యజలకీకర్.
3. మ. మ. వాసుదేవశాస్త్రి అభ్యంకర్ (బిరుదము : 1921)
4. మ. మ. శ్రీధరశాస్త్రి పాఠక్.
5. మ. మ. సిద్ధేశ్వరశాస్త్రి చిత్రావ్. (వాసుదేవశాస్త్రి శిష్యుఁడు)
6. మ. మ. దత్తోవామన పోద్దార్ (ప్రకృతము ఉపకులపతి, పూనా విశ్వవిద్యాలయము)

మనకు స్వాతంత్ర్యము లభించిన పిమ్మట ఇట్టి మహా మహుల జన్మదిన శతవార్షికోత్సవములు, నిర్యాణ దిన శతాబ్ది మహోత్సవములు దేశవ్యాప్తముగ జరుపుకొనుచున్నాము.

ఈ ఆగస్టు నెలలో (10 వ తిథిని) మహారాష్ట్ర పతంజలి శ్రీ వాసుదేవశాస్త్రి జన్మదిన శతాబ్ద మహా సమారోహము భారతవర్షమునం దంతటను, ముఖ్యముగా పూనాలో జరుగనుండుట సంస్కృత విద్వల్లోక మహాభాగ్యము.

ప్రతిష్ఠాన మహావిద్యాలయ కులపతి, సంస్కృత పండిత మండల మండనుఁ డగు రామేశ్వరభట్టు— ఈయన మొదలుకొని వాసుదేవశాస్త్రి వఱకు (12 తరములు) సంస్కృతాచార్య శిష్య పరంపర వర్ధిల్లినది. ఈ పరంపరకు చెందినవారే మధుసూధన సరస్వతి, భట్టోజీ దీక్షితులు, హరిదీక్షితులు, నాగోజీభట్టు, నీలకంఠశాస్త్రిథత్తే — భాస్కర శాస్త్రి అభ్యంకర్ మొదలగు మహామహులు. పై కోవయందలి నీలకంఠ శాస్త్రిథత్తే సంస్కృత విద్యలకు మూలస్తంభ మగు కాశీ నగరమున కూలంకషముగా శాస్త్రాధ్యయన మొనర్చి పీష్వా ప్రభువుల కాలమున పూనా నగరమును స్థిర నివాసము చేసికొని, శాస్త్ర ప్రవచన మొనరించుచు, పూనా సంస్కృత విద్యలకు రెండవ కాశీనగరమను ఖ్యాతిని సంపాదించెను. పై గురుపరంపరలోనివా రందఱును పాణినీయ పాథోనిధికర్ణధారులే. 'కాణాదం పాణినీయంచ సర్వ శాస్త్రోపకారకమ్'— కణాదుని వైశేషికమును, పాణినీయ శబ్దశాస్త్రమును సర్వ శాస్త్రోపకారకము లని పండితసూక్తి. విశేషించి సంస్కృత విద్యా దుర్గమునకు పునాది వంటిది వ్యాకరణ శాస్త్రము. శబ్దశాస్త్ర మహార్ణవమున విహరించి, వ్యాకరణమున తలస్పర్శ మగు వైదుష్యము సంపాదించిన వీరికి న్యాయ—మీమాంసా—వేదాంతాది శాస్త్ర మహాహ్రదములలో స్వైర విహారము చేయుట యన బాలక్రీడ వంటిది. విద్వాంసులలో ప్రప్రథములు వైయాకరణులే యనుట నిర్వివాదము ('ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః'). హిమాచల శిఖరశ్రేణిని పోలిన పై గురుపరంపరలో వాసుదేవశాస్త్రి కట్టకడపటివాఁడు.

వాసుదేవశాస్త్రి సాతారా నగరమున శాలివాహన శకము—1785 వత్సరము అధిక శ్రావణ కృష్ణషష్ఠి (4 ఆగస్టు—1863) యం దవతరించెను. ఈయన జనకుడు మహాదేవ శాస్త్రి, పితామహుడు పై గురుపరంపరలోని భాస్కర శాస్త్రిఅభ్యంకర్ (1785—1872 క్రీ.) పూనాపాణి న్యాచార్యుడగు నీలకంఠశాస్త్రిథత్తే చరణోపాంతమున శబ్ద శాస్త్రమున కూలంకష వైదుష్యము నందిన ప్రథమ శిష్యుడు భాస్కరశాస్త్రి. ఈయన సాతారా నగరమున సంస్కృత విద్యాలయమును నెలకొల్పి వ్యాకరణశాస్త్ర ప్రవచనము చేయుచు, వ్యాకరణ విద్వాంసుల కౌషధప్రాయమగు శబ్దేందుశేఖర ప్రౌఢ గ్రంథమునకు వ్యాఖ్యను నిర్మించి, విద్వన్మండలిచే 'విద్వన్మకుట రత్న' బిరుదముచే సత్కరింపబడెను.

వాసుదేవశాస్త్రికి రెండవ యేటనే జనకుడును, ఎనిమిదవ యేట పితామహుడగు భాస్కరశాస్త్రియు స్వర స్థులైరి. భాస్కరశాస్త్రి శిష్యుడగు రామశాస్త్రిగోడబోలే ఆచార్య ప్రతిష్ఠితమగు విద్యాలయమును నిర్వహించుటే కాక, ఆచార్య వంశాంకుర మగు శిశువును, వాసుదేవశాస్త్రిని పోషించుచు పుత్త్ర నిర్విశేషుడగు నీతనికి అత్యంత శ్రద్ధా వాత్సల్యములతో విద్యాబుద్ధులను కఱపుచు, ఆచార్య పౌత్రుడని అత్యాదరముతో ఈతనిని సంరక్షించు చుండెను. కూలంకషమగు తన శాస్త్ర వైదుష్యము నంతయు రామశాస్త్రి వాసుదేవశేముషి క్షేత్రమున నిక్షేపించి, యాతనిని మహా పండితునిగా తీర్చి దిద్దెను. తన వైదుషీ వైభవమునకు హేతుభూతుడైన గురువును స్మరించినపు డెల్ల కృతజ్ఞతాసూచక బాష్పములచే వాసుదేవశాస్త్రి నేత్రములు చెమ్మగిల్లుచుండెడివట.

1891 వ సంవత్సరమున రామశాస్త్రి శిష్యుడగు వాసుదేవశాస్త్రిని పూనా కుద్యోగము కొఱకు పంపెను. అచ్చట సంస్కృత విద్యాలయమున నీయనకు పండిత స్థానము లభించెను. ఇక్కడనే వాసుదేవశాస్త్రికి న్యాయమూర్తి మహాదేవ గోవింద రెనడేతో పరిచయభాగ్యము కలిగెను. బొంబాయి రాజధానిలోని కళాశాలలలో అగ్రస్థాన కీర్తి నందిన 'ఫెర్గుసన్' కాలేజికి ప్రిన్సిపాల్, ప్రధాన సంస్కృతాచార్యుడు నగు శ్రీ వామన శివరామ ఆప్టే, 1892 వ వత్సరమున అకాల మృతి నందుట వలన అచ్చటి సంస్కృతశాఖ ఎత్తుపడెను. ఆ యదనున రెనడే మహాశయు డుద్యోగ నిమిత్తమై వాసుదేవశాస్త్రిని తన్మహా విద్యాలయ పాలకవర్గమునకు 'సిఫార్సు' చేయగా, వారు ఈయనకు ప్రధాన శాస్త్రి స్థానము నొసగిరి. ఈ శాస్త్రి స్థానమున ఆయన 36 ఏండ్లు సంస్కృత విద్యాబోధన మొనర్చుచు 1928 వ వత్సరమున విశ్రాంతి నందిరి. ఉద్యోగము నుండి నివృత్తి నొందినను, ఆ కళాశాల యందలి సంస్కృతాధ్యాపకుల కందఱకు ఏయే శాస్త్రమున ఏయే సందేహములు వచ్చినను వానిని వాసుదేవశాస్త్రియే పరిష్కరించుచుండెడివాడు. ఇట్లీ మహనీయున కా కళాశాలతో ప్రత్యక్షముగానో, పరోక్షముగానో 50 ఏండ్లు సంబంధ ముండినది. ఆయన నిజముగా 'ఆచార్యాణా మాచార్యః' (Professors' Professor) అని ఖ్యాతి నందెను. అంతటి కూలంకష వైదుషీ భూషితుం డయినను ఆయన ప్రసన్నత, సౌజన్యము, అనుభావము, వినయము మొదలగు ఆత్మగుణములచే భూషితుడగుటవలన ఏ విద్యార్థికిని అధృష్యుడు కాక, సర్వదా అభిగమ్యుడు సులభుడుగా నుండెడివాడు. జిజ్ఞాసువులగు పెద్దలును, పిన్నలును ఆయన చుట్టును మూగు చుండెడివారు.

పూనాపాణిని యగు శ్రీ నీలకంఠశాస్త్రి శిష్య పరంపరలో నాల్గవ తరమునకు చెందిన వాసుదేవశాస్త్రి పతంజలి కృత మగు మహాభాష్యమును మహారాష్ట్ర భాషలోనికి పరివర్తించి "మహారాష్ట్ర పతంజలి" యని ఖ్యాతి నందెను. బొంబాయి రాజధాని యందలి సంస్కృత విద్యాలయములలో ననేకములు వాసుదేవశాస్త్రి ప్రోత్సాహ పర్యవేక్షణములచే ఆయన శిష్య పరంపరచే నిర్వహింపబడు చుండెడివే. సంస్కృత విద్యావ్యాప్తికై ఈయన నిర్విరామముగ చేసిన కఠోర కృషిని గుర్తించి బ్రిటిషు ప్రభుత్వమువారీయనను 1921 వ వత్సరమున "మహా మహోపాధ్యాయ" బిరుదముచే సత్కరించిరి. సంకేశ్వర పీఠాధీశ్వరు లగు శంకరాచార్యులవారీయనకు "విద్వద్రత్న" బిరుదమును ప్రసాదించిరి. బొంబాయి విశ్వవిద్యాలయమునను, పూనా యందలి వేదశాస్త్రోత్తేజక సభయందును ఉత్తమ పరీక్షల కీయన ఏండ్లకొలది పరీక్షాధికారిగా నుండెడివాడు. మహారాష్ట్రమున నలుమూలల నేలకొలదిగా వ్యాపించిన ఈయన శిష్యమండలియు, ఈయన ప్రగాఢ బహుముఖ పాండిత్యము నెడ విశేష గౌరవము కలిగిన పెద్దలును 1938 వ వత్సరమున ఈయన 75 వ జన్మదిన మహోత్సవము నతి వైభవమున జరిపి యుండిరి. సంస్కృతమున విద్వాంసుడును, కవియు, బొంబాయిరాష్ట్ర మహామాత్యుడు నగు కే. ఎమ్. మున్షీ నాటి మహాసభ కధ్యక్ష పీఠము నలంకరించి, వాసుదేవశాస్త్రి మహాభాష్యమునకు రచించిన మహారాష్ట్ర భాషా పరివర్తన (1 వ సంపుటమ్మును)ఆవిష్కరించెను. వాసుదేవశాస్త్రి పరిణతప్రజ్ఞుడై వార్ధక్యమున నీ గ్రంథరచన కుపక్రమించి, భగీరథ ప్రయత్న మొనరించి, నిర్యాణ కాలమునకు నాల్గు వత్సరములు ముందుగా (అనగా 72 సంవత్సరముల వయస్సున) దీనిని ముగించి, ఈ మహా గ్రంథమును తన 75 వ

మహారాష్ట్రపతంజలి - శ్రీ వాసుదేవశాస్త్రి

జన్మదినోత్సవ సభలో, తన కింతవఱకు 50 ఏండ్లుండగా నుండిన ఫెర్గుసన్ కాలేజికి (Deccan Educational Society) ఉపాయనముగా సర్పించిన మహనీయుఁడు. ఈ గ్రంథము నందలి 6 సంపుటములలో శాస్త్రివర్యుని జీవితకాలమున 1—2 సంపుటములును, పిమ్మట 3, 4, 5, 6 సంపుటములును, ఆయన తనయుఁడు మ.మ. కాశీనాథ వాసుదేవ అభ్యంకర పండితుఁడు రచించిన బృహత్పీఠికాను క్రమణికాదులలతోఁ గూడిన 7 వ సంపుటమును (500 పుటలు) సూర్యలోక భాగ్యము నందినవి. ఈ 7 సంపుటము లందలి పుటలు (రాయల్ సైజున) 3553—వెల రు. 80—కఠోర సారస్వత తపస్సుచేసి, పడసిన ఈ మహాఫలమును వాసుదేవశాస్త్రి తన శాస్త్ర విద్యా విహారములకు క్రీడారంగమైన ఫెర్గుసన్—కాలేజికి బహుమానముగా సమర్పించుట ఈయన స్వార్థరాహిత్యమునకు, ఔదార్యమునకు ప్రబలోదాహరణము. పతంజలి మహాభాష్యమున కింతవఱకు నే ప్రాచ్య—పాశ్చాత్య భాషలయందును సమగ్ర పరివర్తనము వెలువడనే లేదు. అందువలన వాసుదేవశాస్త్రి భాషాంతరీకరణమే ఇదం ప్రథమము కావున శాస్త్రివర్యుఁడు మహారాష్ట్ర పతంజలి యనుట అన్వర్థము.

వాసుదేవశాస్త్రి ఆయన తనయుఁడు కాశీనాథ అభ్యంకర పండితుఁడును కూడ విశిష్టమగు మహా మహోపాధ్యాయ బిరుదముచే నలంకృతు లగుటకు ఒక విలక్షణ సన్నివేశము.

వాసుదేవశాస్త్రి శిష్యులు పరస్సహస్రము. అందు ప్రఖ్యాతులు :

1. రంగాచార్య రడ్డి, 2. శంకరశాస్త్రి మారూల్కర్, 3. దిగంబరశాస్త్రి కాశీకర్, 4. గణేశశాస్త్రి గోడబోలే, 5. భగవాన్ శాస్త్రి ధారూర్కర్, 6. లక్ష్మణశాస్త్రి మరగుడకర్.

వాసుదేవశాస్త్రి కుమారుఁడే కాక, శిష్యుఁడగు సిద్ధేశ్వరశాస్త్రియు మహా మహోపాధ్యాయు లగుట గమనింపఁదగిన విషయము. అవసాన దినము వఱకు వాసుదేవశాస్త్రి విద్యా వ్యాసంగ తపస్సు నిర్విరామముగ జరుగుచునే యుండెను. క్రింద పేర్కొనబడిన ఆయన గ్రంథములు ఆ తపస్సునకు బహుముఖ పాండిత్యమునకు ప్రత్యక్ష ఫలములు.

ముని ప్రవరుఁడగు పతంజలి మహాభాష్యమున (పస్పశాహ్నికమున) నుడివిన సూక్తితో, మహాభాష్యమును భాషాంతరమున పరివర్తించి ధన్యజీవియైన వాసుదేవశాస్త్రి వృత్తాంత ముపసంహరింపఁబడు టుచితము :

"చతుర్భిః ప్రకారైర్విద్యా ఉపయుక్తా భవతి— ఆగమకాలే స్వాధ్యాయకాలే, ప్రవచనకాలే, వ్యవహారకాలే చ."

పై వాక్యము వాసుదేవశాస్త్రికి పూర్తిగా అన్వయించును.

(ఎ) స్వోపజ్ఞములు: (1) అద్వైతామోదము, (2) కాయ పరిశుద్ధి, (3) ధర్మతత్వ నిర్ణయము. (4) ధర్మతత్వ నిర్ణయ పరిశిష్టము. (5) మోక్షామోదము (అసమగ్రము). (6) విశిష్టాద్వైత మతము. (7) సాధనామోదము. (8) సూత్రాంతర పరిగ్రహ విచారము.

(బి) వ్యాఖ్యానములు: (1) అద్వైతాంకురము, (2) భగవద్గీత (ఒకటి, రెండు అధ్యాయములు) (3) పరిభాషేందుశేఖర వ్యాఖ్య, (4) ప్రాయశ్చిత్తేందు శేఖర వ్యాఖ్య, (5) మీమాంసా న్యాయ ప్రకాశ వ్యాఖ్య (6) లఘుశబ్దేందుశేఖర వ్యాఖ్య, (7) సిద్ధాంత బిందు వ్యాఖ్య, (8) సర్వ దర్శన సంగ్రహ వ్యాఖ్య.

(సి) భాషాంతరపరివర్తనములు: (1) బ్రహ్మసూత్ర శంకరభాష్య మహారాష్ట్రభాషాపరివర్తనము, (2) బ్రహ్మసూత్ర శాంకరభాష్య మహారాష్ట్ర భాషాంతరీకరణము—అచార్య చందోర్కర్‌తో కలిసి. (3) మహాభాష్యమునకు మహారాష్ట్రభాషా పరివర్తనము.

(డి) పరిష్కృతములు: (1) కావ్యప్రకాశము, (2) కుండార్కటీక, (3) న్యాయకోశము, (4) బ్రహ్మసూత్ర శాంకర భాష్యటిప్పణి, (5) యతీంద్ర మతదీపిక, (6) పతంజలి యోగ సూత్రములు (7) శ్రీ భాష్యము—ఒకటి, రెండు సంపుటములు, (8) శ్రీ భాష్య ప్రథమసూత్ర టిప్పణి (9) శ్రీ భాష్య చతుస్సూత్ర టిప్పణి, (10) సంస్కార పద్ధతి.

గ్రంథ పరిచయం

పంచశతీ - పరీక్ష

(కర్త : కొత్త సత్యనారాయణ చౌదరి. వెల : 0.75 న. పై, ప్రతులకు : కొత్త సత్యనారాయణ చౌదరి, లెక్చరర్ పి. బి. ఎన్. కాలేజి, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.)

"కడుపులో నున్న విషమెల్ల గవితలోన
దూర్చి దాచెడి "విశ్వనాథుని" గణింప
విశ్వనాథుండు సైతము బిడియపడును
శబ్ద సాదృశ్య మున్నంత సంబరంబె."

అను "నాంది" తో "విశ్వనాథ రచనావళి—నికషాయమాణ రచనలలో ఇది మున్నెన్మిదటిది" యని చెప్పి, కొత్త సత్యనారాయణచౌదరిగారు "పంచశతీ—పరీక్ష" చేసిరి. విశ్వనాథ సత్యనారాయణగారు "పంచశతి" యను చాటుపద్య సంపుటమును కూర్చిరి. ముందు దానిని పఠించి పిదప "పంచశతీ—పరీక్ష" పరిశీలింపవలయును. అప్పుడుగాని సత్యనారాయణగారి విమర్శనా దక్షత పాఠకుల కవగతము కాదు. సనాతన ధర్మ ప్రతిష్ఠాపనాచార్యకమును మూడు మూపుల మోచిన విశ్వనాథ బహుముఖీన సాహిత్య ప్రక్రియలలో నవీనులను, నవీన ప్రపంచ విశిష్ట లక్షణములను—పరమార్థము తెలిసికొనకుండ—హేళనము చేసిరి. ఈసడించిరి. నవీనులు కూడ వారిని హేళనము చేసిరి. ఈసడించిరి. ఈసడించుచున్నారు. ఆవిధముగా ఈసడించి ఒఱగొట్టెము లాడుచున్నవారిలో కొత్త సత్యనారాయణ చౌదరిగా రొకరు. కొత్తవారి యీసడింపునకు—విశ్వనాథ గ్రంథములందు వలె—"పంచ శతీ—పరీక్ష" యందలి ప్రతి పదము తార్కాణముగా నున్నది.

సంఘమునందలి మంచి సెబ్బరలను సమీక్షించిన సాహిత్య ప్రక్రియలు—ప్రహసనములు, చంపువులు, శతకములు—సంస్కృతాంధ్ర సాహిత్యమునందు పరశ్శతములు. వానిని రచించిన కవులు అనాసక్త దృష్టిలో ప్రపంచమును సమీక్షించిరి. అట్లని యెల్లరా గుణమును కలిగియున్నారని చెప్పజాలము. వైయక్తిక స్వార్థమున కాఘాతము కలిగిననాడు కొందఱు ద్వేషాసూయాది గుణములకు దాసులై కవిత్వమల్లిరి. చాటువులు చెప్పిరి. అట్టివారు గూడ నీ నాడును ఉన్నారని "పంచశతి" "పంచశతీ—పరీక్ష" చాటుచున్నవి. ద్వేష గ్రంథుల నుండి యుద్భూతమయిన సాహిత్యములో ద్వేషము పొంగి పొరలిపోవుట సాజము. ప్రాచీన గ్రంథములలో సాంఘిక విమర్శ రమణీయ వ్యంగ్య వైభవములతో, లోకోత్తర కవితాశక్తితో కూడి యున్నది. నవీన గ్రంథములలో అరిషడ్వర్గము పడ లేగుచున్నంతగా కావ్య గుణములు లేవు.

విమర్శ, వ్యాఖ్యాతృమేధానిష్ఠమని విశ్వనాథవారి సిద్ధాంతము. ఈ సిద్ధాంతమును వల్లించుచు వారు చేసిన విమర్శ ఎట్టి పూత మెఱుగులతో కూడియున్నదో ఆంధ్ర మహీమండల మెఱుగును. విశ్వనాథవారి సిద్ధాంతమును వారి గ్రంథమునకే సమన్వయించి కొత్తవారు "పంచశతీ—పరీక్ష" చేసిన ట్లనిపించుచున్నది. కొత్తవారు ఏబదియైదు పుటలలో "పంచశతి" కి స్థూలముగా భాష్యము రచించిరి. విశ్వనాథ సృష్టిని తలదాల్చువారు కొత్తవారి వ్యాఖ్యానము అసమంజసమనుటకు వీలులేదు. ఏలయన వ్యాఖ్యానము వ్యాఖ్యాతృమేధానిష్ఠముగదా! ఆ యర్థములు, ఆ తాత్పర్యములు, ఆ ధ్వనులు, ఆ భాష్యములు "పంచశతి" లో లేవని చెప్పుట పొసగదు గదా! "కాదు. వ్యాఖ్యాతృబుద్ధిలో ఏదో లోప మున్న" దని యెవరైన నందురా? మంచిది. ఈ బుద్ధి లోపమును ప్రమాణమును రాగద్వేషములకు లోనుగాక మన మీనాటి విమర్శకుల కందఱి కన్వయింప వలసినదే. కన్ను చూచి కాటుక, పిఱుదు చూచి పీట వేయరాదు. అప్పుడుగాని సత్య విమర్శకు లెవరో తెలియదు.

సాహిత్య ప్రక్రియకుగాక ప్రక్రియాకర్త వ్యక్తిత్వమునకు అధిక ప్రాధాన్య మొసగి విమర్శ వ్రాసిన మనీషులెందఱో కలరు. ప్రక్రియాకర్తకు ప్రాధాన్యము వచ్చుటచే ఎంతో క్రుళ్ళుకువాడము దట్టముగా పేరుకొన్నవి. స్వాతంత్ర్యానంతరము ఈ పద్ధతికి నారు పోసి నీరు పోసినవారిలో విశ్వనాథవా రగ్రగణ్యులు. ఆ మార్గమునే చేపట్టి కృతార్థు లయినవారు కొత్తవారు. వారి యీ వాక్యములు చదువుడు : "ఈ విశ్వనాథకవి మనకు సమకాలికుడు కావున వీరి నిత్య దినచర్యలు — వృత్తి ప్రవృత్తులు భౌతికముగా మానసికముగా మన మెఱుగుదుము. కావున, వీరి తత్త్వము వీరి రచనలలో ఎట్లు గర్భితమై యుండునో మరింత స్పష్టముగా నిరూపింపవచ్చును." ఈ పునాదిపై పంచశతీ పరీక్షా సౌధము నిర్మింపబడినది. అనగా అగాధమయిన విశ్వనాథ మనస్తత్త్వ రహస్యములను బాహిర పుచ్చుటయే కొత్తవారి ప్రయత్నము. ఆ ప్రయత్నముచేసి వారు కృతకృత్యు లయిరి. కాని యొక్క విషయమును మాత్రము మనము విస్మరింపరాదు. కావ్య విమర్శలో కర్తృ వ్యక్తిత్వ విమర్శ ఏకదేశము. అదే పూర్ణముగాదు. "పంచశతి" లోని బహు గుణములను పరామర్శించుచు విశ్వనాథ విగ్రహమునకు వెలకట్ట నిశ్చయించిరి చౌదరిగారు. "వ్యంగ్యములు, ధ్వనులు, వర్ణనలు రమణీయ వాచ్య సరణిలో వ్రాసెదనని తలపెట్టిన ఈ కావ్యములో విశ్వనాథవారి స్వరూప మంతయు ఇమ్ముగా బొమ్మకట్టి యున్నది. పురుషార్థములలోని 'ధర్మకామములు' రెండింటను విశ్వనాథవారి భావము లెట్టివో లౌకిక విషయములలో ఆయన చిత్త ప్రవృత్తి ఎట్టిదో అన్నింటను 'ఆయన నడక

గ్రంథ విమర్శనము

ఎట్లు సాగుచుండునో ఈ పంచశతి చాలవఱకు మనకు బోధించుచున్నది.'' యని కొత్తవారి తలంపు. ప్రాచీన ధర్మ మమకారము, నవీన సాంఘిక సంస్కారనికారము, తుచ్ఛ శృంగార వర్ణనాసక్తి, నిష్పక్షపాత దృక్పథ విరక్తి, సమసామయిక కవి ద్వేషము, పాశ్చాత్య సంస్కృతి వైముఖ్యము— ఇవి విశ్వనాథ విగ్రహలక్షణములని కొత్తవారి తీర్పు. ఆ తీర్పు కు వలయు ప్రబల సాక్ష్యములను కొత్తవారు ''పంచశతి'' నుండి సేకరించిరి. విశ్వనాథ నవలలు పఠించిన వారికి వారు రేఖా మాత్రముగా అర్థముగావచ్చు. కాని ''పంచశతీ— పరీక్ష'' పఠించిన వారికి విశ్వనాథ విశ్వరూపము సాక్షాత్కారమగును!

నిస్సంగ దృష్టితో ఇక్కడ ఒక ప్రశ్న వేయవలయును. విశ్వనాథ తత్త్వమును వెల్లడించు కొత్తవారి విమర్శనా తత్త్వ మెట్టిది ? ఏ ద్వేషమునకు, ఏ యసూయకు, ఏ పరాత్మ వంచనములకు విశ్వనాథ విడిది పట్టుగా నున్నారో వానిని కొత్త వారు సైతము పరిహరించుకొనలేక పోయిరి. కొత్తవారి హక్కు దూషణమునకు పర్యాయపదము. వెక్కిరింపునకు పాణింధమము. దానిలో సంయమనము శూన్యము. ''అచ్చులో పుట్టియు బూజువట్టి పట్టిపోయినవియు నుండ వచ్చును.'' ''బడిపిల్లల పాఠాలు మొదలు— రామాయణ కల్పవృక్షము దాఁక నవలలు, నాటకములు చిట్టికతలు పొట్టికతలు గద్యములు పద్యములు ''అమాంబాపతు సరకు'' విశ్వనాథవారి చేతిలో వెడలుటచే ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి యనియు కితాబు తెచ్చుకొనెను.'' ''అవురా ! నక్క యెక్కడ ! నాగలోక మెక్కడ ?'' ''దేవదాసీల వంకతో ఈ సనాతన ధర్మములకు అవలంబముగా అనూచానముగా అనుస్యూతముగా ''మన మేడ్చిన ఏడ్పులు'' చాలఁ గలవు.'' ''దీనివంటిది— ఒక విధముగా దీని యమ్మ మగడు మఱొక పద్యమిదిగో ! చిత్తగింపుడు'' ''ఇది విశ్వనాథ వారి కూఁతకు సరియైన చెప్పుదెబ్బ. ప్రకృతము ముచ్చటించుకొనుచున్న ''పంచశతి'' బూతులలోనికి ఎక్కుడగిన వరాలకూఁత.'' ఇవి కొత్తవారివంటి పండితులు, ''ఇందలి భాష — నడక — శబ్దశుద్ధి — రచన మున్నగు వానిలో కానలసిన నేర్పు రావలసిన కూర్పు బొత్తిగా శూన్యమగుటయే గాక, భావములలో అవాచ్యమైన, 'విప్లవము' కన్పించుచున్నది'' అని యున్న విజ్ఞులు వ్రాయవలసిన మాటలా? సభ్యతా గంధములుప్తములైన వ్రాతలు వ్రాసినందులకే కదా కొత్తవారు విశ్వనాథను విమర్శించుచున్నది ? మఱి వారీ వ్రాతలు వ్రాయనేల ? ఇది తగునా ? ఉత్తమ సాహితీ విమర్శకుల లక్షణమిదియా ?'' సనాతన ధోరణియన్న భ్రాంతిలోఁ బడి విశ్వనాథ కవిచేసిన— చేయుచున్న రచనల నన్నిటిని సమగ్రముగా మనము చదివి చక్కగా పరీక్షించినచో ఆయన తెలుగు భాషకుఁ జేసిన యుపకారము— ఆర్ష మతమునకుఁ జేసిన యుపకారము స్పష్టము కాఁగలదు. ''ఈ యంశము తెలుఁగు వారికి విన్నవించుటలో గ్రంథరూపముగా తెచ్చుటలో ఇదే మొదలు'' అని కొత్తవారు గడగట్టి గంట వాయించిరి. ఇది లోకోపకార మయిన మహాకార్యము. ఏ తత్కార్య ధురంధరు లగువారు ఏ యవ గుణమునకు ముయ్యేల గుట్టకారాదు. ఉత్తమ లక్ష్యమునకు ఉత్తమ సామగ్రి వలయునన్న నీతి మఱచిపోరాదు. గురు పద నివిష్టులయి లోకమునకు సన్మార్గ ప్రబోధము చేయువారు పెడ్రకంతలు పట్టరాదు. కొత్త వారికీ పోకడ నచ్చదని ''పంచశతీ— పరీక్ష''యే ప్రకటించుచున్నది. వారి విమర్శ, వారి వైశేష్యము '' ఒజ్జల పుచ్చకాయ'' సామెతకు నిదర్శనము.

క్షుద్ర సాహిత్యము ప్రభవింపకుండ జేయుట కిట్టి విమర్శ యవసర మగునా ? కాదా ? యను ప్రశ్నకు కూడ మనము సమాధానము చెప్పుకొనవలసి యున్నది. క్షుద్ర సాహిత్యమును పరిహరింపవలసినదే. సాహితీ వృక్షమునకు పట్టిన వేఱు పురుగులను, చీడ పురుగులను చెండాడవలసినదే. దాని నెవరు కాదందురు ? కాని కొత్తవారి విమర్శ పద్ధతి మాత్రము సాహితీ ప్రపంచ సంస్కారమును ఉద్భవింపఁ జేయలేదు. బురదను బురదతో కడగలేమని మానవ చరిత్ర చాటుచున్నది. విమర్శకునకు అనాసక్త దృక్పథము, చిత్తశుద్ధి, సంయమనము, గుణాగుణ నిష్పక్షపాత విమర్శనా శక్తి, వ్యుత్పత్తి ముఖ్య లక్షణములు. ఆ లక్షణములు కొత్తవారి దగ్గర లేవని ''పంచశతీ— పరీక్ష'' చదివినవారికి తెలియును. ఇతరులీ విధముగా నుండవలయునని శాసించు కొత్తవారు తామా విధముగా నున్నారో లేదో యాత్మ విమర్శచేసికొనుట మంచిది. ప్రాత సత్యనారాయణగారికి కొత్త సత్యనారాయణగారికి సాహితీ ప్రపంచమున విమర్శ విషయమున అణుమాత్రమైన భేదము లేదు. ఇరువురు ద్వేషాసూయాదులతో బంతులాట యాడువారే. బ్రాహ్మణ బ్రాహ్మణేతర ద్వేషములను రెచ్చగొట్టిన ప్రయోజనములేదు. ఆ రోజులు పోయినవి. రోజులు మారినవి. సాహిత్య దుర్గతికి ''పంచశతి'' రచించిన విశ్వనాథ వారే కాక ''పంచశతీ— పరీక్ష'' చేసిన కొత్తవారు కూడ హేతుభూతులగుచున్నారు. ''ఇది చమత్కార వేషముతో నున్న లేకిఁ వ్రాఁత. తక్కువ ఊహ. పెడ్రతోవ. నీచప్రకృతి. కవనమునకే కళంకము. కవియగువానికే మాయని మచ్చ''— ఈ వాక్యములు కవికేకాక విమర్శకునకు కూడ అన్వయించునని కొత్తవారికి తెలియదా? అంతటి విశాల దృక్పథము వారికి లేదా ? ఈయాక్రోశము వలన ఫలమేమి ? ఎవరి మీద ఈ శివతాండవము ?

వర్ణ ద్వేషముతో, వర్గద్వేషముతో కానలసినంత విమర్శ తెలుగునాట వెలువడినది. ఇది సరస్వతీ దేవికి సిందూర తిలకముగాదు. మఱి యామె మొగమున గొట్టిన పులిమిన బురద. ''కడుపులో నున్న విషమెల్ల'' విమర్శలో ''డూర్చి దాచెడి'' సత్యనారాయణను ''గణింప'' సత్యనారాయణస్వామి గూడ భయపడును. ఒకచో చెల్లని శబ్ద సాదృశ్యము మఱొకచో చెల్లదు.

శంఖారావం : సమరగీతి

(మొదటిది గేయసంపుటి: మూల్యము: 0.25 నయా. పై. ప్రతులకు : సమాచార కేంద్రం, సమాచార పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.)

(రెండవది కవితా సంకలనం: వెల: 1.25, సమీా కర్త : వే. నరసింహారెడ్డి, ప్రతులకు: నాగార్జున బుక్‌డిపో, నారాయణ గూడ, హైదరాబాదు)

సకల రాజనీతి సూత్రాలను త్రోసి రాజని చైనా దురాక్రమణము చేసిన తర్వాతగాని భారతదేశమునకు పదే నేండ్లనుండి క్రమ్మిన మైకము వదలలేదు. ఒక్కసారి గత చరిత్రను మననము చేసికొని, చేసిన పొరపాటులను దిద్దుకొని, శత్రునిష్కాసనార్థము సర్వశక్తులను సమీకరించుకొని భారతీయుడు ప్రత్యాలీఢ పాదుడై సమరాగ్ర స్థావరములందు నిలిచినాడు. చైనా చేసిన మోసము, దాని కౌటిల్యము భారతీయులలో ఆశ్చర్యముతోపాటు ఆగ్రహమును ఆగ్రహముతోపాటు ఆత్మావలోకనమును, ఆత్మావలోకనముతోపాటు అచంచల కర్తవ్య వ్యగ్రతను ఉద్బుద్ధము చేసినవి. భారతీయ సైనికులు చైనా నెదుర్కొనుటకు మరతుపాకులందుకొన్ననాడే కవికుమారులు కలము పట్టుకొన్నారు అప్పటినుండి యెన్నో సాహిత్య ప్రక్రియలు బరువుగా నున్నవి, తేలికగా నున్నవి శత్రుపరాజయమును, ఆత్మ విజయమును చిత్రించుచు పుంఖాను పుంఖముగా బయల్వెడలినవి. అందు చెల్లా చెదరుగా నున్న కవితా ఖండముల నొకచో గుదిగ్రుచ్చుపోకడ ప్రశంసనీయము. అట్టి ప్రశంసకు పాత్రులయిన వారీనాడు ఆంధ్రప్రదేశ ప్రభుత్వ సమాచార పౌరసంబంధాల శాఖవారు, వే. నరసింహారెడ్డిగారు. సమాచార పౌరసంబంధాల శాఖవారి గేయసంపుటి "శంఖారావం" వే. నరసింహారెడ్డిగారి కవితా సంకలనము "సమరగీతి."

"జిల్లాలోని అధికారులు, ప్రచారకులు, స్వయం సేవకులు విరివిగా సాగుతున్న రక్షణోద్యమ కార్యక్రమానికి దోహదంగా కొన్ని ఉత్తమమైన ప్రచారగేయాలు ఒక సంపుటిగా తమకు అందజేస్తే సభలు ఊరేగింపులు మొదలైన సమయాల్లో చాలా ఉపకరిస్తవని తెలియజేశారు. ముఖ్యంగా అలాంటి ప్రయోజనానికే ఈ సంకలనం ప్రచురింప బడ్డది" అని పౌరసంబంధాల శాఖవారి మున్నుడి. "శంఖారావం"లో పదునార్గురు రచయితలు వ్రాసిన ముప్పదిరెండు గేయము లున్నవి. ఈ ప్రభుత్వ శాఖవారే ఫలము సాధింపగా నీ మహారంభమున కుపక్రమించిరో దానిని అల్పముగా నయిన సాధింపదీ సంపుటి. దీనికి ప్రతిగేయము తార్కాణమే. "ఉత్తమ ప్రచార గేయము" లొకచో చేర్చితి మను తృప్తి తచ్ఛాకీయులకు కల్గిన కల్గవచ్చుగాక ! సాహిత్య రామణీయకము వాంఛించు వారికీ గేయములు అతి నీరసముగా చూపట్టును. వీనిలో ప్రచార తత్పరత యున్నంత ఉత్తమత్వ సిద్ధి లేదు.

దుయ్యరే కత్తులు దుయ్యరే
తియ్యరే బాకులు తియ్యరే
పచ్చి మోసము చేసి పైబడ
వచ్చు శత్రువు పట్టి గొట్టగ.
ధీర భారత వీరులారా !
వీర భారత వారులారా !

అని యొక కవి ప్రబోధము.

హిమాలయము శిఖరముపై ఫిరంగి మ్రోగింది
ఉమా శివుల తపోభంగ మయింది.
హుంకరించి కాలు దువ్వెనండి
రంకెవేసి మోహరిల్లెనండి (ఎవరు ?)

అని ఇంకొక కవి వర్ణనము.

హద్దుమీరి సరిహద్దు దాటునదే
అదేఅదే శత్రువు కనరా
గ్రుద్దులాటకై వచ్చిన వానికి
బుద్ధి చెప్పుటది యుచితమురా

అని మరొక కవి హెచ్చరిక.

బెదరిపోతుంది చైనా
ఎదిరిద్దాం క్షేమయినా
పంచ శీలకూ పంచితనానికీ
పంగ నామాలు పెట్టింది

అని వేరొక కవి తీర్పు.

ఇట్టి గేయ ఖండములీ సంపుటములో పెక్కులు. వీనిలో సారళ్యము, ఆవేశము మున్నంతగా రమణీయ భావకలన లేదు. అది లేని నాడెంతటి వారు వ్రాసిన గేయమైనను నిర్జీవ రచనయని అనిపించుకొనక తప్పదు. కొందరు వ్రాసిన పాటలు "ఏదో యొకటి వ్రాసిన య"ట్లున్నవి. పౌరసంబంధాల శాఖ వారికీ యఖండాంధ్రక్షోణీ మండలమున ఇంతకంటె ఉత్తమ గేయములు లభింపలేదా ? కానిచో లయరహితములు వచన ప్రతిబింబములయిన ఈ గేయము లేల సేకరింతురు ? ఒక రచయిత వ్రాసిన రెండుమూడు పాటలను చేర్చుటకంటె, ఒక్కొక్క రచయిత రచియించిన ఒక్కొక్క పాటను ఇప్పటి వానికంటె మేల్తర మయిన వానిని కూర్చిన నెంతో శ్రేష్ఠముగా నుండెడిది. పౌరసంబంధాల శాఖవారి లక్ష్యమును నెఱవేరెడిది. ప్రభుత్వమువారు సాహితీ ప్రపంచమున అడుగిడినచో ఎట్టి కృతులవతరించునో చెప్పి చూపుటకు "శంఖారావం" మంచి యెన్నిక.

పై గేయ సంపుటి అవలక్షణములను గొన్నింటిని కొంతలో కొంతయైన పరిహరించికొన్న కవితా సంకలనము "సమరగీతి" ఈ కూర్పులో పద్యములు, వచన గీతిక లున్నవి. విశ్వనాథ, తుమ్మల, జాషువా మున్నగు పెద్దతరము కవులు నారాయణరెడ్డి వంటి యువకవులు రచించిన వివిధ కవితా ఖండము లీసంకలనములో నున్నవి. భండారు సదాశివరావు రచించిన భూమిక ఈ కవితా సంకలన సరస్వతికి చేర్చుక్కయై అందగించుచున్నది. అది ఇది:

ఈ కాశ్య పీఖండ మెవనిదా ? ఎవడు స
త్వ్రాశియయుతుడో అవ్వానిదౌట
దేవదుర్లభ మైన ఈ వసుధ యెవని
దా ? మగటిమి గల స్వామిదౌట
ఈ రత్న గర్భకు నెవడు ప్రభుండని
యు ? ఎవడు దక్షుడో అతనిదౌట
ఈ నేల నేలగ్వూను నర్హత ఎవ
నిద ? దర్ప శ్రీయునిదే ఇదియునౌట

కాలసాక్షి ఎరుంగు, నకాట్య శస్త్ర
కౌశల శ్రీగలట్టి దోర్బలత ఎరుగు,
వెరుగు రాఘవు కోదండ, మెరుంగు సవ్య
సాచి గాండీవ టాంకృత శబ్దగర్జ.

(ప్రాచీన భారతీయ సంస్కృతిని మింటికెత్తిన వారు కొందరు, చైనాకు హెచ్చరిక చేసిన వారు కొందరు. చైనా కౌటిల్యమును వెల్లడించినవారు కొందరు. చైనా దురాక్రమణ ఫలముగా భారతీయులలో ఎసరేగిన కోపావేశములను వర్ణించినవారు కొందరు. ఒకరు భారత సంకల్పమును ఉత్తర గోగ్రహణముతో పోల్చిరి. ఆత్మ విమర్శ యొకరిది. వల్లభభాయి పటేలు వంత వేఱొకరిది. కవుల కర్తవ్య నిర్ణయము మఱొకరిది. పద్యఖండము— సాహిత్య దృష్టితో చూచిన— సొగసుగా నున్నది. కాళోజి, నారాయణరెడ్డి, మాదిరాజు రంగారావు, నరసింహారెడ్డి రచించిన గేయము లుత్తమములు. కొన్ని గేయములు పేలవముగా నున్నవి.

పచ్చి నెత్తుటితోడ ప్రమిద వెల్గించుటకు
పట్టు బట్టిన వైరివాడా !
పదిల పఱచితిని స్నేహభాండమ్ము నీకొఱకు
అందుకో పాత చెలికాడా

అని నారాయణరెడ్డి అన్నపుడు పారవశ్యముతోపాటు వేదన జనింపక మానదు.

ఈ సమీక్ష ముగించుటకు ముందు రెండుమూడు మాటలు చెప్పవలయును. ఈ రెండు సంపుటములకు పద్య గేయాదులను సమకూర్చిన కవులనేకులు. వీరిలో కొందఱు భారత జాతీయోద్యమమును గూర్చియు, ఆంధ్ర రాష్ట్రోద్యమమును గూర్చియు, పరాధీన భూఖండ విముక్తిని గూర్చియు కవితల నల్లినవారే, గానము చేసినవారే. కాని యాకావ్యములలో నున్నంతగా ఉదాత్త భావములు, రమణీ, యోహ, ఉక్తి వైచిత్రి ఈనాటి రచనలలోలేవు. సమరగీతి'' యందలి ''శత్రు స్వరూప నిర్ణయము''వంటి రచన లిందు కుదాహరణములు. అంతేకాదు. ఈ రచనలలో చైనా దుష్ట సంకల్ప వర్ణనమున్నంతగా, ప్రాచీన భారత ప్రశస్తి యున్నంతగా వర్తమాన కర్తవ్య బోధ కానరాదు. ఋష్యంశగల కవులు మార్గగాములు కానిచో ఆ యర్హత ఇంకెవరికి గలదు ? అదియునుగాక ఈ ఇరువదవ శతాబ్దములో యుద్ధ వ్యూహ విధానము, ఆయుధ సృష్టి పద్ధతి ఎన్నో మార్పులు పొందినవి. ఈ మార్పులు పరిశీలింపక ప్రాచీన యుద్ధసాధన వ్యూహములను మితిమీఱి పొగడిన అసహజముగా నుండును. అదే మనకవులు చేసినది. ప్రాచీన చరిత్ర నుండి ఉత్సాహావేశములు పొందుట వేఱు. తత్ప్రశంసయే పరమార్థమనుకొనుట వేఱు. పరంపరాగతమైన యుత్తమ సంస్కృతి గ్రహించి, వర్తమాన కార్య ధురంధరులమై భవిష్యత్స్వర్ణ యుగముల దర్శించుట యందే ముక్తికలదు. చైనా కయ్యము పొడిచిన పిదప ఆయా సాహిత్య ప్రక్రియలు సృష్టించిన కవులు కొందఱీ రహస్యమును గుర్తింప లేదనుటకు వారిరచనలే సాక్ష్యము.

ప్రకృతిలో మానవ ప్రకృతి

(మూడు కావ్యాల సంపుటి: వెల: రూ. 1.50, త్రిపదలు, వెల రూ. 1.00, కర్త: బోయి భీమన్న. ప్రచురణ: సుశీలానికేతనం, 92/2 ఆర్. టి. విజయనగర కాలనీ, హైదరాబాదు.)

''ప్రకృతిలో మానవ ప్రకృతి'' యను కావ్యములో ''ప్రణయ పారమ్యం'' ''ప్రకృతిలో మానవ ప్రకృతి'' ''అగ్నిప్లవం'' అనుమూడు కవితా ఖండము లున్నవి. ప్రథమఖండ గాథ ద్వితీయ ప్రపంచ సంగ్రామమునకు సంబంధించినట్టిది. ఆజాద్ హిందూ ఫౌజులో చేరిన ప్రియునితో, ఆంగ్ల సైన్యములో చేరిన ప్రియురాలితో ముడివడిన ఇతివృత్తము. వారు కారణాంతరముల వలన విడిపోయిన తఱిసిజంట. పురుష వేషమున విమానమును నడపు ప్రియురాలు, సాగర గర్భమున ప్రియుడు నడపు జలాంతర్గామిని ఎదుర్కొను సాహసగాథ, రమణీయముగా చిత్రింపబడినది. ప్రియురాలు బందీగా ప్రియునకు చిక్కును. ఆమె చికిత్స నొల్లదు. కారణము కరుణించుటయే కాని కరుణింపబడుట, వీరోచితమ్ము కాదే రంగమం''దని భావించుట. మఱి ఈ భావన జలాంతర్గామి చోదకున కుండదా ? యని భావింపదామె. కరుణ రస వివేచనము వైయక్తిక జీవనసమీక్ష, దేశభక్తి, ప్రపంచ రాజకీయ సింహావలోకనము— ఈ మితులలో వారి సరస సంభాషణము సాగినది. తుదకు ప్రియుడు ప్రియురాలిని గుర్తించును. ఇరువురు మరణింతురు. సముద్రములో లీనమయి పోవుదురు. పూర్వ ప్రాయమున విడిపోయినవారికి మృత్యువదన గహ్వరము లోగిట పునస్సంయోగము ప్రాప్తించినది.

సంకల్ప బలమిట్లు శత్రురూపమున
ఒకరి కౌగిలిలోని కొకరిని జేర్చి
మృత్యు రూపముదాల్చి ముద్దిడుకొనియె
ముద్దులోనిది గదా మోహన మురళి

అనియు

శ్రీనాథు డాతండు శ్రీదేవి యామె
చేరినా రొకటిగా క్షీరాబ్ధి శయ్య
ఓడలు లేవందు యుద్ధాలు లేవు
ఒక భావ మొకతల్ప మొక్క రూపమ్ము

అనియు భీమన్నగారీ గంభీర ఖండమునకు స్వస్తి చెప్పిరి.

ప్రణయము, దేశభక్తి— ఈ రెండు తలపుల తిరుగటిలో నలిగిపోయిన లేతమనుగడల మలుపులలో, విధి ప్రాబల్య సందేశముతో కూడిన ఈ ప్రథమ ఖండమే యుత్తమముగా నున్నది. రంగస్థలము సాగర గర్భము. వలపు సుడులలో కొట్టుకొని పోయి జీవన చరమదశలో సముద్రమునందు కలిసికొన్న యువతీ యువకులు పాత్రలు. దీనికి తోడు మంజరీ ద్విపద రూపమున గజగమనముతో నడచుభాష.

స్వర్గ సీమను గెల్వ నమకట్టి నరుడు
గురిపెట్టిన ఫిరంగి గుండు, మిన్నేటి

ఇసుక తిన్నెను చిక్కి, నుసియయ్యె ననగ
అరుణ గోళమ్ము దృశ్యమ్మయిపోయె

వంటి నూతన వర్ణనలు.

"ప్రకృతిలో మానవ ప్రకృతి"లో దీన ప్రపంచ దృశ్యములు పదేను వర్ణింపబడినవి. మంజరీ ద్విపద ఛందస్సు. మతము, స్వార్థము, దురాచారములు— వీని వలన చితికి పోయినవారి కన్నీటి పంటలే దృశ్యములు. భీమన్నగారి దృశ్యములను కన్నులకు కట్టినట్లు వర్ణించిరి. చిత్రలేఖన లక్షణములుగల కవితా ఖండమిది. హేయమైన మానవ నాగరకత యందలి కశ్మలమును బట్ట బయలు చేయురచన ఇది. అగస్టు విప్లవంలో పాల్గొన వలసినదిగా ప్రియుడికి ప్రియురాలు చేసిన ప్రబోధం అగస్టు విప్లవము. వృత్తములతో కూడిన ఈ ఖండము నీరసముగా నున్నది. దానికి కారణము పాఠకుడు 1942వ సంవత్సరమునాటి యావేశము ననుభవింపకపోవుటగాదు. మంచి యుదాత్త భావముల కూర్పులేక పోవుట. ఒకానొక సమావేశము నూతనగాగొని ప్రతికాలా బాధిత మయిన రచన చేయ వలయునన్నచో రచయితకు కావ్యకళాసిద్ధి సమృద్ధిగా నుండ వలయును. ఈ ఖండములో ఆ కావ్యకళ మందు మందుముగా నున్నది.

త్రిపదలు సమకాలీన ప్రపంచమును సమీక్షించు భావ శకలములు. మూడు పాదములలో భావము పూర్తి యగును. ఈ పాదములలో లయలేదు. నాదములేద. వీనిని వచన గీతికలనుట సమంజసమేమో! చమత్కారమిందు బహుళము. హాస్యోక్తుల వంటి వయినను ఒక కొన్నిచోట్ల గంభీర భావములు గలవు. సమకాలీన ప్రపంచ పోషణము, దురాచార ఖండనము, సత్యబోధనము, నీతి ప్రబోధము— ఇవి ఈ నూట నలువది తొమ్మిది త్రిపదల లక్షణములు.

వెలుగుంటేనే నీడ ఉండేది
వెలుగెంత తీవ్రమైతే నీడ అంత దట్టం
నీడనే భరించలేకపోతే వెలుగునే తోసెయ్.

వంటివి యెంత యాలోచనాత్మకముగా నుండునో

స్త్రీ పురుషులు పెళ్ళికి ముందు ద్వైతం
పెళ్ళయిన కొత్తలో అద్వైతం
పిల్లలు పుట్టిన తరువాత విశిష్టాద్వైతం

వంటివి యంత చమత్కారావహముగా నుండును.

ఛందో రహితమై, శతక వాఙ్మయ సరళిలో నున్న ఈ లఘుకృతి ప్రతివ్యక్తి కాలక్షేపమున పఠింపదగ్గది. "ఈ త్రిపదలలోని కొన్ని భావాలతో కొందరు ఏకీభవింపరని నాకు తెలుసు. అనుభవాలు వ్యక్తికొక విధంగా ఉంటై. రోటీను బ్రతుకులో రాగశబలత ఉండదు. మునిగితేగాని ముత్యాలు దొరకవు. సెంటిమెంటును విడిచిపెట్టి అనాసక్త దృష్టితో చూడగలవారికి, నిష్ఠూరంతో కూడినదైనా, నిజం కనిపించక పోదు. నా భావాలు సార్వజనికాలుగా భాసించకనూపో"వని భీమన్నగారు చెప్పిన మాటలు నూటికి నూరుపాళ్లు నిబద్ధి. ఆ మాటలు గుర్తుంచుకొనినగాని పాఠకుడీ త్రిపదను జదివి తచ్చమత్కారము నాస్వాదింపలేడు.

ప్రాచీన కవితా పద్ధతి, భావకవితా లక్షణము, అభ్యుదయ కవిత్వరీతి, నవీన విజ్ఞాన పరిణామము ముప్పిగువాని మేళ వించే భీమన్నగారి సాహితీ వ్యవసాయము.

—"శాక్యసింహ"

చిత్రశాల:

(రచన : మేఘశ్యాం. ప్రకాశకులు : సప్తగిరి ప్రచురణలు. ఏకుపల్లిపోష్టు, వయాకల్లూరు, ఖమ్మంజిల్లా. $\frac{1}{8}$ క్రౌనుసైజులో 285 పుటలు—వెల: అయిదు రూపాయలు.)

ఇది ఒక చిత్రకారుని జీవితంలో ప్రవేశించిన స్త్రీని గూర్చిన నవల. ఆ చిత్రకారుడు మధు— పేదవాడు, చదువుకొంటూ చిత్రకళ నేర్చుకొంటున్నాడు. ఆతనితో కూడ చదువుకోవడానికి వచ్చి ఆ గదిలోనే ఉంటున్న సుధాకర్ మెడికల్ కాలేజీ విద్యార్థి. ధనవంతుడు, తల్లిదండ్రులు లేక పినతండ్రి పెంపకంలో ఉంటూ బాధ్యతలు లేనివాడు. వీరిద్దరి మధ్య ఇద్దరు స్త్రీలు— నిర్మల, సురేఖ. నిరంతర త్రిభుజాకారంలో వీరి ప్రేమలు మూడు స్తంభాలాట ఆడుకొంటాయి. సురేఖ— ఒక సినీతార, వ్యభిచారిణి— ఆమె సుధాకర్‌ని ప్రేమించింది. సుధాకర్ ఆమెను ప్రేమించలేదు. ఆతడు, నిర్మల అనే యువతిని ప్రేమిస్తాడు. నిర్మల తల్లిలేనిపిల్ల, గొప్పకుటుంబంలో మనిషి. ఆమెను తండ్రి రంగారావు అల్లారు ముద్దుగా పెంచుతాడు. ఒక రోజు వానలో చిక్కుకొని, బస్‌స్టాండ్‌వద్ద నిలిచిపోతే సుధాకర్ టాక్సీలో ఎక్కించుకొనివచ్చి ఆమెను ఇంటివద్ద దిగబెట్టాడు. నాటినుండి మొదలుపెట్టిన స్నేహంలో నిర్మల అంటే సుధాకర్‌కు గొప్ప మమకారం ఏర్పడుతుంది. ఆతడే తన స్నేహితుడు 'మధు'ను వాళ్ల ఇంటికి పరిచయం చేస్తాడు. ఆతనిమీద నిర్మలకు అనురాగం కుదురుతుంది. వాళ్లిద్దరూ వివాహం చేసుకొంటారు. తర్వాత 'నిర్మల'ను మోడల్‌గా పెట్టుకొని 'మధు' అనేక చిత్రాలు చిత్రిస్తాడు. ఆ చిత్రశాలలో బొమ్మలు చూచిన తర్వాత 'నిర్మల'తో దైహిక సంస్పర్శకు 'మధు' ఇష్టపడడు. వాళ్ల ఇద్దరి దాంపత్య జీవితమూ వ్యర్థమై పోతుంది. సుధాకర్ వాళ్లను బాగుచెయ్యాలని చెప్పి, కాశ్మీరు తీసికొని వస్తాడు. అక్కడకూడ వాళ్ల మనస్సులు కాని శరీరాలుకాని కలియవు. నిర్మల— సుధాకర్‌తో లేచివచ్చి, వేరేఒక చోట కాపురం పెట్టాలి అనుకొంటే సుధాకర్— లారీ క్రిందపడి మరణిస్తాడు. 'నిర్మల'కూడ చనిపోతుంది. సుధాకర్‌ని మొదటినుండి ప్రేమించిన 'సురేఖ' వితంతువుగా ఆతని పినతండ్రి 'మహేంద్ర'గారి ఇంట ప్రవేశిస్తుంది. 'పరిత్రాణాయ సాధునాం' అనే గీతా శ్లోకంతో నవల ముగుస్తుంది. ఈ రచయిత వయస్సులో చిన్నకాని ఇదివారి ఏడవ నవల అట. దీనిలో— అపరిపక్వమైన యువకమనస్సుల బుద్ధి విపర్యయము, కథా విధానములోను సంభాషణలలోను కనిపిస్తున్నది. నవల చదువుతూ ఉంటే, అర్థంలేని అరవ సినిమా చూస్తున్నట్లు తోస్తుంది. ప్రేమ కలాపాలలో రెండు జం

గ్రంథ విమర్శనము

టలు, కాశ్మీరు ప్రయాణం, చిత్రశాలలు వ్యర్థ సంభాషణలూ కలిపిన ఈ కథలో తెనుగుతనం మచ్చుకయినా కనిపించదు. 'సెక్స్' సంబంధాలు గూర్చి వ్రాయదలచిన రచయితకు కావలసిన జీవితానుభవము కాని భావప్రకటనా ప్రాగల్భ్యము కాని ఈ రచయితకు లేక 'నవల' నిస్సారంగా మిగిలి పోయింది. పుస్తకానికి ముందువేసిన ప్రకటనలు కాని, లోపల వేసిన పరిచయం కాని నవలను ఆకర్షవంతంగా చేయలేవు సరికదా ఏ ప్రయోజనాన్నీ సాధించలేక పోయాయి.

వడగళ్లు:

(ఏడు కథల సంపుటి. రచన : పి. వి. సుబ్బారావు. ప్రకాశకులు : మహోదయ పబ్లిషర్స్, తెనాలి. క్రౌను సైజులో 126 పుటలు. వెల: రెండురూపాయలు.)

రచయిత పి. వి. సుబ్బారావు బి. యే. బి. యల్. విద్యార్థి దశనుండి సాహిత్యరంగంలో ప్రవేశించి, కొంత సేవ చేశారు. కొంతకాలం జర్నలిస్టుగాను, రాయిస్టుగాను అనుభవ వైవిధ్యం పొందినవారు కావడంచేత, కొన్ని కథలు, వ్యాసాలు రాజకీయ గ్రంథాలు ఈయన వ్రాశారు. నిజానికి ఈయనను రచయితగా దిద్దితీర్చినది స్వర్గీయ గోపీచంద్. అందుకే ఈ పుస్తకం ఆయనకు అంకితం చేశారు.

ఈ పుస్తకంలో వెలువడిన ఏడు కథలూ 1939, 1949 మధ్యను ప్రకటించినవి. ఒకటి 1962లోను, మరి మూడు 1963లోను వ్రాసినవి.

ఈ పుస్తకానికి ముందు ఇంద్రధనుస్సు పేరుతో రచయిత తెలిపిన వక్తవ్య విషయములో పలికినట్లు, రచయిత సమాధిలో మునిగి, శ్మశానగానం చేసుకొంటున్న తన్ను ఈ ప్రచురణకర్తలు పెకలించి ఇలాగ పలికించారట. స్వరాజ్య సంపాదన క్రితం రచయితలలో వీరికి ఒక ప్రత్యేకత కనిపించింది. "అప్పుడు ప్రతిరచయితలో ఒక అనిర్వచనీయమైన ఆకాంక్ష, భావోద్వేగం ఆర్తి ఇమిడి ఉండేది. అప్పటి రచయితలంతా ఒక మహాయజ్ఞం జరిపిస్తున్న పురోహితులవలె పాడకట్టే వారు. జాతియావత్తూ యజ్ఞం జరిపిస్తున్న యజమానిలాగ మానవుణ్ని దేవతగా మార్చవలసిన స్వరాజ్యసాధన మానవుణ్ణి రాక్షసుడుగా తయారు చేసిందేమో అని నాదుగ్ధ, నా ఆవేదన" అంటారు. అందుచేత తనలో ప్రబలిన నిర్లిప్తతకూ ఇదే కారణమని రచయిత చెప్పుకున్నారు. ఈ పుస్తకంలో కథలే ఈ భావ పరివర్తనకు నిదర్శనాలుగా తీసికోవచ్చునేమో. 1949 కి ముందు వ్రాసిన కథలలో మొదటి రెండూ 'జన్మహక్కులు' 'కావ్యేషు నాటకమ్' ఆశాభావంతో మూడు పూవులూ ఆరు కాయలుగా ఉన్న జీవితాన్ని చిత్రిస్తాయి. అందులో వ్యక్తులు పాత్రలు ధైర్యవంతులు. తాము నమ్మిన ఆశయాలకోసం లోకాన్ని త్యజిస్తారు. 'జన్మహక్కులలో' భార్య— మూర్ఖ భర్తతో కాపురం చేయలేక అతనిని విడిచి వెళ్లిపోయి, పవిత్రంగా స్వతంత్రంగా జీవింప గోరుతుంది. కాని ఆమెను, సంఘమూ, సంసారమూ కూడ వ్యభిచారిణిగానే భావిస్తుంది. ఆమె యెక్కడికో వెళ్లిపోతుంది. రచయిత చివరికి అంటాడు, "ఆమె యెక్కడకు వెళ్లిందో, ఎందుకు వెళ్లిందో, ఏమయిందీ ఎవరికీ తెలియదు. హిందూ భార్యాభర్తల ప్రవర్తనని గురించి శాసనాల చెక్కిపోయిన ఆ స్మృతి కర్తలకే తెలుసు ఆ అమాయిక, పవిత్ర హృదయిని ఏమైపోయిందో" అంటాడు, రచయిత. 'కావ్యేషు నాటకమ్'లో రమ్యమైన నటిని వివాహం చేసికోవడానికి అంగీకరించి సంస్కారి మనోనిశ్చయాన్ని చిత్రించిన కథ మనోహరంగా ఉంది. 'ఆత్మగతమ్'లో 'ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు యువక విప్లవవాది అయిన ఒక పడుచువాడు ఆరోగ్యం చెడి ఆలనాపాలనా లేక, ఆసుపత్రిలో మరణించిన కథలో, ఆ వార్త వేసిన సంపాదకులకు, అది చదివిన పాఠకులకు కృతజ్ఞత నివాళి సమర్పించడంలో రచయిత సంతోషిస్తాడు. నాలుగవ కథ 'ఆరాధ్య దైవమ్'లో అమృత గుళికలవంటి ప్రేమగీతాలు పాడిన భావకవిగారిని వారి స్వస్థలం కాకినాడలో చూచిన తరవాత రచయిత పొందిన ఆశాభంగం, ఈ మాటలలో రచయిత చెప్పాడు.

"జీవితమంతా అగాధంగా కనిపించింది. ఇన్నిరోజుల నా ఆరాధ్యదైవం ఈ ముష్టి వెధవేనా అని దుఃఖం పొంగి వచ్చింది. అప్పుడు వెనక్కి తిరిగాను. ఈ ముష్టి వెధవమాటలు నమ్మి జీవితాన్ని ఎంత వృధా చేసుకున్నాను!"

తరువాత మూడు కథలలో స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన నిరాశాభావం మరింత నగ్నంగా రచయిత చిత్రించారు. కవి రాజకీయవేత్త మరణించాడని చేసిన స్మారక సభలో ఆకవే ఉపన్యసించడం కథావస్తువై నేటి ప్రచారకుల ఆడంబరాన్ని అతిశయోక్తితో ప్రదర్శిస్తుంది. చెట్టంత కొడుకు అకస్మికంగా చనిపోతే, అంత్యక్రియలు జరపడానికి కూడ ఆర్థిక స్తోమతలేని కర్మయోగి గోవయ్య కథలోను, ప్రేమించి స్వర్గం ఒలకబోస్తానన్న 'సుకుమార్'తో ఉండిపోవాలని లేచివచ్చిన 'రజని' విషాదగాథను, ఆమెను కడుపులో పెట్టుకొని ఆశ్రయం ఇచ్చిన రుక్మిణమ్మకథను కరుణ రసప్రధానంగా చూపడంలో ఈ కాలంలో కొందరు కళాజీవులు ఆదర్శవంతులు అని పేరు పెట్టుకొని అమాయికలైన బాలికలను మోసం చేస్తున్న పద్ధతులు కళ్లకు కట్టినట్లు చూపించారు. పి. వి. సుబ్బారావు గారి 'వడగళ్లు' నోటిలో వేసికొంటే చల్లని బాధతో నాలుక లాగివేసే 'వడగళ్ళు'— వాస్తవంలోని కాఠిన్యం తెలుసుకోవలసినవారు చదువదగిన కథలు. 'వ్రాస్తానికి' (వ్రాయుటకు అనే అర్థంలో) వంటి ప్రయోగాలు వీరి భాషలో చిత్రంగా వే ఉంటాయి.

మల్లెపందిరి

(ఆరు కథల సంపుటి. రచన : ఉషశ్రీ. ప్రచురణ : తరుణసాహితి. ప్రతులు దొరికేచోటు: ఆంధ్ర విశ్వసాహితి 208 బోయిగూడ, సికింద్రాబాదు., క్రౌను సైజులో చిన్న అచ్చు 132 పుటలు. వెల: రూపాయి పావలా.)

ఇందులోని ఆరు కథలు, ఆంధ్ర వారపత్రిక, దినపత్రిక మొదలయిన వానిలో ఒకసారి అచ్చుఅయినవే. పుస్తకాకారంలో అవతరణ ఇదే మొదలు.

దాంపత్య జీవిత సౌరభాలను సమగ్రంగా, సక్రమంగా ప్రదర్శించటానికి ఈ కథలో అవకాశం కల్పించు కొన్నట్లు రచయిత ముఖపత్రంలో విమర్శకులకు పాఠకులకు వినయాంజలి ఘటిస్తూ చెప్పారు. తొలికథ 'అభిద'లో అప్పుడే పుట్టిన పాపాయికి ఏమి పేరు పెట్టాలి అనే భార్యాభర్తల చర్చలో 'పోస్ట్‌మాన్' తెచ్చిన టెలిగ్రామ్‌లో 'కళ్యాణి' నా శుభాకాంక్షలు 'విశ్వకళ్యాణి' అని చప్పట్లు కొడుతూ జారిపోయే పైట కూడ సరిజేసుకోకుండా అందరికీ వార్త అందజేసింది మరదలు. అదీ 'అభిద'. సంసారజీవితంలో సామాన్యకుటుంబీకుల కథలు మలచడంలో మునిమాణిక్యంగారి కాంతం మేలుబంతి అయిపోయింది. మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాలలో అనుభవాలు తెలపడంలో శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది అందెవేసిన చేయి. అవే సమాజానికి చెందిన, క్రొత్త కాపురంలో ముచ్చట్లు ఈ కథలో 'ఉషశ్రీ' పరిచయం చేశారు. తొలికాన్పు ప్రసవంలో నూతన దంపతుల ఆనందం, తల్లి ఆకాంక్ష 'దౌహృది' కడుపులో పాపాయి' కథలో వాచ్యంగానే కథకుడు చెప్పాడు. మూడు వందల రూపాయలు మామగారు చేసిన అప్పు నిమిత్తం దావా చేస్తామని నోటీసిస్తే, ఆ ఆపద తప్పించడానికి తన 'చంద్రహారం' భర్త జేబులో వేసిన పద్మావతిని 'కులపాలిక'గా చిత్రించిన కథ మనోజ్ఞంగా ఉంది. నవ నాగరికురాలయిన ఒక సుందరి వంటలక్కను పెట్టుకొని అన్నిపనులకు ఆమె మీదనే ఆధారపడటంలో భర్తను, తన ఇద్దరు పిల్లలనీ ఏ విధంగా ఇగురబెట్టినదీ 'ప్రదక్షిణ' కథలో ఈ కాలపు సుకుమార స్త్రీలకు కనువిప్పుకలిగించే గుణపాఠం చెప్పారు. ఈ సంపుటికి 'పేరు' పెట్టినదీ, పుస్తకంలో సగానికి పైగ స్థలం ఆక్రమించినదీ పెద్దకథ మల్లెపందిరి. దీనిలో వస్తువు పురాణకథ వంటిది, నూతన దంపతుల మధ్య ఎందుకో కలహం ఏర్పడిపోవడం వేరువేరుగా కొన్నాళ్ళు గడచిన తర్వాత తిరిగి కలుసుకోవడం. ఈ పునస్సంధానంలో సాధనకు ఒక అమ్మాయి ప్రవేశిస్తుంది. ఆమెతో తన భర్తకు సంబంధమేమైనా ఉన్నదేమోయని సందేహించే అనసూయకు ఆ శకుంతల తన భర్తను అన్నయ్యగా చూసుకొంటుంది అనడంలో ఆ సందేహ నివృత్తి అవుతుంది. "దొడ్లో మల్లె మొగ్గలన్నీ ఒల్లగలికి గిలగిలనవ్వి ఆమెకు గిలిగింతలు పెడ్తాయి." మల్లెపందిరి కథల సంపుటి ఉషశ్రీ కథా రచనకు పూలజల్లెడ.

— శ్రీ వాత్సవ

కంబరామాయణము

మొదటి భాగము (తమిళ కంబరామాయణమునకు హిందీ గద్యానువాదము. బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధా కాండలు) అనువాదకులు : శ్రీ ఎన్. వి. రాజగోపాలన్‌గారు. 544 పుటలు. మూల్యము : రు. 9.50 (ప్రకాశకులు : బీహారు రాష్ట్రభాషా పరిషత్తు, పాట్నా)

ఆసేతు హిమాచలము వ్యాప్తమైయుండు భారతావని సంస్కృతి ఒక్కటే యని ఎలుగెత్తి చాటునవి రామాయణ మహాభారతములని వేరుగా జెప్ప నక్కరలేదు. ప్రాచీన కాలము నుండి భారతదేశమునందలి ప్రధానములగు దేశభాషల నన్నింటి యందు ఈ రెండు కథల నాధారము చేసుకొని కవులు తమ కావ్య నైపుణ్యమును వెల్లడించియున్నారు. లోకోత్తర పురుషులగు రామకృష్ణుల చరిత్రలను సంస్కృతమునుండి యథాతథముగ ననువాదము చేయక, సంస్కృత మూలము నాధారముగ తీసుకొని తమ ప్రతిభా విలాసముచే కథ నొకపుడు పెంచి మరొకపుడు కుదించి, తమ తమ ప్రాంతమున దీర్ఘకాలమునుండి వాడుకలో నున్న ప్రాసంగిక విశేషముల నందు చేర్చి రసవత్తరమగు కావ్యసృష్టి గావించిన దేశీయకవు లెందరో కలరు. స్వాతంత్ర్యము లభించిన తర్వాత వివిధ ప్రాంతీయ భాషలలోని సాహిత్య సంపదను అన్ని భాషలవారి కందజేయుటకై గొప్ప ప్రయత్నము జరుగుచున్నది. బీహారు రాష్ట్రభాషా పరిషత్తువారు దక్షిణదేశపు నాలుగు ప్రధాన భాషలగు తెలుగు, తమిళ, కన్నడ, మళయాళములలోని రామాయణములను హిందీ భాషలోనికి అనువాదము చేయుటకు సంకల్పించి, రెండు సంవత్సరముల క్రితము గోన బుద్దారెడ్డి విరచితమగు రంగనాథ రామాయణమును హిందీ భాషలోనికి పరివర్తనము చేయించి ప్రచురించియున్నారు. ఇపుడు తమిళ కవి చక్రవర్తి కంబన్ తమిళములో రచించిన రామాయణములో బాల అయోధ్యా, అరణ్య, కిష్కింధా కాండలను మాత్రము హిందీ గద్యములోనికి అనువాదము చేయించి ప్రచురించియున్నారు.

తమిళ వాఙ్మయమునకు తలమానికము వంటిది కంబరామాయణము. ఆ యుద్గ్రంథమును రచించిన కంబన్ మహాకవి కాలము, జన్మస్థానము మొదలగు విషయములను గురించి పండితులలో అభిప్రాయ భేదము లున్నవి. కాని కంబన్ 12 వ శతాబ్దమునకు జెందినవాడనియు, అతడు రాజరాజ నరేంద్రుని మనుమడగు మూడవ కులోత్తుంగచోళుని యాస్థానము నలంకరించిన కవిశేఖరు డనియు పలువురు పండితులు అభిప్రాయపడుచున్నారు.

మహాకవి కంబన్ వాల్మీకి రామాయణము ననుసరించి తన రామాయణమును రచించెను. అది కథానుసరణము మాత్రమే కాని అనువాదము మాత్రము కాదు. ఆదికవి వాల్మీకి శ్రీరాముని ఆదర్శ లోకోత్తర పురుషునిగ జిత్రించియు తన కావ్యమునందు కొన్నిచోట్ల నతనికి దైవత్వ మాపాదించిన సంగతి విజ్ఞులకు విదితమే. కాని కంబన్ కాలమునాటికి శ్రీరాముడు సంపూర్ణముగ దేవాంశసంభూతు డైనాడు. శ్రీరాముడు దుష్టశిక్షణ, శిష్టరక్షణకై యవతరించిన శ్రీ మహావిష్ణువే యని నమ్మి తన కావ్య రచనను గావించిన మహాభక్తుడు కంబ మహాకవి. అయినను కంబరామాయణము నందలి రాముడు మానవ సహజగుణముల కతీతుడు గాడు. ప్రప్రథమమున సీతను గాంచినపుడు అతనికి గలిగిన కామ వికారము, ఆమె యెడబాటున గలిగిన విరహతాపము, దశరథుని మృతి, లక్ష్మణ మూర్ఛలను గాంచినపు డతని సరళ హృదయాంతరాళమునుండి పొంగి పొరలిన దుఃఖము మొదలగునవి శ్రీరాముని మానవునికి సన్నిహితముగ నొనర్చునట్టివి.

గ్రంథ విమర్శనము

శ్రీరామ పాత్రనే గాక యితర పాత్రలను గూడ మానవ సహజముగ చిత్రించుటలో కంబ కవి విశిష్టత, ప్రతిభ అసాధారణముగ కన్పట్టుచున్నవి.

కంబరామాయణమున అవాల్మీకములగు ప్రసంగము లెన్నియో కలవు. అందు ముఖ్యమగునవి : ధనుర్యజ్ఞమున కరుదెంచు రాముడు మిథిలానగర రాజవీథిలో రామచంద్రుని దర్శనమునకై యువ్విళ్లూరుచు మేడపైనున్న సీతను గాంచుట, తదుపరి వారిరువురి పూర్వ రాగజన్య అనంగదశావర్ణనము, తనకు తిలోదక క్రియలు భరతుడు చేయరాదని దశరథుడాదేశించినందున వసిష్ఠుడు శత్రుఘ్నునిచే తిలోదక క్రియలు చేయించుట, సీతారామ లక్ష్మణులగస్త్యాశ్రమము నుండి పంచవటి కేగుచు మార్గ మధ్యమున జటాయువును గాంచి సంభాషించుట, రావణుడు సీతను పర్ణశాలతోబాటు భూమిని పెల్లగించి కొనిపోవుట, సుగ్రీవుడు తారను తల్లిగా భావించి గౌరవించుట, విభీషణుడు రావణునకు హిరణ్యకశిపుని వధను గురించి తెలుపుట, యుద్ధరంగమున విభీషణ కుంభకర్ణుల సంభాషణము, రావణుడు మాయాజనకుని గల్పించి, అతనిచే సీతకు దుర్నీతులు జెప్పించి ఆమెను లోగొన ప్రయత్నించుట —మొదలగునవి.

మహాకవి కంబన్ కవిత్వము రసవత్తరమైనది. అతని రచన లలితపదాలంకారభూయిష్ఠమై, అర్థ గాంభీర్య ప్రపూర్ణమై విలసిల్లుచుండును. ఏ విషయమునైనను రసస్ఫోరకముగ వర్ణించుటలో నతడద్వితీయుడు. కంబరామాయణము దీర్ఘ వర్ణనలకు కాణాచియైనది. అందలి వివిధ ఘట్టముల వర్ణనలు రసవత్తరమై మహదానందమును గూర్చుచున్నవి. కంబన్ కావ్యశిల్ప నైపుణిని గాంచియే శ్రీరంగమునందలి పండితసభ అతని నోట కావ్యమును విని అతనిని 'కవి చక్రవర్తి' బిరుదాంకితుని గావించినది.

ఇట్టి మహాకవి కావ్యమును హిందీ గద్యములోనికి అనువాదము చేసిన శ్రీ రాజగోపాలన్‌గారు తమిళ, హిందీ, సంస్కృత భాషలయందు నిష్ణాతులు. వారు మూలములోని భావశిల్ప సౌందర్యములకు లోటు రాకుండునట్లు శ్రమపడి అనువాదము చేయుటకు ప్రయత్నించిరి. వారి హిందీ అనువాదము మూల విధేయమై యున్నది.

భాషాంతరీకరణ మంత సులభమైన పని కాదు. అందును, రసవత్తర కావ్యమును గద్యములోనికి అనువదించుట కష్టతరము. పైపెచ్చు ఒక భాషా కుటుంబమునకు చెందిన భాషలోని కావ్యమును ఇంకొక భాషా సముదాయమునకు చెందిన భాషలోనికి అనువదించుట కష్టతమము. హిందీ, ఇండో యూరోపియ వర్గమునకు చెందిన విభక్తి ప్రధానమైన భాష—తమిళము ద్రావిడ వర్గమునకు చెందిన ప్రత్యయ ప్రధానమైన భాష. ఈ రెండు భాషలలోని వాక్యరచనా విధానము భిన్నమైనది. నుడికారమును భిన్నమైనదే. తమిళము సరళవాక్య బహుళము. హిందీ మిశ్ర సంయుక్తవాక్య బహుళము. అనువాదకులు కొన్నిచోట్ల పద్యములోని భావము నంతయు ఒకే హిందీ వాక్యములో నిమిడ్చుటకు ప్రయత్నించినారు. అట్టిచోట్ల పద్యములోని భావ సౌందర్యమున కాఘాతము కలిగినది. ఉదా :

"కమల్ పుష్ప పర్ ఆసీన్ (లక్ష్మీ) దేవీ జైసీ ఉన్ సుందరియోం) కే మనోహర్ కమల్ సదృశ కరోంసే ఛుయే జానే పర్ సురభి పుష్పాలంకృత్ కేష్‌వాలే పురుషోంకీ పర్వత్ సమాన్ భుజాయేఁ భీ, జిన్‌కే బల్‌సే భయంకర్‌సింహ్ భీడర్ జాతేహైఁ, ఝుక్‌కర్ రహ్ జాతీహైఁ, తోక్యాయహ్ భీ కహనే యోగ్యకోయీ విశేష్ బాత్ హైకి వికసిత్ సుమన్‌వాలే పౌధే, ఉన్ సుందరియోంకే స్పర్శ్ సే ఝుక్ జాతేహైఁ ?"

అనువాదములోని యిట్టి వాక్యములు మూలములోని భావ సౌందర్యమును చెరుపుటయే గాక పఠనయోగ్యము కూడ కాజాలవు. పద్యములోని భావము నంతయు చిన్న చిన్న వాక్యములతో వెలిబుచ్చి మూలములోని సొగసును కాపాడి యుండ వచ్చును.

మొత్తముమీద శ్రీ రాజగోపాలన్‌గారి హిందీ సేత చక్కగా నున్నది. వారి కృషి కొనియాడ తగినది. తమిళ సాహిత్య సంపదను ఔత్తరాహులకు పరిచయము చేయించుటకై బీహారు రాష్ట్రభాషా పరిషత్తువారు చేయుచున్న కృషి అభినందనీయము.

— కామాక్షీరావు.

ఉర్దూ కథానికలు

(అనువాదము: బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి. ప్రచురణ : ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, హైదరాబాదు, వెల : రూ 5)

ఉర్దూ కథానికలను ఆంధ్ర పాఠక లోకానికి అర్పించవలెనన్న లక్ష్యంతో ఆంధ్ర అకాడమీవారు ఈ పుస్తకాన్ని ప్రకటించారు. మూల కథలను ఎన్నిక చేసినవారు శ్రీమతి జీనత్ సాజిదా.

భారతీయ భాషల కథా సాహిత్యాలతో పోల్చి చూచినప్పుడు ఉర్దూకథా సాహిత్యం కూడా నిస్సందేహంగా కొంత పటిమకలదే. కాని దానిలో ప్రత్యేకమైన కొన్ని సుగుణాలు, అవగుణాలూ ఉన్నాయి. కనుక ఆ సాహిత్యంలో నుంచి ఎంపిక చేసి ప్రకటించాలనుకున్నప్పుడు క్షీరనీర న్యాయం పాటించి కొంత వివేచనతోఏరి కూర్చవలసిన అగత్యం ఉంది. ముఖ్యంగా ఉర్దూ కథానిక పరిణామంలో మూడు ఘట్టాలున్నాయి. మొదటిది ప్రేమ్‌చంద్‌తో ఆరంభమైన వాస్తవికధోరణి. రెండవది 1936లో తరక్కీ పసంద్ అదబ్ (ప్రోగ్రెసివ్ రైటింగ్) అవతరించిన తరువాత ఆరంభమైన వామపక్ష ధోరణి. మూడవది 1947లో దేశ విభజన తర్వాత వచ్చిన కథలు. అవి ఎక్కువగా విభజనవల్ల కలిగిన ఫలితాలను చిత్రించాయి. ఈ మూడుధోరణులలోనూ రెండవ రకం ధోరణితో నుంచి ఎంపిక చేసుకోవలసి వచ్చినప్పుడు కొంత నిగ్రహం అవసరం. కాబట్టే ఫారూఖీ అనే సమీక్షకుడు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "అభ్యుదయ వాదులు సృష్టించిన

కథా సాహిత్యంలో కొన్ని మంచి రచనలూ ఉన్నాయి. చాలా చెత్తా ఉంది. కాబట్టి నెల్లూ పాల్లూతెల్పాలంటే వివేచన గల విమర్శకుడు కావాలి'' అని ఒక సందర్భంలో వ్రాశాడు. ఉర్దూ అభ్యుదయ రచయితలు ప్రయోజనానికి ఇచ్చిన ప్రాధాన్యం కళకు ఇవ్వలేదు. కనుకనే ప్రయోజనం మెచ్చు మీరి రచయిత వ్యక్తిత్వం కురుచఅయిన సందర్భాలు కూడా ఉన్నాయి. పై మూడు ధోరణులలోనూ విషయ వాంఛలకు హెచ్చు ప్రాధ్యాన్య మిచ్చిన రచనలూ చాలా ఉన్నాయి.

ఈ దృష్ట్యా ఈ సంపుటిలో చేర్చబడ్డ కథలను పరిశీలిద్దాము. మొట్టమొదటే అసంతృప్తి కరమైన ఎ పిక చేశారు. ఆధునిక రూపంలో మొట్టమొదటి కథానిక ఉర్దూలో ఎప్పుడు వ్రాయబడిందో చెప్పడం కష్టం. కాని 1907లో ప్రేమ్‌చంద్ మొదటికథ 'దున్యాకా సబ్‌సే అన్మోల్ రతన్' వెలువడింది. ఆధునిక ఉర్దూ కథానిక ప్రేమ్‌చంద్‌తోనే ఆరంభమైందని ఫారూఖీ కూడ వ్రాశాడు. ఆంధ్ర అకాడమీ వారు ప్రచురించిన ఉర్దూ సాహిత్య చరిత్రలో సైతం 'సామాన్య జీవితమునకు సంబంధించిన కథలు తొలుదొల్త ప్రేమచంద్ ఒక్కడే వ్రాసినాడు' అని వుంది. అటువంటప్పుడు ఉర్దూ కథానికల ఈ సంపుటి ప్రేమ్‌చంద్ కథతో ఆరంభం కావాలి, న్యాయంగానైతే. కాని ఇందులో పదవ కథ ప్రేమ్‌చంద్‌ది! ఉపేంద్రనాథ్ అశ్క్ కథలెన్నో వ్రాసినవాడైనప్పటికీ నాటక రచనలో గల నేర్పు ఆతనికి కథా రచనలో లేదు. అయినా ఆయన కథను చేర్చారు. సుదర్శన్ కథను తీసుకొనేలేదు. రాజకీయ సిద్ధాంతాల జోలికి అంతగా పోక అనుభూతులకు, కళకూ ప్రాముఖ్య మిచ్చి రచనలు చేసిన అహమద్ నదీమ్ కాజ్మీవంటి విశిష్ట శైలిగల రచయిత కథ ఇందులో లేదు. చేర్చిన రచయితల పేర్లు చూస్తే చప్పున చాలామంది రచయితలు అభ్యుదయ వర్గంవారే అని ఎవరైనా అనుకునే అవకాశం ఇస్తూ ఉంది ఈ సంపుటి. అందుకే అలా పెద్ద టైపులో అచ్చువేయకుండా చిన్న టైపు వాడి ఉంటే ఇరవై కథలైనా వచ్చేవి. అసలు ఇరవై కథలైనా ఇచ్చి ఉంటే విశాలమైన ఉర్దూ సాహిత్యంలో అన్ని రీతులకూ ప్రాతినిధ్యం ఇచ్చినట్లు ఉండేది. పైగా ఈ సందర్భంలో లబ్ధ ప్రతిష్ఠులైన వారి రచనలేగాని ఈ ఐదేండ్లలో వచ్చిన నవోదిత రచయితలలో చెప్పుకోదగ్గ ఒక రిద్దరైనా చేర్చడం జరుగ లేదు. అందుకే (representative collection) కాదగ్గ ఈ సంపుటి కొంత అసమగ్రతకు పాల్పడింది.

ఇక అనువాదాన్ని పరిశీలిద్దాము. ఉర్దూ కథానికలను తెలుగులోకి తేవాలనుకున్నప్పుడు దాని పలుకుబడిలోని మర్యాదలను పోనివ్వకుండానే తెనుగు నుడికారంలో అందించాలి. కాని ఇందులో చాలా చోట్ల తెలుగు వాక్యాలు ఉర్దూ వాటికి మక్కీకి మక్కీగా ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని : 'ఎప్పుడైతే భోజనం గంట వినబడ్డదో', 'కష్టతరమ్మీద', 'నేనైతే ఇలా ఏమీ అనటంలేదు' వంటివి చాలా వాక్యాలు చూపవచ్చు. ఇవి పాఠకుడికి తెలుగు సరిగారాని ఒక మనిషి మాటలవలె ఉంటాయి. ఇవిగాక 'బిగడాయించుకొని' 'ఉలాయించి', 'కాకీషంలా' వంటి వాటిని యథాతథంగా వ్రాసేశారు. దస్తీ, డాచీ, భాయీజాన్, ఆరామ్ వంటి పదాలకు ఫుట్ నోట్సులో అర్థాలిస్తే అందరికీ తెలిసే వీలుండేది. ''కఫన్'', 'జర్దచహరే' వంటి కథలను మూలంలో చదువుతూ ఉంటే ఎంత గొప్పగా అనిపిస్తాయో అనువాదం చదివినప్పుడు అలా అనిపించదు. అనువాదకుడు పడ్డకష్టం అగుపిస్తుంది కాని సాఫీ, సారళ్యం కన్పించవు. ఒక రచయిత్రి పేరును 'అస్మత్ చుగ్తాయీ' అని వ్రాశారు. కాని అంతా 'ఇస్మత్' అని వ్రాయడం పరిపాటి. ఇంకా నయం. అనువాదకుడు కొంత చేయితిరిగిన రచయిత కాబట్టి ఇంత మాత్రంగానైనా ఉంది. అయినా మరొక్కమారు అనువాదాన్ని సరిచూచుకొని ఉంటే మరి కొంత మెరుగు పెట్టడం జరిగి ఉండేది.

ఉర్దూ కథా సాహిత్యపు పోకడలను, పరిణామాలను సింహావలోకనం చేస్తూ గ్రంథారంభంలో పరిచయం వ్రాసి ఉంటే మన పాఠకులు ఈ సాహిత్యాన్ని గూర్చి కొంత తెలుసుకునే వీలుకలిగేది. కాని అలాంటిదేమీ ఇందులో లేదు. పోనీ ఒక్కొక్క కథ మొదట్లో ఆ రచయిత జనన మరణాదుల తేదీలను, జీవిత విశేషాలను, రచనా రీతిని సంగ్రహంగానైనా ఇచ్చిఉంటే కొంత మేలుగా ఉండేది. అదీలేదు. ఆంగ్ల కథకుల సంపుటిని ఆంగ్ల పాఠకులకు అందిచ్చినప్పుడు సైతం ఆరంభంలో సంక్షిప్తంగా ఆ రచయితను పరిచయం చేయడంకద్దు. విషయ సూచికలో కథల పేర్లు ఇచ్చారు గాని రచయిత లెవ్వరో పుస్తకం వెతికి తెలుసుకోండని వదిలేశారు. సంపుటి చివర ఇండెక్సులేదు. అక్కడక్కడ అచ్చుతప్పులూ ఉన్నాయి. అకాడమీ వంటి సంస్థ ఒక భాషకు చెందిన సాహిత్యాన్ని మరొక భాషవారికి అందించేటప్పుడు సరియైన సంపాదక వర్గం వారి అజమాయిషీ క్రింద, సక్రమరీతిలో, అకడమిక్ స్థాయిలో సలక్షణంగా సంపుటిని ప్రకటిస్తారని పాఠకులు ఆశిస్తారు. కాని ఈ సంపుటి తయారీలో అంత శ్రద్ధ, అటువంటి క్రమపద్ధతి కన్పించవు.

—కావ్యప్రియ

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.